# అపార్థాలు

## అపోహల అంధకారంలో నిజాల కాంతిరేఖ


**సయ్యద్ హామిద్ ముహ్సిన్**

**అనువాదం**

అబ్దుల్ వాహిద్



SALAAM Centre

Promotes Peace and Brotherhood

www.salaamcentre.in www.misconceptions.in

APARTHALU (Telugu)
ISLAM, Facts vs. Fictions (English)

Copyright © 2013 SYED HAMID MOHSIN.

ISBN: 978-81-928089-5-6

All rights reserved. No part of this book may be reproduced or transmitted in any form or by any means, electronic, mechanical, including photocopy, recording, or any information storage and retrieval system, without permission in writing from the author, except for the situation below which is permitted.

## For Reprinting

Reprinting or reproducing this book on the condition that absolutely no change, addition, or omission is introduced is permitted free of charge. To make high quality reprints, you may contact the author / Salaam Centre to obtain free copies of the soft copy or printing files of this book.

## The Web Site of This Book :

This e-book is available on the Web, World Wide at:

www.misconceptions.in , www.salaamcentre.in

Price: 150/-

Printed and Published by :
SALAAM CENTRE
# 65, Ist main, S.R.K. Garden, Jayanagar, Bangalore – 560 041
Contact: +91 99011 29956 / +91 99451 77477 / 080-2663 9007
Email: salaamcentrebangalore@gmail.com

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ✯ | అపార్థాలు | 01 |
| ✯ | స్నేహసంబంధాలు | 03 |
| ✯ | అపోహలు | 04 |
| ✯ | చరిత్రలో పక్షపాతాలు | 05 |
| ✯ | బహుభార్యత్వం | 05 |
| ✯ | పర్సనల్ లా | 07 |
| ✯ | హజ్ సబ్సిడీ | 08 |
| ✯ | జనాభా గలాభా | 09 |
| ✯ | బుజ్జగింపు రాజకీయాల హంగామా | 11 |
| ✯ | బుజ్జగింపు ఇదా? | 13 |
| ✯ | పాకిస్తాన్ - భారత ముస్లిములు | 15 |
| ✯ | 786 | 16 |
| ✯ | నెలవంక - నక్షత్రం | 17 |
| ✯ | కుట్రలు కుతంత్రాలు | 18 |
| ✯ | పాకిస్తాన్ జెండా | 18 |
| ✯ | ఆరాధనాలయాలను అపవిత్రం చేయడం | 19 |
| ✯ | ప్రేమ జిహాద్ | 21 |
| ✯ | వందేమాతరం, జాతీయవాదం తక్కువ రాజకీయస్వార్థం ఎక్కువ | 23 |
| ✯ | టిప్పు సుల్తాన్ | 25 |
| ✯ | తలాక్ | 33 |
| ✯ | ఖులా | 36 |
| ✯ | ఫత్వా | 37 |
| ✯ | కుఫ్ర్ - కాఫిర్ | 38 |
| ✯ | ముస్లిములు - మాంసాహారం | 40 |

| | | |
|---|---|---|
| ☆ | మాంసాహారం హింసోన్మాదాన్ని పెంచుతుందా ? | 43 |
| ☆ | హలాల్ - హరామ్ | 44 |
| ☆ | హలాల్ | 45 |
| ☆ | హరామ్ | 46 |
| ☆ | మానభంగం : లైంగిక ఉగ్రవాదం | 48 |
| ☆ | వ్యభిచారం - మానభంగం | 49 |
| ☆ | మానభంగానికి పాశ్చాత్య సెక్యులర్ శిక్షలు | 50 |
| ☆ | ఇస్లామీయ రాజ్యం - ముస్లిమ్ దేశం | 52 |
| ☆ | ముస్లిములా ? ముహమ్మదీయులా ? | 53 |
| ☆ | షియా సున్నీ ముస్లిములు | 55 |
| ☆ | ఉర్దూ విదేశీ భాషా ? | 58 |
| ☆ | ఇస్లామ్‌లో పూజారులు లేరు | 60 |
| ☆ | మస్జిదు | 61 |
| ☆ | మస్జిదులో ఏముంటుంది ? | 63 |
| ☆ | యావత్తు భూమండలం ఒక పెద్ద మస్జిదు | 64 |
| ☆ | అజాన్ | 65 |
| ☆ | ముస్లిములు కాబాగృహాన్ని ఆరాధిస్తారా ? | 67 |
| ☆ | నల్లరాయి | 69 |
| ☆ | ముస్లిములు ఈ నల్లరాతిని ఆరాధిస్తారా ? | 70 |
| ☆ | మక్కాలోకి ముస్లిమేతరులను ఎందుకు అనుమతించరు ? | 71 |
| ☆ | దర్గాల సందర్శన | 73 |
| ☆ | దర్గా వేరు మస్జిదు వేరు | 74 |
| ☆ | మదరసాలు | 76 |
| ☆ | దేవుడు, దైవప్రవక్తల చిత్రాలు ఎందుకు లేవు ? | 79 |
| ☆ | ఇస్లామ్ కరవాలంతో వ్యాపించిందా ? | 82 |
| ☆ | ఇస్లామ్ బలప్రయోగంతో విస్తరించిందా ? | 85 |

☆ పాతవైరం - కొత్త ద్వేషం 94
☆ మన రాజకీయాల్లో మతతత్వవిషాన్ని తొలగించాలి 106
☆ జిహాద్ 110
☆ అత్యుత్తమ జిహాద్ 110
☆ గొప్ప జిహాద్ 112
☆ తక్కువస్థాయి జిహాద్ 112
☆ సామాజిక జిహాద్ 114
☆ యుద్ధం గురించి ప్రవక్త ఏమన్నారు ? 117
☆ జిహాద్ పదం - వాడుకలో దురుపయోగాలు 120
☆ మతవిశ్వాసాల దురుపయోగం 124
☆ అణిచివేత-ఉగ్రవాదం 127
☆ ఇస్లామోఫోబియాను ఉత్పత్తి చేయడం 132
☆ ఉగ్రవాదం మూలకారణాలు 136
☆ ఉగ్రవాదంపై మీడియా ద్వంద్వప్రమాణాలు 140
☆ హింసాకాండ, ఉగ్రవాదం, ఊచకోతలు పాశ్చాత్యులదే ప్రథమస్థానం 143
☆ ఆత్మాహుతి దాడులకు ఇస్లామ్‌లో అనుమతి లేదు 150
☆ ఇస్లామిక్ ఫండమెంటలిజమ్ 155
☆ మహిళలు 159
☆ ఇస్లామ్ దృష్టిలో మహిళలు 165
☆ ఇస్లామ్‌లో మహిళల హక్కులు 168
☆ ఇస్లామ్‌లో మహిళల విధులు 171
☆ హిజాబ్ - బురఖా 172
☆ హిజాబ్ - నాగరికతకు ప్రగతివికాసాలకు నిదర్శనం 175
☆ ముస్లిమ్ మహిళలకు సంబంధించి కొన్ని వివాదాస్పద అంశాలు 176
☆ ఇస్లామీయ చట్టాల ప్రకారం వారసత్వ ఆస్తిలో స్త్రీ వాటా పురుషుడి వాటకు సగంగా ఎందుకు నిర్ణయించారు ? 176

| | | |
|---|---|---|
| ✯ | పాశ్చాత్యదేశాలన్నింటా మహిళలకు ఓటుహక్కు లభించింది. చాలా ముస్లిమ్ దేశాల్లో ఇంకా మహిళలకు ఓటు హక్కు ఎందుకు లభించలేదు ? | 178 |
| ✯ | స్త్రీ విద్య, డ్రయివింగ్ చేసే హక్కు | 180 |
| ✯ | బహుభార్యత్వం - ఏకపత్నీవిధానం | 181 |
| ✯ | బహుభార్యత్వం - పాశ్చాత్యులకు ఆయుధం | 181 |
| ✯ | యూదమతంలో బహుభార్వత్వం | 182 |
| ✯ | క్రయిస్తవంలో బహుభార్వత్వం | 183 |
| ✯ | హైందవంలో బహుభార్యత్వం | 184 |
| ✯ | పాశ్చాత్య సమాజాల్లో బహుభార్యత్వం | 185 |
| ✯ | ఇస్లామ్‌లో బహుభార్యత్వం | 187 |
| ✯ | ప్రవక్త ముహమ్మద్ కుటుంబ జీవనం | 191 |
| ✯ | ఇస్లామ్‌లో వితంతు పునర్వివాహం | 194 |
| ✯ | అపోహలకు గురైన దివ్యఖుర్ఆన్ వాక్యాలు | 197 |
| ✯ | కృతజ్ఞతలు | 208 |
| ✯ | సంప్రదించిన గ్రంథాలు | 210 |

# పరిచయం

నేడు మనం క్లిష్టపరిస్థితుల్లో జీవిస్తున్నాం. మతపరంగాను, కులపరంగాను అనేక విభేదాలకు గురైె ఉన్న మానవాళి మధ్య మరిన్ని విభేదాలను అనేక శక్తులు సృష్టిస్తున్నాయి. మత, కుల, భాషా దురభిమానాలను రెచ్చగొట్టి స్వప్రయోజనాల కోసం పాకులాడే శక్తులు వివిధ సముదాయాల మధ్య సంబంధాలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదించే మతం నేడు ప్రజల మధ్య విద్వేషాల చిచ్చు రాజేయడానికి దురుపయోగమవుతోంది. కన్స్యూమరిజమ్, కమర్షియలిజమ్ కలగలిసి ప్రజలనే కాదు రాజ్యాలను కూడా దోచుకుంటున్నాయి. రాజ్యాల సహజసంపద, శాంతిభద్రతలు దోపిడికి గురవుతున్నాయి. కన్స్యూమరిజమ్ శక్తులు నేడు ప్రపంచంలో పెత్తనం చెలాయిస్తున్నాయి. ఆయుధవ్యాపార ప్రయోజనాల కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ దుష్టపన్నాగాలను బట్టబయలు చేయవలసి మేధావులు, పరిశోధనా సంస్థలు, మీడియా కూడా నోరు విప్పి విమర్శించడానికి వెనుకాడుతున్నారు. స్వంత ప్రయోజనాలు దెబ్బతింటాయని సంకోచిస్తున్నారు. వీరి మద్దతు లేనిదే పౌరసమాజం మాట ఎక్కడా ఎవరికి వినబడదు. కాని వారి మద్దతు పౌరసమాజానికి లభించే పరిస్థితి లేకపోవడం దురదృష్టకరం.

యుద్ధాలకు ముందు మీడియా ప్రచారం ఉధృతస్థాయిలో మనకు కనబడుతుంది. విద్వేషాగ్నిని రాజేసే ప్రయత్నాలు జోరుగా సాగుతాయి. అపార్థాలను ప్రచారం చేయడం, ముస్లిమ్ సముదాయాన్ని దుర్మార్గంగా చిత్రీకరించడం ద్వారా ద్వేషజ్వాలలు ప్రజ్వరిల్లజేయడం ఈ శక్తులకు అవసరంగా మారింది. ఈ ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా సాంఘీక జీవనంలో సౌహార్ధతను నాశనం చేశాయి. అందువల్లనే నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ చానళ్ళలో ద్వేష విద్వేషాల ప్రచారం, బలోన్మత్తుల యుద్ధోన్మాదం కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. "మీరు మాతో ఉన్నారా లేక ఉగ్రవాదులతో ఉన్నారా తేల్చుకోండన్న" బెదిరింపులు వినిపిస్తున్నాయి. ఇలాంటి బెదిరింపులతో ఎటూ తేల్చుకోలేని వారిని, తటస్థంగా ఉండాలనుకుంటున్న వారిని కూడా తమవైపు బలవంతంగా లాగే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇస్లామ్, ముస్లిములు అన్న పదాలు వినగానే ఎర్రబారిన కళ్ళు, గెడ్డం, భుజాలకు స్టింగర్ మిస్సయిళ్ళు తగిలించుకున్న చిత్రాలు మన కళ్ళముందు కదలాడే స్థాయిలో ఈ ప్రచారం కొనసాగుతోంది. ఈ చిత్రాలే మన ప్రచారప్రసార సాధనాల్లో, టి.వీల తెరలపై, దినపత్రికల పేజీలపై ప్రముఖంగా దర్శనమిస్తున్నాయి. ప్యానెల్ డిస్కషన్లలో జిహాద్, ముల్లా,

ముజాహిదీన్, ఫత్వా, కాఫిర్, షరియా, షియా, సున్ని, వహాబీ, మదరసా వగైరా పదాలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. పాశ్చాత్యదేశాల ఉగ్రవాదంపై యుద్ధాన్ని సమర్థించడానికి ఈ పదాలు ఉపయోగపడుతున్నాయి. సుదీర్ఘకాలంగా మీడియా ద్వారా జరుగుతున్న విద్వేష ప్రచారం ముస్లిములే లక్ష్యంగా కొనసాగుతోంది. చారిత్రక అపార్థాల వల్ల కొన్ని పక్షపాతాలు పుట్టుకువస్తే, పేదదేశాల వనరుల కోసం పోటీ కారణంగా కొన్ని పక్షపాతాలు, రాజకీయ కారణాల వల్ల మరికొన్ని పక్షపాతాలు చోటుచేసుకున్నాయి. ఫలితంగా పేద ప్రజలు, బలహీన సముదాయాలు, బడుగు వర్గాల మతవిశ్వాసాలు, సామాజిక విలువలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం జరుగుతోంది. ప్రపంచంలోని సమస్త చెడులకు వారినే బాధ్యులు చేస్తున్నారు. హాస్యాస్పదమైన విషయమేమిటంటే, ప్రపంచంలోని ఏకైక సూపర్‌పవర్ సృష్టిస్తున్న బీభత్సం వల్ల బాధితులుగా మారిన వారినే టెర్రరిస్టులంటున్నారు. సూపర్‌పవర్ అత్యాశ వల్ల బాధితులుగా మిగిలినవారి పైనే ఉగ్రవాదులన్న ముద్రపడుతోంది. జీహాద్ వంటి భావనలను వక్రీకరించి, తప్పుడు తాత్పర్యాలు చెప్పి అమాయకులపై యుద్ధప్రకటనలుగా ప్రచారం చేస్తున్నారు. అమాయకులను దుర్మార్గులుగా చిత్రీకరించే ఈ దుష్టక్రీడ వెనుక ఎవరున్నారన్నది బహిరంగ రహస్యం.

చమురుబావులపై, శక్తివనరులపై ఎవరి కన్ను పడిందో అందరికీ తెలుసు. ఎవరికి విద్వేష ప్రచారం అవసరమో, ఎవరికి యుద్ధాలు కావాలో కూడా అందరికి తెలుసు. ఈ దుష్టక్రీడను అందరు అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. అబద్ధాల గోడలను కూల్చి నిజాలను బట్టబయలు చేయవలసిన అవసరం ఉంది. ఒకరి మత విశ్వాసాలను మరొకరు అర్థం చేసుకునే ప్రయత్నం, వివిధ సముదాయాల మధ్య సమైక్యత, సామరస్యాలను సాధించడం, ఒకరి శక్తి సామర్థ్యాల ద్వారా మరొకరు ప్రయోజనాలు పొందే సహకారాన్ని పెంపొందించడం ఈ ప్రయత్నాలన్ని చక్కని సమన్వయంతో కొనసాగడం నేటి అవసరం.

వివిధ సముదాయాల మధ్య అపార్థాలు, అపోహలను పెంచి పోషించే పని పాశ్చాత్యులు చేయవలసినంత చేశారు. ఉగ్రవాదంపై సోకాల్డ్ యుద్ధంవల్ల మధ్యప్రాచ్యంలో పదిలక్షలకు పైబడి అమాయకులు ఆహుతయ్యారు. నాగరికతల ఘర్షణ, శ్వేతజాతి ఆధిక్యం, సోకాల్డ్ నాల్గవ ప్రపంచయుద్ధం వంటి కుహనా సిద్ధాంతాలే ఈ దుర్మార్గాల వెనుక ఉన్న ప్రేరణలు. భారత ఉపఖండంలోను ద్విజాతి సిద్ధాంతం ఇలాంటి దుష్పరిణామాలకు కారణమయ్యింది. ఈ దుష్టసిద్ధాంతాలను మేధోపరంగాను, భావాల పరంగాను ఎదుర్కోవలసి ఉంది. కాని నేడు ఏకపక్షవాదనలే వినిపిస్తున్నాయి. మూడవ ప్రపంచ దేశాల్లో పాశ్చాత్యజోక్యం, పాశ్చాత్యులు స్పాన్సర్ చేసిన కుట్రలు, కుతంత్రాలు, బలహీనదేశాల్లో తమ కీలుబొమ్మలను

నియంతలుగా ప్రతిష్ఠించడం తదితర వ్యవహారాలు చర్చకే రావడం లేదు. అలాగే ఇస్రాయీల్ దౌర్జన్యాల గురించి మాట్లాడేవారే లేరు. యూదులపై యూరోపు నేరాలకు పరిహారంగా మధ్యప్రాచ్యం గెడ్డపై ఇస్రాయీల్‌ను ఈ దేశాలు ప్రతిష్ఠించాయి.

పెద్ద పెద్ద సమస్యలు చర్చకు వచ్చినా వాటి సుదీర్ఘనీడలు భారత ఉపఖండంపై కూడా పడుతున్నాయి. ఈ పుస్తకంలో సాధారణ భారత ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడ హిందూ ముస్లిమ్ సముదాయాల మధ్య సంబంధాలను ధ్వంసం చేస్తున్న అపార్థాలను తొలగించే ప్రయత్నం జరిగింది. ఈ పుస్తకం ఇస్లామీయ మౌలిక భావనలను వివరించడానికి, భారతీయ విలువలు, సంప్రదాయాలు, భారతీయ వాతావరణం ఇక్కడి ముస్లిముల సాంస్కృతిక ఆచారవ్యవహారాలపై ఎలాంటి ప్రభావం వేసాయో చెప్పడానికి, మాత్రమే పరిమితమైంది. వివిధ సమస్యల చిక్కుముడులను విప్పడానికి, వేర్వేరు సమస్యల మూలాలను బహిర్గతం చేయడం ద్వారా ప్రపంచ శక్తుల వ్యూహాత్మక ప్రయోజనాలతో ఈ సమస్యలకు ఉన్న సంబంధాన్ని, ఉగ్రవాదం, ఎన్నికల రాజకీయాలు, స్వార్థ శక్తుల రాజకీయ క్రీడలో దాగి ఉన్న యథార్థాలను వివరించడానికి ప్రయత్నించడం జరిగింది. ముస్లిములు అమాయకులని నిరూపించే ప్రయత్నం కాదిది, ఇతరులను మాత్రమే నిందించడానికి ఉద్దేశించిన పంక్తులు కూడా కావివి. ముస్లిముల తప్పులు, దోషాలు, లోపాలను కూడా వేలెత్తి చూపడం జరిగింది. అయితే దక్షిణాసియాలో అధిక జనాభా, తక్కువ వనరులు, వనరులను పొందడానికి పోటీ, ఒత్తిళ్ళు తరచుగా మతపరమైన రంగు పులుముకోవడం జరుగుతుందన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేయడం జరిగింది.

ఈ పుస్తకాన్ని ఇతరులపై ముఖ్యంగా పాశ్చాత్యులపై ముస్లిముల ఫిర్యాదులు, వారి కష్టాలను ఏకరువు పెట్టే పుస్తకంగా కొందరు భావించే అవకాశమూ ఉంది. ఇందులో నిజం కూడా లేకపోలేదు. ఎందుకంటే ముస్లిముల మాటలు వినబడే వాతావరణం లేని పరిస్థితి ఉంది. అప్పుడప్పుడు చోటు చేసుకుంటున్న ఉగ్రవాద దాడుల దోషాన్ని అతితేలిగ్గా ముస్లిములపై నెట్టేస్తూ భామ్యాకాశాలు ఏకమయ్యేలా గగ్గోలును సృష్టిస్తున్నప్పుడు, ఈ గందరగోళంలో ముస్లిముల గొంతు వినిపించుకునేదెవ్వరు? మీడియాలో ముస్లిముల ప్రాతినిధ్యం శూన్యంతో సమానం. వారి అభిప్రాయాలు, వారి ఆవేదన ప్రకటించే వేదికే లేదు. తమ వాదన వినిపించే సదుపాయాలు, సాధనాలు లేనేలేవు. కాబట్టి ముస్లిముల వాదన, ఆవేదనను వినిపించే ప్రయత్నం ఇది. ముస్లిముల ఆలోచనలు, వారి మనోభావాలు, ప్రపంచం పట్ల వారి దృక్పథం, ఇతరులతో వారికి ఎక్కడ విభేదాలు రావచ్చు తదితర అంశాలపై అందరికి అవగాహన కల్పించడం ఈ పంక్తుల ఉద్దేశ్యం. ఇస్లామ్, పాశ్చాత్య

వ్యవస్థలు రెండింటిని బేరీజు వేస్తూ తప్పొప్పులను లెక్కించే పద్దుల పుస్తకం కాదిది. ఇరుపక్షాల మధ్య అవగాహనను పెంచడానికి, శాంతియుత సహజీనవాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన పుస్తకమిది.

భయసందేహాలు, పక్షపాతాలను సైద్ధాంతిక స్థాయిలో ఎదుర్కొని పరిష్కరిస్తే, వివిధ సముదాయాల మధ్య సాన్నిహిత్యం పెరిగితే ప్రజలు శాంతి సహకారాల వాతావరణంలో ప్రగతి పథాన పురోగమించే వాతావరణం ఏర్పడుతుంది. శాంతి సామరస్యాలు, అవగాహన, సౌహార్దతలు సమాజంలో వేళ్ళూనుకుంటే అన్ని సముదాయాల ప్రజలందరు నిర్మాణాత్మక ప్రయత్నాల ద్వారా సామాజిక జీవనాన్ని మరింత మెరుగపరిచే కృషిలో పాలుపంచుకుంటారు. మతతత్వ రాజకీయాల వెనుక ఉన్న వాస్తవాలు, ఉగ్రవాద రాజకీయాల వెనుక ఉన్న యధార్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలి.

చాలా మంది అనేక సంవత్సరాలుగా ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రయత్నాలను మరింత విస్తరించవలసిన అవసరం ఉంది. పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అధ్యాపకులు, శ్రేయోభిలాషులు, ప్రజలు అందరూ ఈ ప్రయత్నాల్లో పాల్గొనాలి. ఈ ప్రయత్నాల్లో మా వంతు కృషిగా “అపార్థాలు” పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

# తొలిపలుకులు

మనం ప్రస్తుతం నివసిస్తున్న ప్రపంచం ఒక కుగ్రామంగా కుచించుకుపోయింది. మానవాళి మధ్య సంబంధాలు చాలా విస్తరించాయి. కొత్త తరం మీడియా భౌగోళిక సరిహద్దులను చెరిపేసింది. దేశాలు, ప్రజలు వాటిని విస్మరించాలని నిర్ణయించుకుంటే ఈ ఎల్లలేవి కనబడవన్న పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు మానవాళి ఇదివరకటిలా లేదు. ఒండొరులతో సంబంధం లేకుండా ఎప్పుడు యుద్ధాల్లో మునిగి ఉండే పరిస్థితికి బదులు సమాచార విప్లవం వల్ల నేడు మానవాళి యావత్తు ప్రపంచ పౌరులుగా భావించే వాతావరణం నెలకొని ఉంది. కాని మనలో ఉమ్మడి విలువలను పెంపొందించుకునే కోరిక బలంగా ఏర్పడాలి. ప్రత్యేక గుర్తింపుల కోసం పట్టుదలకు పోవడం మానుకోవాలి. ప్రపంచ ప్రజల వద్ద రెండు ప్రత్యామ్నయాలు కూడా ఉన్నాయి. విభిన్న సాంస్కృతిక సముదాయాల సమాహారంగా ఒక అందమైన పూవనలా వర్ధిల్లడమా లేక యుద్ధాబీభత్సాలతో కుతకుతలాడే అగ్నిగుండంగా నశించడమా?

ప్రపంచం రెండు ప్రపంచ యుద్ధాలను చూసింది. ఆ తర్వాత సుదీర్ఘ ప్రచ్ఛన్న యుద్ధాన్ని చూసింది. ఆ పిదప సోకాల్డ్ ఉగ్రవాదంపై యుద్ధాన్ని చూస్తోంది. ఇదంతా ఒక శతాబ్ధకాలంలోనే జరిగింది. మానవాళికి జీవనయోగ్యమైన, ప్రగతిశీలమైన, అన్నింటికి మించి శాంతియుతమైన వాతావరణాన్ని ఈ బీభత్సపోరాటాలు అందించాయా? శాంతి అన్నది మునుపటి కన్నా నేడు చాలా కరువైపోయింది, శాంతి ప్రయత్నాల్లో ఆచరణల కన్నా ఆర్భాటాలు ఎక్కువయ్యాయని చాలా మంది ఒప్పుకుంటారు. చాలా యుద్ధాలకు ప్రజాస్వామ్య ప్రభుత్వాలే పాల్పడ్డాయి. ఈ ప్రజాస్వామ్యాలు ఆయుధ వ్యాపారుల చెప్పుచేతల్లో ఇరుక్కుపోయాయి. ఉగ్రవాదంపై యుద్ధం ప్రజలను భయభీతులను చేయడానికి మాత్రమే ఉపయోగపడింది. న్యాయం నిరాకరించబడిన వారికి న్యాయం చేసేబదులు ఈ యుద్ధం ఒకటి తర్వాత మరొకటిగా దేశాలను నాశనం చేసింది. మనస్సులను కలపడానికి ఉపయోగపడే బదులు మీడియా వివిధ సముదాయాల మధ్య గోడలు కట్టడానికి ఉపయోగపడుతోంది. బలసంపదలున్న వారి ప్రయోజనాలను కాపాడ్డానికి బలహీన, నిరుపేద సముదాయాలను బలిపెట్టడం జరిగింది. దురదృష్టం ఏమంటే ఈ బలహీనులనే శాంతికి శత్రువులుగా దుర్మార్గులుగా చిత్రించడం జరుగుతోంది.

ప్రపంచ శాంతి సాధించడానికి ఏం చేయాలన్నది మనమందరం ఆలోచించవలసిన ప్రశ్న. ఇతరులను దుర్మార్గులుగా చిత్రీకరించడం, అపోహలు ప్రచారం చేసి భయాలను

సృష్టించడం ద్వారా నిస్సందేహంగా ఎలాంటి శాంతిని సాధించలేము. ద్వేషం విద్వేషానికి పురుడుపోస్తుంది. జాతిపరమైన, మతపరమైన, కులపరమైన, వర్గపరమైన వైవిధ్యం ఎల్లప్పుడు ఉండేదే. మానవాళి మనుగడలో ఈ వైవిధ్యం ఒక అందమైన వర్ణచిత్రం వంటిది. ఈ వైవిధ్యం విభేదాలకు కారణం కాకూడదు. ఉద్రిక్తతలకు, వివాదాలకు దారితీయరాదు. ప్రేమ, అభిమానం, సహనం, సహిష్ణుతా భావాల అనుబంధం బలపడాలి. మన మధ్య దూరాలు పెంచే విద్వేషం, అసహనం, పక్షపాతాలు అంతరించాలి. న్యాయం, సమానత్వాలు మన భావి ప్రయాణానికి మార్గదర్శక సూత్రాలు కావాలి. పగ, వైరం, ప్రపంచంలోని పరిమిత వనరుల కోసం అనారోగ్యకరమైన పోటీ వంటి రుగ్మతలను విడనాడాలి. సంపద కన్నా సంతృప్తికి, గుత్తాధికారం కన్నా భాగస్వామ్యానికి, వినియోగం కన్నా సంరక్షణకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ మనం ముందుకు సాగాలి. వైవిధ్యాన్ని స్వాగతించి గౌరవించే ప్రజల చేతుల్లో ప్రపంచం సురక్షితంగా ఉంటుంది. అలాంటి ప్రజలే ఇతరులను గౌరవిస్తారు, వారి పట్ల శ్రద్ధ తీసుకుంటారు, తమ వనరులను పంచి ఇస్తారు. కాని పక్షపాతాలను ప్రోత్సహించేవారు, విద్వేషాలను విక్రయించేవారు, ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించాలనుకునే వారి వల్ల ప్రపంచానికి ఎలాంటి భవిష్యత్తు లేదు.

సహనం, సహజీవనాలే భారతీయతత్వ సారం. మనం భారతవర్షంగా పిలుచుకునే ఈ నేల వైవిధ్యంలో ఏకత్వాన్ని చాటి చెబుతోంది. మన రాజ్యాంగ రచయితలు అందరికి న్యాయం సమానత్వాలు ప్రసాదించే సంవిధాన పత్రాన్ని రూపొందించారు. దేశ ప్రజల్లో ఉన్న చారిత్రకమైన వైవిధ్యాన్ని కాపాడుతూనే అందరికి సమాన న్యాయం అందించే సూత్రాలను ప్రతిపాదించారు. మత ప్రాతిపదికన జరిగిన దేశవిభజన విషాదాన్ని పక్కన పెట్టి మన కోసం ఒక నియమావళిని రూపొందించారు, మన ప్రత్యేక గుర్తింపులను కొనసాగించే మార్గదర్శక సూత్రాలను ఇచ్చారు. ఇవి లేకపోతే వ్యవస్థ కలుషితమై పోయేది. అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన వారిని శాల్యూట్ చేయడానికి అసంకల్పితంగానే మన చేతులు పైకి లేస్తాయి. కాని మన స్వప్నాలు కొన్ని దుష్టశక్తుల చర్యల వల్ల భంగపడుతున్నాయి. ఈ శక్తులు కొన్ని సముదాయాలకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా విద్వేష ప్రచారం చేయడం ద్వారా, దుర్మార్గులుగా చిత్రీకరించడం ద్వారం ఒక గొప్ప రాజ్యాంగం ప్రతిపాదించిన సూత్రాలను తుంగల్లో తొక్కాలని చూస్తున్నాయి. ఈ దుష్టప్రయత్నాలు కొనసాగనివ్వరాదు. మనస్సుల్లో గూడుకట్టుకున్న విద్వేషం వైరాన్ని పెంచుతుంది. వీధుల్లో పోరాటాలుగా మారుతుంది. గడ్డివాముపై నిప్పురవ్వ మాదిరిగా ఏ చిన్న కారణమైనా ఒక్కసారి భగ్గుమని తీవ్రమైన పరిణామాలకు కారణమవుతుంది. ఈ విద్వేషప్రచారాన్ని కొనసాగనివ్వడమంటే

మన పతనానికి మార్గం వేసుకోవడమే అవుతుంది.

దేశంలో దాదాపు 13 శాతం ముస్లిములున్నారు. ముస్లిమ్ సముదాయానికి వ్యతిరేకంగా విద్వేష ప్రచారం చేస్తున్నవారు ఖచ్చితంగా దేశ శ్రేయాన్ని కోరడం లేదు. మన ప్రగతి వికాసాలు అందరినీ కలుపుకు వెళ్ళడంలో ఉన్నాయి. కొన్ని సముదాయాలను దూరం చేసుకోవడమన్నది మానసికంగా ప్రారంభమైతే వ్యవస్థలో దట్టమైన అంధకారంగా అలుముకుంటుంది. గతంలోను అనేక విషాద సంఘటనలను మనం చూశాము. కాబట్టి ఈ విద్వేషాలు, పక్షపాతాలను మొగ్గలోనే తుంచేదం వివేకం. చరిత్ర పుస్తకాల్లో, సాహిత్యంలో, జర్నలిజమ్‌లో, మీడియాలో, రాజకీయ ప్రసంగాల్లో ఈ విద్వేషం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇటీవలి కాలంగా బహిరంగ ప్రసంగాల్లో ముస్లిములపై అనేక అపార్థాలు, అపోహలు ప్రచారంలోకి వస్తున్నాయి. సలామ్ సెంటర్ వ్యవస్థాపకులు, చైర్మన్ హామిద్ ముహ్‌సిన్ ఈ అపార్థాలను, అపోహలను శ్రమకోర్చి సేకరించిఈ పుస్తకంలో క్రోడీకరించడమే కాదు యథార్థాల అద్దంలో వాస్తవాలను కల్పితాలను వేర్వేరు చేసి చూపించారు. మోసం, దగాల చీకట్లను చీల్చి వాస్తవాలను ప్రస్ఫుటపరిచిన ఈ ప్రయత్నం జీహాద్‌ను ఉగ్రవాదంగా చూపించడం వెనుక దాగి ఉన్న నిజాలను బట్టబయలు చేసింది. ఈ పుస్తకం ముస్లిములను విమర్శించడంలోను మెతకదనం చూపించలేదు. ఇస్లామ్ ఆధిక్యాన్ని చాటి చెప్పే అత్యుత్సాహంతో ప్రధాన జనజీవన స్రవంతికి దూరమై, అతివాద శక్తులకు ఉపయోగపడే కొందరు ముస్లిములను కూడా తీవ్రంగా విమర్శించింది. ఈ స్వీయసమీక్ష ఈ పుస్తకం ప్రత్యేకత. ఈ పుస్తకాన్ని భారతీయులు అందరూ చదవాలని కోరుతున్నాను. భిన్న సముదాయాలుగా దూరమవ్వడానికి కారణమవుతున్న అనేక అపోహలు, అపార్థాలను దూరం చేసుకోడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. చివరికి మన మందరం భారతీయులమే, అంతకన్నా ఎక్కువ కాదు, తక్కువ కాదు, కలిసి కొనసాగడంలోనే మన భవిష్యత్తు ఉంది. లేకపోతే పతనానికి చేరువవుతాం.

బెంగుళూరు — ప్రొఫెసర్ యు.ఆర్. అనంతమూర్తి

ఫిబ్రవరి 15, 2013

# అపార్థాలు

ప్రజల మధ్య, వ్యక్తుల మధ్య, దేశాల మధ్య, మతాల మధ్య సమీకరణాలు నిరంతరం మారుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్న కాలంలో మనం జీవిస్తున్నాము. కాబట్టి మనం నిత్యం మన వ్యవహారశైలిని, ఆచరణలను సమీక్షించుకోవడంతో పాటు మన విశ్వాసాలు, ఆలోచనలు, ఆచరణలపై కాలక్రమేణా పేరుకున్న దుమ్ముధూళిని శుభ్రం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇస్లామ్ భారతసమాజంలో దాదాపు వెయ్యి సంవత్సరాలుగా ఉన్నప్పటికీ ఇస్లామ్ గురించి అనేక ప్రశ్నలు నేడు వినబడుతున్నాయి. భారత ఉపఖండంలో హిందూ ముస్లిమ్ సముదాయాలు భిన్న ధృవాలుగా ఒకరితో ఒకరు కలువకుండా జీవించడం జరగలేదు. ఒక ప్రాంతంలో బతుకుతూ వస్తున్నారు. గంగా సింధూ జలాలనే తాగుతూ వస్తున్నారు. కళలు, చేతి వృత్తులు, సంస్కృతి, సంప్రదాయాల పరంగా ఒండొరులతో సంబంధాలు కలిగి ఉన్నారు. అయినప్పటికీ మీడియా కారణంగా, విభజన ప్రధానమైన రాజకీయాల కారణంగా, ఉపఖండంలోని వివిధ దేశాల వ్యూహాత్మక ప్రయోజనాల వల్ల హిందూ ముస్లిమ్ సంబంధాల్లో అనుమానాల నీడలు దట్టమయ్యాయి. ఇరుగు పొరుగు మధ్య దూరాలు పెరిగాయి. గతంలో సాధారణ ప్రజల సాధారణ చర్యల విషయంలో ఎన్నడూ కనుబొమలు ముడిపడి అనుమానించడం జరిగేది కాదు, కాని ఇప్పుడు సాధారణ ప్రజల సాధారణ ఆచరణల వెనుక కూడా రాజకీయ అంతరార్థాలను ఆపాదించడం జరుగుతోంది.

అరేబియా ఎడారుల్లో ఇస్లామీయ మతవిశ్వాసం వేళ్ళూనుకున్న వంద సంవత్సరాల లోపే ఇస్లామ్ భారత సరిహద్దుల్లోకి అడుగుపెట్టింది. కాని మొదటి ముస్లిమ్ రాజ్యం ఢిల్లీలో ఏర్పడంది మాత్రం క్రీ.శ 1191లో. బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తి భారతీయ వ్యవహారాల్లో తలదూర్చడానికి చాలా ముందే ముస్లిమ్ సల్తనత్ ఇక్కడ ఏర్పడింది. అనేకమంది సూఫీలు, వలీలు ఇక్కడ తమ ఆశ్రమాలను ఏర్పరచుకున్నారు. ఆధ్యాత్మికతను, శాంతిసందేశాన్ని

సమస్త ధర్మాల ప్రజానీకానికి పంచిపెట్టేవారు.

అనేకమంది సూఫీలు శాంతి, ప్రేమ, సహిష్ణుతల సందేశాన్ని ఉపఖండంలో ప్రచారం చేశారు. ఇక్కడి వివిధ సముదాయాల వేలాది ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నారు.

హిందూ ఇస్లామీయ సంప్రదాయాలు, భాషలు, వాస్తుకళల సుసంపన్నమైన సమ్మేళనం ఇక్కడ చోటు చేసుకుంది. హిందుస్తానీ సంగీతం, ఖవ్వాలీ, గజళ్ళు, ఉర్దూ, ముగలాయి వంటకాలు, ముగల్ చిత్రలేఖనం, శిఖ్ఖు మతం, కబీర్‌పంత్, ఆర్యసమాజ్ మొదలైనవన్నీ ఈ సమ్మేళనం ఫలితాలే.

అనేక రాజవంశాలు వచ్చాయి, గతించాయి. యుద్ధాల వల్ల నిరంతరం సరిహద్దులు మారేవి. రాజకీయ మార్పులు కొత్త సమీకరణాలకు కారణమయ్యేవి. ఉద్యమాలు నడిచాయి, రాజ్యవ్యవస్థలు నేలకూలాయి, ఈ పరిణామాలు ప్రత్యేక ప్రభావాన్ని వేశాయి. ముగల్ సామ్రాజ్య సూర్యుడు 1857లో అస్తమించాడు. ఇక్కడ బ్రిటీషు వారు కొత్త ప్రభువులయ్యారు. సుదూరాన ఉన్న బ్రిటీష్ వలస సామ్రాజ్యాధికారానికి ఇక్కడి ప్రజల సమైక్యతకు కారణమయ్యే సంప్రదాయాల కన్నా విభజించి పాలించే సిద్ధాంతాలు అవసరమయ్యాయి. వారికి అవసరమైన గుమాస్తాలను తయారు చేసే విద్యావ్యవస్థ, ప్రజల మధ్య విభేదాలను విస్తరించే వ్యవస్థ వారికి అవసరమయ్యింది. మతపరమైన విద్వేషమంటే ఏమిటో తెలియని ప్రజలకు అప్పటి నుంచి "మేము... వారు" అని ఆలోచించడం అలవాటయ్యింది.

విద్యాపరమైన వెనుకబాటు, స్థానిక భాషలో పట్టు లేకపోవడం వల్ల నేడు ముస్లిములు తోటి ప్రజలకు వాస్తవాలను వివరించి చెప్పలేకపోతున్నారు. ఈ కారణాల వల్ల వారి గురించి ఆపార్థాలు ఎక్కువవుతున్నాయి. వారి గురించి కట్టుకథలు కల్పించి ప్రచారం చేయడం చాలా తేలిగ్గా జరుగుతోంది. చరిత్రను వక్రీకరించడం వల్ల అమాయక ప్రజల ఆలోచనల్లో విషాన్ని నింపుతున్నారు. వారి లోపాలను గోరంత కొండంతగా చూపిస్తున్నారు. వారు చేసిన మంచిపనులను, వారు సాధించిన విజయాలను తక్కువ చేయడం లేదా అస్సలు లేకుండా చూపించడం జరుగుతోంది. సాధారణ ప్రజల మధ్య సంబంధాలు దెబ్బతినేలా చేస్తున్నారు. కాబట్టి వివిధ సముదాయాల మధ్య సత్సంబంధాలను ఏర్పరచడం నేడు ఎంతైనా అవసరం. లేకపోతే తప్పుడు సమాచారం, అపార్థాలు, అపోహలు సృష్టించే అంధకారం ఈ సంక్షోభాన్ని మరింత సంక్లిష్టం చేస్తుంది.

# స్నేహసంబంధాలు

మిలిటెంట్లు, నేరస్తులు, రాజకీయ నాయకుల వల్ల తలెత్తే మతపరమైన ఉద్రిక్తతలు వివిధ రూపాల్లో బహిర్గతమవుతున్నాయి. భారతదేశంలో మతభావాలను స్వార్థప్రయోజనాలకు వాడుకోవడం ఎలా జరుగుతున్నదో స్పష్టమవుతుంది. దేశంలో హిందూ ముస్లిమ్ సముదాయాల మధ్య విభేదాలకు ఇవి కారణమవుతున్నాయి.

ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు చేసిన ఒక వ్యాఖ్య ఎంతైనా గమనించదగ్గది. దేశంలో ముస్లిములను “వారు”గా వ్యవహరిస్తున్నారే గాని “మనం”గా భావించడం లేదని ఆయన అన్నాడు. ఈ వైఖరి వల్ల విపరీత పరిణామాలు తలెత్తుతున్నాయి. నేడు కూడా మనం ప్రధాన భారత స్రవంతిగా భావించే జనజీవనంలో ముస్లిములను ఒక భాగంగా చూడడం లేదు.

తీవ్రవాదం అన్నది అపనమ్మకం వల్ల బలపడుతుంది. ఈ అపనమ్మకాన్ని కట్టుకథలు, అర్థసత్యాలు, అసత్యాలు పెంచి పోషిస్తాయి. అందువల్లనే తీవ్రవాద శక్తులు విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రతి అంశాన్ని వాడుకుంటాయి. తమకు అనుకూలంగా పనిచేసేలా మార్చుకుంటాయి. ఇతరుల పట్ల అహేతుకమైన ద్వేషాన్ని రెచ్చగొడతాయి. తమకు సంబంధించి అనవసరమైన ఆత్మదురభిమానాన్ని పెంచిపోషిస్తాయి. ఇతరులను హేళన చేయడం, తమ గొప్పలు అతిగా ప్రచారం చేసుకోవడం, తమ ఆధిక్యత, కీర్తిప్రతిష్ఠల గొప్పలు పోవడం ఒక అలవాటుగా చేసుకుంటాయి. ఈ విద్వేష ప్రచారంలో చరిత్రను వక్రీకరించడం, ఇతరుల ప్రతిష్ఠను మంటగలిపే ప్రచారాలు చేయడం, వైరమనస్తత్వాన్ని పెంచడం తదితర పనులకు పాల్పడతాయి.

భారతదేశంలో ముస్లిములు దాదాపు ఇరవై కోట్ల మంది ఉంటారు. ఈ ముస్లిమ్ సముదాయం లక్ష్యంగా వారి ప్రతిష్టను మంటగలిపే ప్రచారం జరుగుతోంది. వారిపై కువిమర్శల దాడులు జరుగుతున్నాయి. మతతత్వ పోటీకి పాల్పడే సముదాయాలన్నింటి పరిస్థితి ఇలాగే ఉంటుంది. పేరుకుపోయిన విద్వేషాలు భగ్గుమనడానికి చిన్న సంఘటన చాలు, హింసాగ్ని జ్వాలలు చెలరేగుతాయి. ఒక సెక్యులర్, బహుళ సముదాయాల ప్రజాస్వామిక వ్యవస్థ పౌరులుగా, మతం ప్రేమానుబంధాలు, స్నేహసౌభ్రాత్రతా భావనలు పెంపొందించే నిర్మాణాత్మక శక్తిగా ఉపయోగపడే ప్రజాస్వామిక వ్యవస్థ పౌరులుగా మనం మిగలం. ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అన్న ప్రశ్నలు అసంబద్ధమైన ప్రశ్నలుగా

మిగిలిపోతాయి. వాస్తవమేమంటే బురదజల్లుకోవడం మాత్రమే కొనసాగుతుంది. ఈ బురదను శుభ్రం చేయాలంటే చాలా శ్రమపడాల్సి ఉంటుంది. దేశంలోని రెండు ప్రధాన మత సముదాయాల మధ్య సత్సంబంధాలు నెలకొన్నప్పుడే, ఈ రెండు సముదాయాలు ఒకదాన్ని ఒకటి అర్థం చేసుకోడానికి ప్రయత్నించినప్పుడే, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యంలో ఒకరినొకరు అవగాహన చేసుకున్నప్పుడే ఈ మురికిని తొలగించడం సాధ్యపడుతుంది. ఈ సముదాయాలు ఒకరి మతవిశ్వాసాన్ని మరొకరు అర్థం చేసుకుని గౌరవించాలి. మతపరమైన సౌహార్దత, సోదరభావాలను పెంపొందించుకోవాలి. విద్వేషం విభజిస్తుంది. ప్రేమ కలుపుతుంది. స్నేహసంబంధాలను పెంపొందించుకోడానికి, ప్రజాభివృద్ధి కార్యక్రమాలు బలోపేతం చేయడానికి ప్రజల మధ్య స్నేహసంబంధాలను సుదృఢం చేయాలి.

# అపోహాలు

ముస్లిముల గురించి అనేక అపార్థాలు ప్రచారంలో ఉన్నాయి. ఉదాహరణకు సాధారణ ప్రజల దృష్టిలో ముస్లిమ్ పర్సనల్ లా అంటే నలుగురు భార్యలను పెళ్ళి చేసుకునే సదుపాయం, ఇష్టంలేని భార్యను మూడు సార్లు తలాక్ చెప్పి వదిలించుకునే సౌకర్యం. అదేవిధంగా ముస్లిములందరూ కుటుంబ నియంత్రణను ఇష్టపడరన్న అభిప్రాయం. కాబట్టి ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంటారు, అందువల్ల వారి జనాభా పెరిగిపోతూ ఉంటుంది, కొంతకాలానికి వారు అధికసంఖ్యాకులై పోతారన్న ప్రచారం దాని వెనుకే కొనసాగుతుంది. చరిత్ర వక్రీకరణల వల్ల అగ్నికి మరింత ఆజ్యం పోసినట్లవుతోంది. ఉదాహరణకు చరిత్రలో బలవంతంగా మతమార్పిళ్ళు జరిగాయని, మందిరాలు కూల్చేసి అక్కడ మస్జిదులు కట్టారని, విగ్రహాలను అపవిత్రం చేశారని ప్రచారం చేయడం ద్వారా పగ ప్రతీకారాలకు రెచ్చగొట్టడం కాకపోయినా ముస్లిములను దుర్మార్గులుగా చిత్రీకరించడాన్ని సమర్థించుకోవడం జరుగుతోంది. ముస్లిములందరూ మూకుమ్మడిగా ఒకే పార్టీకి ఓటు వేస్తారన్న ప్రచారం, ఎన్నికల రాజకీయాల్లో అడుగుపెడుతున్న ముస్లిమ్ పార్టీలను మైనారిటీ రాజకీయ వ్యూహాలుగా చిత్రీకరించడం జరుగుతోంది. కొన్ని రాజకీయ పార్టీలు ప్రవక్త ముహమ్మద్ (స) పుట్టినరోజును జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ జిమ్మిక్కులకు పాల్పడడం జరిగినా లేక కనీసం ముస్లిమ్ సముదాయం ప్రగతి పురోగతులకు ఏమన్నా చర్యలు తీసుకున్నా వాటన్నింటిని ముస్లిములను బుజ్జగించడంగా ప్రచారం చేస్తుంటారు. ఆ వెంటనే మనోభావాలను రెచ్చగొట్టి ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలన్నీ జరుగుతాయి.

# చరిత్రలో పక్షపాతాలు

ఔరంగజేబు, టిప్పు సుల్తాన్ వంటి చారిత్రక వ్యక్తుల వ్యక్తిత్వాన్ని వక్రీకరించడం కూడా నేడు విద్వేష రాజకీయాలకు ఉపయోగపడుతోంది. ముస్లిములకు, హిందువులకు మధ్య దూరాన్ని పెంచడానికి ఇది కూడా సాధనమవుతోంది. ఉదాహరణకు ఔరంగజేబు బనారస్ మందిరాన్ని కూల్చడాన్ని ప్రత్యేకంగా ప్రచారం చేస్తుంటారు. కాని ఔరంగజేబు గోల్కొండలో జామా మస్జిదును కూడా కూలగొట్టించాడు. ఈ వాస్తవాన్ని మాత్రం ఎక్కడా ప్రస్తావించరు. గోల్కొండలోని జామా మస్జిదు ఆవరణలో కుతుబ్‌షాహీ రాజు అబుల్ హసన్ తానీషా అక్రమంగా సేకరించిన సంపదను దాచి ఉంచిన సమాచారం తెలిసిన వెంటనే ఔరంగజేబు ఆ మస్జిదును కూల్చే ఆదేశాలు ఇచ్చాడు. ఈ రెండు సంఘటనల్లోను ఈ రెండు ఆరాధనాలయాలు దురుపయోగానికి గురైనట్లు ఔరంగజేబు నిర్ధారించుకున్నాడు. నిష్పక్షపాత దృష్టితో చూస్తే ఔరంగజేబు చేపట్టిన చర్యలు ఒక చక్రవర్తిగా అధికారాన్ని కాపాడుకోవడానికి చేపట్టిన చర్యలు మాత్రమేనని అర్థమవుతుంది. ఆయన్ను సుగుణాల కుప్పగా పొగడవలసిన అవసరమూ లేదు, ఆయన్ను కించపరుస్తూ తక్కువ చేసి చూపవలసిన పనీ లేదు.

# బహుభార్యత్వం

ముస్లిములు ఒకటికి మించి వివాహాలు చేసుకుంటారని, బహుభార్యత్వం వారిలో ఎక్కువగా ఉంటుందన్న అపోహ సాధారణ ప్రజల్లో ప్రబలంగా ఉంది. బహుభార్యత్వం వల్ల ఎక్కువ సంతానం ఉంటుందని, ఫలితంగా వారి జనాభా పెరిగిపోతుందని గగ్గోలు చేస్తుంటారు. ఈ కట్టుకథలన్నీ సాధారణ జనాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ఎంతమంది పిల్లలు పుడతారన్నది పునరుత్పాదక వయసులో ఉన్న స్త్రీలు ఎంతమంది ఉన్నారన్న సంఖ్యపై ఆధారపడుతుంది. బహుభార్యత్వాన్ని పాటించినంత మాత్రాన స్త్రీల

సంఖ్య పెరిగిపోయి పుట్టే పిల్లల సంఖ్య పెరిగిపోదు. ఎంతమంది స్త్రీలు పునరుత్పత్తి వయసులో ఉన్నారో పిల్లలు కూడా అంతమందే ఉంటారు. ఒక పురుషుడు ఒక భార్యను కలిగి ఉన్నా ఒకరి కన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉన్నా పుట్టే పిల్లల సంఖ్యలో మార్పు ఉండదు. మొత్తం పుట్టే పిల్లల సంఖ్య మొత్తం స్త్రీల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. బహుభార్యత్వం వల్ల దీనిపై ప్రభావం ఉండదు.

ఆడశిశువులను పుట్టక ముందే హతమార్చడం, భ్రూణహత్యలకు పాల్పడడం, కట్నం కోసం వధువును కిరోసిన్ పోసి కాల్చడం, వరకట్నం కోసం వధువు తల్లిదండ్రులను పీడించడం వంటి సాంఘీక రుగ్మతలు వికృతనాట్యం చేస్తున్న సమాజంలో స్త్రీల సంఖ్య తగ్గడం సహజం.

ఇక రెండవ విషయం ఏమంటే దేశంలో స్త్రీ పురుష నిష్పత్తి పరిశీలిస్తే ముస్లిములకు బహుభార్యత్వం లాంటి సదుపాయం సాధ్యపడే సమస్య లేదు. ఎందుకంటే ముస్లిమ్ పురుషులు ఒక్కొక్కరు నలుగురు భార్యలను కలిగి ఉండడమే జరిగితే ముస్లిమ్ పురుషుల్లో 75 శాతం మందికి భార్యలే దొరకరు. 1981 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ముస్లిముల్లో స్త్రీపురుష నిష్పత్తి పరిశీలిస్తే వెయ్యిమంది ముస్లిమ్ స్త్రీలకు 1068 మంది ముస్లిమ్ పురుషులు ఉన్నారు. హిందువుల విషయానికి వస్తే వెయ్యిమంది హిందూ స్త్రీలకు 1072 మంది హిందూ పురుషులు ఉన్నారు. ఈ జనాభా లెక్కలను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ముస్లిమ్ పురుషులందరూ నలుగురు భార్యలను కలిగి ఉంటారని చెప్పడం ఎంత హాస్యాస్పదమో అర్థం అవుతుంది.

జనాభా లెక్కలను, కాస్త ముందు కాలం నుంచి పరిశీలిస్తే, ముఖ్యంగా బహుభార్యత్వం గురించిన లెక్కలను చూస్తే (1961 జనాభా లెక్కల ప్రకారం) ముస్లిములు బహుభార్యత్వం పాటిస్తారన్న అపోహ పటాపంచలై పోతుంది. ఈ జనాభా లెక్కల ప్రకారం బహుభార్యత్వం ఆదివాసీల్లో అత్యధికంగా ఉంది (15.25%). ఆ తర్వాతి స్థానంలో బౌద్ధులు ఉన్నారు (7.9%). జైనుల్లో 6.72%, హిందువుల్లో 5.80% బహుభార్యత్వం ఉంది. ఇంతకీ ముస్లిముల్లో ఎంత ఉందో తెలుసా. ముస్లిముల్లో 5.7 % మాత్రమే ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సామాజిక ధోరణుల్లో విపరీతమైన మార్పులేవీ లేవు కాబట్టి ఈ లెక్కల్లో పెద్దగా మార్పులు వచ్చే అవకాశం లేదు. పూనాలోని గోఖలే ఇనిస్టిట్యూట్‌కు చెందిన మల్లికా బి. మిస్త్రీ ఈ విషయమై పరిశోధించి "ముస్లిముల్లో బహుభార్యత్వం హిందువుల కన్నా ఎక్కువగా ఉందని చెప్పే ఆధారాలేవీ లేవని" పేర్కొన్నారు.

వాస్తవాలు ఇలా ఉన్నప్పటికీ కొన్ని మతతత్వ శక్తుల ప్రాపగాండ యంత్రాంగం విద్వేష ప్రచారాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది. హమ్ దో హమారే దో... వో పాంచ్ ఉన్కే

పచ్చీస్ (మేం ఇద్దరం మా కిద్దరు.. వారు ఐదుగురు వారికి పాతికమంది) వంటి మాటలు ప్రచారం చేస్తున్నారు. అంటే మనం హిందువులం ఒకే భార్య, ఇద్దరు పిల్లలన్న విధానానికి కట్టుబడి ఉన్నాం, కాని వాళ్ళు ముస్లిములు నలుగురు భార్యలు పాతికమంది సంతానం పద్ధతి పాటిస్తున్నారని జనంలో విషాన్ని నింపుతున్నారు. ముస్లిమ్ పురుషుడు కొన్ని పరిస్థితుల్లో అవసరమైతే ఒకరికి మించి భార్యలను, నలుగురు భార్యల వరకు పెళ్ళాడ్డానికి ఇవ్వబడిన అనుమతిని ఈ మతతత్వశక్తులు ముస్లిమ్ సముదాయంపై బురద జల్లడానికి ఉపయోగించుకుంటున్నాయి.

గుజరాత్, అహ్మదాబాద్‌లోని ఎనిమిది బ్లాకుల్లో 1993లో ఒక సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో నగరంలోని మొత్తం ముస్లిమ్ జనాభాను అధ్యయనం చేశారు. మొత్తం జనాభాలో కేవలం 279 మంది మాత్రమే ఇద్దరు భార్యలను కలిగి ఉన్నారు. ఈ ఫలితాలను హిందుస్తాన్ టైమ్స్ పత్రిక (జులై 13, 2003) ప్రచురిస్తూ "తరుచు ముస్లిములను ఈ విషయమై అవహేళన చేయడం జరుగుతుంటుంది కాని వాస్తవానికి హిందువులు కూడా ఎక్కువ మంది భార్యలను కలిగి ఉంటున్నారు. దాదాపు 29,951 మంది స్నేహ ఒప్పందాలు (మైత్రి కరార్) చేసుకున్న కేసులు ఉన్నాయి. ఈ స్నేహ ఒప్పందాలన్నీ జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా అప్పట్లో రిజిష్టరైనవి. మైత్రి కరార్ అనేది ఒక ఒప్పందం. ఈ ఒప్పందం ఒక పెళ్ళయిన హిందూ పురుషుడికి, మరో స్త్రీకి మధ్య జరుగుతుంది. హిందూ వివాహచట్టం ప్రకారం ఒక భార్య బతికి ఉండగా మరో పెళ్ళి చేసుకోడానికి వీలు లేదు కాబట్టి ఈ చట్టాన్ని తప్పించుకోడానికి ఇలాంటి స్నేహ ఒప్పందాలు చేసుకుంటున్నారు" అని ఆ పత్రిక రాసింది. అంతేకాదు, "ఈ ఒప్పందం చట్టబద్ధంగా ఎలాంటి ప్రాముఖ్యం లేని ఒప్పందం, పెళ్ళయిన పురుషుడితో కలిసి ఉన్న మరో స్త్రీకి ఒకవిధమైన భద్రతా భావాన్ని కలిగించడానికి ఉద్దేశించింది మాత్రమే" అని కూడా రాసింది.

## పర్సనల్ లా

ముస్లిమ్ పర్సనల్ లా అనేది ముస్లిములకు ఉన్న ప్రత్యేక సదుపాయంగా కొన్ని శక్తులు చిత్రీకరిస్తున్నాయి. కాని వాస్తవానికి వ్యక్తిగత చట్టాల సదుపాయం అన్ని సముదాయాలకు ఉంది. హిందువులు, హిందువుల్లోని కొన్ని సముదాయాలు ప్రత్యేక చట్టాలను కలిగి ఉన్నారు. ఈ చట్టాలు న్యాయపరంగా వివిధ స్థాయిల్లో ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి. ఉదాహరణకు హిందూ అవిభక్త కుటుంబానికి ఆస్తి, శిస్తుల్లో మినహాయింపు ఉంది. ఈశాన్య

రాష్ట్రాల్లోని వివిధ తెగలకు వారి కుటుంబ వ్యవహారాల విషయంలో సంప్రదాయిక చట్టాలను పాటించే హామీ ఇవ్వబడింది. గోవాలో పోర్చుగీస్ చట్టం పాటించే అనుమతి ఉంది. అలాగే దక్షిణాది హిందువులు పాటించే కుటుంబ చట్టాలు ఉత్తరాది హిందువులు పాటించే కుటుంబ చట్టాలకు భిన్నమైనవి. ఈ చట్టాల్లో సంస్కరణలు రావాలని చాలా మంది భావిస్తున్నారు. కాని ఒక్కసారిగా యూనిఫాం సివిల్ కోడ్, ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకువస్తామంటే ముస్లిముల కన్నా ఎక్కువగా హిందువులే వ్యతిరేకిస్తారు.

## హజ్ సబ్సిడీ

హజ్ యాత్రికులకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది. ఈ సబ్సిడీ ఇప్పుడు సుప్రీంకోర్టు రూలింగ్ తర్వాత దశలవారీగా తొలగించడం కూడా జరుగుతోంది. సెంట్రల్ హజ్ కమిటీ నిర్వహణలో చార్టర్డ్ ఫ్లయిట్స్ ద్వారా హజ్ యాత్రకు వెళ్ళే వారికి ఇవ్వబడే ఈ సబ్సిడీని అనేక మంది ముస్లిమ్ మేధావులే వ్యతిరేకిస్తున్నారు. సెక్యులర్ రాజ్యంలో ఈ సబ్సిడీ పొసగని విషయం. ఇస్లామీయ సూత్రాల ప్రకారం కూడా ఇది సమర్థించదగినది కాదు. కాని అనేక రాష్ట్రాలు ఇతర సముదాయాల ప్రజలకు కూడా తీర్థయాత్రలకు సబ్సిడీలు ఇస్తున్నాయన్నది గమనించాలి.

# జనాభా గలాభా

## ముస్లిమ్ జనాభా పెరుగుదల నిజంగా ఆందోళనకరంగా ఉందా?

ముస్లిముల్లో జనాభా పెరుగుదల రేటు చాలా ఎక్కువగా ఉందన్న అపోహ బలంగా వినిపిస్తోంది. ముస్లిమ్ పురుషులు నాలుగు వివాహాలు చేసుకుంటారని అందువల్ల వారి జనాభా విపరీతంగా పెరిగిపోతుందని, త్వరలోనే వారి జనాభా హిందువుల జనాభాను అధిగమిస్తుందని, దేశం ముస్లిమ్ దేశంగా మారిపోతుందని గగ్గోలు చేస్తున్నారు. ముస్లిములు కుటుంబ నియంత్రణ పాటించరు, ఒకరికి మించి భార్యలను కలిగి ఉంటారు, ఆవిధంగా జనాభా పెంచేసుకుంటున్నారని కొందరు వాదిస్తుంటారు.

ఈ అపోహలను, దురభిప్రాయాలను కొన్ని మతతత్వ శక్తులు చాలా కాలంగా ప్రచారం చేస్తూ వస్తున్నాయి. ముస్లిముల జనాభా పెరుగుదల రేటు చాలా ఎక్కువగా ఉందన్న దురభిప్రాయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించడం ద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయి. ఈ మతతత్వ విష ప్రచారంలో అర్ధసత్యాలను, కట్టుకథలను, పుకార్లను కలగలిపి ప్రజల్లో ఈ అపోహ బలపడేలా చేస్తున్నాయి.

మతాలవారీగా జరిగిన జనాభా లెక్కల సర్వేలు గమనిస్తే మతతత్వ శక్తుల దుష్ప్రచారం అసలు రంగు బట్టబయలవుతుంది. ఈ సర్వేలు మత ప్రాతిపదికన జనాభా లెక్కలు సేకరించడం జరిగింది. 1971 జనాభా లెక్కల్లో హిందువులు 82.7%, ముస్లిములు 11.2% ఉన్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారం అంటే ఇరవై సంవత్సరాల తర్వాత హిందువుల జనాభా 82.6% కాగా ముస్లిములు 11.4%. (మలయాళ మనోరమ ఇయర్ బుక్ 1992). ముస్లిముల జనాభా పెరుగుదల రేటు చాలా స్వల్ప స్థాయిలో ఎక్కువగా ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం ఏటా ముస్లిముల జనాభా పెరుగుదల రేట 2.7 ఉండగా హిందువుల

జనాభా పెరుగుదల రేటు 2.3 ఉంది. దీనిక్కారణం సాంఘీక ఆర్థిక వెనుకబాటు, నిరక్షరాస్యతలు. సాంఘీక, ఆర్థిక వెనుకబాటు, నిరక్షరాస్యతలు లేకపోతే హిందువులు, ముస్లిముల జనాభా పెరుగుదల రేటు సమానంగా ఉంది. ఉదాహరణకు కేరళలో మూడు ప్రధానమైన మతసముదాయాలు అంటే ముస్లిములు, హిందువులు, క్రయిస్తవుల్లో జనాభా పెరుగుదల రేటు ఒకేవిధంగా ఉంది. అక్షరాస్యత పెరగడం వల్ల అక్కడ అన్ని సముదాయాల్లోను జనాభా పెరుగుదల రేటు 1.8 శాతం మాత్రమే ఉంది. దీనికి విరుద్ధంగా జమ్ము కశ్మీర్‌లో హిందువుల జనాభా పెరుగుదల రేటు ముస్లిముల కన్నా ఎక్కువగా ఉంది. అక్కడ ముస్లిముల జనాభా పెరుగుదల రేటు 2.6 శాతం ఉండగా హిందువుల జనాభా పెరుగుదల రేటు 3.7 శాతం ఉంది.

ఈ జనాభా లెక్కలను పరిశీలిస్తే మతాల వారీగా జనాభా పెరుగుదల స్థిరంగానే ఉందని చెప్పాలి. ఇప్పుడు కనబడుతున్న స్వల్పమైన తేడాను లెక్కలోకి తీసుకున్నా ముస్లిముల జనాభా హిందువుల జనాభాను అధిగమించడమన్నది శతాబ్దకాలం గడిచినా సాధ్యపడదు. ఇక్కడ గమనించవలసిన మరో విషయం కూడా ఉంది. ఈ జనాభా లెక్కలను విశ్లేషిస్తే, 1961-71 మధ్య కాలంలో హిందువుల జనాభా పెరుగుదల 23.71 శాతం, 1971-81 మధ్య కాలంలో హిందువుల జనాభా పెరుగుదల 24.42 శాతం. ఇదే కాలంలో ముస్లిముల జనాభా వివరాలు చూస్తే, 1961-71 మధ్య కాలంలో ముస్లిముల జనాభా పెరుగుదల 30.85 శాతం. 1971-81 మధ్య కాలంలో ముస్లిముల జనాభా పెరుగుదల 30.20 శాతం. అంటే హిందువుల జనాభా పెరుగుదల రేటు పెరిగితే, ముస్లిముల జనాభా పెరుగుదల రేటు తగ్గింది. 1981 తర్వాత వంద సంవత్సరాల వరకు ఇదే పెరుగుదల రేటు కొనసాగితే హిందువుల జనాభా పెరుగుదల రేటు దశాబ్దానికి 30.71 గాను, ముస్లిముల జనాభా పెరుగుదల రేటు దశాబ్దానికి 30.55గాను ఉంటుంది. అంటే హిందువుల జనాభా పెరుగుదల రేటు ముస్లిముల కన్నా ఎక్కువగా ఉంటుంది.

# బుజ్జగింపు రాజకీయాల హంగామా

కొన్ని రాజకీయ పార్టీలు ముస్లిములను బుజ్జగిస్తున్నాయని, జాతీయ వనరుల్లో, జాతీయ సంపదలో వారి హక్కు కన్నా ఎక్కువగా ఒరగబెట్టేస్తున్నాయని మతతత్వ శక్తులు తరచు హంగామా చేస్తుంటాయి. ఈ ఆరోపణలు పచ్చి అబద్ధాలని రాజేందర్ సచర్ కమిటీ నిరూపించింది. భారత ప్రభుత్వం ఈ కమిటీని 2005లో నియమించింది. భారతదేశంలో ముస్లిమ్ సముదాయం సామాజిక పరిస్థితిని, విద్యాపరమైన స్థితిని నిర్ధారించడానికి ఈ కమిటీ ఏర్పాటయ్యింది. ఈ కమిటీ 2006లో నివేదిక సమర్పించింది. భారతదేశంలో ముస్లిముల పరిస్థితి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల పరిస్థితి కన్నా హీనంగా ఉందని తేల్చి చెప్పింది. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలను కమిటీ వెల్లడించింది. ముస్లిముల పరిస్థితి ఉద్యోగాల్లోను ఇతర సాంఘీక ఆర్థిక సూచికల్లోను ఎలా ఉందన్నది గమనిస్తే వారి సాంఘీక పరిస్థితిని అంచనావేయడం, వారి పట్ల బుజ్జగింపు వైఖరితో అధిక సదుపాయాలు కల్పించడం జరుగుతున్నదో లేదో ఖచ్చితంగా తెలుసుకోవడం సాధ్యపడుతుంది. ఈ సూచికల పరంగా వారి పరిస్థితి ఎలా ఉందో ఒకసారి చూద్దాం. ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసిన వాస్తవమేమంటే ముస్లిముల జనాభా దేశంలో దాదాపు 15 శాతం ఉంది.

1. ముస్లిముల్లో అక్షరాస్యత రేటు జాతీయ సగటు కన్నా చాలా తక్కువ. ముస్లిమ్ పిల్లల్లో 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసు వారిలో 25 శాతం పిల్లలు స్కూలు ముఖం చూడని వారు లేదా మధ్యలో చదువు మానేసిన వారు. స్వాతంత్ర్యం తర్వాత విద్యావకాశాల విస్తరణ వల్ల ముస్లిములకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. కళాశాలల్లో పరిస్థితి చూస్తే డిగ్రీ స్థాయి చదువుల్లో పాతికమంది విద్యార్థుల్లో ఒకరు మాత్రమే ముస్లిమ్. పోస్టు గ్రాడ్యుయేట్ చదువుల్లో 50 మంది విద్యార్థుల్లో ఒకరు మాత్రమే ముస్లిమ్ విద్యార్థి ఉన్నారు. ముస్లిమ్ గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం మిగిలిన అన్ని సముదాయాల కన్నా చాలా ఎక్కువ. ముస్లిమ్ పిల్లల్లో కేవలం 3 శాతం పిల్లలు మాత్రమే మదరసాలకు వెళుతున్నారు. యస్.సి., యస్.టీ.ల

అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలు ఆయా సముదాయాలకు ఎంతో కొంత ఉపయోగపడ్డాయని అలాంటి చర్యలు ముస్లిముల విషయంలోను చేపట్టవలసిన అవసరం ఉందని కమిటీ సిఫారసు చేసింది.

2. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ముస్లిముల ప్రాతినిధ్యం చాలా చాలా తక్కువ. క్లాస్ వన్ ఉద్యోగుల్లో కేవలం 3.19 శాతం ఉన్నారు. క్లాస్ 2 ఉద్యోగుల్లో కేవలం 4.30 శాతం ఉన్నారు. క్లాస్ 4 ఉద్యోగుల్లో కేవలం 8.16 శాతం ఉన్నారు. ఇక ప్రయివేటు ఉద్యోగాల్లో ఈ శాతం మరింత తక్కువ.

3. భారత జనాభాలో ముస్లిములు 15 శాతం ఉన్నప్పటికీ మొత్తం బ్యూరోక్రసీలో వారి ప్రాతినిధ్యం కేవలం 2.5 శాతం.

4. ఐ.ఏ.యస్.లో ముస్లిములు కేవలం 3 శాతం. ఇండియన్ ఫారిన్ సర్వీసులో కేవలం 1.8 శాతం. ఐ.పి.యస్.లో కేవలం 4 శాతం. దేశంలో ముస్లిముల జనాభా 15 శాతం ఉన్నప్పటికీ సివిల్ సర్వీసుల్లో వారి పరిస్థితి ఇది. ఇండియన్ రైల్వేల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 4.5శాతం. ఈ నాలుగు శాతంలోను 98.7శాతం మంది కేవలం దిగువస్థాయి ఉద్యోగాల్లో మాత్రమే ఉన్నారు. విశ్వవిద్యాలయాల్లో ముస్లిముల ప్రాతినిధ్యం చాలా తక్కువ. బ్యాంకుల్లో మరింత తక్కువ. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ముస్లిముల జనాభాకు తగిన శాతం ప్రాతినిధ్యం ప్రభుత్వ ఉద్యోగాల్లో లేదు. పోలీసు కానిస్టేబుళ్ళలో ముస్లిములు కేవలం 6 శాతం. ఆరోగ్య రంగంలో కేవలం 4.4 శాతం. రవాణా రంగంలో కేవలం 6.5 శాతం.

5. హైకోర్టుల్లో (1-4-1980 వరకు) మొత్తం 310 మంది న్యాయమూర్తుల్లో కేవలం 14 మంది ముస్లిములు.

6. ఆర్థిక సహాయానికి సంబంధించి రుణాలు తీసుకున్న ముస్లిములు కేవలం 4.3 శాతం. మొత్తం రుణాలుగా ఇచ్చిన మొత్తంలో ముస్లిములకు ఇచ్చింది కేవలం 2.02 శాతం. మొత్తం ఆర్థికరంగంలో ముస్లిములకు ఇచ్చిన అన్ని రుణాలు కలుపుకున్నా 3.76 శాతం మాత్రమే.

7. దేశంలోని భారీ పారిశ్రామిక సంస్థల్లో ముస్లిములకు చెందినవి చాలా తక్కువ. ముస్లిములకు జారీ అయిన పారిశ్రామిక లైసెన్సులు 2 రెండు శాతం కన్నా తక్కువ.

ముస్లిములు ముఖ్యంగా చేతివృత్తుల్లో ఉన్నారు. నిపుణులైన పనివారిగా పనిచేస్తున్నారు.

ఈ రంగంలో ఉద్యోగాలు చేసుకుంటున్న ముస్లిములు 52 శాతం ఉన్నారు కాని చేతివృత్తుల రంగంలో ముస్లిముల యాజమాన్యంలో ఉన్న సంస్థలు 4.4 శాతం మాత్రమే ఉన్నాయి.

నిర్ఘాంతపరిచే మరో వాస్తవమేమంటే రాజకీయాల్లో ముస్లిములకు భాగస్వామ్యం లభించకుండా వారిని అడ్డుకునే వ్యవస్థాగతమైన కుట్ర ఉందన్న ఆరోపణల్లో వాస్తవం లేకపోలేదని కమిటీ కనుగొంది. ఉదాహరణకు బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ముస్లిములు అధికంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలను రిజర్వు నియోజకవర్గాలుగా ప్రకటించడం జరిగింది. ఈ నియోజకవర్గాల నుంచి కేవలం యస్.సి. అభ్యర్థులు మాత్రమే పోటీ చేయగలరు. ముస్లిములు యస్.సీ.లు కాదన్నది గమనించాలి. అంటే వారి జనాభా ఎక్కువ ఉన్న నియోజకవర్గాల నుంచి వారు ఎన్నిక కాకుండా కుట్రపూరితంగా ఆ నియోజకవర్గాలను రిజర్వు నియోజకవర్గాలుగా ప్రకటించడం జరిగింది.

## బుజ్జగింపు ఇదా?

వివిధ కమీషన్లు ఇచ్చిన సిఫారసులను ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. ఓట్లు రాల్చుకునే సాధనాలుగా కమీషన్లను ఉపయోగించుకున్నాయి. ముస్లిముల వెనుకబాటు విషయంలో తాము చాలా పట్టించుకుంటున్నామన్న భ్రమను సృష్టించడానికి ఈ కమీషన్లను వాడుకున్నాయి. కాని వాస్తవానికి ఆచరణలో ముస్లిముల కోసం ఏమీ చేయలేదు. ఈ విషయం కూడా భారత ముస్లిముల విషయంలో నిర్వహించిన ఒక సర్వే చాటి చెప్పింది.

ఆ సర్వే ప్రకారం భారత ముస్లిముల ఆర్థిక పరిస్థితి అత్యంత దయానీయంగా ఉంది. ఏటా 10,000 రూపాయల కన్నా తక్కువ ఆదాయంతో జీవిస్తున్న కుటుంబాలు 30.4 శాతం ఉన్నాయి. 10,000 నుంచి 20,000 రూపాయల వార్షిక ఆదాయంతో జీవిస్తున్న కుటుంబాలు 24.4 శాతం ఉన్నాయి. 20,000 నుంచి 30,000 రూపాయల వార్షిక ఆదాయంతో జీవిస్తున్న కుటుంబాలు 7.5శాతం ఉన్నాయి. 30,000 నుంచి 40,000 రూపాయల వార్షిక ఆదాయంతో జీవిస్తున్న కుటుంబాలు 3.8 శాతం ఉన్నాయి. 40,000 నుంచి 50,000 రూపాయల వార్షిక ఆదాయంతో జీవిస్తున్న కుటుంబాలు కేవలం ఒక్క శాతం మాత్రమే ఉన్నాయి. 50,000 రూపాయల వార్షిక ఆదాయం కన్నా ఎక్కువ గడిస్తున్న కుటుంబాలు 5.6 శాతం ఉన్నాయి. 27.6 శాతం ముస్లిములు మురికివాడల్లో జీవిస్తున్నారు. 46.1 శాతం ముస్లిమ్ కుటుంబాలు కేవలం ఒకే గదిలో నివాసముంటున్నాయి.

వివిధ ప్రభుత్వాలు ముస్లిముల పట్ల బుజ్జగింపు వైఖరి అవలంబిస్తుంటే వారి పరిస్థితి ఇంత దయానీయంగా ఎందుకు ఉంది. దీనికి జవాబు ఏమంత కష్టం కాదు. ముస్లిముల

పట్ల ఎలాంటి బుజ్జగింపు వైఖరి లేదు. కేవలం బుజ్జగిస్తున్న భ్రమలు కల్పిస్తున్నారు. అలా చేయడంలో స్వార్థ రాజకీయ శక్తుల ప్రయోజనాలున్నాయి.

భారత రాజకీయాల్లో ఈ కుట్రపూరిత వైఖరులకు ముఖ్యమైన కారణం ఓటు బ్యాంకు రాజకీయాలు. రిజర్వేషన్ల విషయంలో మండల్ కమీషన్ సిఫారసులను అమలు చేసినప్పుడు అవి హిందువుల్లో వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాయి. ముస్లిములకు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదు. ముస్లిములకు మండల్ సిఫారసుల వల్ల ఒరిగిందేదీ లేదు. హిందువుల్లోని వెనుకబడిన వర్గాలకు ఈ సిఫారసుల వల్ల మేలు జరిగింది. నిజానికి వారిని బుజ్జగించడం జరిగింది. ఉత్తర భారతదేశంలో దాదాపు 20 శాతం జనాభా హిందూ అగ్రకులాలు. మండల్ సిఫారసుల వల్ల వారి ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. అందువల్లనే మండల్ కమీషన్ సిఫారసులకు వ్యతిరేకంగా హింసాత్మక ప్రదర్శనలకు పూనుకున్నారు. తమ మత సముదాయంలోని వెనుకబడిన వర్గాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు.

దేశంలో ముస్లిముల స్థితిగతుల గురించి రాజేందర్ సచర్ కమిటీ వెల్లడించిన వాస్తవాలు చదివితే ఆగ్రహం ఆవేదనలు ముప్పిరిగొంటాయి. ముస్లిమ్ మైనారిటీల సాంఘీక ఆర్థిక పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయంటే మానవాభివృద్ధి సూచికలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం దాదాపు శూన్యం. ముస్లిమ్ మైనారిటీల్లో చాలా మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. నిరక్షరాస్యత అత్యధికంగా ఉంది. ముస్లిముల సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది. రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం నానాటికి తగ్గిపోతోంది. భద్రతారాహిత్యం, అసమానత్వం వంటి కారణాల వల్ల వారు భయభీతులకు గురవుతున్నారు. అందువల్ల తమ మైనారిటీ గుర్తింపు పట్ల మరింత ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మతకలహాలు వారిని ప్రత్యేక వాడలకు పరిమితమయ్యేలా చేస్తున్నాయి. ఈ పరిణామాలు వారి పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. వారు నివసించే వాడల్లో జీవన ప్రమాణాలు నానాటికి దిగజారుతున్నాయి. వారి మనోభావాలపై దీని ప్రభావం పడుతోంది. మితవాద, ఛాందసవాద భావాలు అధికమవుతున్నాయి. ఆ విధంగా రెండు సముదాయాల మధ్య పూడ్చరాని అఖాతం ఏర్పడుతోంది.

మైనారిటీల పట్ల సాంఘీక సంక్షేమ శాఖ అధికారుల వైఖరి అత్యంత నిర్లక్ష్యభరితంగా ఉంటోంది. వారిని రెండవ తరగతి పౌరులుగా పరిగణించే ధోరణి కనబడుతోంది. అధికారుల్లో రెండు రకాల వ్యవహారశైలి చోటు చేసుకుంది. ప్రాబల్యం ఉన్న అధికసంఖ్యావర్గం

ప్రజల విషయంలో ఒకవిధమైన వ్యవహారశైలి, మైనారిటీల విషయంలో మరోవిధమైన వ్యవహారశైలి ప్రదర్శిస్తున్నారు. మతతత్వ శక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు మైనారిటీలను రెండవ తరగతి పౌరులుగా మార్చడానికి చేస్తూ వచ్చిన ప్రయత్నాలు ఫలిస్తున్నట్లు కనబడుతోంది.

నేడు దేశానికి కావలసింది ముస్లిములను బుజ్జగిస్తున్నారంటూ బాధ్యత లేకుండా వ్యాఖ్యలు చేయడాన్ని తక్షణం మానుకోవడం. ముస్లిముల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టడం. ఆ విధంగా వారు ప్రధాన జీవన స్రవంతిలో పాలు పంచుకునే, ప్రధాన జనసముదాయాలతో కలిసిమెలిసి శాంతి సౌహార్దతలతో జీవించే వాతావరణాన్ని సృష్టించడం.

# పాకిస్తాన్ - భారత ముస్లిములు

పాకిస్తాన్ ముస్లిములకు పవిత్రభూమి అన్న ఒక పెద్ద అపోహను మతతత్వశక్తులు దేశంలో ప్రచారం చేస్తున్నాయి. పాకిస్తాన్‌కు ఇస్లామ్‌లో ఎలాంటి ప్రత్యేక ప్రాముఖ్యమూ లేదు, మక్కాలో కాబా గృహం ఉన్నవిధంగా లేదా మదీనాలో ప్రవక్త ముహమ్మద్ (స) మస్జిదు ఉన్న విధంగా ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యత పాకిస్తాన్‌కు లేదు. ప్రపంచంలోని 57 ముస్లిమ్ దేశాల్లో పాకిస్తాన్ ఒకటి మాత్రమే. మలేషియా, చాద్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల మాదిరిగా పాకిస్తాన్ కూడా ఒక ముస్లిమ్ దేశం మాత్రమే. అలాగే పాకిస్తాన్ జెండాకు కూడా ఎలాంటి ప్రాముఖ్యమూ లేదు. భారత ముస్లిములు ఆ జెండాను ఆరాధించడం కాని, ఆ జెండా ఎగరవేయడాన్ని పవిత్రంగా భావించడం కాని లేనే లేదు. అనేక దేశాలకు జెండాలున్నట్లే పాకిస్తాన్‌కు ఒక జెండా ఉంది. అంతకు మించి ఆ జెండాకు మరే ప్రాముఖ్యమూ లేదు. పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లో గెలిస్తే లేదా హాకీ మ్యాచ్‌లో గెలిస్తే సంబరాలు చేసుకోవాలని దేశంలోని ముస్లిమ్ ధార్మిక, సామాజిక, రాజకీయ నాయకులెవ్వరు చెప్పలేదు, పైగా ఇలాంటి పనులేవీ చేయరాదని వారిస్తారు. భారతముస్లిములు పవిత్రంగా భావించి సందర్శించే పుణ్యక్షేత్రాలేవీ పాకిస్తాన్‌లో లేవు. నిజానికి భారత సిక్కులు పాకిస్తాన్, లాహోర్‌లో ఉన్న గురుద్వారాను సందర్శిస్తుంటారు.

# 786

క్రయిస్తవ మతానికి శిలువ చిహ్నం. ఓం లేదా స్వస్తిక్ హిందూ ధర్మాన్ని సూచిస్తుంది. ఇలాంటి చిహ్నాల ద్వారా మతాలను గుర్తించే అలవాటున్నవారు సాధారణంగా 786 అనే సంఖ్యను లేదా నక్షత్రంతో ఉన్న నెలవంకను ఇస్లామ్‌కు చిహ్నంగా భావిస్తుంటారు. సాధారణ ప్రజల్లో ఈ అభిప్రాయం ఎంత బలంగా ఉందంటే మతసముదాయాలకు ఏదైనా అప్పీలు చేయాలంటే ఈ చిహ్నాలను వాడుతుంటారు. ఈ చిహ్నాలను ఉపయోగించడం వల్ల వ్యక్తీకరణ బలంగా ఉంటుందనుకుంటారు. కాని ఇస్లామ్‌ను గుర్తించడానికి ఇలాంటి చిహ్నాలను వేటిని ప్రతిపాదించడం కాని, అధికారికంగా ఆమోదించడం కాని ఇస్లామ్‌లో లేదు. ఇలాంటి చిహ్నాలకు ఇస్లామ్‌లో ఎలాంటి ప్రాముఖ్యమూ లేదు.

చాలా ప్రాచుర్యం పొందిన 786 సంఖ్య విషయానికి వస్తే ఈ సంఖ్య అరబీలోని బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ అన్న వచనానికి సంకేతంగా వాడుకలోకి తెచ్చారు. బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్ అనేది ఒక చిన్న ప్రార్ధన. దివ్యఖుర్‌ఆన్‌లోని ప్రతి అధ్యయం ప్రారంభంలో ఈ ప్రార్ధన చదువుతారు. ఒక ముస్లిమ్ ఏ పని ప్రారంభించినా ఈ ప్రార్ధన ద్వారా ప్రారంభించాలని చెప్పడం జరిగింది. ఈ ప్రార్ధనకు అర్ధమేమిటంటే "నేను అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. ఆయన అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు". అరబిక్ భాషలో ఒక సంప్రదాయం ఉంది. భాషలోని ప్రతి అక్షరానికి ఒక అంకెను అనుసంధానించే సంప్రదాయం అది. దీన్ని అబ్జద్ గణన విధానం అంటారు. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ అన్న ప్రార్ధనలోని ప్రతి అక్షరానికి సూచించబడిన అంకెలను కలిపితే 786 వస్తుంది. కొందరు ముస్లిములు ఏదన్నా రాస్తున్నప్పుడు, ఒక ఉత్తరం లేదా ఏదన్నా పత్రం రాస్తున్నప్పుడు బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ అన్న ప్రార్ధనా వాక్యానికి బదులు క్లుప్తంగా ఉంటుందని ఈ సంఖ్య రాస్తుంటారు. ఇస్లామ్‌లో దీనికి ఎలాంటి ప్రాముఖ్యమూ లేదు. ఇస్లామ్ ఇలా చేయాలని చెప్పనూ లేదు. ఇది అరబిక్ సాహిత్యంలో ఉన్న ఒక సంప్రదాయం మాత్రమే. కాబట్టి దీనికి ఎలాంటి ధార్మిక ప్రాధాన్యమూ లేదని తెలుసుకోవాలి.

కొన్ని మూఢనమ్మకాలు ఆధునిక కాలంలో సరికొత్త రూపంలో దర్శనమిస్తుంటాయి. అదేవిధంగా 786 అన్న సంఖ్య కూడా ఆధునిక ఉపకరణాలు, పరికరాలపై కూడా దర్శనమిస్తోంది. కొందరు సంపన్న ముస్లిములు తమ కారు రిజిస్ట్రేషన్ నెంబరులో చివరి మూడు అంకెలు 786 ఉండాలని కోరుకుంటారు. కొందరు తమ సెల్ ఫోను నెంబరులో చివరి మూడు అంకెలు 786 ఉండాలని అభిలషిస్తారు. ఈ ఫ్యాన్సి నెంబర్లను పొందడానికి

భారీ మొత్తం ఖర్చు చేయడానికి కూడా వెనుకాడరు. ఈ నెంబరు ఉంటే తేలిగ్గా గుర్తుంచుకోవచ్చని, ఇతరులకు చెప్పడంలో కూడా సౌలభ్యం ఉంటుందని ఇంకొందరు ఈ నెంబరు కోరుకుంటారు. సినిమాల్లో కూడా ఈ నెంబరును ఉపయోగించడం, ఆ విధంగా మనోభావాలను వాడుకోవడం కనబడుతుంది. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ వీర్ జరాలో షారూక్ ఖాన్ పాకిస్తాన్ లాహోర్ జైల్లో ఖైదీ నెంబర్ 786గా కనబడతాడు.

# నెలవంక - నక్షత్రం

ఇస్లామీయ కేలండర్ చంద్రమాన కేలండర్. ఇస్లామ్‌లోని హిజ్రీ కేలండర్‌ను రెండవ ఖలీఫా లేదా ఇస్లామీయ రాజ్యాధ్యక్షుడిగా హజ్రత్ ఉమర్ (రజి) ప్రవేశపెట్టారు. ఈ కేలండర్‌ను హజ్రత్ ఉమర్ (రజి) చంద్రమాన కేలండర్‌గానే ప్రవేశపెట్టారు. ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనాకు వలస వెళ్ళిన సంఘటనను హిజ్రత్ అంటారు. ఈ వలస వెళ్ళిన తేదీ నుంచి హిజ్రీ కేలండర్ ప్రారంభమవుతుంది. ముఖ్యమైన ధార్మిక ఆచరణలు, ఉదాహరణకు హజ్ యాత్ర, ఉపవాసాల మాసం రమజాన్, ఈదుల్ ఫిత్ర్ లేదా రమజాన్ పండుగ, ఈదుల్ అజ్హా లేదా బక్రీద్ పండుగ చంద్రమానం ప్రకారమే జరుపుకుంటారు. ఇస్లామీయ పవిత్రమాసం రమజాన్ ప్రారంభమైందని గుర్తించాలంటే ఆ మాసం నెలవంక కనబడాలి. అందువల్లనే నెలవంక కనబడడాన్ని జాగ్రత్తగా గమనిస్తారు. టర్కీలో ఏర్పడిన ఉస్మానియా సామ్రాజ్యం అతిపెద్ద సామ్రాజ్యం. యూరప్, ఆసియాల్లోని అనేక ప్రాంతాలు ఈ సామ్రాజ్యపరిధిలో ఉండేవి. ఈ సామ్రాజ్యచిహ్నంగా అప్పట్లో నెలవంక నక్షత్రం ఉన్న చిహ్నాన్ని వాడుకునేవారు. వారి జెండాపై ఈ చిహ్నం ఉండేది. ఆ తర్వాతి నుంచి ముస్లిమ్ ప్రపంచంలో ఉస్మానియా జెండాను అనుసరించడం చోటు చేసుకుంది. ఈ సంప్రదాయాన్ని అనుసరించే అనేక ముస్లిమ్ దేశాలు తమ జాతీయ ఏంబ్లమ్‌లో నెలవంక నక్షత్రం చిహ్నాన్ని పొందుపరచడం ప్రారంభించాయి. అంతే తప్ప ఈ చిహ్నానికి ధార్మికంగా ఎలాంటి ప్రాముఖ్యమూ లేదు.

కొన్ని సందర్భాల్లో కొందరు అవగాహన లేని ముస్లిములు ఈ నెలవంక నక్షత్రం చిహ్నాన్ని ఇస్లామ్‌ను సూచించే పవిత్రమైనదిగా భావిస్తుంటారు. అందువల్లనే ముస్లిమ్ స్మశానాల వద్ద, దర్గాల వద్ద నెలవంక నక్షత్రం ఉన్న ఆకుపచ్చ జెండాలు కనబడుతుంటాయి. ఈ

చిహ్నం అనేక ఆధునిక ముస్లిమ్ దేశాల జెండాలపై కనబడుతున్నప్పటికీ ఇస్లామ్ ఈ చిహ్నాన్ని సూచించనూ లేదు, దీనికి ఎలాంటి పవిత్రతనూ ఆపాదించలేదు. ఉస్మానియా సామ్రాజ్యం ఈ చిహ్నాన్ని అధికారిక చిహ్నంగా రూపొందించి అప్పట్లో దీన్ని వాడుకునేది. ఈ చిహ్నం ఉస్మానియా సామ్రాజ్య పతాకంపై దాదాపు నాలుగు శతాబ్దాలపాటు ఉంది. ఈ చిహ్నం వాడకం ఎంత ప్రబలమైందంటే, అమెరికాలో ముస్లిముల ఉనికి, వారి పలుకుబడికి గుర్తుగా వాషింగ్టన్ డి.సి.లోని శ్వేతసౌధానికి ఎదురుగా ఉద్యనవంలో ఇటీవల ఈ చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ఒక ముస్లిమ్ రాజ్యం జెండాపై కాని, అధికారిక ముద్రల్లో కాని, రాజ్యచిహ్నంలో కాని ఈ నెలవంక నక్షత్రాన్ని ఉపయోగించాలన్న నిబంధన, సూచల్లాంటివి ఏవీ ధార్మిక గ్రంథాల్లో లేవు. ఇస్లామ్ ఈ చిహ్నాలను వేటిని సూచించలేదు. కాబట్టి ఈ చిహ్నానికి ఎలాంటి ధార్మిక ప్రాధాన్యమూ లేదు.

## కుట్రలు కుతంత్రాలు

నెలవంక నక్షత్ర చిహ్నాలున్న జెండాలను పాకిస్తాన్ జెండాలతో పోల్చడం ద్వారా హిందూత్వ మతతత్వ శక్తులు సాధారణ ప్రజల్లో ఒక విధమైన అయోమయాన్ని సృష్టించి రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. ముస్లిములకు సంబంధించిన జెండాలపై నెలవంక నక్షత్ర చిహ్నం కనబడుతున్నప్పటికీ, ఇలాంటి జెండాలు ముస్లిమ్ స్మశానాల వద్ద, దర్గాల వద్ద కనబడుతున్నప్పటికీ పాకిస్తాన్ జెండాలో ఎడమవైపున ఒక తెల్లని నిలువు పట్టీ దాదపు జెండాలో నాలుగోవంతు ఆక్రమించుకుని కనబడుతుంది.

## పాకిస్తాన్ జెండా

ముస్లిములు సాంప్రదాయికంగా ఉపయోగించే ఈ నెలవంక నక్షత్రం చిహ్నం ఉన్న జెండాను పాకిస్తాన్ జెండాగా చిత్రీకరిస్తూ మతతత్వ శక్తులు సాధారణ ప్రజల్లో అనుమానాలు అపోహలు సృష్టిస్తూ ముస్లిముల దేశప్రేమపై అనుమానాలు పెంపొందేలా చేస్తున్నాయి. విచిత్రమేమంటే మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి ఈ శక్తులు మరో అడుగు ముందుకు వేసి ఒక ప్రభుత్వ కార్యాలయంపై పాకిస్తాన్ జెండా ఎగరవేయడానికి కూడా బరితెగించాయి. కర్నాటకలో

ఈ సంఘటన జరిగింది. జనవరి 2012లో పోలీసులు కర్నాటక బెల్గాం జిల్లాలోని సిందగీ వద్ద ఆరుగురు శ్రీరామ సేన కార్యకర్తలను నిర్బంధంలోకి తీసుకున్నారు. (ది హిందూ, జనవరి 11, 2012). రామసేన కార్యకర్తలు స్వయంగా పాకిస్తాన్ జెండాను అక్కడి తహసిల్దార్ కార్యాలయంపై ఎగరేశారు. స్థానిక ముస్లిములు పాకిస్తాన్ జెండా ఎగరేశారని తర్వాత గగ్గోలు మొదలెట్టారు. చివరకు ఈ కుట్ర బట్టబయలైంది. మతకలహాలు రెచ్చగొట్టడానికి మతతత్వ శక్తులు ఎంత నీచానికి పాల్పడతాయో ఈ సంఘటన చాటి చెబుతోంది.

# ఆరాధనాలయాలను అపవిత్రం చేయడం

తహసిల్దార్ కార్యాలయంపై పాకిస్తాన్ జెండా ఎగరేయడానికి పాల్పడిన మతతత్వ శక్తులు ఇంకా దిగజారి ఇలాంటి నీచమైన మరికొన్ని ఎత్తుగడలకు పాల్పడుతున్నాయి. ఏప్రిల్ 2012లో హైదరాబాద్‌లో నలుగురు హిందూ యువకులు హైదరాబాద్‌లో మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లోని మందిరాల్లో గొడ్డుమాంసం ముక్కలు పారేసే హీనకృత్యానికి పాల్పడ్డారు. ఫలితంగా మతకలహాలు పెచ్చరిల్లాయి. తక్షణం రంగంలోకి దిగిన పోలీసులు ఈ పనికి పాల్పడిన నలుగురు హిందూ యువకులను నిర్బంధంలోకి తీసుకున్నారు. మతకలహాలను రెచ్చగొట్టడానికి కుట్రపూరితంగా ఈ నీచకృత్యానికి పాల్పడినట్లు తేలింది.

ఈ సంఘటనల వల్ల తెలుస్తున్నదేమంటే, మతపరమైన చిహ్నాల విషయంలో కాని, వాటి పవిత్రతకు భంగం వాటిల్లిందన్న ఆలోచనతో కాని ప్రజలు అతిగా ప్రతిస్పందించడం మంచిది కాదు. భారతదేశం వంటి బహుళ సముదాయాల దేశంలో ప్రజల మతభావాలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకోవాలనుకునే స్వార్థశక్తులు చాలా ఉండే అవకాశం ఉంది. కుట్రలు కుతంత్రాలతో ప్రజల్లో చిచ్చుపెట్టి మతకలహాల మారణకాండను సృష్టించే అవకాశం ఉంటుంది. మతతత్వ శక్తులు ప్రజలను రెచ్చగొట్టడానికి తమ ఏజంట్లనే నియమించి సమాజాన్ని మతపరంగా ముక్కలు ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తాయి. ఇలాంటి కుట్రలు కుతంత్రాల ద్వారా ఎన్నికల రాజకీయాల్లో ప్రయోజనాలు సాధించుకోవాలని చూస్తాయి. పైన పేర్కొన్న రెండు సంఘటనల ద్వారా ఈ వాస్తవాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. మతతత్వ శక్తుల ఏజంట్లే ఆరాధనాలయాల్లో అభ్యంతరకరమైన పదార్థాలు విసరి ఈ పని చేసింది ముస్లిములేనని ఆరోపించి ముస్లిములపై సాధారణ జనాన్ని రెచ్చగొట్టటానికి పాల్పడ్డాయి. నిజానికి ఆ పని చేసింది ముస్లిములు కాదు, అలాంటి నీచమైన పని గురించిన ఆలోచన

కూడా వారికి రాలేదు.

మతతత్వ శక్తుల ఎత్తుగడలు బెడిసికొడుతున్నాయి. ప్రజలను రెచ్చగొట్టడానికి వాడుకున్న వివాదాస్పద అంశాలు అనుకున్న ఫలితాలు ఇవ్వడం లేదు. అయోధ్య సమస్యపై హంగామా చేసినా దేశంపై సర్వాధికారాలు సాధించలేకపోయారు. మతభావాలను రెచ్చగొట్టడానికి ఎలాంటి ప్రయత్నాలకైనా వెనుకాడని పరిస్థితికి చేరుకున్నారు. ఆ విధంగా తమ ఓటుబ్యాంకును కాపాడుకోవాలని చూస్తున్నారు. అందువల్ల సాధారణ ప్రజలు హిందువులు కాని ముస్లిములు కాని ఈ పరిస్థితుల్లో అత్యంత సంయమనంతో వ్యవహరించవలసి ఉంది. సంయమనాన్ని కోల్పోవడం వల్ల మతతత్వ శక్తుల చేతుల్లో పావులుగా మారిపోతాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటే, శాంతిభద్రతలను కాపాడే యంత్రాంగం పక్షపాతంగా వ్యవహరించేది లేదని తీర్మానించుకుంటే, సమాజాన్ని అల్లకల్లోలం చేసి స్వార్థ ప్రయోజనాలు సాధించుకోవాలని ప్రయత్నిస్తున్న మతతత్వ శక్తులు పన్నాగాలు పారవు.

# ప్రేమ జిహాద్

కర్నాటకలో బిజేపి అధికారంలో ఉన్న కాలంలో మీడియాలో ఒక విచిత్రమైన ప్రచారం మొదలైంది. హిందూ అమ్మాయిలను ప్రేమవలలో దింపి ముస్లిమ్ యువకులు వారిని మతం మార్చుకునేలా చేస్తున్నారని, ఇదంతా ఒక ప్రణాళికాబద్ధంగా ముస్లిమ్ సంస్థలు చేయిస్తున్నాయని ప్రచారం మొదలైంది. కొన్ని వారాల పాటు మీడియాలో ప్రముఖంగా ఈ వార్తలు వచ్చాయి. కేరళ, కర్నాటక శాసనసభల్లోను ఈ సమస్య ప్రస్తావనకు వచ్చింది. కర్నాటక ప్రభుత్వం ఈ విషయమై పోలీసు విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో ఇదంతా ఉత్త పుకారుగా తేలిపోయింది. ఈ పుకారును కర్నాటక కోస్తా ప్రాంతంలోని మతతత్వ శక్తులు ప్రారంభించాయి. ఈ పుకారు ప్రారంభించడానికి ముందు బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా ముస్లిమ్ పురుషుడు ఎవరైనా హిందూ స్త్రీతో మాట్లాడుతూ కనబడినా లేదా హిందూ స్త్రీతో కలిసి ఎవరైనా ముస్లిమ్ పురుషుడు ప్రయాణిస్తూ కనబడినా వారిపై మతతత్వ శక్తులు దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల పరంపర ప్రారంభమైన వెంటనే ఈ పుకారు కూడా మొదలైంది.

ఈ పుకారు వెనుక రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. తామే హిందువులకు రక్షణ కల్పించగలమని, హిందూ స్త్రీలకు భద్రత కల్పించగలమని మతతత్వ హిందూత్వ శక్తులు ఒకవిధమైన భ్రమను సాధారణ హిందూ ప్రజల్లో సృష్టించాలనుకున్నాయి. హిందూ అమ్మాయిలు ముస్లిముల ప్రేమ వలలో పడకుండా కాపాడే రక్షకులుగా తమను తాము చిత్రీకరించుకోడానికి ప్రయత్నించాయి. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే సాధారణంగా స్త్రీలను కుటుంబ గౌరవానికి చిహ్నంగా భావిస్తారు, అంతేకాదు తమ సమాజ గౌరవానికి చిహ్నంగా భావిస్తారు. స్త్రీలను ఇతర సముదాయం తమ నుంచి వేరు చేయడమంటే తమ సముదాయానికి తీవ్ర పరాభవంగా భావిస్తారు. ఈ ఆలోచనతో రెచ్చిపోతారు. ఇలా రెచ్చగొట్టడమే ఈ పుకారు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

మీడియాలో మతతత్వ శక్తులు ప్రారంభించిన ఈ పుకారు ఉద్యమం ప్రారంభం నుంచి విశ్వసనీయతను కోల్పోయింది. ఈ ఆరోపణలు వినిపించిన తర్వాత కర్నాటక హైకోర్టు విచారణకు ఆదేశించింది. ఒక డిఐజి స్థాయి అధికారి ఈ విచారణకు నేతృత్వం వహించారు. ఆయన విచారణ తర్వాత తన నివేదికను సమర్పిస్తూ కొన్ని మతాంతర వివాహాల సంఘటనలున్నప్పటికీ ముస్లిమ్ యువకులు హిందూ అమ్మాయిలను ప్రేమవలలో కుట్రపూరితంగా దింపడమన్నది ఒక అపోహ మాత్రమేనని తేల్చి చెప్పారు. మతాంతర వివాహాల విషయంలోను ఎలాంటి బలవంతం లేదా ప్రలోభాలు పోలీసుల విచారణలో బయటపడలేదు. అదేవిధంగా మరో విచారణలోను ఈ ప్రేమజిహాద్ లాంటిది ఏదీ లేదని, ఇలాంటి ప్రయత్నాలకు పాల్పడుతున్న సంస్థ ఏదీ లేదని తేలిపోయింది. ముస్లిమ్ సంస్థలు ముస్లిమ్ యువకుల ద్వారా హిందూ అమ్మాయిలను ప్రేమలో దింపి ప్రేమ జిహాద్‌కు కుట్రపన్నాయని మతతత్వ శక్తులు హంగామా చేస్తున్నదంతా అబద్ధమని తేలిపోయింది. కొన్ని ప్రేమ వివాహాల్లో భర్త ముస్లిమ్ అయినప్పుడు భార్య మతం మార్చే ప్రయత్నాలు జరిగాయన్నది నిజమే అయినా అవన్నీ వ్యక్తిగత స్థాయిలో జరిగిన ప్రేమ వ్యవహారాలు మాత్రమే. ప్రణాళికాబద్ధంగా, కుట్రపూరితంగా ఇలాంటి కొన్ని సంస్థలు ఇలాంటి ప్రేమ జిహాద్‌కు పాల్పడుతున్నాయన్నది పచ్చి అబద్ధమని స్పష్టం అయ్యింది. మీడియాలో మొదలైన ఈ పుకారు ఉద్యమం చల్లారినప్పటికీ మతతత్వ శక్తులు ముస్లిములపై బురదజల్లడం మాత్రం ఆగలేదు. బలవంతంగా హిందూ ముస్లిమ్ స్త్రీపురుషుల మధ్య ఎలాంటి సంభాషణలు, పరస్పర చర్యలు లేకుండా అడ్డుగోడలు కట్టడం ఆగలేదు.

అసలు ప్రేమ జిహాద్ పేరిట ఒక సంస్థ పనిచేయమన్నదే అహేతుకమైన ఆలోచన. జిహాద్‌ను ఇప్పుడు వక్రీకరించిన అర్థంలో తీసుకున్నప్పటికీ ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమ జిహాద్ ఎలా అవుతుంది. ప్రేమ అనేది అసంకల్పితంగా, మానసికంగా మొదలవుతుంది. దీనికి బయటి నుంచి ప్రేరణలు, ప్రేరకాలు ఉంటాయని ఆలోచించడమే అసంబద్ధం. ప్రేమను నటించడం లేదా కుట్రపూరితంగా ప్రేమను పొందడం సాధ్యమా? ప్రేమ హృదయాల్లో పుడుతుంది. సంబంధాల్లో బలపడుతుంది. బలవంతంగా ప్రేమ జనిస్తుందని భావించడం అవివేకం.

# వందేమాతరం

## జాతీయవాదం తక్కువ రాజకీయస్వార్థం ఎక్కువ

సంక్లిష్ట చరిత్ర ఉన్న గేయం వందేమాతరం. బంకీం చంద్రం చటర్జీ ఈ గేయాన్ని రాశారు. తర్వాత ఆయనే రాసిన ఆనందమఠ్ నవలలో ఈ గేయాన్ని కూడా చేర్చారు. ఆనందమఠ్ నవల మొత్తం ముస్లిమ్ వ్యతిరేకత, విద్వేషాలతో నిండిన నవల. సమాజంలో కొన్ని వర్గాలకు ఈ గేయం ఎంతో ఇష్టమైన గేయం. ఇస్లామ్ ఏకదైవారాధక మతం. ఒకే ఒక్క దేవుడిని తప్ప మరో దేవుడిని కాని, దేవతను కాని ఇస్లామ్ గుర్తించదు. ఏకైక దేవుడిని తప్ప మరెవ్వరినైనా ఆరాధించడాన్ని ఇస్లామ్ సమ్మతించదు. ఇది మతతత్వ శక్తులకు మంచి అవకాశంగా దొరికింది. వందేమాతరం పాడకుండా ఉండడం జాతివ్యతిరేక చర్యగా చిత్రీకరించడం ప్రారంభించాయి.

జాతీయవాదం, దేశప్రేమ, మాతృభూమి పట్ల ప్రేమ విషయంలో ముస్లిములు ఎవరికి తక్కువ కాదు. కాని నేలను పూజించడం, ఆరాధించడం అన్నది ఇస్లామ్‌లో లేదు. దేశం పట్ల ప్రేమ కలిగి ఉండడం వేరు, దేశాన్ని ఆరాధించాలని చెప్పడం వేరు. ఈ రెంటి మధ్య తేడాను గుర్తించాలి. సౌదీ అరేబియా, ఈరాన్ వంటి దేశాల్లో ప్రజలను దేశాన్ని ఆరాధించాలని చెప్పడం ఉండదు. దేశం పట్ల శ్రద్ధ, ప్రేమ కలిగి ఉండడానికి దేశాన్ని దేవుడిగా భావించి పూజించవలసిన అవసరం లేదు.

**జనగణమన :** రబీంద్రనాథ ఠాగూర్ రాసిన జనగణమన గీతాన్ని జాతీయ గీతంగా ఎన్నుకున్నారు. ఈ గీతంలో భారతదేశంలోని బహుళత్వాన్ని ప్రస్తావించడం జరిగింది. ఇక్కడ గమనించవలసిన మరో వాస్తవమేమంటే వందేమాతరం గేయంలోని మొదటి రెండు చరణాలు మాత్రమే జాతీయగేయంగా గుర్తించడం జరిగింది. మిగిలిన చరణాలు జాతీయ గేయంలో లేవు. ఈ మిగిలిన చరణాల్లో మాతృభూమిని హిందూ దేవతగా ప్రస్తుతించడం జరిగింది. జనగణమన గీతం విషయంలోను కొన్ని శక్తులు కించపరచడానికి ప్రయత్నించాయి. కింగ్‌జార్జ్ 5 భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా రవీంద్రనాథ ఠాగూర్ ఈ గీతాన్ని ఆయన్ను ప్రస్తుతిస్తూ రాశారన్న ఆరోపణ వినిపిస్తుంది. ఇది కూడా ఒక అపోహ. ఇటీవలి కాలంలో ఈ అపోహను ప్రచారం చేయడం ప్రారంభమయ్యింది. నోబుల్ బహుమతి గ్రహీత

రవీంద్రనాథ ఠాగూర్‌పై బురదజల్లడానికే ఈ అపోహను సృష్టించారు. వలసవాదాన్ని రవీంద్రనాథ ఠాగూర్ ఎంత బలంగా వ్యతిరేకించారో అందరికీ తెలుసు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అజాద్ హింద్ ఫౌజ్ "జనగణమన" గీతాన్ని జాతీయగేయంగా స్వీకరించింది. "జనగణమన" మన జాతీయ జీవనంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకుందని గాంధీజీ కొనియాడారు. ఈ కారణం వల్లనే కొన్ని శక్తులు "జనగణమన" స్థానంలో బంకిం చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గేయానికి ప్రాధాన్యం ఇవ్వాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

వందేమాతరం పాడడం విషయంలో ముస్లిముల అభ్యంతరాల కన్నా "జనగణమన" గీతాన్ని తక్కువ చేసి చూపించడానికి కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇది నిజానికి మతతత్వ రాజకీయాలతో ముడిపడిన సమస్య. ఒక మతసముదాయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసే కుట్ర ఇందులో ఉంది. జాతీయఔన్నత్యాన్ని కాపాడే మంచి ఉద్దేశ్యం ఏదీ ఇందులో లేదు.

ఈ సమస్య సుప్రీంకోర్టుకు కూడా వెళ్ళింది. "జెహోవా విట్‌నెసెస్ ఫెయిత్" విద్యార్థులు వందేమాతరం పాడడానికి నిరాకరించారు. ఈ గేయం తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఆ విద్యార్థులను స్కూలు బహిష్కరించింది. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్ళింది. ఒక సెక్యులర్ న్యాయస్థానం ఒక మతవిశ్వాసం సరయినదా కాదా అన్నది తేల్చి చెప్పడం కుదరదని కోర్టు పేర్కొంది. ఒక సముదాయం ప్రత్యేక మతవిశ్వాసాన్ని నిజంగా, మనస్ఫూర్తిగా కలిగి ఉందా లేదా, అలాగే ఆ మతవిశ్వాసం శాంతిభద్రతలకు, సామాజిక నైతికతకు వ్యతిరేకంగా ఉందా అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టు తీర్పు ఇచ్చింది. విద్యార్థుల బహిష్కరణను కోర్టు కొట్టివేసింది. భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ ప్రసాదించిన మతస్వేచ్ఛకు ఇది విరుద్ధంగా ఉందని పేర్కొంది. ఆ విద్యార్థులను స్కూలులోకి తిరిగి తీసుకున్నారు.

ఈ తీర్పును ప్రముఖ న్యాయవాది సోలీ సోరాబ్జీ వివరిస్తూ ఇలా అన్నారు : "మన సంప్రదాయం సహనాన్ని బోధిస్తుంది. మన తత్వం సహనాన్ని నేర్పుతుంది. మన రాజ్యాంగంలో సహనశీలం ఉంది. ఇది మసకబారిపోకుండా మనం చూసుకోవాలి."

# టిప్పు సుల్తాన్

## దేశభక్తుడిపై కువిమర్శలు

పక్షపాతంతో కళ్ళుమూసుకుని వ్యవహరించే చరిత్రకారులు కొందరు 18వ శతాబ్దానికి చెందిన మైసూరు పాలకుడు టిప్పుసుల్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని కువిమర్శలకు దిగుతున్నారు. టిప్పుసుల్తాన్‌ను ఒక నిరంకుశ పాలకుడిగా చిత్రీకరిస్తున్నారు. మరింత బాధాకరంగా, ఆయన్ను మతోన్మాద పాలకుడని ప్రచారం చేస్తున్నారు. బ్రిటీష్ వలసపాలకులకు మద్దతిచ్చిన ముఠాలపై ఆయన తీసుకున్న చర్యలను వక్రీకరించి ఆయన్ను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

భారతదేశంలో ముస్లిముల పాలనను మతోన్మాద పాలనగా చిత్రీకరించడానికి ప్రయత్నించే చరిత్రకారులే ఇలాంటి రాతలకు పూనుకున్నారు. ముస్లిమ్ పాలకులు తమ రాజకీయ ప్రత్యర్థులను అణచడానికి చేపట్టిన కొన్ని చర్యలు ఈ మతతత్వ చరిత్రకారులకు గొప్ప అవకాశాలుగా దొరికాయి. ముస్లిమ్ పాలకులను మతోన్మాదులుగాను, ముస్లిమేతర ప్రజలను బాధితులుగాను చిత్రించి చరిత్రను మతతత్వీకరణ చేయడానికి పాల్పడుతున్నారు. ఇలాంటి చరిత్రకు శ్రీకారం చుట్టింది బ్రిటీష్ పాలకులే. భారతదేశంపై తమ పరిపాలనను సుస్థిరం చేయడానికి కుట్రపూరితంగా “విభజించు పాలించు” విధానాన్ని అవలంబించి బ్రిటీష్ వలసపాలకులు పెట్టిన చిచ్చు ఇలా కొనసాగుతోంది.

టిప్పుసుల్తాన్ ఆయన తండ్రి హైదర్‌అలీల చరిత్రను ఈ మతతత్వశక్తులు అనేకవిధాలుగా వక్రీకరించాయి. బ్రిటీషు వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఈ ఇద్దరు మైసూరు పాలకులంటే బ్రిటీషు వారికి కంటగింపైంది. మొదటి మైసూరు యుద్ధం 1767లో జరిగింది. ఆ యుద్ధంలో బ్రిటీషువారిని మద్రాసులోని సెయింట్ జార్జి ఫోర్టు వరకు తరిమికొట్టారు. ఒక మోసపూరితమైన ఒప్పందం కనుక అప్పట్లో జరగనట్లయితే దక్షిణభారతదేశంలో బ్రిటీషువారి పాలనకు టిప్పుసుల్తాన్ అప్పట్లోనే చరమగీతం పాడి ఉండేవాడు. ఈ పోరాటాల్లో ఒటమి వల్ల బ్రిటీషువారు తమ విభజన కుట్రను మరింత తీవ్రం చేశారు. విద్వేష ప్రచారాన్ని మరింత ఎక్కువ చేశారు. హిందూ ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ముస్లిమ్ పాలకులపై ప్రజలను రెచ్చగొట్టడం ప్రారంభించారు. కాని వీరి ఈ కుట్రలు 18వ శతాబ్ధంలో పెద్దగా విజయవంతం కాలేదు. కాని మతతత్వ చరిత్ర ఆ తర్వాతి శతాబ్దాలలో తన ప్రభావం చూపించింది. 1980 తర్వాతి నుంచి చరిత్ర కాషాయీకరణ ఎక్కువయ్యింది. చరిత్రను వక్రీకరించిన కొందరు చరిత్రకారుల రాతలను ఉపయోగించుకుంటూ కొందరు పాలకులను

మతతత్వవాదులుగా ప్రచారం చేయడం, మీడియాలో ఇలాంటి రాతలు రావడం, పాఠ్యపుస్తకాల్లో ఈ వక్రీకరించిన చరిత్ర చోటు చేసుకోవడంతో నిజాలపై నివురుగప్పుకుంది. టిప్పుసుల్తాన్‌కు సంబంధించి ఇలాంటి వక్రీకరణలు తీవ్రంగా జరిగాయి.

భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల జాబితాలో టిప్పుసుల్తాన్ పేరు చేర్చడానికి వీల్లేదంటూ వ్యతిరేకించే శక్తులు పుట్టుకురావడం అత్యంత దురదృష్టకరం. భారతస్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల్లో టిప్పుసుల్తాన్ అత్యంత ముఖ్యుడు. ఆయన బ్రిటీషువారిని తరిమికొట్టడానికి పోరాడ్డం మాత్రమే కాదు, బ్రిటీషు వారి నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి తన ప్రాణాలు కూడా అర్పించాడు. మూడవ మైసూరుయుద్ధం 1793లో జరిగింది. ఆ యుద్ధంలో బ్రిటీషువారిది పైచేయి అయ్యింది. ఆ యుద్ధ పరిహారంగా 2.30 కోట్లు చెల్లించేవరకు తన ఇద్దరు కుమారులను బ్రిటీషువారి వద్ద హామీగా ఉంచవలసి వచ్చినా ఆయన వెనుకాడలేదు (రిఫరెన్స్ వికీపీడియా). ఆ మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లించి తన కుమారులను మద్రాసు నుంచి విడిపించుకున్నారు. అంత పెద్ద మొత్తం ఆయన చెల్లించినా ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకంత వ్యక్తం కాలేదంటే, ప్రజలు ఆయన పట్ల ఎంత విధేయంగా ఉండేవారో, ఆయన్ను ఎంత అభిమానించేవారో అర్థమవుతుంది.

నిస్సందేహంగా టిప్పుసుల్తాన్ ఇస్లామీయ సంప్రదాయాలకు చాలా విలువ ఇచ్చేవాడు. ఆయన రాజ్యాన్ని "సల్తనతె ఖుదాదాద్" అనేవాడు. అంటే దైవమిచ్చిన రాజ్యం. అయితే ఆయన పాలనావ్యవహారాల్లో పూర్తి సమానత్వాన్ని పాటించాడు. మతవర్గాల సుహృద్భావ, శాంతియుత సహజీవనాన్ని అభిలషించాడు. ముస్లిములైనా, హిందువులైనా అందరి సంక్షేమానికి పనిచేశాడు. మస్జిదుల విషయంలోనైనా, మందిరాల విషయంలోనైనా సమానంగా వ్యవహరించాడు. ఆయన హిందువులకు ఉన్నత పదవులు కట్టబెట్టాడు. ఉద్యోగాల్లో ఎలాంటి వివక్ష పాటించలేదు. మీర్ ఆసఫ్ పదవిలో అంటే దివాన్ పదవిలో పూర్ణయ్యను నియమించాడు. అంటే ఆయనకు అత్యంత కీలకమైన మంత్రిపదవిలో హిందూ పూర్ణయ్య ఉండేవారు. ఆర్థికమంత్రిగా కృష్ణారావు ఉండేవారు. పోలీసు యంత్రాంగానికి అధినేతగా శ్యామారావు ఉండేవారు. మద్రాసులో రాయబారిగా శ్రీనివాసరావు పనిచేశాడు. పూనాలో రాయబారి అప్పాజీరావు. ఢిల్లీలో రాయబారి మూల్‌చంద్. ఆయనకు వ్యక్తిగత సహాయకుడు సుబ్బారావు. ఆయనకు ఆంతరంగీకుల్లో నాయక్‌రావు, నాయక్ సంఘానా ముఖ్యులు. మున్షీ అంటే ఎక్కౌంటెంట్ నార్సయ్య. కూర్గులో కమాండెంట్ నాగప్పయ్య. సైన్యంలో ఒక ముఖ్యమైన డివిజన్‌కు కమాండర్ హరిసింగ్. మూడువేల గుర్రాలున్న అశ్వికదళానికి కమాండర్ శివాజీ. హిందూమతాన్ని ఆయన అణిచేసిన మాట వాస్తవమైతే అదే హిందూ మతానికి చెందిన వ్యక్తులను కీలకమైన పదవులివ్వడం జరిగేదా? ఎవరో

కొందరికి కాదు పెద్ద సంఖ్యలో హిందువులకు ఆయన పదవులు కట్టబెట్టాడు.

వివిధ మందిరాలకు టిప్పుసుల్తాన్ ఇచ్చిన కానుకలు కూడా ఈ సందర్భంగా దృష్టిలో ఉంచుకోవాలి. కాని ఆ వివరాలన్ని ప్రస్తావించడానికి ఇక్కడ స్థలం చాలదు. టిప్పుసుల్తాన్ వివిధ మందిరాలకు కానుకలిచ్చింది తానేదో సెక్యులర్ రాజునని చెప్పుకోడానికి కాదు, అప్పట్లో సెక్యులరిజమ్ అన్న భావన ఏదీ లేదు. కాబట్టి తాను సెక్యులర్‌నని చెప్పుకునే అవసరమూ ఆయనకు కలుగలేదు. ప్రజలను సంతోషపెట్టడానికి ఆయన చేపట్టిన చర్యల్లో ఒక భాగం మాత్రమే అది. ప్రజలు సాంప్రదాయికంగా అనుసరిస్తున్న పద్ధతుల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడానికి మాత్రమే ఆయన ఈ కానుకలు పంపేవాడు.

చరిత్రకు మతతత్వరంగు పులమడానికి అత్యుత్సాహం ప్రదర్శించే చరిత్రకారులు ఒక వాస్తవాన్ని మరిచిపోతుంటారు. అదేమంటే, ఆ కాలంలో తీవ్రమైన రాజకీయ అనిశ్చితి, రాజకీయ యుద్ధాల్లో ఎవరు ఏ పక్షాన ఉన్నారన్నదే పరిగణనలో ఉంటుంది. బ్రిటీషువారికి వ్యతిరేకంగా నడుంకట్టిన వారెవరు, బ్రిటీషువారికి సహాయకులుగా బతుకుతున్నవారెవరన్న విభజన మాత్రమే ఉంటుంది. కూర్గులపై, కేరళ నాయర్లపై జరిగిన యుద్ధాలను ఈ నేపథ్యంలోనే చూడాలి. అలాగే కర్నాటక నవాబులు ముస్లిములైనా వారిపై కూడా యుద్ధాలు జరిగాయి. వీరంతా బ్రిటీషువారికి దాసులై స్వాతంత్ర్యపోరాటాలను వ్యతిరేకించినవారన్నది మనం గుర్తించాలి. ప్రముఖ రచయిత బి.ఎన్.పాండే ఈ విషయాలను తన "ఔరంగజేబ్ అండ్ టిప్పుసుల్తాన్ : ఇవాల్యుషన్ ఆఫ్ దెర్ రెలిజియస్ పాలిసీస్" అన్న పుస్తకంలో చక్కగా పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆబ్జెక్టివ్ స్టడీస్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. "ఆయన కూర్గులోని హిందువులను, మంగుళూరులో క్రయిస్తవులను, మలబార్‌లోని నాయర్లపై అణిచివేయడానికి కారణం వారంతా ఆయనకు వ్యతిరేకంగా బ్రిటీషువారితో చేతులు కలుపడం వల్లనే జరిగింది. ఆయన మలబార్‌కు చెందిన మోపిల్లాలను కూడా వదల్లేదు. (మోపిల్లాలు ముస్లిములు). మహదేవీ ముస్లిములను కాని, సావన్‌పూర్ నవాబులను కాని, హైదరాబాద్ నిజామును కాని ఎవరినీ ఆయన వదల్లేదు. బ్రిటీషువారితో చేతులు కలిపే ధోరణి కనిపించిన ప్రతిసారి ఆయన చర్య తీసుకున్నాడు."

కాబట్టి టిప్పుసుల్తాన్‌ను మతతత్వవాదిగా ముద్రవేయడం కన్నా అవివేకం మరొకటి ఉండదు. తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బ్రిటీషువారితో చేతులు కలిపిన వారందరి పట్ల ఆయన కఠినంగా వ్యవహరించాడు. కాబట్టి ఆయన తీసుకున్న చర్యల వెనుక రాజకీయ కారణాలున్నాయే కాని మతపరమైన కారణాలు లేవు.

అందువల్లనే గాంధీజీ టిప్పుసుల్తాన్ గురించి వ్యాఖ్యానిస్తూ "హిందూ ముస్లిమ్

సమైక్యతకు ప్రతిరూపంగా" పేర్కొన్నారు.

మతతత్వ చరిత్రకారులు ఎంత నీచంగా చరిత్రను వక్రీకరించారనడానికి ఉదాహరణ బి.ఎన్.పాండే పరిశోధనలో తేలింది. డా.బి.ఎన్.పాండే ఒరిస్సా గవర్నర్‌గా ఉన్నప్పుడు కూర్గులో హిందువులను సామూహికంగా చంపేయడం జరిగిందన్న ప్రస్తావనను ఒకచోట చదివారు. ఆయన వెంటనే మైసూరు గెజిట్‌లో దీనికి సంబంధించిన రిఫరెన్స్ కోసం ప్రయత్నించారు.

ఈ సంఘటన గురించి డా.పాండే చదివింది ఒక పాఠ్యపుస్తకంలో. అలహాబాద్‌లోని ఆంగ్లో బెంగాలీ కాలేజిలో చదివిస్తున్న చరిత్ర పాఠ్యపుస్తకంలో ఈ ప్రస్తావన ఉంది. ఆ పాఠ్యపుస్తకంలో "టిప్పుసుల్తాన్ బలవంతంగా మతం మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలకు భయపడి మూడువేల మంది బ్రాహ్మణులు ఆత్మహత్య చేసుకున్నారు." అని రాసి ఉంది. ఈ మాటలు రాసింది ప్రముఖ మేధావిగా పేరున్న డా.హరిప్రసాద్ శాస్త్రి. ఆయన కలకత్తా విశ్వవిద్యాలయంలో సంస్కృత విభాగానికి అధిపతి.

ఇది చదివిన డా.పాండే వెంటనే డా.హరిప్రసాద్ శాస్త్రికి లేఖరాశారు. ఈ సంఘటన జరిగిందనడానికి ఆధారాలు ఎక్కడ నుంచి తీసుకున్నారో చెప్పవలసిందిగా కోరారు. హరిప్రసాద్ శాస్త్రి ఈ లేఖకు జవాబివ్వలేదు. చాలా ఉత్తరాలు రాసిన తర్వాత కాని ఆయన నుంచి జవాబు రాలేదు. ఈ సమాచారం తనక మైసూరు గెజిట్ నుంచి లభించిందని జవాబిచ్చాడు. ఆ తర్వాత డా.పాండే అప్పట్లో మైసూరు విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా ఉన్న సర్ బ్రిజేంద్రనాథ్ సీల్‌కు లేఖ రాసి, మైసూరు గెజిట్‌లో ఈ సంఘటన గురించి ఎక్కడ ఉందో తెలియజేయాలని కోరారు. సర్ బ్రిజేంద్రనాథ్ ఈ లేఖను అప్పుడు మైసూరు గెజిట్‌పై పనిచేస్తున్న ప్రొఫెసర్ శ్రీకాంతయ్యకు పంపించారు. ప్రొఫెసర్ శ్రీకాంతయ్య స్వయంగా చరిత్రకారుడు. ఆయన ఈ లేఖకు జవాబిస్తూ అలాంటి సంఘటన గురించి మైసూరు గెజిట్‌లో ఎక్కడా లేదన్నాడు. అలాంటి సంఘటన ఏదీ జరగలేదని ఒక చరిత్రకారుడిగా తాను గట్టిగా చెప్పగలనన్నాడు. అంతేకాదు "టిప్పుసుల్తాన్ ప్రధానమంత్రి, సర్వసైన్యాధ్యక్షుడు ఇద్దరు బ్రాహ్మణులే" అని కూడా తెలియజేశాడు. దాంతోపాటు సుల్తాన్ ఖజానా నుంచి వార్షిక గ్రాంటులు పొందుతున్న 156 హిందూ దేవాలయాల లిస్టును కూడా ఆయన పంపించాడు. నేటికి కూడా నంజాగుడ్ మందిరంలో టిప్పుసుల్తాన్ బహూకరించిన లింగమే పూజలు అందుకుంటుంది. టిప్పుసుల్తాన్ ప్యాలెస్‌కు రాయివేటు దూరంలో రంగనాథ ఆలయం ఉంది. మస్జిద్ నుంచి వచ్చే అజాన్ పట్ల టిప్పు ఎంత మర్యాద చూపించేవాడో, రంగనాథ ఆలయం గంటలు వినిపించినప్పుడు కూడా అంతే మర్యాద చూపించేవాడు. (ఇంపాక్ట్

ఇంటర్నేషనల్, లండన్, వాల్యూమ్ 28, జులై 1998)

మైసూరు గెజిట్‌లో ఈ బ్రాహ్మణుల ఆత్మహత్య కథ లేదు. తర్వాత పరిశోధనలో హరిప్రసాద్ శాస్త్రి ఈ కథను కల్నల్ మైల్ రాసిన "హిస్టరీ ఆఫ్ మైసూరు" నుంచి సేకరించాడని తెలిసింది. మైల్ ఈ సంఘటనను క్వీన్ విక్టోరియా వ్యక్తిగత లైబ్రరీలోని ఒక పర్షియన్ రాతప్రతిలో చదివానని రాశాడు. డా. పాండే అంతటితో వదల్లేదు. క్వీన్ విక్టోరియా లైబ్రరీలోని ఆ రాతప్రతి కోసం ప్రయత్నించారు. క్వీన్ విక్టోరియా లైబ్రరీలో మైల్ చెబుతున్న రాతప్రతి ఏదీ ఎప్పుడూ లేదని తేలింది. ఇలాంటి కట్టుకథ రాసిన హరిప్రసాద్ శాస్త్రి పుస్తకాన్ని భారతదేశంలోని ఏడు రాష్ట్రాల్లో – అస్సామ్, బెంగాల్, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్; మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పాఠ్యపుస్తకంగా హైస్కూళ్ళలో బోధిస్తున్నారు. మతతత్వాన్ని బుర్రలకెక్కిస్తున్నారు. డా.పాండే తన ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిని కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌కు పంపించారు. అప్పుడు వైస్ చాన్సలర్‌గా ఉన్న సర్ అషుతోష్ చౌదరి వెంటనే ఆ పుస్తకాన్ని సిలబస్ నుంచి తొలగించారు. ఇది జరిగిన తర్వాత చాలా సంవత్సరాలకు, అంటే 1972లో డా. పాండే ఇదే ఆత్మహత్యల కట్టుకథను ఉత్తరప్రదేశ్ హైస్కూళ్ళలో బోధించడం చూసి ఖంగుతిన్నారు. ఈ అబద్ధపు మతతత్వ చరిత్ర ఒక వాస్తవంగా చరిత్ర పుస్తకాల్లో చక్కర్లు కొడుతూనే ఉంది.

టిప్పు సుల్తాన్ మందిరాలకు, దేవాలయాలకు ఇచ్చిన జాగీర్లు, కానుకల జాబితా ఎంత పెద్దదంటే వేల పేజీలు సరిపోవు. ప్రముఖ మందిరాల్లో కనుగొన్న ప్రాచీన పత్రాల్లో ఆయన గురించిన మరిన్ని వివరాలు లభ్యమవుతున్నాయి. పీష్వా సైన్యాలు శృంగేరిలోని ముఖ్య మందిరాన్ని ధ్వంసం చేసిన సంఘటన ఆయన్ను చాలా కదిలించింది. తన ఖజానా నుంచి అధికారికంగా నిధులు పంపించి విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించాడు. తమిళనాడులోని కంజీవరంలో మందిర నిర్మాణానికి 10,000 హన్స్ (అప్పటి సొమ్ము) పంపించాడు. ఆ మందిర నిర్మాణం ముగిసిన తర్వాత రథోత్సవంలో స్వయంగా పాల్గొన్నాడు. మెల్కోట్ మందిరంలో ఇరువర్గాల మధ్య వివాదాన్ని ఆయన పరిష్కరించాడు. ఆయన తీర్పును ఇరుపక్షాలు అంగీకరించాయి. దిండిగల్‌ను ముట్టడించినప్పుడు దక్షిణం వైపు నుంచి దాడులు చేయకుండా వారించాడు. ఎందుకంటే రాజాగారి మందిరం అటువైపుగా ఉంది కాబట్టి దానికి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. పాత కన్నడ సాహిత్యంలో టిప్పు సుల్తాన్‌ను ప్రశంసించిన కవితలు అనేకం ఉన్నాయి. కర్నాటక, తుమ్కూరు జిల్లాలోని సీబిలో ఉన్న మందిరం పైకప్పు టిప్పుసుల్తాన్ ప్రశంసలను నేటికి కూడా ప్రదర్శిస్తోంది. పాత మైసూరు రాజ్యానికి చెందిన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాకవులు టిప్పుసుల్తాన్‌ను కీర్తిస్తూ పాటలు పాడడం

నేడు కూడా కనబడుతుంది. మందిరం పైకప్పుపై వేసిన చిత్రాలు టిప్పు సుల్తాన్ మరణించిన యాభై సంవత్సరాల తర్వాత చిత్రీకరించారన్నది గమనిస్తే ప్రజల్లో ఆయన పట్ల ఎంత అభిమానం ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆయన మరణించిన అర్థశతాబ్ది తర్వాత కూడా ఆ అభిమానం అంతరించలేదు.

యుద్ధరంగంలో రక్తమోడుతూ ఆయన నేలకొరిగిన తర్వాత ఆయన మృతశరీరం వద్ద ప్రజలు సాష్టాంగపడ్డారు. ఆయన అంత్యక్రియల వద్ద కూడా ఇదే దృశ్యం కనబడింది. టిప్పుసుల్తాన్ నిరంకుశంగా మతోన్మాదిలా వ్యవహరించి ఉంటే ఇలా జరిగి ఉండేదా? కాని చరిత్ర ఈ సంఘటనలను రికార్డు చేసింది. ఒకవైపు శ్రీరంగపట్నంలో బ్రిటీషు సైన్యం దోపిళ్ళకు పాల్పడుతుంటే, సాధారణ ప్రజల ఇళ్ళు దోచుకుంటుంటే, హిందూ ప్రజలు పెద్ద సంఖ్యలో సుల్తాన్ ప్యాలెస్ వద్ద రోదిస్తూ ఆయన మృతశరీరానికి సాష్టాంగపడ్డారని చరిత్రకారులు రాశారు. (బీట్సన్ 1880, ముహమ్మద్ మొయినుద్దీన్ కొటేషన్, సన్‌సెట్ ఎట్ శ్రీరంగపట్నం, ఓరియంట్ లాంగ్‌మ్యాన్, 2000). ఒక మతోన్మాది పాలకుడై ఉంటే ప్రజలు ఇంత అభిమానం చూపించి ఉండేవారా?

## మానవాళికి టిప్పు సేవలు

మంగుళూరు, గోవా విశ్వవిద్యాలయాలకు వైస్‌చాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బి.షేక్ అలీ "టిప్పు సుల్తాన్ – ఎ సెక్యులర్ రూలర్" అన్న వ్యాసంలో రాసిన పంక్తులు ఇక్కడ ప్రస్తావించదగ్గవి.

> "పదిహేడేళ్ళ టిప్పు పరిపాలనలో అత్యంత ముఖ్యమైనది ఆయన అవలంబించిన ఆంతరంగిక విధానం. ఆయన వాణిజ్యం, వర్తకం, కళలు, చేతివృత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆయన ఒక పటిష్టమైన పాలనావ్యవస్థను ఏర్పాటు చేశారు. నౌకాదళం, రాకెట్ వ్యవస్థ, వాణిజ్యం పరిశ్రమలపై ప్రభుత్వ ఆజమాయిషీ, తుపాకులు, గాజు, పాత్రలు, కాగితం, పంచదార తయారు చేసే ఫ్యాక్టరీల ఆలోచన ఆయనదే. షాహర్ గంజాం పారిశ్రామిక వాడ వస్త్రాలకు, కాగితానికి ప్రసిద్ధి చెందింది. ఆయన తన రాజ్యంలోను, విదేశాలతోను వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేశాడు. మస్కత్, జిద్దా, బస్రా, పెగు వంటి ప్రాంతాల్లో ఈ వాణిజ్య కేంద్రాలను ప్రారంభించాడు. గంధపు తైలం, సిల్కు, మిరియాలు, తివాచీలు, ఏనుగుదంతాలతో చేసిన వస్తువులను నేలమార్గాన, సముద్రమార్గాన ఎగుమతి చేసేవారు. ఆయన కాలంలో భత్కల్, మంగుళూరు, హొన్నవార్ ప్రముఖ నౌకాశ్రయాలుగా ఉండేవి.

రాజ్యంలో ప్రాథమిక విద్యాభ్యాసం తప్పనిసరి చేశాడు. రాజ్యంలో కోఆపరేటివ్ బ్యాంకులు, తపాలా సర్వీసులు ప్రారంభించాడు. కావేరీ నదిపై డ్యాము కట్టాలన్న ఆలోచన కూడా ఆయనదే. కావేరీ నదిపై వ్యవసాయనీటి సరఫరా కోసం సాదె ముహీ ప్రాజెక్టుకు ఆయన శంఖుస్థాపన చేశాడు. తర్వాత అదే స్థలం వద్ద సర్ ఎం. విశ్వేశ్వరయ్య డ్యాము కట్టారు. ఈ డ్యాము ప్రధాన గేటు వద్ద పర్షియన్‌లోను, ఇంగ్లీషులోను ఉన్న శిలాక్షరాలు "ప్రారంభించింది నేను. పూర్తి చేసేది దేవుడు" అని కనబడతాయి. ఆయన వివిధ ప్రాంతాల నుంచి వృత్తికళాకారులను, నిపుణులను రప్పించాడు. వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. రైతులకు రుణసదుపాయం కల్పించాడు. బంజరుభూముల సేద్యానికి సదుపాయాలు కల్పించాడు. జమిందారీ వ్యవస్థను రద్దు చేశాడు. రైతుల పంటలో నాల్గవభాగం శిస్తుగా వసూలు చేసేవాడు. పంటలు నష్టపోతే శిస్తుల్లో మినహాయింపు లభించేది. సిల్కు పరిశ్రమను ఆయనే ప్రారంభించాడు. శ్రీరంగపట్నంలో 21 సిల్కు ఉత్పత్తి కేంద్రాలు ఉండేవి. ఆయన సరికొత్త న్యాయవ్యవస్థ ప్రవేశపెట్టాడు. ఖైదీలు పండ్లతోటలు పెంచేలా చేశాడు. అవినీతి అధికారులను, సంఘవిద్రోహశక్తులను అత్యంత కఠినంగా అణిచివేశాడు. ఆయన ప్రవేశపెట్టిన సాంఘీక సంస్కరణల్లో ముఖ్యమైనవి : మద్యనిషేధం, బానిసత్వం, అనాథ పిల్లల అమ్మకాలు, దుబారా ఖర్చుల నిషేధం, జూదం, పొగాకు వాడకలా నిషేధం. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు జీవితంలోని అన్ని రంగాలను సంస్కరించాయి. సరికొత్త క్యాలెండర్, తూనికలు కొలతలు, బ్యాంకింగ్, ఫైనాన్స్, రెవిన్యూ, న్యాయవ్యవస్థ, ఆర్మీ, నేవీ, నైతిక ప్రమాణాలు, నడవడిక అన్నింటా ఆయన సంస్కరణలు కనబడతాయి. అంతేకాదు ఆయన రాహతీ నాణాలు ప్రవేశపెట్టాడు. ఈ నాణాలపై శివపార్వతులు, శృంగేరీ శారద, ఉడుపి కృష్ణుల చిత్రాలు, కన్నడ, పర్షియన్ భాషల్లో అంకెలు ఉండేవి. "

కొన్ని సముదాయాల్లో పండుగలప్పుడు, ఉత్సవాలప్పుడు మానవబలులు, బహుభర్తల పద్ధతి పాటించడం జరిగేది. మహిళలు అరకొరగా దుస్తులు ధరించేవారు. ఒక ఫర్మానా ద్వారా ఈ దురాచారాలన్నింటిని టిప్పు సుల్తాన్ తన రాజ్యంలో నిషేధించాడు. ఇలాంటి అనేక సంస్కరణలు, సంక్షేమ చర్యల వల్లనే టిప్పు సుల్తాన్ ప్రజల ప్రేమాభిమానాలు చూరగొన్నాడు. ఆయన్ను విమర్శించేవారు ఈ సంస్కరణల్లో కొన్నింటినిఇతర మతాల్లో జోక్యం చేసుకోవడంగా ఆరోపిస్తుంటారు. ఏది ఏమైనా భారత చరిత్రలో కనబడే అనేక రాజుల్లో టిప్పుసుల్తాన్ ఒక విశిష్టమైన వ్యక్తిగా అందరినీ ఆకర్షిస్తాడు.

ప్రముఖ బెంగాలీ మేధావి, చరిత్రకారుడు సర్ జాదూనాథ్ సర్కార్ టిప్పుసుల్తాన్ గురించి చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి.

"టిప్పు సుల్తాన్ ఒక గొప్ప స్వతంత్రసేనాని, గొప్ప పరిపాలనా దక్షుడు, సాంఘీక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కొత్త ఆవిష్కరణల విజ్ఞాని"

టిప్పుసుల్తాన్ గురించి ఆయన కాలంలో ఆయన శత్రువు ఏమన్నాడో, ఎలాంటి దృశ్యాలను ఆయన రాజ్యంలో చూసాడో తెలుసుకుంటే టిప్పుసుల్తాన్ గురించి మరింత చక్కగా అర్థం అవుతుంది. మూడవ మైసూరు యుద్ధంలో టిప్పు పై పోరాడ్డానికి వచ్చిన బాంబే డిటాచ్‌మెంట్‌కు చెందిన ఎడ్వర్డ్ మూర్ చెప్పిన మాటలు చూద్దాం:

"ఒక కొత్తరాజ్యంలో ప్రయాణించే వ్యక్తి అక్కడ చక్కటి పాడిపంటలు, శ్రమించే ప్రజలు, కొత్త కొత్త పట్టణాలు, వాణిజ్యవ్యాపార కార్యకలాపాలు, విస్తరిస్తున్న పట్టణాలు, ఎటు చూసినా సౌభాగ్యం చూస్తే ప్రజలు ఆనంద సంతోషాలతో ఉన్నారని భావిస్తాడు. ప్రజల అభిలాషలు, ఆకాంక్షలకు అనుగుణమైన ప్రభుత్వం పాలిస్తుందని అనుకుంటాడు. టిప్పు రాజ్యంలో ఇలాగే ఉంది. ఆయన ప్రభుత్వం గురించి మా అభిప్రాయం కూడా ఇదే."

# తలాక్

## (విడాకులు)

వివాహం విడాకులకు సంబంధించి సరళమైన విధానాలను వివరణాత్మకంగా ప్రతిపాదించిన మొదటి మతధర్మం ఇస్లామ్. దివ్యఖుర్‌ఆన్ ప్రకారం ఒక పురుషుడు ఒక స్త్రీ మధ్య కుదిరే సామాజిక ఒప్పందం వివాహ రూపంలో పరిపూర్ణమవుతుంది. కొందరు వ్యక్తుల సమక్షంలో ఆ స్త్రీపురుషులు ఒప్పందం చేసుకుంటారు. వధువు తరపు నుంచి వరుడి తరపు నుంచి ఇద్దరు వ్యక్తులు ఈ వివాహ ప్రతిపాదన చేస్తారు. మరో ఇద్దరు ఈ ప్రతిపాదన విషయంలో సాక్షులుగా ఉంటారు. ఖాజీ గారు ఈ ఒప్పందాన్ని అక్షరబద్ధం చేస్తారు. ఈ సందర్భంగా నికాహ్ ప్రసంగంగా పిలువబడే కొన్ని దివ్యఖుర్‌ఆన్ వచనాలను పఠిస్తారు. వివాహపత్రంపై వధువరులతో సంతకాలు చేయిస్తారు. ఈ విధంగా ఒప్పందాన్ని అంగీకరించడం ద్వారా వివాహం పూర్తవుతుంది.

ఇస్లామ్ మానవప్రవృత్తిని, మనిషి స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటుంది. మానవస్వభావంలోని వాస్తవాలను ఇస్లామ్ పరిగణనలోకి తీసుకుంది. అందువల్లనే వివాహం తర్వాత వధువరులు కలిసి ఉండడం సాధ్యం కాదనుకుంటే విడిపోయే అవకాశాన్ని కూడా కల్పించింది. వధువరులు తమ స్వభావాల మధ్య పొంతన కుదరదనుకుంటే విడిపోవచ్చు. వారిద్దరికీ సంతానం ఉన్నప్పటికీ బలవంతంగా కలిసి కాపురం చేయవలసిన అవసరం లేదు. వివాహాన్ని రద్దు చేసుకునే విధివిధానాలు వివరణాత్మకంగా ఉన్నాయి. దీన్నే తలాక్ లేదా విడాకులు అంటారు. అయితే ఒక ముస్లిం భర్త కేవలం నోటితో మూడు సార్లు తలాక్ చెప్పి భార్యను వదిలించుకుంటాడన్న దురభిప్రాయం ముస్లిమేతరుల్లో బలంగా ఉంది. దీనికి సంబంధించి అనేక అపహాస్యపు వ్యాఖ్యలు, అవహేళనలు కూడా ప్రచారంలో ఉన్నాయి. కొందరు అవగాహన లేని మౌల్వీలు కూడా దీనికి కారణమయ్యారు. ఫోనులో, మొబైల్‌లో చెప్పినా సరే లేదా ఎస్ఎమ్ఎస్ చేసినా, ఈ మెయిల్ పంపినా తలాక్ అవుతుందని

ఫత్వాలిచ్చారు. ఇంకాస్తా ముందుకెళ్ళి మద్యం మత్తులో చెప్పినా, లేదా నిద్రలో కలలో చెప్పినా కూడా తలాక్ అమలవుతుందని చెప్పినవాళ్ళూ ఉన్నారు. కొన్ని హిందీ సినిమాలకు గొప్ప కథాంశంగా కూడా ఇవి ఉపయోగపడ్డాయి.

మద్యం మత్తులో ముస్లిమ్ భర్త తలాక్ చెబితే ఇస్లామ్‌లో దానికి ఎలాంటి స్థాయి ఉందో ఒకసారి ఆలోచించాలి. మద్యం మత్తులో ప్రార్థనలు చేస్తే స్వీకరించబడవని స్పష్టంగా ఉన్నప్పుడు మద్యం మత్తులో చెప్పిన తలాక్ ఎలా అమలవుతుంది. దీన్ని బట్టి మనకు స్పష్టంగా అర్థమవుతుందేమిటంటే, కొన్ని స్వార్థ శక్తులు ఇలాంటి అపవాదులను సృష్టించి ఇస్లామ్‌పై, ఇస్లామీయ కుటుంబ చట్టాలపై బురదజల్లడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆలోచన, వివేచన ఉన్నవాళ్ళు ఎవరూ ఇలాంటి వాటిని ఒప్పుకోరు.

ముస్లిములపై బురదజల్లడానికి ఎప్పుడు అత్యుత్సాహంగా ముందుకు వచ్చే శక్తులు కొన్ని మీడియాలో ఈ అంశాన్ని గోరంత కొండంత చేస్తున్నాయి. నిజం చెప్పాలంటే ముస్లిమ్‌లలో విడాకులు చాలా తక్కువ. రెండవ విషయమేమంటే, టిఆర్‌పీ రేటింగులు పెంచుకోడానికి ఇలాంటి సంఘటనలను స్వయంగా సృష్టించడమూ, అవగాహన లేని మతపెద్దల నుంచి ఫత్వాలు రప్పించుకోవడమూ ఆ తర్వాత ఇస్లామ్‌పై, ఇస్లామీయ షరిఅత్‌పై బురదజల్లడమూ అసాధ్యమేమీ కాదు. దురదృష్టవశాత్తు కొందరు ముస్లిములు బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ తగిన పరిజ్ఞానం లేకపోవడం వల్ల లేదా ఆగ్రహాన్ని అదుపు చేసుకోలేకపోవడం వల్ల మూడుసార్లు తలాక్ చెప్పేసి భార్యకు విడాకులిచ్చి ఆమె జీవితాన్ని నాశనం చేసిన సంఘటనలూ ఉన్నాయి. ఇలాంటి వారి వల్ల ఇసామఁకు చాలా నష్టం వాటిల్లింది. స్వార్థశక్తులు ఇస్లామ్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి, ఇస్లామ్‌లోని విడాకుల చట్టాలను విమర్శించడానికి కావలసినంత సరంజామా దొరికింది.

స్త్రీపురుషుల ప్రత్యేక వ్యక్తిత్వాలను, ప్రతి ఒక్కరి స్వభావాన్ని ఇస్లామ్ పరిగణనలోకి తీసుకుంటుంది. నికాహ్ ద్వారా స్త్రీపురుషులు భార్యాభర్తలుగా ఒక్కటవుతారు. అయితే బలవంతంగా కలిసి ఉండవలసిన అవసరమూ లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేర్పాటుకు కూడా దేవుడు అవకాశం కల్పించాడు. మానవాళిని సృష్టించిన దేవునికి మానవప్రవృత్తి గురించి బాగా తెలుసు. ఈ అవకాశమే లేనట్లయితే కలిసిఉండడానికి ఏమాత్రం ఇష్టపడని చాలా మంది జంటలకు జీవితం దుర్లభంగా నరకప్రాయంగా మారిపోయేది. బలవంతపు కాపురం చేయలేక భార్య ఆత్మహత్య చేసుకోవడమో, భార్యను వదిలించుకోడానికి భర్త ఆమెను హతమార్చడమో జరిగేది. వధువరుల అభిరుచుల్లో, స్వభావాల్లో, ఇష్టాయిష్టాల్లో పొంతన లేకపోతే, కలిసి ఉండడం వారిద్దరికి భరించరాని భారమైపోతే ఇస్లామ్ వారిని

బలవంతంగా కలిపి ఉంచాలని ఏమాత్రం భావించదు. అందుకే వివాహబంధం నుంచి గౌరవప్రదంగా విడిపోయే అవకాశాన్ని కల్పించింది. దీన్నే తలాక్ అంటారు. మతపరంగా వివాహబంధాన్ని పవిత్రంగా భావిస్తూ, ఈ బంధాన్ని విచ్ఛిన్నపరచడానికి, తెగతెంపులు చేసుకోడానికి ఎలాంటి అవకాశం లేని సముదాయాల్లో స్త్రీలు వేధింపులకు, చిత్రహింసలకు, హత్యలకు గురవుతారు.

కాని ఇస్లామ్ ప్రసాదించిన విడాకుల సదుపాయాన్ని కొందరు ముస్లిములు చాలా కాలంగా దుర్వినియోగపరుస్తున్నారన్నది కూడా వాస్తవమే. ఇస్లామీయ చట్టాలను తప్పు భాష్యం చెప్పడం వల్ల ఈ దుర్వినియోగానికి అవకాశం దొరికింది.

ఇష్టంలేని వివాహం రద్దు చేసుకోవడానికి విడాకుల రూపంలో తలాక్‌ను ఇస్లామ్ అనుమతించినప్పటికీ, ఇస్లామీయ చట్టాల పరంగా తలాక్‌కు పూర్తి సమ్మతి ఉన్నప్పటికీ ఇస్లామ్‌లో అనుమతించబడిన చర్యల్లో అత్యంత అయిష్టకరమైనదిగా తలాక్‌ను పేర్కొనడం కూడా జరిగింది. దివ్యఖుర్ఆన్ తలాక్‌కు అనుమతి ఇచ్చింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయమై మాట్లాడుతూ "చట్టపరమైన పనులన్నింటిలోను దేవునికి అత్యంత అయిష్టమైనది తలాక్" అన్నారు.

భర్త తన భార్యకు తలాక్ ఇచ్చే పద్ధతి కూడా వివరణాత్మకంగా చెప్పబడింది.

> "విడాకులు రెండుసార్లు ఇవ్వాలి. తరువాత భార్యను సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి. లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి. సాగనంపేటప్పుడు, మీరు వారికి పూర్వం ఇచ్చిన వాటినుండి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు. (దివ్యఖుర్ఆన్ : 2 :229)

పైన పేర్కొన్న ఈ రెండు వాక్యాలను దివ్యఖుర్ఆన్‌లోని నాలుగవ అధ్యాయం (అన్నిసా)లోని 34, 35 వాక్యాలను కలిపి చదివితే తలాక్‌కు సంబంధించి ఏడు దశల పద్ధతి అర్ధమవుతుంది. కాని ఈ పద్ధతి కాలక్రమేణా విస్మరించడం జరిగింది. కొందరు ఖాజీలు ఇచ్చిన ఉత్తర్వుల వల్ల మూడుసార్లు తలాక్ అని పలికితే చాలు వివాహం రద్దవుతుందన్న అభిప్రాయాన్ని కలిగించాయి.

ఈ విధంగా తలాక్ చెప్పేవారు దైవాదేశాలతో ఆటలాడుతున్నారని ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక) హెచ్చరించారు. ప్రవక్త ముహమ్మద్ అనుచరులు, రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (దైవం ఆయనతో ప్రసన్నుడవుగాక) ఇలాంటి వారిని శిక్షించారు.

# ఖులా

## స్త్రీలకు విడాకుల హక్కు

వివాహబంధంలో ఉండడానికి ఇష్టపడని స్త్రీ భర్త నుంచి విడాకులు కోరే హక్కును కూడా ఇస్లామ్ కల్పించింది. భర్త విడాకులు ఇవ్వడానికి ఇష్టపడకపోతే, ఆ స్త్రీ ఖాజీ వద్దకు వెళ్ళి వివాహాన్ని రద్దు చేయమని కోరవచ్చు.

ఏది ఏమైనా ఈ వేర్పాటు అన్నది హఠాత్తుగా, ఒక్కసారిగా జరిగిపోయేది కాదు. ఇద్దత్ కాలవ్యవధి ఉంటుంది. అంటే నిరీక్షణ కాలం. ఇది దివ్యఖుర్ఆన్ చూపించిన ఒక అత్యున్నత విధానంగా ప్రొఫెసర్ కూల్సన్ పేర్కొన్నారు. స్త్రీ మూడు రుతుక్రమాల కాలం వరకు వ్యవధి ఉంటుంది. ఒకవేళ ఆమె గర్భవతి అయితే ప్రసవం అయ్యేవరకు ఈ వ్యవధి ఉంటుంది.

ఈ కాలంలో ఆమె భర్త (విడాకులిచ్చిన భర్త) నుంచి ఆర్థిక సహాయం పొందే హక్కు ఉంది. ఈ కాలంలో విడాకుల విషయంలో పునరాలోచించే అవకాశం ఉంది. దివ్యఖుర్ఆన్ ఈవిషయమై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

> "మీరు గనుక స్త్రీలకు విడాకకులివ్వవలసి వస్తే, వారి నిర్ణీతగడువు (ఇద్దత్) కొరకు విడాకులివ్వండి. నిర్ణీత గడువు కాలాన్ని ఖచ్చితంగా లెక్కకట్టండి. మీ ప్రభువైన అల్లాహ్‌కు భయపడండి. (ఆ గడువు కాలంలో) వారేదైన స్పష్టమైన చెడుకు పాల్పడితే తప్ప మీరూ వారిని వారి ఇళ్ళ నుండి వెళ్ళగొట్టకూడదు." దివ్యఖుర్ఆన్ (65:1)

భర్తలకు దివ్యఖుర్ఆన్ హెచ్చరిక: భర్తలకు మరో హెచ్చరిక ఏమంటే, విడాకులిచ్చిన భార్య మరొకరిని పెళ్ళాడాలనుకుంటే అడుకోరాదు.

> "మీ కొరకు సంస్కారవంతమూ పవిత్రమూ అయిన పద్ధతి ఏమిటంటే మీరు దానికి దూరంగా ఉండడమే. అల్లాహ్‌కు అన్నీ తెలుసు. మీకు తెలియదు." దివ్యఖుర్ఆన్, (2:232)

# ఫత్వా

ఇస్లామీయ సంప్రదాయాల ప్రకారం ఫత్వా అంటే న్యాయపరమైన అభిప్రాయం. కాని చాలా మంది ఫత్వా అంటే ధార్మిక న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వుగా అపోహపడుతున్నారు. కొన్ని అసంబద్ధమైన ఫత్వాల కారణంగా ఈ పదానికి మరింత ప్రచారం వచ్చింది. ముస్లిములు ఈ ఫత్వాల ప్రకారం జీవిస్తారని, వాటిని అమల్లో పెడతారని సాధారణ ప్రజలు భావించే వాతావరణం ఏర్పడింది. నిజానికి సాధారణంగా సగటు ముస్లిమ్ ఎవరు ఏ వ్యవహారంలో అయినా గాని ధర్మవేత్తల అభిప్రాయం పొందడానికి ప్రయత్నించడం అన్నది చాలా తక్కువ.

ఏదన్నా ఫత్వా అసంబద్ధంగా కనబడితే, న్యాయపరమైన విధివిధానాలకు, నిష్పక్షపాతానికి పొసగనిదిగా కనబడినా దానికి అంత ప్రాముఖ్యమూ లేదు, నేడు మీడియాలో ఇస్తున్నంత ప్రచారం, హంగామా జరగవలసిన అవసరమూ లేదు. ఇస్లామీయ ధార్మిక వ్యవస్థలపై బురదజల్లడానికి అత్యుత్సాహం ప్రదర్శించే మీడియా, సంచలనాల కోసం ప్రాకులాడే మీడియా చేతికి ఇలాంటి ఏదన్నా ఫత్వా దొరికితే చాలు ఇక మీడియాలో గగ్గోలు మొదలైపోతుంది. వేలాది మదరసాలున్నాయి. మదరసాల్లో వేలాది ధార్మిక అభిప్రాయాలు వెలిబుచ్చే వేదికలున్నాయి. ఒక విషయానికి సంబంధించి అసంఖ్యాక ధార్మిక అభిప్రాయాలు ఉండవచ్చు. విచిత్రమేమంటే కొన్ని ఫత్వాలను పక్షపాతంతో కళ్ళుమూసుకుపోయిన మీడియా అత్యుత్సాహంగా అందిపుచ్చుకుంటోంది. ఈ ఫత్వా ధార్మిక ఆదేశంగా గోల చేస్తుంది. మతోన్మాదానికి చిహ్నంగా హంగామా చేస్తుంది. మరింత విచిత్రమేమంటే ముస్లిములు తప్పనిసరిగా ఈ ఫత్వాలకు కట్టుబడతారన్నట్లు చిత్రీకరించడం.

ఫత్వా అనేది ధార్మిక ఆదేశమూ కాదు, ఇస్లామీయ న్యాయపరమైన ఉత్తర్వు కూడా కాదు. ఇది కేవలం ఇస్లామీయ న్యాయపరమైన అభిప్రాయం. "ఏ షార్టర్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఇస్లామ్" ఫత్వాను ఇలా నిర్వచించింది "ఒక న్యాయమూర్తి (ఇస్లామీయ) లేదా ఎవరన్నా వ్యక్తి అడిగిన ప్రశ్నకు ఒక ముఫ్తీ లేదా ఇస్లామీయ చట్టాల నిపుణుడు ఇచ్చిన న్యాయపరమైన అభిప్రాయం."

ఫత్వాలనేవి కేవలం అభిప్రాయాలు మాత్రమే, వాటికి కట్టుబడవలసిన అవసరం లేదు. వాటిని ఆచరించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు. నిజానికి ఫత్వా ఇచ్చే ముఫ్తీ కూడా ఈ ఫత్వాకు ఖచ్చితంగా కట్టుబడాలని చెప్పడం జరగదు. ఫత్వా ఇచ్చే ముఫ్తీ స్వయంగా "దీన్ని స్వీకరించండి లేదా వదిలేయండి.. మీకు ఏది మంచిదనిపిస్తే అది చేయండి" అంటారు. సంక్లిష్టమైన సమస్యలకు సమాధానాలు వెదికే వారు ఒకే విషయమై వివిధ ఇస్లామీయ

పంథాల నుంచి ఇలాంటి ధార్మిక అభిప్రాయాలను కోరుతుంటారు. ఈ అభిప్రాయాల్లో వ్యత్యాసం, తేడాలు ఉన్నా ఆశ్చర్యపోవలసింది ఏదీ ఉండదు.

బాధ్యతారహితంగా ఇచ్చిన కొన్ని ఫత్వాలకు అధిక ప్రచారం లభిస్తోంది. ముస్లిముల నుంచి ఆ ఫత్వాల విషయంలో విమర్శలు వస్తున్నప్పటికీ సంచలనాత్మక ప్రచారం మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. ఉదాహరణకు 1989లో ఈరాన్‌కు చెందిన ఇమామ్ ఆయాతుల్లా ఖొమేని జారీ చేసిన ఫత్వా. సల్మాన్ రుష్దీకి వ్యతిరేకంగా ఆయన ఈ ఫత్వా ఇచ్చారు. ఈ ఫత్వాను అనేకమంది ఇస్లామీయ న్యాయకోవిదులు విమర్శించారు. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ ధర్మవేత్తలు, కైరోలోని అల్‌అజ్‌హర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ అధ్యాపకులు ఇమామ్ ఖొమేనీ ఫత్వాను ఇస్లామీయ చట్టవిరుద్ధమైనదిగా, ఇస్లామ్‌కు విరుద్ధమైనదిగా ఖండించారు. ఎలాంటి విచారణ లేకుండా ఒక వ్యక్తికి మరణశిక్ష విధించడాన్ని ఇస్లామీయ చట్టం ఆమోదించదు. అంతేకాదు, భౌగోళికంగా సార్వభౌమాధికార పరిధికి బయట ఉన్న వ్యక్తికి అలా శిక్ష విధించే అవకాశమే లేదు. 1989లోనే జరిగిన ఇస్లామిక్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నలభైఐదు ముస్లిమ్ దేశాల సభ్యుల్లో నలభై నాలుగు మంది ఇమామ్ ఖొమేనీ ఫత్వాను తిరస్కరించారు. కాని ఈ విషయాలేవీ మీడియాలో కనబడలేదు. అంతర్జాతీయ మీడియా ఈ వార్తలకు అస్సలు ప్రాముఖ్యం ఇవ్వలేదు. రుష్దీని హత్య చేయాలంటూ పూర్తి ముస్లిమ్ ప్రపంచం వెంటాడుతుందన్నట్లే మీడియాలో వార్తలు వచ్చాయి.

# కుఫ్ర్ - కాఫిర్

కాఫిర్ అన్న పదంపై కూడా చాలా అభ్యంతరాలు వస్తుంటాయి. ముస్లిమేతరులను తిట్టడానికి, పరాభవించడానికి ముస్లిములు ఈ పదం వాడుతుంటారన్నట్లు వివాదాస్పదంగా మీడియాలోని పక్షపాత శక్తులు చిత్రీకరిస్తుంటాయి. ఈ పదాన్ని, ఈ పదం వెనుక ఉన్న భావార్థాలను పూర్తిగా అపార్థం చేసుకోవడం జరుగుతోంది.

కాఫిర్ అన్న పదం కుఫ్ర్ అన్న పదం నుంచి వచ్చింది. కుఫ్ర్ అంటే అరబీ భాషలో అర్థం దాచిపెట్టడం లేదా కప్పిపుచ్చడం. రాత్రిని కాఫిర్‌గా అభివర్ణిస్తారు ఎందుకంటే అది కనిపించే వాటన్నింటిని కప్పిపుచ్చుతుంది. అలాగే దట్టమైన మబ్బులను కూడా కాఫిర్‌గా వర్ణిస్తారు. ఎందుకంటే అవి ఆకాశాన్ని సూర్యుడిని కప్పేస్తాయి. చివరకు రైతును కూడా కాఫిర్‌గా పేర్కొనడం జరుగుతోంది, ఎందుకంటే రైతు పొలంలో విత్తనాలను మట్టితో

కప్పేస్తాడు కాబట్టి.

కాఫిర్ లేదా కుఫ్ర్ అన్న పదాలు తిట్టుపదాలు కాదు. నిందార్థంతో వాడే పదాలు కానే కాదు. కాబట్టి ఈ పదాలు వాడడం వల్ల ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు ఉండనవసరం లేదు. ఎవరూ బాధపడవలసిన అవసరం కూడా లేదు. మరో విషయమేమంటే, కాఫిర్ అన్న పదం ముస్లిమేతరులకు పర్యాయపదం కానేకాదు. అలాగే ముస్లిమేతరులందరూ కాఫిర్లు కాదు. కాఫిర్ అనేది ధార్మికంగా పారిభాషికపదం. ధార్మికంగా ఈ పారిభాషికానికి అర్థం ఏమంటే, ఏదన్నా విషయాన్ని తిరస్కరించేవ్యక్తి లేదా ఖండించే వ్యక్తి. ఈ దృష్టితో చూస్తే ఒక మతస్తులు మరో మతస్తులకు కాఫిర్లు అవుతారు. కేపిటలిస్టుల దృష్టిలో కమ్యునిస్టులు కాఫిర్లు అవుతారు. కమ్యునిస్టుల దృష్టిలో కేపిటలిస్టులు కాఫిర్లు అవుతారు. ఇస్లామీయ పారిభాషికంగా చూస్తే, అల్లాహ్ (అంటే ఒకే ఒక్క దేవుడు అని అర్థం)ను తప్ప మరెవ్వరి ఆరాధననైనా తిరస్కరించే వ్యక్తి విశ్వాసి (ముస్లిమ్). దీనికి వ్యతిరేకమైనది కాఫిర్ పదం. ఈ పదంలో ఎలాంటి తిట్టు లేదు ఎలాంటి నింద లేదు.

ఇక్కడ గుర్తించవలసిన విషయమేమంటే ధర్మం విషయంలో దేవుడు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా బోధించింది :

> ''ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది. ఇకనుండి ''తాగూత్''ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించిన వాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. (అతడు ఆశ్రయించిన) అల్లాహ్ సర్వమూ వింటాడు. సమస్తమూ తెలిసినవాడు.'' దివ్యఖుర్ఆన్ (2 : 256)

కాబట్టి ఒకేదేవుడు, దేవుని ప్రవక్త అన్న విశ్వాసాన్ని తిరస్కరించే వారి పట్ల ఇస్లామ్ లేదా ముస్లిములు అనుచితంగా వ్యవహరించడానికి అవకాశమే లేదు.

# ముస్లిములు - మాంసాహారం

మానవాళి సంప్రదాయికంగా ఆహారం విషయంలో రెండు వనరులపై ఆధారపడుతూ వచ్చింది. ఒకటి : పొలాలు, పంటలు, తోటలు. రెండు : జంతువులు. మాంసాహారానికి పశువులపైనా, సముద్రంలో లభించే జీవులపైనా ఆధారపడడం కనబడుతుంది. కేవలం వృక్షపరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకుని జీవించేవారిని శాకాహారులుగా (వెజిటేరియన్) పిలుస్తారు. వృక్షపరమైన ఆహారంతో పాటు జంతుపరమైన ఆహారాన్ని కూడా తీసుకునే వారిని మాంసాహారులుగా పిలుస్తున్నాం. మూడో రకం మనుష్యులు కూడా ఉన్నారు. జంతుసంబంధమైన ఎలాంటి ఉత్పత్తిని కూడా తీసుకోని వారు కూడా ఉన్నారు. వారిని వేగన్లని అంటారు. అంటే వీళ్ళు పాలు, తేనె, గ్రుడ్లు, పాల ఉత్పత్తులు వేటినీ తీసుకోరు.

ఇటీవలి కాలంలో వెజిటేరియన్, వేగన్ ధోరణలు ప్రపంచంలో ఎక్కువ ప్రాచుర్యం పొందుతున్నాయి. జంతువుల హక్కులను గౌరవించాలని, జంతువులను వధించడం లేదా జంతువుల నుంచి ప్రయోజనాలు పొందడం మానుకోవాలన్న భావన ఈ ధోరణుల వెనుక ఉంది.

ఇస్లామ్, క్రయిస్తవం, యూదు మతాలు ఉద్భవించిన ప్రాంతం మౌలికంగా పశు పాలకుల సమజం. గ్రామీణ ప్రాంతం. ఈ మూడు ధర్మాలకు చెందిన అనేకమంది ప్రవక్తలు పలస్తీనా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు. ఈ ప్రాంతాలు పొడి ప్రాంతాలు. ఎడారి ప్రాంతాలు. అక్కడి ప్రజలకు పశువులను పెంచడం ప్రధానవృత్తిగా ఉండేది. ఆహారం కోసం ఎక్కువగా పశువులపైనే ఆధారపడేవారు. కాబట్టి ఈ మూడు ధర్మాలను అనుసరించేవారు ఈ సంప్రదాయాలనే పాటించడం జరుగుతోంది. అంతే తప్ప ఈ మూడు ధర్మాల్లో ఏవి కూడా జంతువులను వేటాడ్డం, వాటి మాంసాన్ని తినడం తప్పనిసరిగా పేర్కొనలేదు.

చాలా మతధర్మాల్లో జంతువులను చంపి వాటి మాంసాన్ని తినడం ఆమోదయోగ్యమైన విషయమే. అయితే కొందరు మాంసాహారాన్ని అనైతికంగా భావిస్తారు. అలాంటి వారు

కూడా మాంసాహారాన్ని అనాగరికం అని చెప్పలేరు. దయ సానుభూతి మానవగుణాలకు ఆహార అలవాట్లకు సంబంధం లేదు. మాంసాహారం తినేవారు కూడా చాలా దయాస్వభావులుగా, సానుభూతి పరులుగా ఉండవచ్చు. అలాగే కేవలం శాకాహారం తినే వ్యక్తిలో కూడా నిర్దయ, క్రూరత్వాలు ఉండవచ్చు.

ఆధునిక వైజ్ఞానిక శాస్త్రం ప్రకారం మొక్కలు వృక్షాలకు కూడా ప్రాణం ఉంటుంది. అవి కూడా బాధపడతాయి. సంగీతానికి ప్రతిస్పందిస్తాయి. అవి కూడా బయటి ప్రభావాలకు గురవుతాయి. సంతోషం, దు:ఖం వాటికి కూడా కలుగుతాయి. నీటి కోసం అవి రోదిస్తాయి. అమెరికాలో రైతులు కొన్ని యంత్రాలను తయారు చేశారు. నీటి కోసం రోదిస్తున్న మొక్కల రోదనలను ఈ యంత్రాలు గుర్తిస్తాయి. ఆ రోదనల తీవ్రతను పెంచుతాయి. ఆ విధంగా నీటికోసం మొక్కలు రోదిస్తున్న వెంటనే వాటికి నీరు అందేలా నీటిసరఫరా వ్యవస్థను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇస్లామీయ ఫిలాసఫీ ప్రకారం ప్రపంచంలో మనిషి అత్యున్నత జీవి. భూమి మీద ఉన్న వనరులన్నింటినీ తన ప్రయోజనం కోసం ఉపయోగించుకునే హక్కు అధికారాలు మనిషికి ఉన్నాయి. అయితే ఈ వనరులను వ్యర్థం చేయకుండా ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే వనరులు అంతరించకుండా చూసుకోవాలి. అంటే ఉపయోగించిన వనరులు మళ్ళీ ప్రకృతిసిద్ధంగా తయారయ్యేలా వినియోగం ఉండాలి.

ఇస్లామ్ ప్రకారం భూమి మీద ఉన్న వనరులన్నింటికీ, భూమి మీద లభించే ఉత్పత్తులన్నింటికి మనిషి కావలి వంటి వాడు. అంతే తప్ప మనిషి వీటన్నింటికీ యజమాని కాదు. యజమాని కేవలం దేవుడు మాత్రమే. కాబట్టి ఈ వనరులకు కావలిగా ఉన్న మనిషి నిజాయితీగా వ్యవహరించాలి. తన అవసరాలు తీర్చుకోడానికి మాత్రమే ఈ వనరులను ఉపయోగించుకోవాలి. అంతే తప్ప అత్యాశకు పోయి వాటన్నింటినీ పోగుచేసుకోవాలని ప్రయత్నించరాదు.

ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా ఉపదేశించింది :

> "విశ్వాసులారా! కట్టుబాట్లను పూర్తిగా పాటించండి. మీ కొరకు పశువులను పోలిన జంతువులన్నీ ధర్మసమ్మతం (హలాల్) చెయ్యబడ్డాయి. – ముందు మీకు

తెలుపబడబోయేవి తప్ప." దివ్యఖుర్ఆన్ (5:1)

మరో సందర్భంలో దివ్యఖుర్ఆన్ ఇలా బోధించింది.

"నిజంగానే పశువులలో కూడా మీకు ఒక గుణపాఠం ఉంది. వాటి గర్భాలలో ఉన్న దాని నుంచే మేము ఒక వస్తువును (అంటే పాలు) మీకు త్రాపుతున్నాము. మీకు వాటిలో ఇంకా ఎన్నో ఇతర లాభాలు కూడా ఉన్నాయి. వాటిని మీరు తింటారు." దివ్యఖుర్ఆన్ (23:21)

న్యూట్రీషన్లందరూ మాంసాహారం లేదా పశువుల ద్వారా లభించే ప్రోటీన్లు సంపూర్ణ ఆహారాన్నిస్తాయని అంగీకరిస్తున్నారు. మనిషికి కావలసిన ఎనిమిది అమీనో ఆసిడ్లు మాంసాహారం ద్వారా లభిస్తాయి. ఈ ఎనిమిది అమీనో ఆసిడ్లు మనిషి ఆరోగ్యానికి చాలా అవసరం. మాంసాహారంలో ఐరన్, విటమిన్ బి 1, నియాసిన్‌లు కూడా ఉంటాయి. కేవలం వృక్షప్రధానమైన ఆహారం వల్ల తీవ్రమైన ప్రోటీన్ లోపం ఏర్పడవచ్చు. దీనివల్ల రక్తహీనత రావచ్చు. భారత జనాభాలో తగిన ప్రోటీన్లతో ఉన్న ఆహారం తీసుకోని వారు సాధారణంగా ఈ రక్తహీనత బారిన పడడం మనం చూస్తూనే ఉన్నాం.

మన దంతాల నిర్మాణం అమరికలను పరిశీలించినా తెలిసేదేమంటే, మనిషి దంతాలు కొరకడానికి, నమలడానికి రెండు పనులకు తగిన రీతిలో ఉన్నాయి. అందువల్ల మనిషి నిర్మాణం శాకాహారం తీసుకోడానికి, మాంసాహారం తీసుకోడానికి రెండింటికి అనువుగా ఉంది. కాని జంతువుల దంతాల నిర్మాణం ఇలా ఉండదు. పశువులకు కేవలం చదునైన దంతాలు మాత్రమే ఉన్నాయి. అంటే కేవలం నమలడానికి మాత్రమే ఉపయోగపడే దంతాలు. అలాగే పులి, సింహం లాంటి క్రూరజంతువులకు మాంసాన్ని కొరకడానికి ఉపయోగపడే పదునైన దంతాలు మాత్రమే ఉన్నాయి. అంటే తమ ఆహారాన్ని కొరికి చీల్చి తినడానికి అనువుగా ఉన్నాయి. దీన్ని బట్టి తెలిసేదేమంటే మానవ నిర్మాణం శాకాహారం, మాంసాహారం రెండింటిని తినడానికి అనువుగా ఉంది. అలాగే మనిషి జీర్ణవ్యవస్థ కూడా శాకాహారం, మాంసాహారం రెండింటిని జీర్ణం చేసుకోడానికి తగినదిగా ఉంది.

# మాంసాహారం హింసోన్మాదాన్ని పెంచుతుందా ?

ఇస్లామ్ ఆహారం విషయంలో ఖచ్చితమైన నియమాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. జంతువుల్లో ఆకులు అలములు తినే పశువుల మాంసాన్ని ఆహారంగా తీసుకోవచ్చు. ఎనిమిది రకాల చతుష్పాదుల మాంసాన్ని ఆహారంగా తీసుకోవచ్చని ఇస్లామ్ అనుమతించింది. మాంసాహార జంతువుల మాంసాన్ని ఆహారంగా తీసుకోవడం నిషిద్ధం. ఆహారంగా అనుమతించబడిన జంతువులు – ఆవు, మేక, గొర్రె, ఒంటె, బర్రె మొదలైనవి ఉన్నాయి. ఇలా అనుమతించబడిన జంతువులనైనా నిర్దిష్టపద్ధతిలోనే వధించాలి. దీన్ని హలాల్ పద్ధతి అంటారు. ఇతర జంతువుల మాంసాన్ని తినే మాంసాహార క్రూరమృగాలను ఆహారంగా తీసుకోవడం నిషిద్ధం. ఇక ఆకలు అలములు తినే జంతువుల్లోను పందిమాంసం ముస్లిములకు, యూదులకు నిషిద్ధం.

మాంసాహారం వల్ల హింసోన్మోదులుగా తయారవుతారని చెప్పే శాస్త్రీయ ఆధారాలు ఏవీ లేవు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు మనిషి పెరిగిన వాతావరణం, మనిషి ప్రపంచాన్ని చూసే ఆలోచనా దృక్పథం వల్ల మనిషి హింసాత్మక ప్రవృత్తి కలవాడిగా లేదా శాంతికాముకుడిగా మారుతాడు. ఉదాహరణకు జర్మన్ నేత అడాల్ఫ్ హిట్లర్ ఫక్తు శాకాహారి. కాని దుర్మార్గపు ఆలోచనలు, పథకాలతో పొరుగుదేశాలపై అణిచివేతలకు పాల్పడ్డాడు. లక్షలాది ప్రజల హత్యాకాండకు కారకుడయ్యాడు. కాబట్టి ఈ అపోహలు, అపార్థాలన్నింటినీ నిర్ద్వంద్వంగా తిరస్కరించవలసిన అవసరం ఉంది. ప్రేమాభిమానాలు, విద్వేషవైరాలు ఆహారపు అలవాట్లపై ఆధారపడి ఉండవు. భారతదేశంలోని ఆదివాసి జనాభా అనేక రకాల జంతువులను ఆహారంగా తీసుకుంటారు. కాని వారు హింసాత్మకంగా వ్యవహరిస్తున్న ఆధారాలేవీ లేవు.

# హలాల్ - హరామ్

## ధర్మబద్ధమైనవి - ధర్మవిరుద్ధమైనవి

ఒక ఖచ్చితమైన క్రమశిక్షణా నియమావళిని ఇస్లామ్ ప్రతిపాదిస్తుంది. ఇస్లామ్‌ను పాటించేవారు ఈ స్థూలమైన మార్గదర్శక సూత్రాలకు కట్టుబడవలసి ఉంది. అనుమతించబడిన ఆచరణలు, అనుమతించబడిన ఆహారం, అనుమతించబడిన వ్యవహారాలను హలాల్ అంటారు. అంటే ధర్మబద్ధమైనవి. అలాగే ధార్మిక ఆదేశాల పరంగా నిషేధించబడిన ఆచరణలు, ఆహారాలు, వ్యవహారాలను హరామ్ అంటారు. అంటే ధర్మవిరుద్ధమైనవి. హరామ్ ఆహారాన్ని భుజించడం, హరామ్ పనులు చేయడం దేవుని ఆగ్రహానికి కారణమవుతుంది. అలాంటి వారిని దివ్యఖుర్ఆన్ తీవ్రంగా అభిశంసించింది. ఈ హరామ్ పనులను పాపాలుగా ఖుర్ఆన్ పేర్కొంది. ముస్లిములు వీటికి దూరంగా ఉండాలి. ఉదాహరణకు మద్యం, పందిమాంసాలు హరామ్. వీటిని తీసుకోవడం హరామ్. అలాగే వస్త్రధారణ విషయంలోను ముస్లిమ్ పురుషులు బంగారపు ఆభరణాలు, సిల్కు వస్త్రాలు ధరించరాదన్న నిషేధం ఉంది. బంగారాన్ని ఏవిధంగానైనా ధరించడం నిషిద్ధం. సిల్కు విషయంలో కాటన్ లేదా ఊలు దారాలతో కలిపి సిల్కు దారాలు నేసిన వస్త్రాలకు మినహాయింపు ఉంది.

హలాల్, హరామ్ అనేది వ్యవహారశైలికి కూడా వర్తిస్తుంది. సంపాదనకు కూడా వర్తిస్తుంది. ముస్లిమ్ అక్రమ పద్ధతుల ద్వారా సంపాదించరాదు. అంటే దొంగతనాలు, మోసాలు, అవినీతి, లంచగొండితనం, బలవంతపు వసూళ్ళు, ఇతరుల వనరులను కొల్లగొట్టడం, వడ్డీ తదితర అక్రమపద్ధతుల ద్వారా సంపాదించడం హరామ్. హరామ్ పద్ధతుల ద్వారా సంపాదించే వ్యక్తి, లేదా అలాంటి సంపాదన ద్వారా జీవించే వ్యక్తి పాపాత్ముడు. అదేవిధంగా వ్యభిచారం, చాడీలు చెప్పడం, అబద్ధాలు, స్వలింగ సంపర్కం, ఇతరులపై గూఢచర్యం చేయడం, ఇతరులను ఎగతాళి చేయడం, ఇతరులను అపహసించడం వంటి చేష్టలు వాటి తీవ్రత దృష్ట్యా కొన్ని ఏహ్యకరమైన పనులుగాను మరి కొన్ని హరామ్ చేష్టలుగాను పరిగణన పొందుతాయి.

# హలాల్

## జంతువును వధించే ఇస్లామీయ పద్ధతి

ఆహారంగా స్వీకరించడానికి ధార్మికంగా అనుమతించబడిన జంతువులను ముస్లిములు, యూదులు మెడ క్రిందిభాగంలో గొంతు వద్ద కోయడం ద్వారా వధిస్తారు. ఇలా చేయడం వల్ల ఆ జంతువులో ఉన్న రక్తమంతా బయటకు పోతుంది. మరణించిన జంతువు రక్తనాళాల్లో రక్తం మిగిలిపోవడమన్నది జరగదు. ఆ మాంసం పరిశుద్ధంగా ఉంటుంది. ఈ పద్ధతిలో ముస్లిములు జంతువును వధించడాన్ని హలాల్ అంటారు. యూదులు భుజించే ధర్మబద్ధమైన ఆహారాల్లో ఇది కూడా ఒకటి.

ఇస్లామ్, యూదమతం ఈ రెండింటిలోను జంతువును వధించేటప్పుడు మెడ క్రిందిభాగంలో మాత్రమే కోయాలి. మెడపై భాగంలో కోయరాదు. ఈ విధంగా చేయడం వల్ల జంతువు శరీరానికి మెదడుకు మధ్య సంబంధం ఒక్కసారిగా తెగిపోవడం జరగదు. అందువల్ల జంతువు మెదడు చురుకుగా ఉండి, జంతువు శరీరంలోని రక్తమంతా బయటకు ప్రవహించేలా చేస్తుంది. ఇలా వధించిన జంతువు శరీరంలో రక్తం మిగలదు. ఆహారంగా తినడానికి రక్తం లేని ఆహారమే ఆరోగ్యకరమైనది. ఇలాంటి మాంసం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. ఈ పద్ధతిలో శ్వాసనాళం, రక్తనాళాలు, గొంతు తెగిపోతాయి. కాని వెన్నెముకలో ఉన్న వెన్నుపాము చివరి క్షణం వరకు పనిచేస్తూనే ఉంటుంది. జంతువు శరీరంలోని రక్తం మొత్తం, చివరి బొట్టు వరకు బయటకు ప్రవహించేలా చేస్తుంది. జంతువు పూర్తిగా మరణించిన తర్వాత మాత్రమే శరీరం నిశ్చలనమైన తర్వాత మాత్రమే తలను వేరు చేయడం జరుగుతుంది. ఆ తర్వాత మాంసాన్ని మరింత పరిశుద్ధం చేయడం జరుగుతుంది.

బాక్టీరియా, సూక్ష్మక్రిములు రక్తంలోనే వర్ధిల్లుతాయి. బాక్టీరియా వృద్ధి చెందడానికి రక్తం గొప్ప మీడియం. అందువల్లనే ముస్లిముల పద్ధతిలో వధించడాన్ని అత్యంత ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, బాక్టీరియాను నివారించే పద్ధతిగా గుర్తించడం జరుగుతుంది.

# హరామ్

## మద్యం జూదం నిషిద్ధం

మత్తుకలిగించే పదార్థాలను, జూదాన్ని దివ్యఖుర్‌ఆన్ కఠినంగా నిషేధించింది. మద్యం మనిషి తెలివిని చంపేస్తుంది. సాంఘీక వ్యవహారశైలిపై దుష్ప్రభావం వేస్తుంది. అందువల్ల మద్యం నిషిద్ధమైంది. మత్తు కలిగించే పదార్థాలు, ముఖ్యంగా మద్యం అనేక సాంఘీక రుగ్మతలకు మూలకారణంగా అందరూ అంగీకరిస్తారు. మద్యం మత్తులో డ్రయివింగ్ చేయడం వల్ల అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. వీధుల్లో గొడవలు, ఇండ్లలో మద్యం మత్తులో మగవాళ్ళు భార్యాపిల్లలపై దౌర్జన్యాలకు, హింసాకాండకు పాల్పడడం గురించి అందరికి తెలుసు. స్త్రీలపై జరిగే అనేక నేరాలకు కారణం మద్యపానమే. మత్తులో ఉన్నవాళ్లు సాంఘీక మర్యాదలను మరిచిపోతారు. మంచిమర్యాద విస్మరిస్తారు. అమెరికాలో మద్యం మత్తులో ఉన్న మగవాళ్ళు పబ్బుల్లో షూటవుట్‌లకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి.

దివ్యఖుర్‌ఆన్ విశ్వాసులను మద్యానికి, జూదానికి దూరంగా ఉండాలని క్రిందివిధంగా ఆదేశించింది.

> "విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్యభాగ్యం కలిగే అవకాశం ఉంది." దివ్యఖుర్‌ఆన్ : (5:90)

మద్యానికి బానిస కావడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాదు, ఆర్థికవ్యవస్థకు కూడా ఇది తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. మద్యంమత్తులో ఉన్నవాళ్ళు విపరీతమైన లైంగిక చేష్టలకు పాల్పడవచ్చు. స్త్రీలపై లైంగిక దాడులకు, మానభంగాలకు చివరకు సన్నిహిత రక్తసంబంధీకులపై కూడా అత్యాచారాలకు పాల్పడవచ్చు.

ఇస్లామ్ జూదాన్ని కూడా నిషేధించింది. ఇది ఒక వ్యవసనం. ఈ వ్యసనం వల్ల ప్రయోజనాల కన్నా నష్టాలే ఎక్కువ. జూదం కుటుంబ ఆర్థికస్థితని కుదేలయ్యేలా చేస్తుంది. అది లాటరీ కావచ్చు లేదా గుర్రపు పందేలు కావచ్చు ఏదైనా కాని జూదం అన్నది అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. ఇందులో ఏ ఒక్కరికో లాభం కలుగడమన్నది సందేహాస్పదం, కాని దాదాపు అందరూ నష్టపోవడమన్నది ఖాయం. జూద వ్యసనానికి గురైన వారు ఉత్పాదక కార్యక్రమాల్లో ఆసక్తి చూపించలేరు. అదృష్టం కలిసిరావాలని చూస్తుంటారు. అదృష్టం వారిని కరుణించడం చాలా అరుదు. క్రమేణా జూదం వారి ఆర్థికస్థితిని గుల్ల చేస్తుంది. కట్టుగుడ్డలతో మిగిలేలా చేస్తుంది. అప్పులతో కష్టాలపాలవుతారు.

అమెరికాలోని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో నేషనల్ క్రయిం విక్టిమైజేషన్ సర్వే బ్యూరో ఆఫ్ జస్టిస్ అధ్యయనం ప్రకారం ఒక్క 1996 సంవత్సరంలోనే 2,713 మానభంగాలు జరిగాయి. ఈ రేపిస్టుల్లో చాలా మంది మద్యం మత్తులో నేరానికి పాల్పడ్డారు. లైంగిక దాడుల విషయంలోను ఇదే పరిస్థితి ఉంది. మద్యం ఎలాంటి మహమ్మారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

# మానభంగం : లైంగిక ఉగ్రవాదం

ఇస్లామ్‌లో షరిఅత్ చట్టాల ప్రకారం మానభంగం ఒక ప్రత్యేక నేరంగా నేరాల వర్గీకరణలో కనబడదు. అందువల్ల శిక్షల విషయంలో కొంత అయోమయం కూడా కనబడుతుంది. మానభంగాన్ని "జినా" (వ్యభిచారం)గా పరిగణించాలని, ఆ నేరంగానే శిక్ష విధించాలని తప్పుగా భాష్యం చెబుతున్నారు. కాని నిజానికి మానభంగం హిరాబా నేరాల క్రిందికి వస్తుంది. అంటే టెర్రరిస్టు నేరాల క్రిందికి వస్తుంది.

హిరాబా అంటే మాటువేసి ప్రజలను చంపడం, ఆయుధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, చంపడం, వారి ఆస్తులను బలవంతంగా, బహిరంగంగా లాక్కోవడం. ఇక్కడ సంపదను ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది, ఎందుకంటే దోపిళ్ళు సాధారణంగా సంపద కోసమే జరిగేవి. కాని ఈ ఆదేశాలు మానభంగం ఉద్దేశ్యంతో భయభ్రాంతులకు గురిచేసే వారికి కూడా వర్తిస్తాయి.

ఇస్లామ్‌లో హిరాబా అత్యంత తీవ్రమైన నేరం, పాపం. దివ్యఖుర్‌ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయాలు దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఇలాంటి నేరాలకు దేవుడు దివ్యఖుర్‌ఆన్‌లో కఠినమైన శిక్షలు విధించాడు.

> "అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికి, ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగేవారికి శిక్ష ఏమిటంటే : వారిని చంపటం లేదా శిలువపైకి ఎక్కించటం లేదా చేతులను, కాళ్ళను అభిముఖ దిశలలో ఖండించటం లేదా దేశం నుండి బహిష్కరించడం. ఇవి వారికి ఇహలోకంలో జరిగే అగౌరవం, అవమానం. పరలోకంలో వారికి అంతకంటే ఘోరమైన శిక్ష ఉంటుంది. మీరు వారిని స్వాధీన పరచుకోకముందు పశ్చాత్తాపపడే వారికి తప్ప – అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు అనే విషయం తెలుసుకోవాలి." దివ్యఖుర్‌ఆన్ (5 : 33–34)

# వ్యభిచారం - మానభంగం

ప్రారంభకాలంలోని ఇస్లామీయ ధర్మవేత్తల్లో ముఖ్యంగా అల్ దాసుఖీ, న్యాయమూర్తి ఇబ్నుల్ అరబీలు మానభంగాన్ని హిరాబా (టెర్రరిస్టు) నేరంగా ఎందుకు భావించాలో, ఇది జినా (వ్యభిచారం) ఎందుకు కాదో స్పష్టంగా వివరించారు. ఇబ్నుల్ అరబీ ఒక సంఘటనను వివరించారు. ఒక బృందంపై దాడి జరిగింది. అందులో ఒక మహిళపై అత్యాచారం జరిగింది. ఈ నేరం హిరాబా కాదని, ఇందులో ఆయుధాలను వాడడం కాని, సంపదను కొల్లగొట్టడం కాని జరగలేదని న్యాయమూర్తి ఇబ్నుల్ అరబీ ముందు నిందితులు వాదించారు. ఇబ్నుల్ అరబీ జవాబిస్తూ దోపిడికి కారణమయ్యే హిరాబా కన్నా మర్మావయవాలతో జరిగే ఈ నేరం అత్యంత హీనమైనదని, స్త్రీ సంపద దోపిడీ కావడాన్ని భరిస్తుంది కాని మానభంగాన్ని భరించలేదని జవాబిచ్చారు. మానభంగాన్ని ఈ తరగతి నేరంగా పరిగణించడం హేతుబద్ధమే. ఎందుకంటే ఇక్కడ దోపిడీ ఉంది. ఇక్కడ బాధితుల సంపదను కాదు మానమర్యాదలను, భద్రతను దోచుకోవడం జరిగింది.

ఈ విధంగా చూస్తే మానభంగం అనేది ఒక టెర్రరిస్టు నేరం, ఇది హిరాబా నేరం. హింసాత్మక నేరం. ఇక్కడ లైంగిక సంపర్కన్ని ఆయుధంగా ఉపయోగించడం జరుగుతుంది. హిరాబా నేరంలో ప్రాసిక్యూషన్ దృష్టి నిందితుడైన రేపిస్టుపై ఉంటుంది. నిందితుడి ఉద్దేశ్యం, శారీరక చేష్టలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇక్కడ బాధితుల సమ్మతి గురించిన ప్రశ్నే లేదు. హిరాబా నేరంలో నలుగురు సాక్షుల అవసరమూ లేదు. నేడు వార్తాపత్రికల బ్యానర్ కథనాల్లో కనిపించే కొన్ని వార్తలు, ముఖ్యంగా కొందరు కుహానా షరిఅత్ వేత్తల అభిప్రాయం ప్రకారం ఈ నేరాన్న నిరూపించడానికి నలుగురు సాక్షుల అవసరం లేదు. గ్రామీణ పాకిస్తాన్, నైజీరియా తదితర ప్రాంతాల్లో ఇలాంటి వార్తలు వినవచ్చాయి. ప్రాసిక్యూషన్ పరిసరాల సాక్ష్యంపై, వైద్యపరమైన పరిశీలనలపై ఆధారపడుతుంది. బాధితురాలి వాంగ్మూలంపై ఆధారపడుతుంది.

మరోవిషయమేమంటే, మానభంగం వంటి నేరంలో అందులోను ఇస్లామీయ న్యాయస్థానంలో కేసును రుజువు చేయడం చాలా కీలకమైనది. ఎందుకంటే, ఇక్కడ నిందితుడికి ఇది జీవన్మరణాల సమస్య. కాబట్టి నిందితుడు నిజంగా ఆ నేరానికి పాల్పడ్డాడా లేదా అన్నది కూలంకషంగా విచారించడం జరుగుతుంది. ఒకవేళ ఈ విచారణలో లైంగిక సంపర్కం ఇరువురి సమ్మతిపై జరిగిందని తేలితే, మానభంగం ఆరోపణ అబద్ధమని తేలితే, వారిద్దరు వ్యభిచారానికి పాల్పడినట్లు భావించి ఇరువురిని శిక్షించడం జరుగుతుంది.

# మానభంగానికి పాశ్చాత్య సెక్యులర్ శిక్షలు

పాశ్చాత్యదేశాల్లో శిక్షలు, ముఖ్యంగా అమెరికాలో శిక్షలను పరిశీలిస్తే, మానభంగం వంటి నేరంలో బాధితులే కాదు డాక్టర్లు, పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు తీవ్రమైన నిరాశ నిస్పృహలకు గురయ్యే పరిస్థితి ఉంది. అమెరికాలో అరవై శాతం కన్నా ఎక్కువ రేప్ కేసులు రిపోర్టు కావడం లేదని తెలుస్తోంది.

ఎందువల్ల ఇలా జరుగుతుంది? ముందుగా అసలు సమస్య ఎంత లోతుగా ఉందో అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

- 2003లో అత్యాచారం, అత్యాచారయత్నం, లైంగికదాడుల వంటి నేరాల బాధితులు 1,98,850 మంది. ఇందులో 81,000 మంది మానభంగానికి గురైనవాళ్ళు. 61,060 మంది అత్యాచారయత్నం బాధితులు. 80,910 మంది లైంగిక దాడుల బాధితులు.
- 2003లో కేవలం 40 శాతం లైంగిక దాడుల కేసులే రిపోర్టు అయ్యాయి.
- ప్రతి రెండున్నర నిముషాలకు అమెరికాలో ఎక్కడో ఒక చోట ఒక లైంగిక దాడి జరుగుతోంది.
- ఇలాంటి లైంగిక దాడుల వల్ల 4,065 గర్భధారణలు ఏటా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

(ఈ గణాంకాలను పెన్సిల్వేనియా కోయలిషన్ ఎగనిస్ట్ రేప్ నుంచి స్వీకరించడం జరిగింది. http://pcarorg/aboutsa/stats.html )

అమెరికా వంటి ఆధునిక సమాజంలో మానభంగాలు ఇంత ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయి? దీనికి చాలా కారణాలున్నాయి. ఏదన్నా నేరం వల్ల నేరస్తుడికి కలిగే

ప్రయోజనం కన్నా శిక్ష చిన్నదిగా ఉన్నట్లయితే ఆ నేరం చేయడానికి నేరస్తులు ఏమాత్రం భయపడరు. వెనుకంజవేయరు. ఆర్థికవేత్త కిప్ విస్కసీ "జర్నల్ ఆఫ్ లేబర్ ఎకనమిక్స్"లో రాసిన మాటలు ఇక్కడ గమనించదగ్గవి. "పాశ్చాత్య దేశాల్లో న్యాయవ్యవస్థ వల్ల నేరస్తులకు వాటిల్లే నష్టం చాలా తక్కువ. యువనేరస్తులకు ఈ విషయం బాగా తెలుసని గణాంకాలు చెబుతున్నాయి." అని రాశారాయన.

నిజానికి అమెరికాలో మానభంగం కేసుల్లో ప్రాసీక్యూషన్ గణాంకాలు చూస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. అరవైశాతం లైంగికదాడులస్సలు రిపోర్టు కావడం లేదని, ఈ నేరస్తులకు ఎలాంటి శిక్షలు పడడం లేదన్నది పక్కనపెడితే, రిపోర్టయిన నేరాల పరిస్థితి ఏమిటి? ఈ నేరాన్ని రిపోర్టు చేసిన తర్వాత బాధితులకు న్యాయం జరుగుతుందా? దురదృష్టవశాత్తు ఇక్కడ కూడా గణాంకాలు చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఆర్.ఏ.ఐ.ఎన్.ఎన్ (రేప్, అబ్యూజ్ అండ్ ఇన్‌సెస్ట్ నేషనల్ నెట్‌వర్క్ – www.rainn.org) ఇచ్చిన డాటాను పరిశీలిస్తే క్రింది విషయాలు తెలుస్తున్నాయి.

- రేప్ కేసును పోలీసు యంత్రాంగానికి రిపోర్టు చేస్తే 51 శాతం అరెస్టులు జరిగే అవకాశం ఉంది.
- అరెస్టు నిజంగా జరిగితే 80 శాతం ప్రాసిక్యూషన్ జరిగే అవకాశం ఉంది.
- ప్రాసిక్యూషన్ జరిగితే శిక్షలు పడే అవకాశం 58 శాతం
- శిక్ష పడడం జరిగితే నేరస్తుడు జైలుకు వెళ్ళడం అన్నది 69 శాతం జరగొచ్చు

అంటే, రిపోర్టు అవుతున్న 39 శాతం కేసుల్లోను కేవలం 16.3 శాతం కేసుల్లో మాత్రమే నేరస్తుడు చివరకు జైలుపాలయ్యే అవకాశం ఉంది. ఇక రిపోర్టు కాని కేసులను కూడా కలుపుకుంటే ఇది 6 శాతం మాత్రమే. పదహారు మంది రేపిస్టుల్లో కేవలం ఒక్కడు మాత్రం మహా అయితే ఒకరోజు జైల్లో గడిపుతాడు. మిగిలినవాళ్ళు స్వేచ్ఛగానే తిరుగుతారు.

కాబట్టి మానభంగం కేసుల్లో శిక్షలు పడుతున్న రేటును పరిశీలిస్తే, కేసును రిపోర్టు చేసినా న్యాయం జరుగుతుందన్న ఆశ కన్నా రేపిస్టు ప్రతీకారానికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్లనే మానభంగానికి గురైన మహిళలు రిపోర్టు చేయడానికి కూడా వెనుకాడుతున్నారు.

# ఇస్లామీయ రాజ్యం - ముస్లిమ్ దేశం

ముస్లిమ్ దేశాలంటే అక్కడ ఇస్లామ్ చట్టాలు – పర్సనల్ చట్టాలు, ప్రభుత్వ పాలనా విధానాలు అన్నీ ఇస్లామీయ చట్టాల ప్రకారమే ఉంటాయని చాలా మంది భావిస్తుంటారు. అందువల్ల ఈ ముస్లిమ్ దేశాల్లో జరుగుతున్నదంతా ఇస్లామ్‌ను పాటించడం వల్లనే జరుగుతుందని భావిస్తారు. ఇది సత్యదూరమైన అభిప్రాయం. ఒక అపోహ మాత్రమే.

అయితే, వివిధ ముస్లిమ్ దేశాల్లో స్వాతంత్ర్య ఉద్యమాల తర్వాత ముస్లిమ్ ప్రపంచంలో ఇస్లామీయ ఉద్యమాలు తలెత్తాయి. తమ తమ దేశాల్లో ఇస్లామీయ రాజ్యస్థాపనకు ప్రయత్నాలు చేయడం మొదలైంది. ఇస్లామీయ రాజ్యం అంటే ఇస్లామీయ షరిఅత్, ఇస్లామీయ చట్టాలు అమల్లో ఉన్న రాజ్యం. ఇస్లామీయ పండితులు, ఆ దేశంలోని జాతీయ ఇస్లామీయ ఉద్యమ నాయకులకు రాజ్యవ్యవహారాల్లో, రాజకీయాధికారంలో ప్రమేయం, అదుపు ఉన్న రాజ్యం.

ఇటీవల చాలా ముస్లిమ్ దేశాలు ఇస్లామీయ రాజ్యాలుగా ప్రకటించుకున్నాయి. ఇస్లామీయ షరిఅత్‌ను అమలు చేస్తున్నామన్నాయి. కాని నిజానికి జరిగింది వేరు. కొన్ని శిక్షలకు సంబంధించి ఇస్లామీయ చట్టాల్లోని ఉత్తర్వులను మాత్రమే అమల్లో పెట్టారు. స్త్రీల హోదా విషయంలోను, కొన్ని ప్రదర్శనాత్మక వ్యవహారాల్లోను ఇస్లామీయ చట్టాలపై ఎక్కువ ఆసక్తి చూపించారు. ఆవిధంగా ఇస్లామీయ శిక్షల ప్రదర్శన ఒకటి మొదలైంది. హుదూద్ చట్టాలు, కొరడా దెబ్బలు, అవయవాలు ఖండించడం వంటి చర్యలకు పెద్ద ప్రచారమే ఇచ్చారు. నిజానికి ఇవి తీవ్రమైన చట్టాలు, విపరీతమైన, తీవ్రమైన పరిస్థితుల్లో మాత్రమే విధించే శిక్షలు. అది కూడా కొన్ని మౌలికమైన సామాజిక షరతులను తప్పక దృష్టిలో ఉంచుకుని విధించవలసినవి. ఉదాహరణకు సామాజిక న్యాయం, సంపద పంపిణీ, పౌరుల విషయంలో రాజ్యం బాధ్యతలు, క్షమాభిక్ష, దయాస్వభావం వంటి మౌలిక విషయాలను దృష్టిలో ఉంచుకుని చాలా జాగ్రత్తగా విధించవలసిన శిక్షలు. కాని నిర్లక్ష్యంగా ఈ శిక్షలను విధించడం వల్ల ఒక ఛాందసవాద రాజ్యం, తీవ్రమైన, చీకటి చట్టాలను అమలు చేసే రాజ్యంగా ప్రపంచం ముందు కనబడుతున్నారు. ఈ విధంగా చేయడం ద్వారా దివ్యఖుర్ఆన్ బోధనలకు, ఇస్లామీయ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకంగా నడుచుకుంటున్నారు. ఈ విధంగా ఇస్లామీయ రాజ్యాలుగా తమను తాము ప్రకటించుకున్న దేశాలు నిజానికి ఒక ప్రత్యేక తరగతి, కుటుంబం లేదా సైన్యం పరిపాలనను ఇస్లామీయ రాజ్యంగా చిత్రీకరిస్తున్నాయి.

నిజానికి ఈ ముస్లిమ్ దేశాల్లో చాలా దేశాలు నియంతల పరిపాలనలో ఉన్నాయి. కఠినమైన అణిచివేతలు అమలు చేసే నిరంకుశుల పాలనలో ఉన్నాయి. ఇరాక్‌లో సద్దామ్

హుస్సేన్ ప్రభుత్వం వంటి ప్రభుత్వాలే చాలా చోట్ల ఉన్నాయి. అల్జీరియా, సిరియా, జోర్డన్, పాకిస్తాన్ తదితర దేశాల్లో విధానాలను, వారి ఆచరణలను పరిశీలిస్తే అక్కడ మానవహక్కుల అతిక్రమణ చాలా తరచుగా జరుగుతుందన్నది స్పష్టం అవుతుంది. పౌరస్వేచ్ఛలకు అవకాశం లేని పరిస్థితి కనబడుతుంది. ఈ దేశాల్లోని నియంతలు అక్కడ నామమాత్రంగా జరిగే ఎన్నికలను రిగ్గింగ్ చేస్తుంటారు. ప్రతిపక్ష నాయకులను, వారి అనుయాయులను జైలు పాలు చేస్తారు. లేదా హతమారుస్తారు. మొత్తం కుటుంబ సభ్యులను ఎలాంటి న్యాయప్రక్రియ లేకుండా నిరవధికంగా జైల్లో నిర్బంధిస్తారు. ఖైదీలను శారీరకంగా మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తారు. ఇవి కాక ఇంకా తీవ్రమైన మానవహక్కుల అతిక్రమణలకు, అన్యాయాలకు పాల్పడుతుంటారు.

ఈ అణిచివేతలకు ఇస్లామ్‌కు సంబంధం ఉందనుకుంటే చాలా పెద్ద పొరబాటు. ఇస్లామీయ చట్టాలను అవగాహన చేసుకుంటే ఈ ముస్లిమ్ దేశాల్లోని అణిచివేతల వ్యవస్థలకు ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టంగా అర్థం అవుతుంది.

# ముస్లిములా ? ముహమ్మదీయులా ?

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక)ను ముస్లిములు పూజించడం, ఆరాధించడం లేదు. ప్రవక్త ముహమ్మద్ దేవుడు పంపించిన చివరి ప్రవక్తగా ముస్లిములు విశ్వసిస్తారు. దేవుడు ఆయనకు ముందు పంపించిన ఇతర ప్రవక్తల మాదిరిగా ఆయన కూడా మానవమాత్రుడే. కాని కొందరు ముస్లిమేతరులు ప్రవక్త ముహమ్మద్ (స)ను ముస్లిములు ఆరాధిస్తారన్న అపోహలో ఉన్నారు. అందువల్లనే ముస్లిములను పొరబాటున ముహమ్మదీయులని పిలువడం వింటుంటాం.

జీసస్ మాదిరిగానే ప్రవక్త ముహమ్మద్ కూడా తాను దేవుడినని ఎన్నడూ చెప్పలేదు. ఆయన ఒకే దేవుడిని (అల్లాహ్ అంటే ఒకే దేవుడని అర్థం) ఆరాధించాలని ప్రజలకు బోధించారు. ఆయన తాను మానవమాత్రుడినేనన్నది ఎల్లప్పుడు చెబుతూనే వచ్చారు. ఆ విధంగా తనను దేవునిగా మార్చకుండా నిరోధించారు. తనను దేవుని దాసునిగా, దేవుని ప్రవక్తగా పిలవాలని మాత్రమే ఆయన ఎప్పుడు చెప్పేవారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. “క్రయిస్తవులు మేరీమాత పుత్రుడు ఏసును దేవుడిగా మార్చేసినట్లు నన్ను కూడా మార్చవద్దు. నేను దేవుని దాసుడిని, దేవుడి ప్రవక్తను మాత్రమే”

దేవుడు తన చివరి ప్రవక్తగా ముహమ్మద్ ను ఎన్నుకున్నాడు. ఆయన ద్వారా తన సందేశాన్ని యావత్తు మానవాళికి పంపాడు. కేవలం దైవాదేశాల రూపంలో మాత్రమే కాదు, ఒక సజీవ ఉదాహరణగా ప్రవక్త ముహమ్మద్ దైవాదేశాల ప్రకారం జీవించి చూపించారు. ఆయన అత్యున్నత వ్యక్తిత్వం, నైతికతల కారణంగా, ఆయన దేవుని సందేశాన్ని అందజేసినందువల్ల ముస్లిములు ఆయన్ను అత్యంత ప్రేమిస్తారు. అత్యధికంగా గౌరవిస్తారు. ఆయన అందించిన దైవసందేశం ఇస్లామ్‌లోని స్వచ్ఛమైన ఏకదైవారాధన

ముస్లిములు ప్రవక్త ముహమ్మద్ అడుగుజాడల్లో నడవడానికి కృషి చేస్తారు. అంతేకాని ఆయన్ను ఏ విధంగానూ ఆరాధించడం జరగదు. దేవుని ప్రవక్తలందరినీ గౌరవించాలని ఇస్లామ్ బోధిస్తుంది. ప్రవక్తలను గౌరవించడం, ప్రేమించడం వేరు వారిని ఆరాధించడం వేరు. ఒకే ఒక్క దేవుడిని మాత్రమే ఆరాధించాలన్నది ముస్లిముల చెక్కుచెదరని విశ్వాసం.

ప్రవక్త ముహమ్మద్ ను కాని మరొకరిని కాని, దేవుని తప్ప మరొకరిని ఆరాధించడం లేదా దేవునితో పాటు మరొకరిని ఆరాధించడం ఇస్లామ్ ప్రకారం క్షమార్హం కాని మహాపాపం. ఒక వ్యక్తి ముస్లిమ్‌గా చెప్పుకున్నప్పటికీ, ఒకే ఒక్క దేవుని కాకుండా మరెవ్వరినైనా ఆరాధించడం జరిగితే ఆ వ్యక్తి ముస్లిమ్‌గా మిగలడు. ఒక ముస్లిమ్ విశ్వాసవచనంలో అత్యంత ప్రధానమైనది అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించరాదన్న నియమం.

ఇస్లామ్, ముస్లిమ్ అన్న పదాలు దివ్యఖుర్‌ఆన్‌లో ఉపయోగించబడిన పదాలు. ఖుర్‌ఆన్ ఈ విషయమై “నిస్సందేహంగా, అల్లాహ్ దృష్టిలో ఆమోదయోగ్యమైన జీవనవిధానం ఇస్లామ్” (దివ్యఖుర్‌ఆన్: 3:19) అని స్పష్టం చేసింది. అంతేకాదు “ఆయన మీకు ముస్లిములని పేరు పెట్టాడు.” (దివ్యఖుర్‌ఆన్ : 22:78). ఆదమ్ నుంచి ప్రవక్త ముహమ్మద్ వరకు ప్రవక్తలందరి సందేశం ఒక్కటే. అల్లాహ్‌కు (ఒకే ఒక్క దేవుడికి) విధేయత చూపండి. ఆయన తప్ప మరెవ్వరినీ ఆరాధించకండి. ఈ సందేశం, ప్రవక్తల ద్వారా పంపబడిన సందేశం ముహమ్మద్ అంతిమ ప్రవక్తగా వచ్చిన తర్వాత సంపూర్ణమైంది. ఆయన ప్రవక్తల పరంపరలో చిట్టచివరి వారు. దివ్యఖుర్‌ఆన్ ఈ వాస్తవాన్ని ప్రస్తావించింది. “ఈ రోజు నేను మీ ధర్మాన్నీ మీకోసం పరిపూర్ణం చేశాను. మీపై నా మేళ్ళను పూర్తి చేశాను. మీ కోసం ఇస్లామ్‌ను జీవనవిధానంగా ఎంపికచేశాను.'' (దివ్యఖుర్‌ఆన్ :5:3). అందువల్ల ఇస్లామ్‌ను ముహమ్మదనిజమ్ అనడం, ముస్లిములను ముహమ్మదీయులనడం తప్పు. ముహమ్మద్‌ను ఇస్లామ్ మతస్థాపకుడని పేర్కొనడం కూడా తప్పు. నిజానికి ఆయన ఇస్లామ్‌లో చిట్టచివరి దైవ ప్రవక్త.

# షియా సున్నీ ముస్లిములు

ముస్లిముల్లోని షియా, సున్నీ వర్గాలు ముస్లిమేతరుల్లో అనేక ప్రశ్నలకు కారణమవుతున్నాయి. ఈ ప్రశ్నలకు తగిన జవాబులు కూడా వారికి దొరకవు. ఎందుకంటే చాలా మంది ముస్లిములకు కూడా ఇందుకు సంబంధించిన చారిత్రక అవగాహన లేదు. చారిత్రక అవగాహన ఉన్నప్పటికీ ఎదుటివారికి అర్థమయ్యే విధంగా చారిత్రక అంశాలను వివరించడంలో విఫలమవుతున్నారు.

షియా లేదా సున్నీ ముస్లిములందరూ మౌలిక ఇస్లామీయ విశ్వాసాలు, ఆచరణలు, ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు, హజ్‌యాత్ర వగైరాలన్నీ ఒకేవిధంగా ఉంటాయి. ఇస్లామ్‌లోని ఈ రెండు ప్రధానమైన వర్గాల మధ్య ఉన్న భేదం రాజకీయమైనది. ప్రవక్త ముహమ్మద్ పరమపదించిన రెండు దశాబ్దాల తర్వాత ఈ రాజకీయ భేదాలు తలెత్తాయి. శతాబ్దాలు గడిచిన కొద్ది ఈ భేదాలు అనేక రూపాల్లో విస్తరించాయి. అనేక ఆచరణల్లో చోటు చేసుకున్నాయి. క్రమేణా ఈ ఆచరణలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కూడా ఆపాదించడం జరిగింది.

## మూలకారణం : నాయకత్వ సమస్య

ప్రవక్త ముహమ్మద్ రాజకీయ వారసుడెవరన్న సమస్య షియా సున్నీ విభేదాలకు కారణమైంది. ప్రవక్త ముహమ్మద్‌కు నిజమైన వారసుడెవరన్న సమస్యకు సున్నీ ముస్లిములు, ప్రవక్త ముహమ్మద్ అనుచరుల్లో చాలా మంది అంగీకరించిన విషయం, ఈ బాధ్యతాభారాన్ని మోయగలిగిన వారిలో ఒకరిని ప్రజాస్వామికంగా ఎన్నుకోవడం. అదే జరిగింది. ప్రవక్త ముహమ్మద్‌కు ఆప్తమిత్రుడు, సలహాదారుడు అబూబక్ర్ (దైవం ఆయనతో ప్రసన్నుడవుగాక)ను ఖలీఫాగా ఎన్నుకున్నారు. ఆయన ఇస్లామీయ చరిత్రలో మొదటి ఖలీఫా. అంటే ఇస్లామీయ రాజ్యానికి అధ్యక్షుడు. అరబీలో సున్నీ అన్న పదానికి ప్రవక్త ముహమ్మద్ సంప్రదాయాలను

అనుసరించే వ్యక్తి అని అర్థం.

అయితే అప్పట్లో కొందరు ముస్లిములు ఈ ఎన్నికను విభేదించారు. రాజకీయ వారసత్వం ప్రవక్త ముహమ్మద్ కుటుంబంలో ఉండాలని వాదించారు. ప్రవక్త ముహమ్మద్ నియమించిన వారి వద్దనే ఉండాలని లేదా దేవుడు స్వయంగా నియమించిన ఇమాముల వద్దనే ఉండాలని వాదించారు.

షియా ముస్లిముల అభిప్రాయం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ స్వర్గస్తులైన తర్వాత రాజకీయ వారసత్వం ఆయన అల్లుడు హజ్రత్ అలీ (దైవం ఆయనతో ప్రసన్నుడవుగాక)కు రావలసింది. ఆ తర్వాత చరిత్రలో ఎన్నడూ షియా ముస్లిములు ప్రజాస్వామికంగా ఎంపికైన ముస్లిమ్ నాయకులను గుర్తించలేదు. అందుకు బదులుగా ఇమాముల నాయకత్వాన్ని గుర్తిస్తూ వచ్చారు. ప్రవక్త ముహమ్మద్ లేదా దేవుడు స్వయంగా ఈ ఇమాములను నియమించారని విశ్వసిస్తూ వచ్చారు. అరబీలో షియా అన్న పదానికి మద్దతిచ్చే సమూహం అని అర్థం. నిజానికి షియా అన్న పదం పూర్తి పదం కాదు. షియాతె అలీ అన్నది పూర్తి పదం. అంటే అలీ మద్దతుదారుల సమూహం అని అర్థం. దీన్ని క్లుప్తీకరించి షియాగా పిలుస్తారు. వీరిని అహ్లుల్ బైత్ అనుచరులుగా కూడా పిలుస్తారు. అహ్లుల్ బైత్ అంటే కుటుంబసభ్యులు (ప్రవక్త కుటుంబ సభ్యులు). అంటే వీరు ప్రవక్త కుటుంబసభ్యుల అనుచరులు.

## పంపిణీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిముల్లో సున్నీ ముస్లిములదే ఆధిక్యం. 85 శాతం సున్నీ ముస్లిములే ఉన్నారు. ప్రపంచంలోని 56 ముస్లిమ్ దేశాల్లో నాలుగు దేశాలు, ఈరాన్, ఇరాక్, బహ్రెయిన్, ఆజర్‌బైజాన్ దేశాల్లో షియాలు అధికసంఖ్యలో ఉన్నారు. అయితే ఇండియా, పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, ఎమన్, సిరియా, లెబనాన్‌లలో షియా జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉంది.

## ధార్మిక ఆచరణల్లో తేడా

ప్రారంభంలో రాజకీయ నాయకత్వం విషయంలో విభేదాలు వచ్చాయి. కాలక్రమంలో ఆధ్యాత్మిక జీవితంలోను కొన్ని మార్పులు రావడం, ఆచరణలు, ధార్మిక క్రతువుల్లోను ఈ విభేదాలు చోటుచేసుకున్నాయి.

గమనించవలసిన విషయమేమంటే, ఈ విభేదాలున్నప్పటికీ, మౌలిక విశ్వాసాల

విషయంలో ఎలాంటి భేదం లేదు. నిజానికి ఇప్పుడు చాలా దేశాల్లో ముస్లిములు ఈ షియా సున్నీ తేడాను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. షియా ముస్లిములని లేదా సున్నీ ముస్లిములని పిలువబడాలనుకోవడం లేదు. కేవలం ముస్లిములుగా మాత్రమే పిలువబడాలనుకుంటున్నారు.

## ధార్మిక నాయకత్వం

షియా ముస్లిముల విశ్వాసం ప్రకారం ఇమామ్ స్వతహాగా పాపరహితుడు. ఆయన అధికారం సవాలు చేయరానిది. ఎందుకంటే స్వయంగా దేవుడు ఆ అధికారాన్ని ప్రసాదించాడు కాబట్టి. అందువల్ల షియా ముస్లిములు తమ ఇమాములను పవిత్రమైనవారిగా భావిస్తారు. వారి సమాధులను సందర్శించడానికి యాత్రలు చేస్తారు. దైవం వద్ద వారు తమకు సిఫారసు చేస్తారని భావిస్తారు.

సున్నీ ముస్లిముల వాదన ప్రకారం ఇస్లామ్‌లో ధార్మిక నాయకత్వం వారసత్వంగా లభించే అవకాశమే లేదు. వారసత్వంగా కొందరికి ప్రత్యేకస్థానం హోదా లభించడం అన్నది ఇస్లామ్‌లో లేదు. కాబట్టి వారసత్వం ప్రాతిపదికన కొందరికి పవిత్రత ఆపాదించలేమని, కాబట్టి ఎవరైనా సరే దైవానికి సిఫారసు చేసే అవకాశం లేదని వాదిస్తారు. రాజకీయ నాయకత్వం అన్నది జన్మహక్కుగా ఎవరికీ లభించదని, రాజకీయ వారసత్వం అన్నది ఒక బాధ్యతగా ప్రజలు అప్పగించేది లేదా ప్రజలు తొలగించేదని నమ్ముతారు.

## ఘర్షణలు వివాదాలు

సౌదీ అరేబియా, పాకిస్తాన్, ఇండియా తదితర దేశాల్లో షియా సున్నీ విభేదాలు సాంఘీక, రాజకీయ రంగాలకు కూడా విస్తరించాయి. ఎక్కడెక్కడైతే ప్రజాస్వామ్యం ఉందో, ఉదాహరణకు లెబనాన్, ఇండియా, పాకిస్తాన్ వగైరా దేశాల్లో ఈ విభేదాలు రాజకీయపంథాలుగా, రాజకీయ గ్రూపులుగా రూపుదిద్దుకున్నాయి. సౌదీ అరేబియా, సిరియా వంటి దేశాల్లో ఈ రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. ఇరాక్, అఫ్గనిస్తాన్ వంటి యుద్ధప్రభావిత దేశాల్లో ఈ రెండు వర్గాల మధ్య సాయుధ సంఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఈ దేశాల్లోని సామాజిక అలజడి వల్ల ఈ విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇండియాలోని లక్నో వంటి ప్రాంతాల్లో కూడా ఘర్షణలు జరిగాయి. చాలా చిన్న కారణాలు, ముహర్రమ్ ఊరేగింపు రూట్ వంటి అతి చిన్న కారణాలతో కూడా ఘర్షణలు జరిగాయి. కొన్ని స్వార్థశక్తులు ఈ విభేదాలు, ఘర్షణల నుంచి ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తున్నాయి.

ఈ చర్చ వల్ల మనకు తెలుస్తున్నదేమంటే, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అనేక జనసమూహాలు పాటిస్తున్న విస్తృతస్థాయి మతంగా ఇస్లామ్‌లో బహుళత్వానికి పూర్తి అవకాశాలున్నాయి. ఇస్లామ్ అనుచరులందరూ మూసపోసినట్లు ఒకేవిధమైన చట్రంలో జీవించాలని ఇస్లామ్ నిర్బంధించడం లేదు. ఇతర పంథాలకు అవకాశం లేకుండా దారులు మూసేయడం లేదు. వివిధ జాతి, భాషా, సామాజిక, రాజకీయ సమూహాలకు ఇస్లామ్ అవకాశం కల్పించింది. ఒక విభిన్న సంస్కృతులు, పంథాలతో కూడిన ఒక అందమైన పూదోటగా రూపుదిద్దుకుంది. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. ఈ బహుళత్వానికి అవకాశం లేనట్లయితే ఇస్లామ్ ఇంత ప్రభావశీలంగా ఉండేది కాదు. మధ్యధరా ప్రాంతంలోని కాసాబ్లాంకా నుంచి పసిఫిక్ సముద్రంలోని బ్రూనై వరకు విశాల భౌగోళిక ప్రాంతాల్లో విస్తరించిన మతధర్మం ఈ సువిశాల వైవిధ్యభరిత భౌగోళిక ప్రాంతాల్లో మూసపోసిన ఒకేవిధమైన సంస్కృతిని రుద్దాలని ఎన్నడూ అనుకోలేదు. ఈ ప్రాంతాలన్నింటిలోను ఉమ్మడిగా కనిపించేది ఒక్కటే. ఇస్లామీయ విశ్వాసం. ఏకదైవారాధన. ప్రవక్త ముహమ్మద్ (స)ను చిట్టచివరి ప్రవక్తగా విశ్వసించడం. ఇది అన్ని ప్రాంతాలలోను కనబడుతుంది. ఇస్లామ్‌లోని షియా సున్నీ విభేదాలను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

# ఉర్దూ విదేశీ భాషా ?

ఉర్దూ భాషాభివృద్ధికి ఏమైనా చర్యలు చేపడితే ఒక విదేశీ భాష కోసం ఖర్చు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తుంటాయి. ఆధునిక కాలంలోని ఒక పెద్ద అపోహ ఇది. గంగా సింధూ మైదానంలో భారత ముస్లిముల గుర్తింపుల్లో ఉర్దూ భాష కూడా ఒకటన్నది నిజమే అయినప్పటికీ ఉర్దూ ఇండో ఆర్యన్ భాష. ఉర్దూ వ్యాకరణం సంస్కృతంతో సంబంధం కలిగి ఉంది. ముగల్ సామ్రాజ్య కాలంలో వారి సైనిక శిబిరాల్లో ఉర్దూ పురుడు పోసుకుంది. ఈ సైనిక శిబిరాల్లో వివిధ జాతుల, తెగల సైనికులు ఉండేవారు. హిందీ, సంస్కృతం, బ్రజ్‌భాష, ప్రాకృత్, పాళీ భాషలు కలగాపులగంగా వాడేవారు. ఈ భాషల సమ్మేళనం నుంచి పుట్టింది ఉర్దూ.

మరో వాస్తవమేమంటే భారతదేశంలోని ముస్లిములందరూ ఉర్దూ మాట్లాడతారనుకోవడం అపోహ. అలాగే ఉర్దూ ఉపయోగించేవారు, ఉర్దూ అభివృద్ధికి కృషి చేసిన వారు అందరూ ముస్లిములనుకోవడం కూడా తప్పే. ఉర్దూ సాహితీ వారసత్వంలో మహోన్నత సెక్యులర్ భావాలు కనబడతాయి. అనేక మంది హిందూ కవులు, రచయితలు,

నాటకరచయితలు, వ్యాసకర్తలు ఉర్దూ సాహిత్యానికి విశేష సేవలందించారు. భారతదేశంలోని ఏ భాషలోను లేనన్ని భగవద్గీత అనువాదాలు ఉర్దూలో ఉన్నాయి. ఆనంద నారాయణ్ ముల్క్, మలిక్ రామ్, కిషన్ చందర్, భిషేషర్ ప్రదీప్; మనోరమ దివాన్, ప్రేమ్‌చంద్, రఘుపతి ఫిరాక్ గోరఖ్‌పూరీ, బ్రజ్‌నారాయణ్, చక్‌బస్త్, గోపీచంద్ నారంగ్ వంటి ప్రముఖ ఉర్దూ రచయితలు హిందువులే. ఉర్దూ భాషకు మధ్యప్రాచ్యానికి లేదా అరబ్బులకు ఎలాంటి సంబంధమూ లేదు. పాకిస్తాన్ ఉర్దూ భాషను జాతీయస్థాయిలో అధికారిక భాషగా స్వీకరించింది. కాని పాకిస్తాన్‌లోని నాలుగు రాష్ట్రాల్లో ప్రజలు తమ తమ స్థానిక భాషలే వాడుతారు. అంటే సింధీ, బలూచీ, పంజాబీ, పష్తూ భాషలు వాడుతున్నారు. అలాగే పాకిస్తాన్‌లోని నాలుగు స్థానిక భాషల్లో ఒకటైన సింధీ భారత జాతీయ భాషల్లో ఒకటి. ఇది ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాలకు చిహ్నంగా భావించాలే తప్ప అనుమానస్పద దృక్కులతో చూడవలసిన విషయం కాదు. మరో విషయమేమంటే ఉర్దూ భాషను రాయడానికి ఉపయోగించే పర్షియన్ రాత వల్ల దీన్ని విదేశీ భాషగా ముద్ర వేయలేం. మరో మూడు భారత భాషలు, సింధీ, పంజాబీ, కశ్మీరీలు కూడా పర్షియన్ రాతనే ఉపయోగిస్తాయి. ఏమన్నా సందేహాలుంటే భారత రిజర్వు బ్యాంకు జారీ చేసిన వంద రూపాయల నోటుపై చూడండి. వివిధ భాషల రాతలను పరిశీలించండి మీకే అర్థం అవుతుంది.

దేశంలో అతి పాత ఉర్దూ మ్యాగజైన్, వంద సంవత్సరాల కన్నా ఎక్కువ పాతదైన మస్తానా జోగి మ్యాగజైన్ హిందువులదే. నేడు అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఉర్దూ దినపత్రిక రాష్ట్రీయ సహారా నడుపుతున్నది ముస్లిమేతర సంస్థ సహారా గ్రూప్.

# ఇస్లామ్‌లో పూజారులు లేరు

ఇమామ్, ముఫ్తీ, ఖాజీ, మౌల్వీ వంటి హోదాలను చాలా మంది ముస్లిమేతరులు పూజారి హోదాగా భావిస్తుంటారు. కాని అది నిజం కాదు. ఇమామ్ అంటే సామూహిక ప్రార్థనల్లో నాయకత్వం వహిస్తున్న వ్యక్తి. ముఫ్తీ అంటే ధార్మిక విషయాల్లో తనకున్న ప్రావీణ్యం ప్రాతిపదికన అవసరమైన సలహాలు, అభిప్రాయాలు చెప్పే వ్యక్తి. ఖాజీ అంటే ధార్మిక పరిభాషలో న్యాయమూర్తి. వివాదాలను ధార్మికఆదేశాల ప్రకారం పరిష్కరించే వ్యక్తి. మౌల్వీ అంటే ధర్మపండితుడు. ఉపాధ్యాయుడు కావచ్చు లేదా కేవలం దివ్యఖుర్‌ఆన్‌ను పఠించేవారు కావచ్చు. వీరిలో ఎవరికీ మానవాతీత హోదా లేదు. వీరిలో ఎవ్వరూ మనిషికి, దేవుడికి మధ్య వారధులుగా లేదా మధ్యవర్తులుగా నిలబడేవారు కాదు. ఏ ఇమామ్ ముందు ఎలాంటి ఒప్పుకోళ్ళు (కన్‌ఫషన్స్) చేయవలసిన అవసరం లేదు. వ్యక్తి స్వయంగా దేవుని ముందు సాగిలబడి తన పాపాలకు స్వయంగా క్షమాభిక్ష వేడుకోవాలి. దివ్యఖుర్‌ఆన్‌లో ఏ కొద్దిభాగం కంఠస్థం చేసిన వ్యక్తయినా, ఇస్లామీయ ఆచరణలను పాటిస్తున్న వ్యక్తయినా సామూహిక ప్రార్థనలకు మస్జిదులో నాయకత్వం వహించవచ్చు. ప్రత్యేక పూజారులు ఎవరూ ఉండరు. సున్నత్, మక్తబ్, గృహప్రవేశం, వ్యాపార ప్రారంభం వంటి సందర్భాల్లో ప్రత్యేకంగా పూజారులను పిలువక్కర్లేదు. మస్జిదులో ఎవరికోసమైనా గాని ప్రత్యేక స్థానాలు ఉండవు. ముందు వచ్చిన వారు ముందు స్థానాల్లో కూర్చోగలరు. ఇస్లామ్‌లో ఒకరు గొప్ప ఒకరు తక్కువ అన్న భావమే లేదు. అందరూ సమానంగా నిలబడాల్సిందే. ఒకే పళ్ళెంలో తినాల్సిందే. ఈ సందర్భంగా దివ్యఖుర్‌ఆన్ బోధన ఒకటి దృష్టిలో ఉంచుకోవాలి. "మీలో దేవుని వద్ద అత్యంత గౌరవప్రదమైన వారు మీలో అత్యంత ధర్మపరాయణులే."

# మస్జిదు

1. మస్జిదు అంటే ఇస్లామ్‌ను అనుసరించేవారు ఆరాధనలు చేసుకునే ప్రదేశం. దేవుని ముందు సాష్టాంగపడే (సజ్దాచేసే) ప్రదేశం

2. చాలా మస్జిదులకు గుమ్మటాలు, మినార్లు, ప్రార్థనామందిరం ఉంటాయి.

3. మస్జిదులో ప్రార్థన చేస్తున్నప్పుడు అభిముఖంగా ఎలాంటి విగ్రహాలు, చిత్రాలు, బొమ్మలు, పవిత్రచిహ్నాలు ఏవీ ఉండవు.

4. ప్రవేశ రుసుము కాని లేదా సమర్పణలు అంటే మస్జిదులో నమాజుకు వెళ్ళినప్పుడు కొబ్బరికాయ, మిఠాయిలు, అగరొత్తులు, చాదర్ వగైరాలు సమర్పించవలసిన అవసరం లేదు.

5. ముస్లిములు ప్రార్థన కోసం సమావేశమయ్యే ప్రదేశంగాను, సమాచార కేంద్రంగాను, విద్యాకేంద్రంగాను, వివాదాల పరిష్కార కేంద్రంగాను మస్జిదు ఉపయోగపడుతుంది.

6. ముస్లిములందరు వరుసలుగా నిలబడి నమాజులో ప్రార్థన చేస్తారు. మస్జిదులో నమాజు చేస్తున్నప్పుడు ఏ వ్యక్తికి ప్రత్యేక సదుపాయాలు కాని ప్రాధాన్యం కాని లభించదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ హోదా పరంగా ఎవరికి కూడా మొదటి వరుసలో స్థానం కేటాయించడం కూడా జరగదు.

7. ఆకాశంలో సూర్యుడి స్థానాన్ని బట్టి నమాజు వేళలు నిర్ధారితమై ఉన్నాయి.

ప్రాత:కాల ప్రార్థనలు, అంటే ఫజ్ర్ నమాజు సూర్యోదయానికి కాస్త ముందు జరుగుతుంది.

మధ్యాహ్న ప్రార్థన, అంటే జుహ్ర్ నమాజు వేళ సూర్యుడు ఆకాశాన అధిరోహిస్తున్నప్పటి నుంచి మొదలవుతుంది.

మూడవది అస్ర్ నమాజు. వస్తువు నీడ ఆ వస్తువు కన్నా రెట్టింపుగా ఉన్నప్పుడు ఈ నమాజు వేళ అవుతుంది.

నాల్గవవది మగ్రీబ్ నమాజు. సూర్యాస్తమయం అయిన వెంటనే ఈ నమాజు చేస్తారు.

ఐదవది ఇషా నమాజు. ఈ నమాజు పూర్తిగా చీకటి పడిన తర్వాత, అంటే సూర్యాస్తమయం జరిగిన కనీసం గంటన్నర తర్వాత చేస్తారు. నమాజు వేళల విషయంలో ఖచ్చితమైన సమయం పాటిస్తారు. ఎంత ముఖ్యమైన వ్యక్తి విషయంలో అయినాగాని ఈ వేళల్లో మినహాయింపులు లేవు.

8. నమాజుకు ఇమామ్ నాయకత్వం వహిస్తారు. అంటే సామూహిక ప్రార్థనలకు ఒక ఇమామ్ నాయకత్వం వహిస్తారు. మస్జిదుల్లో పూజారులెవ్వరూ ఉండరు. ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి ఎవరైనా సరే ఈ సామూహిక ప్రార్థనలకు నాయకత్వం వహించవచ్చు.

9. మస్జిదుల్లో ముస్లిమేతరులు ప్రవేశించే అనుమతి కూడా ఉంది.

10. మస్జిదుల్లో జరిగే నమాజులో జంతుబలి లాంటివి ఏవీ ఉండవు.

11. మద్యం, మత్తుపదార్థాలు తీసుకుని మస్జిదులో ప్రవేశించడం నిషిద్ధం. చివరకు పచ్చి ఉల్లిపాయలు, వెల్లుల్లి తిన్నవారైనా సరే మస్జిదులో ప్రవేశించే ముందు నోటిని శుభ్రంగా కడుక్కోవాలి.

12. ప్రార్థనలకు ముందు ముస్లిములు శరీరం నీటితో శుభ్రపరచుకోవాలి. ఈ పద్ధతిని వుజూ అంటారు.

# మస్జిదులో ఏముంటుంది ?

## ప్రార్థనామందిరం

ప్రార్థనా మందిరం ఒక పెద్ద హాలు వంటిది. దీన్ని ముసల్లా అంటారు. ఇక్కడ దేవునికి సాష్టాంగపడడం జరుగుతుంది. అంటే సజ్దా చేయడం, నమాజులోని ఇతర ఆచరణలను ఆచరించడం జరుగుతుంది.

## మిహ్రాబ్

మస్జిదు ప్రార్థనా హాలులో ఒక గోడకు అర్ధవలయాకారంలో ఒక గూడు వంటిది నిర్మించబడి ఉంటుంది. దీన్ని మిహ్రాబ్ అంటారు. ఈ మిహ్రాబ్ ఖిబ్లా దిశను సూచిస్తుంది. ఖిబ్లా దిశ అంటే మక్కాలోని కాబా గృహం ఉన్న దిశ. ముస్లిములు ప్రార్థన చేస్తున్నప్పుడు కాబాకు అభిముఖంగా నిలబడి ప్రార్థించాలి, కాబట్టి ఖిబ్లా దిశగా ఉన్న గోడకు ఈ మిహ్రాబ్ నిర్మిస్తారు. దీన్ని ఖిబ్లాగోడ అంటారు.

## మింబర్

మింబర్ అంటే మస్జిదులో ఒక చిన్న ప్లాట్‌ఫాంలా కట్టిన అరుగు. దీనిపై ఇమామ్ నిలబడి ఖుత్బా అంటే ప్రసంగం చేస్తారు. ఇది సాధారణంగా శుక్రవారం రోజున మధ్యాహ్నం జరిగే సామూహిక ప్రార్థనలో ఉంటుంది.

## శరీర ప్రక్షాళనా సౌకర్యం

మస్జిదుల్లో సాధారణంగా చిన్న నీటి కొలను ఫౌంటేన్ లేదా వరుసగా కట్టిన నీటిపంపులు ఉంటాయి. ప్రార్థనలకు ముందు ముస్లిములు శరీరావయవాలను నీటితో శుభ్రం చేసుకోవలసి ఉంటుంది. దీన్ని వుజూ అంటారు. ఈ నీటి వసతి వుజూ చేయడానికి ఏర్పాటు చేయబడింది. మస్జిదులోని ప్రార్థనా హాలులో పాదరక్షలతో వెళ్ళరాదు. మస్జిదుకు వచ్చిన సందర్శకులు, ప్రార్థనలకు వచ్చిన వారు వుజు చేసుకోవాలి.

# యావత్తు భూమండలం ఒక పెద్ద మస్జిదు

మొత్తం భూమండలం ఒక మస్జిదేనని ప్రవక్త ముహమ్మద్ అన్నారు. ప్రవక్త చెప్పిన ఈ ప్రవచనం వెనుక ఉన్న భావం చాలా సరళమైనది. భూమిపై ఎక్కడైనా ప్రార్ధనలు చేసుకోవచ్చని ప్రవక్తకు అల్లాహ్ అనుమతించాడు. భూమిపై ఏ ప్రదేశం అపవిత్రమైంది కాదు. అదేవిధంగా ప్రవక్త ముహమ్మద్ అనుయాయులైన ముస్లిములు కూడా భూమిపై ఎక్కడైనా నమాజు చేయవచ్చు. అందువల్లనే ముస్లిములు పార్కుల్లో, రోడ్డు పక్కన, రైల్వే ప్లాట్‌ఫాంపై, ఎయిర్‌పోర్టు టెర్మినల్ వగైరా ప్రదేశాల్లో నమాజు చేయడం కనబడుతుంది. ముస్లిములకు యావత్తు భూమండలం ప్రార్ధనాస్థలమే. నిర్ధారిత వేళల్లో వారు దేవుని స్మరిస్తూ ప్రార్ధన చేస్తారు. ఎక్కడున్నా సరే సమయం కాగానే ప్రార్ధనకు పూనుకుంటారు.

ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మాటలకు ఈ సరళమైన భావంతో పాటు మరో గూఢార్థం కూడా ఉంది. ముస్లిమ్ దృక్పథం ప్రకారం మస్జిదు అనేది ఒక శాంతి ప్రదేశం. ప్రజలు అందులోకి స్వచ్ఛతతో ప్రవేశిస్తారు. వారి శరీరాలు, వారి దుస్తులు పరిశుభ్రంగా ఉంటాయి. వారి మనోమస్తిష్కాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి. వారు దేవుని విధేయులైన దాసులుగా మస్జిదులో ప్రవేశిస్తారు. వారు మస్జిదులో ప్రవేశిస్తున్నప్పుడు అక్కడున్న వారితో అస్సలాము అలైకుమ్ (దేవుని శాంతి మీకు కలుగుగాక) అంటారు. ఇది కొత్తగా అక్కడికి వచ్చేవారి శాంతి ప్రకటన. మస్జిదులో శాంతి సౌహార్దతలు ప్రసరిస్తూ ఉంటాయి. అక్కడ దేవుడు ఒక్కడే, మనుష్యులంతా ఒక్కటే అన్న సందేశం ప్రకాశిస్తూ ఉంటుంది.

ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే, యావత్తు భూమి ఒక మస్జిదు అని ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మాటల్లోని అంతరార్థం అవగతమవుతుంది. ఆయన యావత్తు భూమిని ఒక శాంతిప్రదేశంగా రూపొందించాలన్నారు. మానవాళి యావత్తు శాంతిని పొందాలి. భూమిపై ప్రతి ప్రాంతంలో శాంతి విలసిల్లాలి. ప్రవక్త ముహమ్మద్ దృక్పథం ప్రకారం ఒక మస్జిదు ఏవిధంగా దేవుడు ఒక్కడే, మనుష్యులంతా ఒక్కటే అన్న సందేశానికి కేంద్రమై శాంతిని ప్రకాశిస్తుందో అదేవిధంగా యావత్తు భూమి ఒక మస్జిదుగా మారినప్పుడే ఆదర్శవంతమైన శాంతి స్థాపితమవుతుంది.

# అజాన్

## ప్రార్థనా పిలుపు

ప్రపంచంలోని ప్రతి మస్జిదులోను రోజుకు ఐదుపూటలు నమాజ్ లేదా ఇస్లామీయ ప్రార్థన జరుగుతుంది. ప్రతి ముస్లిమ్ రోజుకు ఐదుపూటలు ప్రార్థనలు చేయవలసి ఉంది. నమాజు మస్జిదులో చేయడమే అత్యుత్తమం. ప్రజల మధ్య సామాజిక సంబంధాన్ని సుదృఢం చేయడానికి, ప్రజల మధ్య పరిచయాలు పెంచడానికి, ప్రజలు ఒకరి సుఖదు:ఖాలను మరొకరు పంచుకునే వాతావరణం సృష్టించడానికి ఈ ఏర్పాటు చేయడం జరిగింది.

మస్జిదులో ప్రార్థనలకు ప్రజలను పిలవడానికి ఉద్దేశించింది అజాన్. మస్జిదు మినారుల నుంచి అజాన్ పలకడం జరుగుతుంది. చాలా మంది ముస్లిమేతరులు అజాన్ పలుకులు విని ఇదే ప్రార్థన అని పొరబడడం కూడా జరుగుతుంది. ముస్లిముల ప్రార్థనల్లో లౌడ్‌స్పీకర్ వాడతారని అపోహపడడం కూడా జరుగుతుంది.

మరో విచిత్రమైన అపోహ కూడా ఉంది. అక్బర్ చక్రవర్తి సామ్రాజ్యం అంతరించి ఆయన మరణించి చాలా కాలం గడిపోయిన తర్వాత కూడా ముస్లిములు అక్బర్ అంటూ ఎందుకు పిలుస్తున్నారా అని కొందరు ఆశ్చర్యపోతుంటారు. అజాన్ పలకడానికి మహా అయితే రెండు నుంచి మూడు నిముషాల సమయం పడుతుంది. లౌడ్ స్పీకర్లో అంతకన్నా ఎక్కువ సమయం అజాన్ వినిపించడం జరగదు.

అజాన్‌లో వాడే ప్రతిపదాన్ని మహాప్రవక్త ముహమ్మద్ స్వయంగా నిర్ణయించారు. కాసాబ్లాంకా నుంచి జకర్తా వరకు ప్రతి మస్జిదు నుంచి ఈ పదాలు ఆకాశంలో ప్రతిధ్వనించడం ప్రతి రోజు జరుగుతోంది. ప్రార్థనలకు పిలిచే వివిధ రీతులున్నాయి. చర్చీల్లో గంటలు మోగిస్తారు. మందిరాల్లో శంఖం పూరిస్తారు. వీటన్నింటికి భిన్నమైన పద్ధతిలో మస్జిదులో ప్రార్థనల కోసం పిలిచే విభిన్నమైన పద్ధతి అజాన్. అజాన్ పలుకుల అర్థాన్ని కూడా తెలుసుకుంటే ఇది ఎంత విశిష్టమైన పద్ధతో తెలుస్తుంది.

1. **అల్లాహు అక్బర్ :** అల్లాహ్ అత్యున్నతుడు (నాలుగుసార్లు ఉచ్ఛరించడం జరుగుతుంది)

2. **అష్‌హదు అన్‌లాయిలాహ ఇల్లల్లాహ్ :** ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడని సాక్ష్యమిస్తున్నాను. (రెండుసార్లు)

**3. అష్హదు అన్న ముహమ్మదు ర్రసూలుల్లాహ్**

ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అని సాక్ష్య మిస్తున్నాను. (రెండుసార్లు పలుకుతారు)

**4. హయ్యా అలస్సలా** ఆరాధనకు త్వరపడి రండి (రెండుసార్లు )

**5. హయ్యా అలల్ ఫలా** సాఫల్యం వైపునకు త్వరపడి రండి (రెండుసార్లు)

**6. అల్లాహ్ అక్బర్** అల్లాహ్ అత్యున్నతుడు (రెండుసార్లు )

7. **లా యిలాహ ఇల్లల్లాహ్** ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేదు (ఒకేసారి పలుకుతారు)

ప్రాత:సమయం ప్రార్థన అంటే ఫజర్ నమాజు అజాన్‌లో **హయ్యా అలల్ ఫలా** తర్వాత మరో రెండు వాక్యాలు అదనంగా పలుకుతారు. ఆ వాక్యాలు : **అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్** : నిద్ర కన్నా ప్రార్థన ఉత్తమమైనది (రెండుసార్లు)

ఇదే ప్రార్థనాపిలుపు, ఏమాత్రం మార్పు లేని ప్రార్థనా పిలుపు, దేవుని ఔన్నత్యాన్ని కొనియాడే ప్రార్థనాపిలుపు ముస్లిమ్ విశ్వాసాన్ని చాటి చెబుతుంది.

"ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేదని, ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను." అంటే ముస్లిమ్ మౌలిక విశ్వాసాన్ని ప్రకటిస్తూ ప్రార్థనకు ఆహ్వానించే, ఇహపర లోకాల సాఫల్యం దిశగా ఆహ్వానించే ఈ అజాన్ దాదాపు గత పదిహేను శతాబ్దాలుగా ప్రపంచంలో ముస్లిములు నివసించే ప్రతి ప్రాంతంలోను ప్రతిధ్వనిస్తుంది. విభిన్న మాండలికాలు, భిన్న యాసలు, వివిధ స్వరాల్లో ఎన్ని తేడాలున్నా, లయభేదాలున్నా ఒక అద్భుతమైన సంగీతం ఇందులో పలుకుతంది. ఇది గేయాత్మకంగా దేవుని స్తుతిస్తూ ప్రజలను ఆధ్యాత్మికత వైపునకు పిలిచే ఆహ్వానం.

ప్రాత:సమయాన ఇది నిద్రలేపే పిలుపుగాను, పొద్దంతా కష్టపడిన తర్వాత సాయంత్రం సాంత్వన కలిగించే పిలుపుగాను, రాత్రి నిద్రపోయే ముందు ప్రశాంతతను ప్రసాదించే పిలుపుగాను ఇది వినబడుతుంది. అజాన్ జీవనవాస్తవాన్ని గుర్తు చేస్తుంది. అల్లాహ్, దేవుడు ఒకే ఒక్కడని, ప్రజలు రోజువారి పనుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ, మధ్య మధ్యలో ఆధ్యాత్మికతను పునశ్చరించుకుంటూ ఒకే ఒక్క దేవుని స్మరించుకుని, ఆవిధంగా పునరుత్తేజం పొంది తమ తమ విధిబాధ్యతల నిర్వహణలో మళ్ళీ నిమగ్నం కావాలన్నది దేవుని అభిమతమని అజాన్ రోజు గుర్తు చేస్తూ ఉంటుంది.

# ముస్లిములు కాబాగృహాన్ని ఆరాధిస్తారా ?

మక్కాలోని హరమ్ మస్జిదు ప్రపంచంలో కేంద్ర మస్జిదు. దీన్ని కాబాగృహం అంటారు. ఇది ఒక చతుర్భుజాకార కట్టడం. కాబాగృహం అభయ ప్రదేశం. ఇక్కడ ఎవరూ ఏ ప్రాణినీ హతమార్చరాదు. ఇక్కడ ఒక ఈగను, ఒక దోమను కూడా చేత్తో చరిచి చంపడం నిషిద్ధం. ఒకవేళ ఎవరైనా తన తండ్రి హంతకుడిని ఇక్కడ చూసినా ఆ హంతకుడిని చంపడానికి, లేదా అతనిపై దాడి చేసి గాయపరచడానికి ప్రయత్నించరాదు. హరమ్ మస్జిదులో ప్రవేశించిన తర్వాత వాదులాటలకు, వాగ్వివాదాలకు, వాగ్యుద్ధాలకు పూనుకోరాదు.

సాధారణంగా ముస్లిమేతరుల నుంచి ఒక ప్రశ్న ఎదురవుతూ ఉంటుంది. ముస్లిములు తమ ప్రార్థనల్లో కాబాగృహానికి సాష్టాంగపడుతుంటారు, కాబాగృహాన్ని ఆరాధిస్తుంటారు, అలా ఎందుకు చేస్తారన్నది ఆ ప్రశ్న.

ఇది ఒక అపోహ. ఈ ప్రశ్నకు దివ్యఖుర్‌ఆన్ స్వయంగా జవాబిస్తోంది.

> "ప్రవక్తా! నీవు మాటిమాటికి నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్‌జిదె హరామ్' వైపునకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నా సరే, ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజు చెయ్యండి."
> దివ్యఖుర్‌ఆన్ (2: 144)

## 1. ఇస్లామ్ సమైక్యతను ఇష్టపడుతుంది

కాబాగృహానికి అభిముఖంగా నిలబడి ప్రార్థించాలన్న ఆదేశమే లేనట్లయితే ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ముస్లిములు ఎవరిష్టం వచ్చిన దిశలో వారు నిలబడి ప్రార్థించేవారు. ముస్లిముల్లో సమైక్యతను పెంపొందించడానికి, ఒకే దేవుని ఆరాధనల ద్వారా సమైక్యతాభావాన్ని

ప్రోత్సహించడానికి, ముస్లిములు వారెక్కడున్నా సరే కాబాగృహానికి అభిముఖంగా నిలబడి ప్రార్థించాలని ఆదేశించడం జరిగింది. కాబాగృహానికి పశ్చిమ దిశన నివసించే ముస్లిములు తూర్పుదిక్కుగా నిలబడి ప్రార్థిస్తారు. కాబాగృహానికి తూర్పుదిక్కుగా ఉన్న ముస్లిములు పశ్చిమ దిక్కుగా నిలబడి ప్రార్థిస్తారు. ఎవరన్నా రోదసి నుంచి ముస్లిముల ప్రార్థనలను చూస్తే వారంతా మక్కాలోని కాబాగృహం చుట్టూ వలయాలుగా నిలబడి ఉన్నట్లు కనబడుతుంది.

## 2. ఒకే దేవుడి ఆరాధనకు చిహ్నంగా కాబా ప్రదక్షిణ

మక్కాలోని మస్జిదె హరామ్‌కు వెళ్ళినప్పుడు ముస్లిములు కాబాగృహం ప్రదక్షిణ చేస్తారు. దీన్ని తవాఫ్ అంటారు. ఈ ఆచరణ దేవుడు ఒక్కడే అన్న విశ్వాసానికి ప్రతీక. ఏకదైవారాధనకు చిహ్నమిది. ప్రతి వలయానికి ఒకే కేంద్రం ఉన్నట్లు యావత్తు విశ్వానికి దేవుడొక్కడే ఆయనే ఆరాధనలకు అర్హుడు.

## 3. కాబాగృహంపై నిలబడి అజాన్ చెప్పేవారు

ప్రవక్త ముహమ్మద్ కాలంలో అజాన్ చెప్పడానికి కాబాగృహం పైకెక్కి అజాన్ బిగ్గరగా అందరికీ వినబడేలా పలికేవారు. దీన్ని బట్టి ప్రవక్త ముహమ్మద్ కాని, ఆయన అనుచరులు కాని, ముస్లిములెవ్వరు కాని కాబాగృహాన్ని ఆరాధించలేదని తెలుస్తోంది. ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు కాబాగృహానికి అభిముఖంగా నిలబడి ప్రార్థించేవారు.

# నల్లరాయి

## హ(జల్ అస్వద్

## నల్లరాయి (ప్రాముఖ్యమేమిటి ? ముస్లిములు ఈ నల్లరాయిని ఎందుకు ముద్దాడుతారు ?

కాబాగృహానికి తూర్పుమూలన ఉంది ఈ నల్లరాయి. ఇది ఇస్లామీయ పవిత్రచిహ్నంగా ముస్లిములు భావిస్తారు. ముస్లిమ్ సంప్రదాయాల ప్రకారం ఈ నల్లరాయి ఆదమ్, హవ్వాల కాలం నాటిది. ఈ నల్లరాయి స్వర్గం నుంచి వచ్చిందని, దైవగృహం అంటే కాబాగృహం ఎక్కడ నిర్మించాలో ఆదమ్, హవ్వాలకు సూచించడానికి ఈ నల్లరాయి వచ్చిందని నమ్ముతారు.

మరో ఇస్లామీయ సంప్రదాయం ప్రకారం కాబాగృహంలోని ఈ నల్లరాయి ప్రాముఖ్యం ఏమిటంటే, ప్రవక్త ఇబ్రాహీమ్ (ఆయనపై శాంతి కలుగుగాక), ప్రవక్త ఇస్మాయీల్ (ఆయనపై శాంతి కలుగుగాక)లు నిర్మించిన మూలకట్టడంలో మిగిలిన ఒకే ఒక్క రాయి ఈ నల్లరాయి. ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక) రాకకు ముందు చాలా సార్లు కాబాగృహం శిథిలమైంది, మళ్ళీ కట్టడం జరిగింది. ప్రవక్త ఇబ్రాహీమ్, ప్రవక్త ఇస్మాయీల్‌ల కాలం తర్వాత అనేక ప్రకృతి విపత్తులను తట్టుకుని, అనేకసార్లు కాబాగృహం శిథిలమైన తర్వాత కూడా మిగిలిన ఒకే ఒక్క రాయి ఈ నల్లరాయి.

ప్రవక్త ముహమ్మద్ మక్కా నుంచి ప్రవాసులైన చాలా సంవత్సరాల తర్వాత హజ్‌యాత్ర చేసినప్పుడు ఆయన నల్లరాయిని ముద్దాడి అక్కడి నుంచి కాబాగృహం ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రవక్త ముహమ్మద్ ఏకదైవారాధనా ధర్మాన్ని ప్రచారం చేస్తున్నందువల్ల తాను ఎంతో ప్రేమించే మక్కా నగరానికి దూరం కావలసి వచ్చింది. ఆయన మదీనా నగరానికి ప్రవాసం వెళ్ళి చాలా కాలం తర్వాత మళ్ళీ తన నగరం మక్కాకు హజ్‌యాత్రకు వచ్చిన ఉద్వేగభరితమైన సమయం అది.

రెండవ ఖలీఫా ఉమర్ ఈ నల్లరాయి గురించి ఎలాంటి అపోహలు లేకుండా చేశారు. ఆయన హజ్‌యాత్రకు నాయకత్వం వహించినప్పుడు ఆయన ప్రదక్షిణలు ప్రారంభించే ముందు నల్లరాయిని ముద్దాడి "నాకు తెలుసు నువ్వు ఒక రాయి తప్ప మరేమీ కాదు, నువ్వు ఎవరికీ ఎలాం ప్రయోజనమూ కలిగించలేవు, ఎలాంటి హానీ చేయలేవు. ప్రవక్త నిన్ను ముద్దాడడం నేను చూసి ఉండకపోతే, నేను ఎన్నటికీ నిన్ను ముద్దాడేవాడిని కాదు." అని పలికారు.

# ముస్లిములు ఈ నల్లరాతిని ఆరాధిస్తారా ?

ఈ నల్లరాయి గురించి ఉన్న అనేక అపార్థాల దృష్ట్యా దీని గురించి కాస్త వివరంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఇది ఆకాశం నుంచి పడిన ఉల్కాశకలం కానే కాదు. ఇది ఒక నల్లరాయి మాత్రమే. కాబాగృహం ప్రదక్షిణ ఎక్కడి నుంచి ప్రారంభించాలన్నది సూచించడం తప్ప ఈ నల్లరాయికి మరో ప్రాముఖ్యం లేదు. ఈ రాయి రంగు దృష్టా కట్టడంలో ప్రత్యేకంగా కనబడుతుంది. ముఖ్యమైన విషయమేమంటే, ఈ నల్లరాయిని ముస్లిములు ఆరాధించడం లేదు. ఈ నల్లరాయి ఉన్న దిశగా ముస్లిములు సాష్టాంగపడడమూ జరగడం లేదు. కాబాగృహానికి అభిముఖంగా అంటే కాబాగృహంలోని ప్రతి రాయికి అభిముఖంగా నిలబడి ముస్లిములు ప్రార్థిస్తారు, సాష్టాంగపడతారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ముస్లిములు కాబాగృహానికి అభిముఖంగా నిలబడుతున్నప్పుడు చాలా మంది నల్లరాయి ఉన్న దిశ గురించి ఏమాత్రమూ పట్టించుకోరు. ఇక్కడ మరో ముఖ్య విషయం గుర్తుచేసుకోవలసి ఉంది. అదేమంటే, ఖరామితా మక్కాపై దాడి చేసినప్పుడు ఈ నల్లరాయిని కూడా యుద్ధసొత్తుగా దోచుకుపోయాడు. ఈ నల్లరాయి అక్కడ చాలా కాలం ఉంది. ఈ నల్లరాయి లేకపోయినా ముస్లిములు కాబాగృహం దిశగానే నిలబడి ప్రార్థనలు చేశారు. ఖరామితా నల్లరాయిని దాచి ఉంచిన ప్రదేశం (ఒమ్మాన్‌లో ఉంది) దిశగా నిలబడి ప్రార్థించలేదు. నిజానికి కాబాగృహం కట్టడం కూడా ఈ విషయంలో ముఖ్యమైనది కాదు. ఉదాహరణకు, కాబాగృహంలో కొత్తనిర్మాణాలు, మరమ్మత్తులు జరుగుతున్నా ముస్లిములు కాబాగృహం దిశగానే నిలబడి ప్రార్థిస్తారు. అక్కడ కాబా ఉన్నా లేకపోయినా, నల్లరాయి ఉన్నా లేకపోయినా అంత ముఖ్యం కాదు. ఇంతకు ముందు చెప్పినట్లు ఈ నల్లరాయి ఉపయోగం ఒక్కటే, కాబా ప్రదక్షిణ ఎక్కడి నుంచి ప్రారంభించాలో తెలియజేసే ప్రారంభస్థానంగా మాత్రమే ఇది ఉపయోగపడుతుంది. అంతకు మించిన ప్రాముఖ్యం మరేదీ లేదు.

# మక్కాలోకి ముస్లిమేతరులను ఎందుకు అనుమతించరు ?

ఇస్లామీయ పుణ్యక్షేత్రాలయిన మక్కా మదీనాల్లోకి ముస్లిమేతరులను అనుమతించరని చాలా మంది విమర్శించడం కూడా వినబడుతుంటుంది. పవిత్రనగరాలైన మక్కా, మదీనాల్లో చట్టబద్ధంగా ముస్లిమేతరుల ప్రవేశానికి అనుమతి లేదన్నది నిజమే. ఈ నిషేధానికి హేతుబద్ధమైన కారణాలున్నాయన్నది క్రింది వివరాలు పరిశీలిస్తే అర్థమవుతుంది.

మక్కా మదీనాలు ఇస్లామీయ పవిత్ర నగరాలు. ముస్లిములు అక్కడికి ఆరాధన కోసం వెళతారు. కేవలం సందర్శించడానికి, వినోదానికి, సరదాగా గడపడానికి అక్కడికి ఎవ్వరూ వెళ్ళరు. ఆ నగరాల పట్ల నిబద్ధతతో ఆరాధనల్లో కాలం వెళ్ళబుచ్చేవారు కేవలం ఇస్లామీయ విశ్వాసం ఉన్నవారే కాబట్టి వారికి మాత్రమే అక్కడ అనుమతి ఉంది. ఇతర మతధర్మాలకు సంబంధించిన పుణ్యక్షేత్రాల్లోను ఇలాంటి ఆంక్షలున్నాయి. ఎవరైనా తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్ర ప్రాంతంలోకి అడుగుపెట్టాలంటే ఆ వ్యక్తి హిందూమతాన్ని విశ్వసిస్తున్నట్లు ప్రకటించాలి. హైందవేతరులకు అక్కడ ప్రవేశం లేదు. ఎందుకంటే ఆ మందిరం ఏదో సరదాగా సందర్శించడానికి, వినోదం కోసం చూసి వెళ్ళడానికి ఉద్దేశించింది కాదు కాబట్టి.

అలాగే చాలా మందిరాల్లో దళితులకు ప్రవేశం లేదు. మహిళలకు ప్రవేశం లేని మందిరాలు ఉన్నాయి. మాంసాహారులపై ఆంక్షలున్న మందిరాలున్నాయి.

నిజానికి దేశంలో ప్రజలందరూ సమానులే. కాని దేశంలో ప్రతిచోటికి అందరూ వెళ్ళలేరు. కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలున్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో డిఫెన్స్ సిబ్బంది తప్ప మరెవ్వరూ వెళ్ళలేరు. అలాగే న్యూక్లియర్ రియాక్టర్లు, ముఖ్యమైన ప్రయోగాలు జరుగుతున్న లేబరెటరీలు, ఇంటిలిజెన్స్ సంస్థల ప్రధానకార్యాలయాలు తదితర ప్రాంతాల్లో

సాధారణ ప్రజలు ప్రవేశించలేరు. అక్కడికి వెళ్ళవలసిన నిజమైన అవసరం ఉన్నవారు మాత్రమే ముందస్తుగా అధికారుల నుంచి తగిన అనుమతులు పొంది అక్కడికి వెళ్ళగలరు. ఒక కంటోన్మెంట్ ఏరియాలోకి ప్రవేశించే అనుమతి ఎందుకు లేదని సాధారణ పౌరులు అభ్యంతర పెట్టడం అహేతుకం. అదేవిధంగా, మక్కా మదీనా వంటి ఆరాధనాలయాల్లోకి, కేవలం ముస్లిమ్ ఆరాధనకు మాత్రమే ఉద్దేశించిన ప్రదేశాల్లోకి మమ్మల్ని ఎందుకు అనుమతించరని ముస్లిమేతరులు ప్రశ్నించడం కూడా అహేతుకమే అవుతుంది.

ప్రతిదేశం విదేశీయులను అనుమతించే విషయంలో కొన్ని నిబంధనలు విధిస్తుంది. కొన్ని నియమాలు విధిస్తుంది. విదేశీయులు ఆ నియమ నిబంధనలను పాటిస్తానికి ఒప్పుకుంటేనే వీసా జారీ చేస్తారు. అదేవిధంగా సౌదీ అరేబియా దేశం మత విశ్వాసాన్ని ధృవీకరించిన తర్వాత మాత్రమే ఈ ప్రాంతాల్లోకి ప్రవేశించే అనుమతి ఇస్తుంది. ఈ రెండు ప్రదేశాల్లో ముస్లిమేతరులకు అనుమతి లేకపోయినా సౌదీ లోని ఇదర నగరాలకు ఎవరైనా టూరిస్టులుగా వెళ్ళవచ్చు, ఉద్యోగాలకు వెళ్ళవచ్చు, వాణిజ్యం చేయవచ్చు.

# దర్గాల సందర్శన

కొందరు ముస్లిములు దర్గాలను, సమాధులను సందర్శిస్తుంటారు. ఈ చేష్టలకు ఇస్లామ్‌కు సంబంధం లేదు. ఇస్లామ్ స్వచ్ఛమైన ఏకదైవారాధక ధర్మం. ఒకే ఒక్క అత్యున్నతుడైన దేవుడిని మాత్రమే ఆరాధించాలని బోధించే ధర్మం. ఇస్లామీయ విశ్వాసంలో ఈ పెడధోరణి దక్షిణాసియాలో ఎక్కువగా చోటు చేసుకుంది. ఇక్కడ సూఫీలు, వలీలు, దర్వేషుల సమాధులపై దర్గాలు లేచాయి. ఈ సూఫీలు, దర్వేషులు తమ కాలంలో లక్షలాది ప్రజల ప్రేమాభిమానాలు చూరగొన్న పుణ్యపురుషులు. వారి సేవాదృక్పథం వల్ల ప్రజలు వారిని ప్రేమించేవారు. అభిమానించేవారు. ఈ సూఫీలు ప్రేమ, సౌహార్దతలను బోధించారు. వారు నిస్వార్థంగా జీవించారు. ప్రజల ప్రేమాభిమానాలు సంపాదించుకున్నారు. కాని కాలక్రమేణా ఈ ప్రేమాభిమానాలు శృతిమించి ఈ సూఫీలకు దైవికహోదా కట్టబెట్టే స్థాయికి చేరుకున్నాయి. చివరకు ఒకవిధమైన ఆరాధనగా ఇది మారిపోయింది. ఆ విధంగా మరణించిన ఆ పుణ్యాత్ములను మహిమాన్వితులుగా మార్చేయడం జరిగింది. వారి గురించి కథలు కథలుగా చెప్పుకోవడం మొదలైంది. వారికి మానవాతీత శక్తులున్నాయని, సాధారణ ప్రజలకు సాధ్యం కాని ఘనకార్యాలు వారు సాధించారని, వారికి ఆగ్రహానుగ్రహ శక్తులున్నాయన్న కథలు ప్రచారం పొందాయి. స్వార్థశక్తులు ఈ ప్రచారాన్ని వాడుకుని లాభపడే ప్రయత్నాలు ప్రారంభించాయి. సూఫీలు, దర్వేషులకు దాదాపు దైవత్వం కట్టబెట్టి స్వంత ప్రయోజనాలు సాధించుకోవడం ప్రారంభించారు. చాలా సరళమైన ఇస్లామీయ విశ్వాసంలోకి ఈ వ్యవహారాలన్నీ చొచ్చుకువచ్చాయి. స్వచ్ఛమైన ధార్మికవిశ్వాసంలో కాలుష్యాలు చోటు చేసుకున్నాయి. నేడు సమాధుల ఆరాధన, దర్గాల సందర్శన ఉపఖండానికి సంబంధించినంత వరకు సాంస్కృతిక ఇస్లామ్‌లో భాగంగా మారిపోయింది. నిజానికి ఇస్లామీయ విశ్వాసంలో దీనికి ఎలాంటి పాత్ర లేదు.

సమాధులపై దర్గాలు కట్టాలని, దీపాలతో అలంకరించాలని, అగరొత్తులు వెలిగించాలని, చాదర్లు సమర్పించి ఉర్సు ఉత్సవాలు (వర్ధంతులు) నిర్వహించాలని, మర్సియా, ఖవ్వాలీల రూపంలో సంగీతసమారోహాలు నిర్వహించాలని ఏ ఒక్క ప్రవక్త ఎన్నడూ చెప్పలేదు. ఇస్లామ్ ఇలాంటి ఆచరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇవన్నీ పెడధోరణులుగా, ధర్మభ్రష్ట ఆచరణలుగా ప్రకటిస్తుంది.

ప్రవక్త ముహమ్మద్ ఇలా చెప్పారు : "తమ ప్రవక్తల సమాధులను ఆరాధనాస్థలాలుగా మార్చిన వారు నాశనమగుగాక. నా సమాధిని ఆరాధనాస్థలంగా మార్చవద్దు."

# దర్గా వేరు మస్జిదు వేరు

ఇస్లామ్‌లో మస్జిదు ఆరాధనాప్రదేశం. ముస్లిములు రోజుకు ఐదుపూటలు నమాజు చేయడానికి అక్కడ సమావేశమవుతారు. దర్గాలంటే మౌలికంగా సూఫీలు, దర్వేషుల సమాధులు. ఈ సూఫీలు, దర్వేషులు సాధారణ ప్రజల ప్రేమాభిమానాలు చూరగొన్న పుణ్యపురుషులు. వారి జీవితకాలంలో సేవాదృక్పథంతో ప్రజల మన్ననలు పొందినవారు. ఈ సూఫీలు ప్రచారం చేసిన ప్రేమసందేశం, వారి ప్రశాంతచిత్తం, ప్రజాసేవ, ప్రజల పట్ల ప్రేమాభిమానాల కారణంగా ప్రజలు వారిపట్ల ఆకర్షితులయ్యారు. వారు మరణించిన తర్వాత ఈ సూఫీల శిష్యులు, అనుచరులు వారి భక్తులుగా మారిపోయారు. వారి సమాధులను పెద్ద పెద్ద కట్టడాలుగా మార్చేశారు. వాటిని దర్గాలుగా పిలువడం ప్రారంభమయ్యింది. ఈ సూఫీలు మానవాతీత శక్తులు, మహిమలు, మహత్యాలు ప్రదర్శించారన్న కథలు ప్రచారంలోకి వచ్చాయి. దీర్ఘకాలిక రోగాలను కూడా మంత్రం వేసినట్టు నయం చేసేవారన్న కథలు ప్రాచుర్యం పొందాయి.

ఇలాంటి దర్గాలకు వెళితే రోగాలు తగ్గుతాయని కొందరు ప్రచారం మొదలు పెట్టారు. ఈ విధంగా దర్గాలు పుణ్యక్షేత్రాలుగా మారిపోయాయి. ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (క్రీ.శ 1141 - 1230) దర్గా అజ్మీరులో ఉంది. ఇది భారతదేశంలో ప్రముఖమైన దర్గాల్లో ఒకటి. ఢిల్లీలోని ఖాజా భక్తియార్ కాకి దర్గా, పంజాబ్‌లోని బాబా ఫరీదుద్దీన్ గంజ్ షక్కర్ దర్గా, ఢిల్లీలోని నిజాముద్దీన్ ఔలియా దర్గా, గుల్‌బర్గాలోని ఖాజా బందే నవాజ్ దర్గా, హైదరాబాద్‌లోని యూసుఫైన్ దర్గాలు భారతదేశంలోని కొన్ని ప్రముఖ దర్గాలు. ఈ పుణ్యపురుషులు తమ జీవితకాలాల్లో శాంతి ప్రేమలను ప్రచారం చేశారు. వారి సమాధులు దర్గాలుగా మారిపోయాయి. భారీగా ప్రజలను ఆకర్షించే కేంద్రాలయ్యాయి. ఇక్కడ ముస్లిములే కాదు అన్ని ధర్మాల వారు వస్తారు. నిజానికి ముస్లిమేతర సోదరుల సంఖ్య ముస్లిముల కన్నా ఎక్కువగా ఉంటుంది. నిజానికి మౌలిక ఇస్లామీయ విశ్వాసాల ప్రకారం ఈ ఆచరణలకు ఎలాంటి అవకాశమూ లేకపోయినా, ప్రధాన స్రవంతి ఇస్లామ్‌లో ఈ ఆచరణలు ఆమోదయోగ్యం కాకపోయినప్పటికీ ఈ దర్గాల వద్ద ఇస్లామీయ వాస్తుకళ (గుమ్మటాలు, మినారులు), ఉర్దూలో కవులు కళాకారులు సంగీతవాయిద్యాలతో ఆ సూఫీలను స్తుతిస్తూ ఖవ్వాలీలు పాడడం వగైరా ఉంటాయి కాబట్టి వీటిని ఇస్లామీయ సంస్కృతిలో భాగాలుగా అభివర్ణించడం జరుగుతోంది.

సమాధుల ఆరాధన ఇస్లామ్‌లో ఆమోదయోగ్యమైనది కాదు, ఈ చేష్టలను ఇస్లామ్ నివారించింది, తీవ్రంగా అభిశంసించింది. ఎందుకంటే ఇలా చేయడం నిజానికి దేవునికి భాగస్వాములను కల్పించడమే అవుతుంది. ఇది ఒకవిధమైన బహుదైవారాధనే. ఇస్లామీయ సిద్ధాంతం స్వచ్ఛమైన ఏకదైవారాధక సిద్ధాంతం. ఇందులో ఎలాంటి కాలుష్యాలకు తావులేదు. ఇస్లామ్ ఈ విషయంలో స్పష్టమైన నిర్వచనాలు ఇచ్చింది. దైవత్వం, ధర్మపరాయణత్వం ఈ రెంటి మధ్య ఖచ్చితమైన తారతమ్యం ఉంది. ఈ రెండు ఒకటి కాదు. చివరకు ప్రవక్తలు కూడా ఆరాధనకు యోగ్యులు కాదు. ప్రవక్తలు స్వయంగా తాము మానవమాత్రులమేనని ప్రకటించారు. తాము కూడా మామూలు మనుష్యులమేనని, తమకు కూడా మావ సహజ బలహీనతలు ఉన్నాయని తెలిపారు. దివ్యఖుర్ఆన్‌లోని మొదటి అధ్యాయం అల్ ఫాతిహా స్వయంగా ముస్లిములు ఎలా ప్రార్థించాలో నేర్పింది. అల్ ఫాతిహాలో నేర్పిన ప్రార్థనా పలుకులు ఇవి :

"మేము నిన్నే ఆరాధిస్తాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము" దివ్యఖుర్ఆన్ (1:4)

కాబట్టి ఈ విషయంలో ఎలాంటి అయోమయమూ లేదు.

మరో ముఖ్యమైన విషయమేమంటు, ఇస్లామీయ సిద్ధాంతం మనిషి ఎలాంటి మధ్యవర్తులు లేకుండా తానే స్వయంగా దేవునితో సంబంధం కలిగి ఉంటాడు. మనిషి తానే దేవుని ప్రార్థిస్తాడు. ఎలాంటి మధ్యవర్తి, సిఫారసుదారుని అవసరం లేదు. మనిషికి, దేవునికి మధ్య ఎలాంటి దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేదు. కాని సమాధులను ఆరాధించడం వెనుక మనిషికి దేవునికి మధ్య ఆ సమాధిలో ఉన్న పుణ్యపురుషుడిని మధ్యవర్తిగా నిలబెట్టే ప్రయత్నం ఉంది. ఇలాంటి చేష్టలను ఇస్లామ్ ఆమోదించదు. నిజానికి బతికున్న కాలంలోనే ప్రవక్తలు కాని, ఈ పుణ్యపురుషులు కాని దేవునికి మనిషికి మధ్య మధ్యవర్తులుగా నిలబడడం సాధ్యం కానప్పుడు చనిపోయిన తర్వాత మధ్యవర్తిత్వం ఎలా సాధ్యం.

ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది :

"కాని (ప్రవక్తా) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు." దివ్యఖుర్ఆన్ (35:22)

అందువల్లనే దర్గాలు ఆరాధనాస్థలాలు కాదు. ఆరాధనాస్థలాల యోగ్యత వాటికి లేదు. కొందరు ఈ సమాధులకు పవిత్రత ఆపాదించినప్పటికీ మౌలిక ఇస్లామీయ సిద్ధాంతంపై దాని ప్రభావం ఏమాత్రం ఉండదు.

# మదరసాలు

భారతదేశంలో కొన్ని స్వార్థ శక్తులు, మతతత్వ శక్తులు, వాటికి తోడు పక్షపాతంతో వ్యవహరించే మీడియాలోని కొందరు రాజకీయ దురుద్దేశ్యాలతో మదరసాలపై విషప్రచారం సాగిస్తున్నారు. మదరసాల గురించి ఇలా మాట్లాడేవారికి చాలా మందికి అస్సలు మదరస వ్యవస్థ గురించి ఎలాంటి పరిజ్ఞానమూ లేదు. మదరసాల్లో ఏం బోధిస్తారన్నది కూడా వీరికి తెలియదు. ఇవి ఇస్లామీయ సంస్థలు కాబట్టి ఇక్కడ జిహాద్ గురించి, యుద్ధం గురించి బోధిస్తారన్న నిర్ణయానికి వచ్చేస్తున్నారు.

ఇస్లామ్ ప్రారంభదశలోనే భారతదేశంలోకి కూడా ప్రవేశించింది. కొందరి అభిప్రాయం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) జీవితకాలంలోనే కేరళ ద్వారా ఇస్లామ్ ఇక్కడ అడుగుపెట్టింది. ఆ తర్వాత ఉత్తర భారతదేశంలోని సింధ్ ద్వారా ఇస్లామ్ ఇక్కడ ప్రవేశించింది. ఉత్తర, దక్షిణ భారతాల్లో అనేకమంది ఇస్లామ్ స్వీకరించారు. కాబట్టి ప్రారంభకాలం నుంచి ధార్మిక విద్యాజ్ఞానాలు బోధించడానికి, ధార్మిక అవగాహన ఉన్న ధర్మపండితులను (ఉలమాలను) తయారు చేసే మదరసా వ్యవస్థ అవసరమయ్యింది. ఈ ఉలమాలు ఇతరులకు ధర్మవిద్య బోధించగలరు, ప్రార్థనలు, ఇతర ధార్మిక ఆచరణల విషయంలో ప్రజలకు సహాయపడగలరు కాబట్టి మదరరసాలను స్థాపించవలసి వచ్చింది.

మదరస అన్న పదానికి అర్థం అధ్యయనం జరిగే ప్రదేశమని అర్థం. బ్రిటీష్ అమెరికన్ ఇంగ్లీషులో స్కూలు అన్న పదం ఎలాంటిదో అరబీలో మదరస అన్న పదం అలాంటిది. తెలుగులో పాఠశాల. మదరసాల్లో ప్రాథమిక స్కూళ్ళు, ఉన్నత స్కూళ్ళు, యూనివర్శిటీ స్థాయి విద్యాలయాలు ఉన్నాయి. ఇస్లామీయ దేశాల్లో ఉన్నత విద్యాసంస్థలను కూడా మదరసాలనే అంటారు. కోల్‌కతాలో మదరసా ఆలియా ఉంది. అంటే అత్యున్నత అధ్యయనా కేంద్రమని అర్థం. కోల్‌కతాలోని మదరసా ఆలియాకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఇప్పుడు యూనివర్శిటీ హోదా ఇచ్చింది. ఈ మదరసాల్లో అన్ని మతవర్గాల విద్యార్థులకు అవకాశం ఉందన్నది గమనించవలసిన విషయం. రాజా రామమోహన్ రాయ్ మదరసా ఆలియాలోనే చదువుకున్నారు. ఆయనకు సంస్కృతంలోను, హిందూతత్వశాస్త్రంలోను ఎంత ప్రావీణ్యం ఉండేదో పర్షియన్; అరబీ భాషల్లోను అంతే ప్రావీణ్యం ఉండేది.

చాలా చోట్ల మదరసాలు నిజానికి ధార్మిక విద్యావసరాలకే కాదు, సెక్యులర్ విద్యావసరాలకు కూడా ఉపయోగపడ్డాయి. ఇది ధార్మిక, ప్రాపంచిక జీవనానికి ఎంతో అవసరం.

నేడు దాదాపు 20,000 మదరసాలు ఏటా 15 లక్షల మంది విద్యార్థులకు విద్యాదానం చేస్తున్నాయి. సచర్ కమిటీ రిపోర్టు 2006 ప్రకారం ముస్లిమ్ విద్యార్థులు దాదాపు 3% మంది మదరసాలకు వెళుతున్నారు. గమనించవలసిన ముఖ్యమైన విషయమేమంటే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ముస్లిమ్ విద్యార్థులకు, కొన్ని చోట్ల పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద ముస్లిమ్ విద్యార్థులకు మదరసాలు ముఖ్యమైన విద్యాకేంద్రాలు. భారతదేశంలోని చాలా మంది ముస్లిములు నిజానికి అధికసంఖ్యలో ముస్లిములు నిరుపేదలు, నిరక్షరాస్యులు. ఈ నిరుపేద ముస్లిములకు తమ పిల్లలను మంచి స్కూళ్ళకు పంపాలన్న అభిలాష ఉన్నప్పటికీ ఆర్థికంగా అంత స్తోమత లేదు.

అంతేకాదు ముస్లిములకు ధార్మిక అవసరాలు కూడా ఉన్నాయి. ధార్మిక విద్యాజ్ఞానాలు పిల్లలకు అందించే కేంద్రాలు కూడా వారికి అవసరం. మదరసాలు వారి పిల్లలకు ధార్మిక విద్యతో పాటు ఇతర శాస్త్రాలను కూడా ఉచితంగా బోధిస్తాయి. ఆహారం, హాస్టల్ సదుపాయం అందిస్తాయి. అన్నింటికి మించి వారికి సదుపాయంగా దగ్గరగా ఉంటాయి. మరో విషయమేమంటే, మదరసాలన్నింటిని ఒకే గాటన కట్టలేం. మదరసాలను వివిధ తరగతులుగా వర్గీకరించవలసిన అవసరం ఉంది. ప్రాథమిక మదరసాలను మక్తబ్‌లు అంటారు. ఇక్కడ ప్రాథమిక ధార్మిక విద్యాబోధన మాత్రమే జరుగుతుంది. ఆ తర్వాత మిడిల్ స్కూల్ స్థాయి మదరసాలున్నాయి. ఇక్కడ అరబిక్ భాష, దివ్యఖుర్ఆన్, ఖుర్ఆన్ భాష్యం, హదీసులు తదితర అంశాలు బోధించడం జరుగుతుంది. ఉన్నతస్థాయి మదరసాలను గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ కళాశాలలతో పోల్చవచ్చు. ఆ తర్వాత జామియాలుగా పిలువబడే మదరసాలను విశ్వవిద్యాలయాలుగా చెప్పవచ్చు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన జామియా మొరాక్కోలోని ఫెజ్‌లో ఉన్న ఖరావియ్యాన్ యూనివర్శిటీ. ఇది క్రీ.శ.859లో స్థాపించబడింది. ఆ తర్వాత ఈజిప్టులోని కైరోలో ఉన్న అల్ అజ్‌హర్ యూనివర్శిటీ రెండవ అత్యంత ప్రాచీన జామియా. ఇది క్రీ.శ.970లో స్థాపించబడింది. ధార్మికశాస్త్రాలతో పాటు ఇక్కడి విద్యార్థులు మీమాంస, వేదాంతం, గణితం, భౌతికశాస్త్రం, ఖగోళశాస్త్రం, సాంకేతికశాస్త్రాలను కూడా అభ్యసించేవారు..

మదరసాల ఆధునికీకరణ ఉద్యమం కూడా ఒకటి నడిచింది. చాలా మదరసాలు ఆధునికీకరణ చెందాయి.

ఇటీవల ప్రముఖ ప్రభుత్వ సంస్థ ఎన్‌సిఈఆర్‌టీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రయినింగ్) ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. అనేక రాష్ట్రాల్లో మదరసాల ఆధునికీకరణ వేగంగా నడుస్తోందని, ముఖ్యంగా కేరళ, కోల్‌కతాలో ఆధునికీకరణ చెప్పుకోదగ్గస్థాయిలో ఉందని ఆ అధ్యయనం పేర్కొంది. ఈ మదరసాల్లో జాతివ్యతిరేక కార్యకలాపాల గురించి ఆ అధ్యయనంలో ఎక్కడా కనబడలేదు.

ముస్లిములు మదరసా విద్యావ్యవస్థ పట్ల మొగ్గు చూపడానికి కారణాలు ముఖ్యంగా:

1. ముస్లిమ్ మెజారిటీ ప్రాంతాల్లో ఆధునిక స్కూళ్ళ కొరత.

2. బాలికలకు ప్రత్యేక స్కూళ్ళు లేకపోవడం, చివరకు కో ఎడ్యుకేషన్ స్కూళ్ళలో మహిళా ఉపాధ్యాయులు కూడా లేకపోవడం.

3. ఆధునిక విద్యార్జనకు అయ్యే ఖర్చు. ప్రభుత్వ స్కూళ్ళ పరిస్థితి దయానీయంగా ఉండడం.

4. ప్రభుత్వ స్కూళ్ళలో విద్యాప్రమాణాలు లేకపోవడం

5. స్కూలు పాఠ్యపుస్తకాల్లో హిందువుల పట్ల పక్షపాతం ఉందన్న నిరసన.

## మదరసా - మక్తబా

సాధారణంగా ప్రజలు మదరసాకు మక్తబాకు మధ్య తేడాను గుర్తించరు. ముస్లిములందరు పిల్లల్ని మదరసాలకు పంపుతారన్న అపోహకు ఇది కూడా కారణం. మదరసాలు క్రమబద్ధమైన విద్యాబోధన అందిస్తాయి. అది ధార్మిక విద్య కాని, ప్రాపంచిక విద్య కాని పాఠ్యప్రణాళికల ప్రకారం క్రమబద్ధమైన విద్యాబోధన ఉంటుంది. మక్తబాలు నిజానికి మహల్లాల్లో ఉండే ప్రాథమిక ధార్మిక విద్యాకేంద్రాలు. సాధారణంగా ఇవి మస్జిదులకు అనుబంధంగా ఉంటాయి. ఇక్కడ ప్రాథమిక ధార్మిక విద్యనందించడం జరుగుతుంది. సాధారణ స్కూళ్ళలో చదువుకునే ముస్లిమ్ పిల్లలు కూడా స్కూలు తర్వాత ఈ మక్తబాకు వచ్చి చదువుకుంటారు. అంటే మక్తబాలు పార్ట్‌టైంలో ధార్మికవిద్యను అందిస్తుంటాయి. మామూలుగా రెగ్యులర్ స్కూళ్ళలో చదువుకునే విద్యార్థికి ఇక్కడ ధార్మికవిద్య పొందే అవకాశం లభిస్తుంది. ఇవి సాధారణ స్కూళ్ళకు కాంప్లిమెంటరీ స్కూళ్ళని చెప్పాలి. ఈ మక్తబాలకు ముస్లిమ్ పిల్లలు వెళ్లడం ప్రతి ప్రాంతంలోను కనబడే సాధారణ దృశ్యం. ఇది చూసి ముస్లిమ్ పిల్లలందరూ మదరసాల్లోనే చదువుతున్నారన్న అభిప్రాయానికి చాలా మంది వస్తుంటారు.

# దేవుడు, దైవప్రవక్తల చిత్రాలు ఎందుకు లేవు ?

ఇతర మతధర్మాలు అనుసరించేవారికి తమ దేవుళ్ళ ప్రతిమలు లేదా చిత్రాలు ఉంటాయి. వారి పూజాస్థలాల్లో ఈ ప్రతిమలు కనబడతాయి. లేదా ఇంటిలో పవిత్రమైన చోట ఈ ప్రతిమలను, చిత్రాలను ఉంచుకుంటారు. మస్జిదుల్లో కాని, ముస్లిముల ఇళ్ళల్లో కాని ఇలా దేవుళ్ళ చిత్రాలు లేదా ప్రవక్త ముహమ్మద్ చిత్రాలు కనబడవు. ప్రతిమలు, చిత్రాలను ఇస్లామ్ ఎందుకు అనుమతించడం లేదని కొందరు ప్రశ్నిస్తుంటారు.

ప్రవక్త ముహమ్మద్ యావత్తు మానవాళికి మార్గదర్శిగా దైవం తరఫున వచ్చిన చిట్టచివరి దైవప్రవక్త. ఆయన ఇస్లామీయ విశ్వాసాన్ని బోధించారు. ఈ విశ్వాసంలోని మూడు ప్రాథమిక అంశాలేమంటే 1. ఒకే ఒక్క అత్యున్నతుడైన దేవుడిని విశ్వసించడం. 2. ప్రవక్తల పరంపరను అంటే ఆదమ్ నుంచి ప్రవక్త ముహమ్మద్ (స) వరకు వచ్చిన ప్రవక్తలందరినీ విశ్వసించడం. 3. మరణానంతర తీర్పుదినాన దేవునికి జవాబు చెప్పుకోవలసి ఉందని విశ్వసించడం.

ప్రవక్త ముహమ్మద్ ప్రజలతో స్పష్టంగా తాను మానవమాత్రుడినేనని చెప్పారు. తాను అందరి లాంటి వాడినేనని చెప్పారు. తనకు దైవత్వం ఆపాదించరాదని హెచ్చరించారు. కాబట్టి ఇస్లామ్ చాలా స్పష్టంగా దేవుడిని, దైవప్రవక్తను వేర్వేరుగా నిర్వచించింది. అందువల్లనే దైవప్రవక్తలను ఇతర ధర్మాల్లో మాదిరిగా దేవుని అవతారాలుగా పొరబడ్డం ఎన్నడూ జరగలేదు. దైవప్రవక్తలను వేరుగానే ఉంచారు. దేవుడు నిత్యుడు. ఎల్లప్పుడు ఉంటాడు. కాని ప్రవక్తలు సాధారణ మనుష్యుల మాదరిగానే మృత్యువుకు గురవుతారు. దైవప్రవక్తలు దేవుని సందేశాన్ని ప్రజలకు చేరవేసేవాళ్ళు. ప్రజలకు మార్గదర్శనాన్ని ఇచ్చేవారు. అందువల్లనే ప్రవక్త ముహమ్మద్ (స) తనకు దైవత్వం ఆపాదించరాదని హెచ్చరించారు. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ కూడా స్పష్టంగా ప్రకటించింది. ప్రవక్త ఒకరోజు మృత్యువుకు గురవుతారు కాని దేవుడు మాత్రం

ఎల్లప్పుడు ఉంటాడని చెప్పింది. దేవుడు నిద్రపోడు, కనీసం ఆయనకు కునుకు కూడా పట్టదు.

ఆ విధంగా ఇస్లామ్ ఆరాధనలకు దేవుడిని కేంద్రంగా చేసింది. ప్రార్థనలు ఆరాధనలన్నీ ఆయనే కేంద్రంగా జరుగుతాయి. ఈ దైవభావనను బలహీనపరిచే ఎలాంటి భావనకు అవకాశమూ లేదు, అనుమతీ లేదు. అందువల్లనే దేవుని ప్రతిమలను, చిత్రాలను, దైవప్రవక్త చిత్రాలను తయారు చేసే అనుమతి ఇస్లామ్‌లో లేదు. గతంలో ఇలాంటి ప్రతిమలు చిత్రాలు రూపొందించిన సమాజాలు తర్వాత విగ్రహారాధనకు పాల్పడడం అసలు దేవుని మరిచిపోవడం జరిగింది. కాబాగృహం ఏకదైవారాధనకు ప్రవక్త ఇబ్రాహీమ్, ప్రవక్త ఇస్మాయీల్ కలిసి నాలుగు వేళ సంవత్సరాల పూర్వం ఏకదైవారాధనకు నిర్మించారు. కాని ఆ కాబాగృహం కూడా ఈ ప్రతిమలు, చిత్రాల కారణంగా ఏకదైవారాధనకు దూరమయ్యింది. అనేక దేవుళ్ళు అక్కడ వెలిసారు. ఒక్కోపనికి ఒక్కో దేవుడు. ప్రవక్త ముహమ్మద్ కాలంలో కాబాగృహం మళ్ళీ ఏకదైవారాధన కేంద్రంగా పూర్వవైభవాన్ని పొందగలిగింది. ఒకే ఒక్క దేవుడి దైవత్వాన్ని ఇస్లామ్ పునస్థాపించింది. విగ్రహారాధనను కఠినంగా నిషేధించింది.

అదేవిధంగా ప్రవక్త ముహమ్మద్ ప్రతిమను కాని చిత్రాన్ని కాని రూపొందించడం పూర్తిగా నిషిద్ధం. పుణ్యపురుషులను దేవుళ్ళుగా మార్చుకునే బలహీనత మనుష్యుల్లో ఉంది. ప్రవక్త ముహమ్మద్‌ను కళ్ళారాచూసిన వారు ఆయన చిత్రాన్ని రూపొందించాలని ఉవ్విళ్ళూరవచ్చు, ఆ తర్వాత ఆ చిత్రాన్ని ఆరాధించడమూ ప్రారంభం కావచ్చు. ఆ విధంగా అసలు దేవుని మరిచిపోయే ప్రమాదం ఉంది.

అందువల్లనే ప్రపంచవ్యాప్తంగా మస్జిదుల్లో ఎలాంటి ప్రతిమలు, చిత్రపటాలు ఉండవు. ఒకే ఒక్క అత్యున్నత దేవుని ఆరాధించే కేంద్రాలవి. ఆయన్ను మాత్రమే మనసులో నింపుకునే ప్రదేశాలవి. సమస్త ప్రార్థనలు, ఆరాధనలు, వేడుకోళ్ళు అన్నీ కేవలం ఆ ఒకే ఒక్క దేవునికి మాత్రమే. చివరకు ప్రవక్త ముహమ్మద్ కూడా ఈ దైవత్వం పరిధిలోకి వచ్చే ప్రసక్తి లేదు. ఆయన వేరు, దేవుడు వేరు. ప్రవక్త ఒక మార్గదర్శి మాత్రమే. ఆయన ఆధ్యాత్మిక నాయకుడు, ఆదర్శమూర్తి, సంస్కర్త, శుభవార్తను వినిపించిని సందేశహరుడు, హెచ్చరికలు చేసిన దైవప్రవక్త మాత్రమే. ఆయన దేవుడు కాదు. ఆయన దేవునికి భాగస్వామి కూడా కాదు. దేవుడి అవతారం కానే కాదు. ఆయనకు సంబంధించిన ఎలాంటి ప్రతిమ చేయడానికి కుదరదు. ఆయన విగ్రహాలు రూపొందించడం, చిత్రాలు, పెయింటింగులు వేయడం, శిల్పాలు చెక్కడం దేనికీ అనుమతి లేదు. చిత్రాలకు, పెయింటింగులకు, ప్రతిమలకే అవకాశం లేనప్పుడు వ్యంగ్యంగా, అపహాస్యంగా కార్టూన్లు, కేరికేచర్లు వేసే ప్రసక్తే లేదు.

అందువల్లనే ప్రవక్త ముహమ్మద్ చిత్రాల గురించి తీవ్రమైన ఆందోళనలు చెలరేగాయి. ఇటీవల భారీస్థాయిలో ఆందోళనలు నిరసనలు మిన్నంటాయి. ప్రవక్త ముహమ్మద్ కార్టూన్లను ఒక డచ్ కార్టూనిస్టు వేశాడు. ఈ కార్టూన్లను డచ్ దినపత్రిక జేలాండ్ పోస్టెన్ ప్రచురించింది. ఈ చేష్ట ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టే చర్యగా ముస్లిములు భావించారు. ఇలాంటి చేష్టలను బ్లాస్ఫెమీ చట్టం క్రిందికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాశ్చాత్యదేశాల్లో జీసస్ పట్ల అమర్యాదకరంగా వ్యవహరించడాన్ని నిషేధించే చట్టాలున్నాయి. పాశ్చాత్యదేశాలు ఈ విషయంలో ద్వంద్వప్రమాణాలు పాటిస్తున్నాయి. పాశ్చాత్యదేశాల్లో జీసస్‌ను హేళన చేస్తూ రూపొందించిన అనేక నాటకాలను నిషేధించడం జరిగింది. అలా చేయడం భావప్రకటనాస్వేచ్ఛను హరించడంగా భావించలేదు. మతవిశ్వాసాల పరంగా పవిత్రపురుషులు, పవిత్రచిహ్నాలను గౌరవించడం సముచితం.

భావప్రకటనా స్వేచ్ఛ అంటే పవిత్రకు భంగం కలిగించడం కాదు. నిజానికి భావప్రకటనాస్వేచ్ఛ అశ్లీలాన్ని అనుమతించదు, అసభ్యతను, దేశద్రోహాన్ని ప్రోత్సహించడాన్ని అంగీకరించదు. అన్ని దేశాల్లోను వ్యక్తుల వ్యక్తిగత జీవితాన్ని, గౌరవమర్యాదలను కాపాడే చట్టాలున్నాయి. అలాంటప్పుడు ఒక డచ్ కార్టూనిస్టు ప్రవక్త ముహమ్మద్‌ను అవహేళన చేసే కార్టూన్లు ఎలా వేయగలడు? భావప్రకటనా స్వేచ్ఛ అతనికి ఎలా వర్తిస్తుంది?

ముస్లిమ్ ప్రపంచంలో ఎవ్వరూ ప్రవక్తల చిత్రాలు, పెయింటింగులు వేయరు. కార్టూన్ల ప్రశ్నేలేదు. జీసస్ క్రీస్తును, మేరీమాతను ఇస్లామ్ ఎంతో గౌరవిస్తుంది. ఇస్లామ్ ఇతర మతాల దేవుళ్ళను, ఆరాధ్యులను అవహేళన చేయరాదని, దూషించరాదని, అమర్యాదగా వ్యవహరించరాదని వారిస్తుంది. అలా చేయడం వల్ల వారు కూడా అదేవిధంగా వ్యవహరించడం, పరిస్థితి వివాదాస్పదం కావడం జరుగుతుందన్న హెచ్చరిక ఇస్లామ్ స్పష్టంగా చేసింది.

# ఇస్లామ్ కరవాలంతో వ్యాపించిందా ?

ప్రతి ప్రవక్త తనదైన స్వంత శైలిలో, స్వంత పద్ధతిలో సందేశ ప్రచారం చేశారు. వివిధ ప్రవక్తలు వివిధ కాలాల్లో వచ్చారు. విభిన్న ప్రజాసముదాయాల్లో పనిచేశారు. కాబట్టి ప్రతి ప్రవక్త పనిచేసిన పరిస్థితులు, సామాజిక స్థితిగతులు వేర్వేరుగా ఉన్నాయి. అందువల్ల ఒక ప్రవక్తను మరో ప్రవక్తతో పోల్చడం సముచితం కాదు. ప్రవక్త ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) ఎలాంటి యుద్ధాలు చేయలేదన్నది నిజమే. ఎందుకంటే ఆయన పనిచేసిన పరిస్థితుల్లో యుద్ధాలు చేయవలసిన అవసరం రాలేదు. కాని ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక) సత్యాన్ని కాపాడ్డానికి యుద్ధాలు చేయవలసి వచ్చింది.

ప్రవక్త ముహమ్మద్ ప్రవక్తగా నియమించబడినప్పుడు ఆయన ప్రజలను శాంతిమార్గానికి ఆహ్వానించారు. కాని ఇస్లామ్ శత్రువులు, ఖురైషు నాయకులు ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన్ను వేధింపులకు గురిచేశారు. నిరంతరం దౌర్జన్యాలకు పాల్పడ్డారు. సంవత్సరాల పాటు ప్రవక్త ఆయన అనుచరులు అణిచివేతలకు, హింసాదౌర్జన్యాలకు గురయ్యారు. వారి ఆస్తులు కబళించారు. చివరకు మక్కా నగరం వదిలి మదీనాకు తరలిపోయేలా చేశారు. మదీనాకు వలసపోయినా శత్రువులు వదల్లేదు, అక్కడ కూడా వెంటాడారు. మదీనా నుంచి వారిని బహిష్కరించాలని, లేదా పూర్తిగా తుదముట్టించాలని మదీనా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. కాని మదీనా ప్రజలు అందుకు అంగీకరించలేదు. ఆగ్రహించిన మక్కా ఖురైషులు మదీనా ప్రజలను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరికలు జారీచేశారు. మదీనాలో నాయకుడిగా ఉన్న కపటవిశ్వాసికి మక్కా ఖురైషులు ఒక లేఖరాశారు. తమ శత్రువైన ముహమ్మద్‌కు మదీనాలో ఆశ్రయం ఇచ్చారని, ఆయన్ను తుదముట్టించాలని లేకపోతే మదీనాపై దాడి చేసి సర్వనాశనం చేసేస్తామని హెచ్చరిక పంపారు. ఇది జీవన్మరణాల సమస్య. ఇస్లామీయ విశ్వాసాన్ని కాపాడుకోడానికి సమైక్యంగా ప్రతిఘటించడమో లేదా చావడమో తేల్చుకోవలసిన సమయమది. ఈ పరిస్థితుల్లో ప్రవక్త ముహమ్మద్ పోరాడాలనే నిర్ణయించుకున్నారు.

ప్రవక్త ముహమ్మద్ శత్రువులు ఈ యుద్ధాలను బలవంతంగా ప్రవక్తపై రుద్దారు. సత్యసందేశ ప్రచారాన్ని ఈ శత్రువులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. కాబట్టి ఈ యుద్ధాలను చారిత్రక నేపథ్యంలో పరిశీలించాలి.

బాధ్యతాయుతుడైన ఏ నాయకుడు కూడా యుద్ధ ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయడు. అందరికీ ఆదర్శనీయుడు, పాలకులకు, సైన్యాధ్యక్షులకు ఉదాహరణగా నిలిచిన ప్రవక్త ముహమ్మద్ యుద్ధప్రమాదాన్ని తేలిగ్గా తీసుకుంటారని భావించలేము. ప్రవక్త ముహమ్మద్ దేవుని మార్గదర్శనంతో యుద్ధరంగ నియమాలను రూపొందించారు. యుద్ధరంగానికి కూడా మానవత్వం నేర్పారు. శాంతిని ప్రోత్సహించడానికి, ప్రాణనష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నించారు.

ప్రవక్త ముహమ్మద్ కరవాలంతో ఇస్లామ్‌ను వ్యాపింపజేశారని ఇస్లామ్ శత్రువులు, పక్షపాతవైఖరి కలిగిన వాళ్ళు ఆరోపించడం వినిపిస్తుంది. యుద్ధాలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నట్లు చిత్రీకరిస్తుంటారు. నిజానికి ఆయన మదీనాలో గడిపిన పదిసంవత్సరాల వలసజీవితంలో కేవలం 95 రోజులు మాత్రమే యుద్ధరంగాల్లోను, పోరాటాల్లోను ఉన్నారు. చాలా యుద్ధాలు ఆయన కేవలం ఒక్కరోజులోనే గెలిచారు. పదిసంవత్సరాల్లో మిగిలిన రోజులు, అంటే దాదాపు 3,555 రోజులు ఆయన ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు సాధించడానికి, గిరిజన సమాజాన్ని సంస్కరించడానికి పనిచేశారు. అరబ్బు ద్వీపకల్పంలో శాంతిభద్రతలను స్థాపించారు. దుర్మార్గం, అణిచివేతలు అన్యాయాలను తుదముట్టించి మంచితనం, ధర్మం, న్యాయం, శాంతిసౌహార్ధతలు వర్ధిల్లేలా చేశారు.

ప్రవక్త ముహమ్మద్ పాల్గొన్న అన్ని యుద్ధాల్లోను కలిపి మొత్తం ప్రాణనష్టం కేవలం 1014 మంది మాత్రమే. ఇందులో ప్రవక్త సైన్యానికి వాటిల్లిన ప్రాణనష్టం కేవలం 255 మంది. శత్రువులకు వాటిల్లిన ప్రాణనష్టం 759 మంది. ఈ యుద్ధాల్లో పాల్గొన్న వారిలో చనిపోయిన వారి శాతం చూస్తే 1.5 శాతానికి మించదు. యుద్ధాలతో, హింసాత్మక పోరాటాలతో నడిచిన విప్లవాల్లో చనిపోయిన వారి సంఖ్యను ప్రవక్త ముహమ్మద్ పాల్గొన్న యుద్ధాల్లో జరిగిన ప్రాణనష్టంతో పోల్చి చూస్తే ఈ తేడా మనకు స్పష్టంగా తెలుస్తుంది. సంవత్సరాల తరబడి కొనసాగిన యుద్ధాల్లో అనేక లక్షల మంది అమాయక ప్రజలు చనిపోయారు. అలాగే వివిధ విప్లవాల్లో మరణించిన వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మరో విషయమేమంటే యుద్ధాల్లో పాల్గొన్న సైనికుల కన్నా సాధారణ పౌరుల మరణాలే ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రెండవ ప్రపంచయుద్ధంలో మరణించిన వారి సంఖ్య (సాధారణ పౌరులతో సహా), యుద్ధంలో పోరాడిన సైనికుల సంఖ్యతో పోల్చితే 517% ఉ

ంది. అంటే యుద్ధంలో పోరాడిన సైనికుల సంఖ్య కోటి ఆరు లక్షల మంది ఉంటే, చనిపోయిన వారి సంఖ్య ఐదుకోట్ల నలభైఆరు లక్షలు.

యుద్ధాలు, హింసాత్మక పోరాటాల విషయానికి వస్తే క్రయిస్తవుల రికార్డును కాని, పాశ్చాత్యుల చరిత్రను కాని ఒక్కసారి చూస్తే చాలు పాశ్చాత్య మేధావులకు ముహమ్మద్ వైపు వేలెత్తి చూపే అర్హత కూడా ఉండదు. అయితే ప్రవక్త ముహమ్మద్) జీవించిన కాలంలో, ఆ పరిస్థితుల్లో యుద్ధాలు చేయకుండా ఆయన సందేశప్రచారం, ఆయన ఉద్యమం కొనసాగే అవకాశాలు అస్సలు లేవా అన్న ప్రశ్న చాలా మంది అడగవచ్చు. ప్రవక్త ముహమ్మద్ తన సందేశ ప్రచారోద్యమాన్ని ప్రారంభించిన తొలిదినాల్లో ప్రవక్త ముహమ్మద్ ఘర్షణలు తలెత్తకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకున్నారు. నిజానికి గుప్పెడు మంది అనుచరులతో ఉన్న ముస్లిమ్ సముదాయం ఘర్షణలకు దిగే పరిస్థితి కూడా అప్పట్లో లేదు. వారికి తగిన వనరులు కూడా లేవు. కాని మదీనాకు వలసవెళ్ళిన తర్వాత సైనికంగా రక్షణచర్యలు తీసుకోవలసిన అవసరం ఎదురయ్యింది.

ఇస్లామ్‌కు ముందు కాలంలో అరేబియా సమాజం ఎలా ఉండేదో కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి. యుద్ధప్రియుల సమాజమది. దాడులు చేయడం, దోపిళ్ళకు పాల్పడడం, హింసాత్మక పోరాటాలు సర్వసాధారణంగా ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో మనుగడ కొనసాగించాలంటే ఆత్మరక్షణ కోసం పోరాడక తప్పదు. ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన వాస్తవమేమంటే, దివ్యఖుర్‌ఆన్ స్పష్టమైన నియమాలను, యుద్ధంలో మానవత్వాన్ని కాపాడే నిబంధనలను, న్యాయబద్ధమైన పోరాటానికి అవసరమైన నీతులను ప్రతిపాదించింది. ఆధునిక కాలంలోని జెనివా ఒప్పందంలోని యుద్ధనియమాలన్నీ అందులో కనబడతాయి. దీన్ని బట్టి యుద్ధం అన్నది ఆత్మరక్షణకు మాత్రమే ఉద్దేశించిందన్నది స్పష్టం అవుతుంది. సాధారణ పౌరులు, మహిళలు, పిల్లలు, వృద్ధులపై దాడులు చేయరాదన్న ఖచ్చితమైన నిబంధన ఉంది. ఆరాధనాస్థలాలు, అవి ఎవరికి సంబంధించినవి అయినా సరే, చర్చిలు, మందిరాలు, సినాగాగ్‌లు, మస్జిదులు ఏవైనా సరే వాటిని ధ్వంసం చేయడానికి వీలులేదు. జంతువులు, నీటి వనరులు, పంటలను నాశనం చేయరాదు. అంతేకాదు, శత్రువు శాంతి కోరితే ఆ ప్రతిపాదనను తక్షణం ఆమోదించాలి. శాంతి, సహనం, ఇతర మతస్తులతో సహజీవనం తదితర విషయాల్లో ముస్లిములు ఇతరుల కన్నా మిన్నగా కనబడతారు.

# ఇస్లామ్ బలప్రయోగంతో విస్తరించిందా ?

## ఈ ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం "ముమ్మాటికి కాదు"

దివ్యఖుర్ఆన్ ఇలా ప్రకటించింది.

> "ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారం కానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది." దివ్యఖుర్ఆన్ (2:256)

ఇస్లామ్ బలప్రయోగంతో, కత్తిబలంతో విస్తరించిందన్న అపవాదు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ ప్రాచుర్యం పొందింది. చరిత్ర పాఠ్యపుస్తకాలు, మీడియాలో కొన్ని పక్షపాత శక్తులు ఈ ప్రాపగాండాకు మరింత ఊతమిస్తున్నాయి. ఈ ప్రాపగాండ వెనుక రాజకీయ దురుద్దేశ్యాలున్నాయి. భారతదేశంలో మతతత్వశక్తులకు, కొన్ని రాజకీయ పార్టీలకు ఇలాంటి దుష్ప్రచారం అవసరమయ్యింది. మతపరంగా ఓట్లను చీల్చి లాభపడాలని ఈ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. విద్వేష ప్రచారానికి ఏదో ఒక సాకు కావాలి కాబట్టి చరిత్రను తవ్వి కంకాళాలను బయటకు తీస్తున్నాయి. చరిత్రను వక్రీకరించి చూపిస్తూ తమ స్వార్థ ప్రయోజనాలకు పాకులాడుతున్నాయి.

నిజానికి వీరదరూ బ్రిటీషు వలసవాద చరిత్రకారుల అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. అద్భుతమైన బహుళత్వం ఉన్న దేశంలో విభజించు పాలించు నీతిని అనుసరించి బ్రిటీషు చరిత్రకారులు రాసిన రాతలే అవి. వాస్తవాలు గమనిస్తే ముస్లిమ్ పాలకులు భారతదేశాన్ని దాదాపు 650 సంవత్సరాల కాలం పాలించారు. ఈ సుదీర్ఘకాలంలో దేశంలోని ప్రతి ఒక్క ముస్లిమేతరుడిని బలవంతంగా మతం మార్చే అవకాశం ఉంది. కాని అలా జరగలేదు. దేశంలో దాదాపు 80 శాతం ప్రజలు ముస్లిమేతరులే. ఇస్లామ్ కత్తిబలంతో విస్తరించిందన్న అపవాదును ఖండించడానికి ఈ ఒక్క వాస్తవం చాలు.

ప్రస్తుతం ప్రపంచంలో ముస్లిములు మెజారిటీగా ఉన్న దేశాలను ఒక్కసారి పరికిస్తే

మనకు కొన్ని వాస్తవాలు తెలిసివస్తాయి. నేడు ప్రపంచ జనాభా దాదాపు 700 కోట్లు. ఇందులో 170 కోట్ల మంది ముస్లిములు ఉంటారు. ఇందులో అరబ్బుల జనాభా కేవలం 22 శాతం మాత్రమే. ముస్లిములు అత్యధికంగా ఉన్న దేశం అరేబియాకు సుదూరాన, భూమండలానికి అవతలివైపున ఉన్న ఇండోనేషియా. దక్షిణాసియా దేశాల్లో దాదాపు 40 కోట్ల మంది ముస్లిములు ఉన్నారు. భారతదేశంలో 15 కోట్ల మంది ఉన్నారు. హిందూ, సంస్కృత సంప్రదాయాలు అధికంగా ఉన్న బంగ్లాదేశ్ వంటి చోట 12 కోట్ల మంది ముస్లిములు ఉన్నారు.

ముస్లిముల్లో దాదాపు 30 శాతం జనాభా ప్రపంచంలోని వివిధ ప్రజాస్వామిక దేశాల్లో మైనారిటీలుగా ఉన్నారు. భారతదేశం, అమెరికా, బ్రిటన్, యూరప్ దేశాలు, రష్యా తదితర దేశాల్లో జీవిస్తున్నారు. ఆఫ్రికాలోని అనేక దేశాల్లో ముస్లిము జనాభా ఉంది. అక్కడ ముస్లిమ్ పాలకులు ఎన్నడూ పాలించలేదు. అలాగే స్పెయిన్, ఫిలిప్పిన్స్ వంటి దేశాలు ఇంతకు ముందు ముస్లిమ్ పాలనలో ఉన్న దేశాలు. కాని అక్కడ నేడు ముస్లిముల సంఖ్య చాలా తక్కువ. ఆసక్తికరమైన విషయమేమంటే, కొన్ని అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక దేశాల్లో, అమెరికా, బ్రిటన్, స్కాండినేవియా దేశాలు, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో అత్యంత వేగంగా విస్తరిస్తున్న మతం ఇస్లామ్.

చరిత్రను పరిశీలిస్తే ఇస్లామీయ సైన్యాలు ఎన్నడూ ఇండోనేషియా, మలేషియాల్లోకి ప్రవేశించలేదు. అక్కడ ఇస్లామ్ సముద్రమార్గన ప్రవేశించింది. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలపై ప్రభావం వేసింది. ప్రజల మనస్సులు గెలుచుకుంది. ఇస్లామ్ అనవసరంగా సంస్కృతి సంప్రదాయాల శైలిని మార్చలేదు. వస్త్రధారణ, ఆహార అలవాట్లు, భాషలను మార్చలేదు.

ఇస్లామీయ చరిత్రను పరిశీలిస్తే సైన్యాల ద్వారా ఇస్లామ్ ప్రవేశించిన అనేక దేశాల్లో అక్కడి ప్రజలు ఇస్లామ్ స్వీకరించిన తర్వాత నేటికి కూడా ముస్లిములుగానే కొనసాగుతున్నారు. ఇస్లామ్ అక్కడి భూభాగాలను మాత్రమే ఆక్రమించుకోలేదు, అక్కడి ప్రజల మనస్సులను కూడా గెలుచుకుంది. ఇస్లామేతర మతధర్మానికి కట్టుబడి ఉండాలని అక్కడి కొందరు ప్రజలు భావిస్తే వారి అభిప్రాయాలను గౌరవించింది. వారికి మతస్వేచ్ఛను ఇచ్చింది. ఈజిప్టులో కాప్టిక్ క్రయిస్తవులు, లెబనాన్‌లో మారోనైటులు అలాంటి మతస్వేచ్ఛనే అనుభవిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక వారసత్వానికి ఇస్లామ్ ఎన్నడూ హాని కలిగించలేదు. అబూ సింబెల్‌లోని స్ఫింక్స్, ఫారో మందిరాలు, పిరమిడ్లు నేటికి కూడా చారిత్రక వారసత్వ చిహ్నాలుగా నిలిచిఉన్నాయి. ఈరాన్‌లోని పర్స్‌పోలిస్ నేటికి కూడా సురక్షితంగా ఉన్నాయి. హిందూ

మందిరాలు, ఇండోనేషియాలోని బాలిలో ఉన్న బార్బుడార్లు పర్యాటకకేంద్రాలుగా నేటికి కూడా ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి. ఇస్లామ్ ముందు కాలంలోని నియంత పాలకుల అణిచివేతల ఆ పాలన నుంచి విముక్తికలిగించిన శక్తిగా ఇస్లామ్ ప్రజల హృదయాలను గెలుచుకుంది.

భారత ఉపఖండం గురించి ఆలోచిద్దాం. భారతదేశానికి వాయవ్యసరిహద్దులు అరబ్బు ప్రాబల్యం ఉన్న మధ్యప్రాచ్యానికి ఆనుకుని ఉన్నాయి. ఇస్లామీయ సైన్యాల ద్వారా ప్రారంభంలో భారతదేశంలలోకి ఇస్లామ్ ప్రవేశించిందన్నది నిజమే. సింధ్ ప్రాంతాన్ని ఈ సైన్యాలు జయించాయి. కాని అంతకు ముందే ప్రవక్త ముహమ్మద్ జీవితకాలంలోనే కేరళలోకి సముద్రమార్గం ద్వారా ఇస్లామ్ ప్రవేశించింది. ఉపఖండం కోస్తా ప్రాంతంలో ఇబ్నేబతూతా ఇక్కడ సందర్శించినప్పుడు, 11 నుంచి 13వ శతాబ్దం మధ్యకాలాల్లో ముస్లిములు చాలా మంది ఉన్నారు. ఢిల్లీని పాలించిన ముగల్ చక్రవర్తులకు కూడా ఇక్కడ ఉన్న ఈ ముస్లిముల గురించి తెలియదు. ముగల్ చక్రవర్తులు పోర్చుగీసువారికి ఈ ప్రాంతాల్లో సముద్రదొంగలతో తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించవచ్చని హక్కులు రాసిచ్చారు. నిజానికి సముద్రదొంగలుగా పోర్చుగీసువారు అభివర్ణించింది ఇక్కడి ముస్లిములనే. కేరళలోకి ఇస్లామ్ అరబ్బు వర్తకుల ద్వారా ప్రవేశించింది. సాంప్రదాయిక హిందూ విశ్వాసాల ప్రకారం సముద్ర ప్రయాణం నిషిద్ధంగా ఉండేది. అరబ్బులు సముద్ర ప్రయాణాల్లో నిష్ణాతులు. అందువల్ల ట్రావన్కూర్ రాజా ముస్లిములకు సహాయ సహకారాలందించేవాడు. ఎందుకంటే రాజ్య ఆర్థిక ప్రగతికి సముద్రవర్తకం ఎంతో ముఖ్యమైనది. ఈ కారణాల వల్లనే వారు స్థానికుల్లో నిపుణులైన సముద్ర ప్రయాణీకులు తయారు కావాలని పాలకులు భావించారు. అందువల్ల స్థానిక జాలరులు ఇస్లామ్ స్వీకరించడాన్ని అనుమతించడమే కాదు చాలా సందర్భాల్లో ప్రోత్సహించేవారు కూడా. అందుకు అవసరమైన సదుపాయాలు కూడా కల్పించేవారు. స్థానిక జాలర్ల కుటుంబాల్లోని ప్రతి కుటుంబంలో కనీసం ఒక్క ముస్లిమ్ ఉండాలన్న ఆదేశాలు కూడా ఉండేవి. ఇబ్నే బతూత భారతదేశాన్ని సందర్శించి ఇక్కడి నుంచి మాల్దీవ్స్ వెళు తున్నప్పుడు అంటే 8వ శతాబ్దంలో మలబార్ కోస్తా పొడవునా అనేక ముస్లిమ్ సముదాయాలను చూశాడు.

ఇస్లామ్ ప్రభావం అధికంగా కనబడే ఉత్తరాదిలో కూడా బలవంతపు మతమార్పిళ్ళ లేవు. ముహమ్మద్ బిన్ ఖాసిమ్ సింధ్‌ను జయించాడు. ఒక విజేతగా ఆయన సింధ్‌లోకి ప్రవేశించినప్పటికీ సింధ్ ప్రజలు ఆయన్ను హృదయపూర్వకంగా స్వాగతించారు. ఆయన్ను ఎంతో అభిమానించారు. రాజా దాహిర్ నిరంకుశపాలనలో అణిచివేతలకు గురైనా సింధ్ ప్రజలు ముహమ్మద్ బిన్ ఖాసిమ్‌కు బ్రహ్మరథం పట్టారు. తర్వాతి పరిణామాల క్రమంలో

ఖలీఫా సులైమాన్ ఇబ్నే మర్వాన్ ఇచ్చిన ఆదేశాల వల్ల ఇస్లామీయ సైన్యం ముహమ్మద్ బిన్ ఖాసిమ్‌ను నిర్బంధించింది. ఆయన్ను ఒక ఖైదీగా డమస్కస్‌లో మావియా ఇబ్నే ముహల్లబ్ వద్దకు పంపడం జరిగింది. ఈ పరిణామాన్ని సింధ్ ప్రజలు భరించలేకపోయారు. ముహమ్మద్ బిన్ ఖాసిమ్ కోసం సింధ్ ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన స్మృతి చిహ్నంగా కిరాజ్ వద్ద ఒక విగ్రహాన్ని నిర్మించారు. (రిఫరెన్స్ : విలియం జాక్సన్ ఏ.వీ., హిస్టరీ ఆఫ్ ఇండియా, సంపుటం 5, ది గ్రోలియర్ సొసైటీ, లండన్, బరోడా ఎడిషన్ 1907, పేజి 14). ముహమ్మద్ బిన్ ఖాసిమ్ తన సైన్యంలో జాట్, మైదీ ప్రజలను చేర్చుకున్నాడు. ఈ ప్రజలు దాహిర్ పాలన పట్ల పూర్తిగా విసిగిపోయి ఉన్నారు. అందువల్లనే ఒక అపరిచిత సైన్యాధ్యక్షుడి సైన్యంలో చేరడానికి ముందుకు వచ్చారు. దాహిర్ పాలనలో వారిని అనుచితంగా చూడడం, వేధింపులకు గురిచేయడం జరిగింది. వారికి గుర్రాలపై స్వారీ చేసే అనుమతి ఉండేది కాదు. తలపాగా ధరించే అనుమతి లేదు. మంచి దుస్తులు ధరించడానికి వీల్లేదు. వారు కేవలం నీళ్ళు మోసేవారిగా, చెట్లు నరికేవారిగా బతకవలసి వచ్చింది. ఇలాంటి అణిచివేతల పట్ల విసిగి వేసారిన జాట్, మైదీ ప్రజలు ముహమ్మద్ బిన్ ఖాసిమ్ సైన్యంలో సంతోషంగా చేరారు. (రిఫరెన్స్ : ప్రొఫెసర్ ఈశ్వరీ ప్రసాద్; హిస్టరీ ఆఫ్ మెడీవల్ ఇండియా, పేజి 55-56)

బౌద్ధం కొంత బలహీనపడుతున్నప్పటికీ ఇంకా ప్రాచుర్యంలో ఉన్న ప్రాంతాల్లో ఇస్లామ్ శరవేగంగా వ్యాపించింది. సింధ్ ప్రాంతంలో కూడా ప్రజలు ఎక్కువగా బౌద్ధులే. బ్రాహ్మణరాజు దాహిర్ పరిపాలన పట్ల విసిగి వేసారి పోయి ఉన్నారు. అదేవిధంగా బెంగాల్, వాయవ్య ఫ్రాంటియర్ ప్రాంతాలు, పంజాబ్‌లలోను బౌద్ధం వ్యాప్తిలో ఉండేది. ఇక్కడ కూడా ప్రజలు బ్రాహ్మణ మతపరమైన అణిచివేతకు గురైవారు. భరతదేశం నుంచి బౌద్ధం ఎదో మంత్రం వేసినట్లు మాయమై పోలేదు. అణిచివేతలు, అన్యాయాల వల్ల బౌద్ధులు దేశం వదిలిపోవడం లేదా అవకాశం దొరికిన వెంటనే ఇస్లామ్‌లో ఆశ్రయం పొందడం జరిగింది. ఉమయ్యద్ ఖిలాఫత్ కాలంలో ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఖలీఫాగా ఉన్నప్పుడు ఆయన సింధ్ ప్రాంతంలోని రాజులకు, రాణులకు లేఖలు రాసి వారిని ఇస్లామ్ స్వీకరించాలని ఆహ్వానించారు. రాజా దాహిర్ కుమారుడు జైషియా ఇస్లామ్ గురించి విన్నాడు. ఇస్లామ్ సుగుణాలను తెలుసుకున్నాడు. ఆయన ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్‌గా మారాడు. (రిఫరెన్స్ : విలియమ్ జాక్సన్ ఏ.వి., హిస్టరీ ఆఫ్ ఇండియా, సంపుటం 5, గ్రోలియర్ సొసైటీ, లండన్, బరోడా ఎడిషన్ 1907, పేజి 15)

ఢిల్లీని పాలించిన ముస్లిమ్ సుల్తానులు బలవంతంగా హిందువులను ముస్లిములుగా మార్చారన్న అపవాదు ఎంత పెద్ద అబద్ధమంటే, అల్లావుద్దీన్ ఖిల్జీ పాలకుడిగా ఉన్నప్పుడు

ఇస్లామ్‌లోకి మతం మార్చుకోడాన్ని నిషేధించాడు. ఆయన చాలా సెక్యులర్ భావాలు కలిగిన రాజు కాబట్టి ఇలా చేశాడనుకుంటే పొరబాటు. రాజ్యానికి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం జిజియా పన్ను వల్ల లభించేది. జిజియా కట్టే బనియా (కోమటి) వ్యాపారులు ఇస్లామ్‌లోకి మారకుండా ఇలా చేశాడు.

అక్బరు చక్రవర్తి లాంటి వారు మతమార్పిళ్లకు బదులు హిందూమతంలోని కొన్ని మూఢాచారాలను సంస్కరించడం ద్వారా మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఆయన అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. ఈ సంస్కరణలను హిందూ సంప్రదాయాల్లో అనవసర జోక్యంగా భావించే అవకాశం లేకపోలేదు. ఏదిఏమైనా ఆయన మానవత్వానికి విరుద్ధంగా ఉందని అనిపించిన వాటన్నింటినీ మార్చే ప్రయత్నం చేశాడు. ఉదాహరణకు ఆయన బాల్యవివాహాలను నిరోధించాడు. అగ్నిపరీక్షలు (అగ్నిగుండంపై నడువడం) వంటివి నిషేధించాడు. జంతుబలులను అడ్డుకున్నాడు. వితంతు పునర్వివాహాలకు అనుమతించాడు. తప్పనిసరిగా ఉండిన సతిసహగమనాన్ని స్వచ్ఛందంగా ఆచరించే హక్కు ఇచ్చాడు. ఆయన సతీసహగమనాన్ని పూర్తిగా నిషేధించలేదు. అలా చేస్తే పెద్ద ఎత్తున నిరసనలు పెల్లుబుకుతాయని భయపడ్డాడు. వివాహ సందర్భంగా వధువరుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించాడు (రిఫరెన్స్ : ఏ.వి. విలియమ్స్ జాక్సన్, హిస్టరీ ఆఫ్ ఇండియా, సంపుటం 4, పేజి 15, 18)

రాజ్యపరిపాలనలో అనుసరించే పద్ధతుల కారణంగా పాలకులు ప్రజల ప్రేమాభిమానాలకు పాత్రులు కావడమన్నది చాలా అరుదు. నిజానికి ముస్లిమ్ చక్రవర్తులెవ్వరు ప్రజలను ఇస్లామ్ వైపు ఆకర్షించడం జరగలేదు. సూఫీలు, ఫకీర్లు, దర్వేషుల వల్ల ప్రజలు ఇస్లామ్ పట్ల ఆకర్షితులయ్యారు. ఈ సూఫీల ఆశ్రమాలు రోగులకు, పేదలకు, అవసరార్థులకు ఆశ్రయమిచ్చేవి. ఈ ఆశ్రమాలే దర్గాలు. అజ్మీర్, మెహ్రౌలీ, నిజాముద్దీన్ దర్గాల వంటివి అసంఖ్యాక ప్రజల ప్రేమాభిమానాలకు, గౌరవాదరాలకు కేంద్రాలయ్యాయి. ఈ సూఫీ సంతులు చాలా సాధారణ జీవితాన్ని గడిపేవారు. పేదలకు అన్నం పెట్టేవారు. తమ వద్ద ఉన్నదంతా పేదల కోసం ఖర్చు చేసేవారు. రోగుల సేవ కోసం చికిత్సకులను నియమించేవారు. ఉచితంగా చికిత్స అందించేవారు. చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా జీవితకాలంలో సుల్తానుల రాజ్యాధికారానికి వ్యతిరేకంగా అనేక దాడులు జరిగాయి. అనేకసార్లు డిల్లీ పతనమైంది. కాని ఎవ్వరు కూడా నిజాముద్దీన్ ఔలియా ఖాన్‌ఖా (ఆశ్రమం)పై చేయివేయలేదు.

భారతదేశంలో ముస్లిములు అత్యధికంగా ఉన్న రాష్ట్రం జమ్ము కశ్మీర్. ఈ ప్రాంతాన్ని

అనేక వందల సంవత్సరాల కాలం హిందూ రాజులు పాలించారు. ఇక్కడి ప్రజలు మధ్యాసియా నుంచి వచ్చిన సూఫీల కారణంగానే ఇస్లామ్‌లోకి మారారు.

నిజామ్ పరిపాలించిన హైదరాబాద్ సంస్థానం ప్రాంతాన్ని ముస్లిమ్ పాలకులు దాదాపు 400 సంవత్సరాలు పాలించారు. అయినప్పటికీ 1948లో ఈ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైనప్పుడు ఇక్కడ ముస్లిముల జనాభా కేవలం 12 శాతం మాత్రమే.

జలంధర్‌లో హిందూ జాట్ సముదాయం ఒకటి ఉంది. దీన్ని సుల్తానీ జాట్‌లని అంటారు. ఈ ప్రజలు సుల్తాన్ సాఖీ సర్కార్ భక్తులు. ఈ సుల్తాన్ ఒక సాధువు, ఆయన సమాధి పాకిస్తాన్‌లోని షాకోట్‌లో ఉంది. ఈ సుల్తానీ జాట్‌లు ఇప్పుడు కూడా హలాల్ మాంసం మాత్రమే తింటారు. వీళ్లందరూ రైతులే. హుక్కా తాగుతారు. వారి గ్రామాల శివార్లలో సుల్తాన్ జియారత్‌లను ఏర్పాటు చేసుకుంటారు. ప్రతి గురువారం ఈ జియారత్‌ను శుభ్రం చేసి దీపాలు వెలిగిస్తారు. షాకోట్‌లోని సుల్తాన్ సమాధి వద్ద ఒకప్పుడు జాతరలు కూడా నిర్వహించేవారు.

శిఖ్ఖుల పాలనలో ఉన్నప్పుడు ముల్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉంది) గవర్నర్ సవాన్‌మల్ ఈ జాతరను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. సుల్తానీ జాతరకు వెళ్ళే ప్రతి హిందూవుకు 100 రూపాయలు జరిమానా విధించేవాడు. అయినప్పటికీ ప్రజలు (హిందూ సుల్తానీ జాట్‌లు) ఈ జాతరకు వెళ్లడం ఆపలేదు. ఈ సంప్రదాయం 19వ శతాబ్దం చివరి వరకు కొనసాగింది. లూధియానా, జలంధర్ గెజిట్లు ప్రచురించడం 19వ శతాబ్దంలో ప్రారంభమయ్యింది. ఇది భారతదేశంపై ఇస్లామ్ ప్రభావం.

కెన్యా, టాంజానియా, మడగాస్కర్ వంటి దేశాలపైకి ఎన్నడూ ఇస్లామీయ సైన్యాలు వెళ్ళలేదు. అయినా అక్కడ చెప్పుకోదగ్గ సంఖ్యలో ముస్లిములు ఉన్నారు.

1. టాంజానియాలో 70 శాతం ప్రజలు ముస్లిములే. ఈ ప్రాంతాలన్నీ చిరకాలంగా క్రయిస్తవ పాలనలో ఉన్నాయి.

2. యూరప్‌లోను ఇస్లామ్ ప్రభావం ప్రబలంగా కనబడుతుంది. తూర్పు యూరప్‌లోని బల్కాన్ రాజ్యాలను టర్కీకి చెందిన ఉస్మానియా ఖలీఫాలు ఐదు శతాబ్దాలకు పైగా పాలించారు. కాని ఈ రాజ్యాలలో ప్రజలను వారు ఇస్లామ్‌లోకి మార్చలేదు. ఆల్బేనియా, బోస్నియా హెర్జగోవినాలలో తప్ప బాల్కన్ రాజ్యాలలో మరెక్కడా ముస్లిములు అధికసంఖ్యలో లేరు. అల్బేనియాలో 90 శాతం ముస్లిమ్ జనాభా ఉంది. బోస్నియా హెర్జగోవినా ముస్లిములు ఎక్కువగా ఉన్న ప్రాంతం,

యుగోస్లోవియా ఫెడరేషన్‌లో మొన్నటి వరకు ఉండేది. ఇటీవల స్వతంత్ర రాజ్యంగా అవతరించింది.

3. విచిత్రమేమంటే, దాదాపు ఎనిమిది శతాబ్దాల కాలం ముస్లిమ్ పాలనలో ఉన్న స్పెయిన్‌లో (క్రీ.శ.712 నుంచి 1492 వరకు) ఎన్నడూ ముస్లిములు అధికసంఖ్యాకులు కాదు. ముస్లిముల పాలనా కాలంలో ఇక్కడి క్రయిస్తవులకు, యూదులకు పూర్తి మతస్వేచ్ఛ లభించింది. ఇది పటిష్టమైన ఆధారాలున్న చారిత్రక వాస్తవం. అక్కడి ముస్లిములను, యూదులను తర్వాత క్రయిస్తవ పాలన వచ్చినప్పుడు బలవంతంగా క్రయిస్తవంలోకి మార్చడం జరిగింది. మతమార్పిడికి ఇష్టపడని వారిని దేశం నుంచి బహిష్కరించారు.

అరబ్బు భూబాగాల్లో క్రయిస్తవ జనాభా చెప్పుకోదగ్గస్థాయిలో ఉంది. ప్రజలపై ఇస్లామ్‌ను బలవంతంగా రుద్దడం జరగలేదనడానికి ఇంతకన్నా ఆధారం ఏం కావాలి?

4. ఈజిప్టులో 10% కాప్టిక్ క్రయిస్తవులున్నారు.

5. ప్రపంచంలో అత్యధిక ముస్లిమ్ జనాభా ఉన్న దేశం ఇండోనేషియా. ఇండోనేషియాలో బాలీ దీవి హిందూ జనాభా అధికంగా ఉన్న ప్రాంతం. ఇండోనేషియాలో ప్రాచీన హిందూ దేవాలయాలు నేటికి కూడా కనబడతాయి.

6. మలేషియాలో అధికసంఖ్యాక ప్రజలు ముస్లిములు. ఈ దేశంలోకి ఎన్నడూ ముస్లిమ్ సైన్యాలు రాలేదు. ఇక్కడ ఇస్లామ్ యుద్ధాల వల్ల వ్యాపించలేదు. ఇస్లామ్‌లోని నైతికతా సందేశం వల్ల వ్యాపించింది. మలేషియాలో 45 శాతం ప్రజలు మాలే ప్రజలు కాదు. అక్కడి వ్యాపారం, విద్య, పరిపాలనల్లో ఈ మాలే కాని ప్రజలదే కీలకపాత్ర. నిజానికి అక్కడ మాలే ప్రజలకు భూమిపుత్ర రిజర్వేషన్లు ఇవ్వవలసిన పరిస్థితి వచ్చింది.

7. లెబనాన్‌లో అధిక సంఖ్యాక ప్రజలు ముస్లిములు. అయినప్పటికీ చట్టప్రకారం ఒక మారినైట్ క్రయిస్తవుడు మాత్రమే అక్కడ అధ్యక్షుడు కాగలడు. ప్రధాని ముస్లిమ్ ఉంటారు. స్పీకర్‌గా షియా వర్గానికి చెందిన వ్యక్తి ఉంటారు. ఇతర పదవులన్నీ ఈ విధంగానే పంపకం చేశారు.

8. సిరియా, జోర్డన్, ఇరాక్‌లలో నేటికి కూడా పాత క్రయిస్తవ సముదాయాలు నివసిస్తున్నాయి.

9. టూనిషియా, ఈరాన్‌లలో యూదులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. టూనిషియా వ్యాపారం, పరిశ్రమల్లో యూదులదే కీలకపాత్ర.

10. బంగ్లాదేశ్‌లో 10% ప్రజలు హిందువులు. కళలు, సాహిత్యం, మీడియా, బెంగాలీ సినిమా రంగాలలో వీరిదే ప్రాబల్యం. బంగ్లాదేశ్ రాజధాని నగరం ఢాకాకు ఆ పేరు ఢాకేశ్వరీ ఆలయం వల్ల వచ్చింది. ఈ పేరును మార్చి ఇస్లామీయ పేరు పెట్టే ప్రయత్నాలేవీ అక్కడ జరగలేదు. ఇస్లామీయ సిద్ధాంతానికి విరుద్ధంగా లేని అనేక హిందూ సంప్రదాయాలను అక్కడి ప్రజలు నేటికి పాటిస్తారు. మహిళలు బొట్టు పెట్టుకుంటారు, సింధూర్ ఉపయోగిస్తారు. స్త్రీలు ప్రధానంగా చీరలే కట్టుకుంటారు. బంగ్లా భాష సంస్కృత ప్రాబల్యం అధికంగా ఉన్న భాష. ఇస్లామ్ ప్రజలందరినీ ఒకే మూసలో పోయాలని భావించదు. బహుళత్వాన్ని ఇస్లామ్ గౌరవిస్తుంది.

11. ఆసక్తికరమైన మరో వాస్తవమేమంటే, ఇస్లామీయ సామ్రాజ్యంలోని చాలా ప్రాంతాలను మంగోలు సైన్యాలు ఆక్రమించుకుని విజేతలుగా అక్కడికి ప్రవేశించినప్పటికీ వారు ఇస్లామ్‌ను ధ్వంసం చేయలేకపోయారు. నిజానికి ఇస్లామ్‌లోని సుగుణాల కారణంగా మంగోలు జాతి ఇస్లామ్‌ను స్వీకరించింది. చరిత్రలో ఇలాంటి సంఘటన మరెక్కడా కనబడదు. విజేతలు పరాజితుల ధర్మాన్ని స్వీకరించిన సంఘటన ప్రపంచంలో అత్యంత అరుదైన సంఘటన. మంగోలులు విజేతలుగా ముస్లిమ్ భూభాగాల్లో అడుగుపెట్టారు. వారిని పరాజితులైన ముస్లిములు బలవంతంగా ముస్లిములుగా మార్చడం అసాధ్యం. నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 17 కోట్ల మంది ముస్లిముల్లో ఏ ఒక్కరినైనా బలవంతంగా ముస్లిములుగా మార్చడం జరిగిందా. ఏ ఒక్క ముస్లిమును అడిగినా లేదనే అంటాడు. నేడు ప్రపంచంలో అతిపెద్ద ముస్లిమ్ దేశం ఇండోనేషియా. అక్కడ ముస్లిమ్ సైన్యాలేవి యుద్ధానికి వెళ్ళలేదు. కత్తిబలంతో ఇస్లామ్ వ్యాపించిందని చెప్పడానికి అక్కడ అవకాశమే లేదు. ఆధ్యాత్మికంగా సాఫల్యమార్గాన్ని చూపించే, నైతికతకు కట్టుబడి ఉండేలా చేసే ఇస్లామ్‌కు కట్టుబడేలా ఎవరినైనా బలవంతపెట్టడం ఎలా సాధ్యం?

చరిత్రలో ఈ వాస్తవాలను గమనించడం వల్లనే సర్ థామస్ ఆర్నల్డ్ ఇలా రాశారు.

“ఇస్లామ్ విస్తరించింది. కాని కట్టుకథల్లో కనిపిస్తున్నట్లు ఒక చేత్తో కత్తి, మరో చేత్తో ఖుర్ఆన్ చేతపట్టిన ముస్లిమ్ యోధుల ఆక్రమణల వల్ల కాదు, దివ్యఖుర్ఆన్ బోధనల వల్ల, ప్రవక్త (స) వ్యక్తిత్వం వల్ల ఇస్లామ్ విస్తరించింది.” (రిఫరెన్స్ : ప్రీచింగ్ ఆఫ్ ఇస్లామ్)

ప్రపంచంలో ఇస్లామ్‌ను ఇష్టపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుందన్నది స్పష్టమైన వాస్తవం. సెప్టెంబర్ 11 దుర్ఘటన తర్వాత అనేకమంది ఇస్లామ్ గురించి చదవడం ప్రారంభించారు. ఆ పిదప వేలాది మంది ఇస్లామ్ స్వీకరించారు. ఇలా కొత్తగా ఇస్లామ్ స్వీకరిస్తున్న వారిలో 70 శాతం మంది మహిళలేనని సర్వేల్లో తేలింది. ఈ వాస్తవాలను బట్టి బలప్రయోగం వల్ల ఇస్లామ్ విస్తరించిందని చెప్పడం పచ్చి అబద్ధమని తేలుతోంది. ఒకవేళ బలప్రయోగం వల్ల ఇస్లామ్ విస్తరించి ఉన్నట్లయితే నేడు ఇస్లామ్ వదిలి వెళ్ళిపోయేవారి సంఖ్య అత్యధికంగా ఉండవలసింది. ఎందుకంటే ఇస్లామ్ స్త్రీలను అణిచివేసే ధర్మమని, హింసాత్మక మధ్యయుగాల ధర్మమన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతున్న నేటి రోజుల్లో ఎందుకు బలవంతంగా స్వీకరించిన ధర్మానికి కట్టుబడతారు. ఇస్లామ్‌పై దుమ్మెత్తిపోస్తున్నవాళు ్ళ ఇప్పుడైనా వాస్తవాలను గమనించాలి. ఇస్లామ్ వ్యతిరేక శక్తుల దుష్ప్రచారాన్ని ప్రజలు గుర్తించవలసిన అవసరం ఉంది.

# పాతవైరం - కొత్త ద్వేషం

ఇస్లామ్‌కు వ్యతిరేకంగా పాశ్చాత్య దుష్ప్రచారానికి చాలా సుదీర్ఘచరిత్ర ఉంది. ఇస్లామ్‌కు క్రయిస్తవ యూరప్‌కు మధ్య ఈ వైరం దాదాపు వేయిసంవత్సరాలుగా కొనసాగుతూ వస్తోంది. అరబ్బు ద్వీపకల్పంలో ఇస్లామ్ మొలకెత్తిన వంద సంవత్సరాలలోపే యూరప్ గడపలోకి కూడా అడుగుపెట్టింది. క్రీ.శ.712 నాటికి ఉమయ్యద్ సామ్రాజ్య సైన్యాధికారి తారిఖ్ బిన్ జైద్ స్పెయిన్‌ను జయించారు. ఈ విజయంతో ఐబీరియా ద్వీపకల్పం ఇస్లామ్ పాలనలోకి వచ్చింది. దీన్ని అండాలుస్ అంటారు. దాదాపు ఎనిమిది శతాబ్దాల పాటు ఇక్కడ ముస్లిముల పాలన కొనసాగింది. ఇక్కడ ఇస్లామీయ నాగరికత వర్ధిల్లింది. అప్పటి వరకు ప్రపంచం కనివినీ ఎరుగని నాగరికతా వికాసం అది. కార్డోబా, గ్రెనడాల్లోని ఇస్లామీయ విశ్వవిద్యాలయాలు మధ్యప్రాచ్యానికి, ఆఫ్రికా, యూరప్‌లకు చెందిన మేధావులు, ఖగోళవేత్తలు, వైద్యులు, శాస్త్రవేత్తలు, తత్వవేత్తలను ఆకర్షించాయి.

క్రయిస్తవంలోని త్రిత్వ సిద్ధాంతంలో ఉన్న సంక్లిష్టతల కన్నా ఇస్లామ్‌లోని ఏకదైవారాధక సిద్ధాంతంలోని సరళత్వం పటిష్టమైన ఆధ్యాత్మిక సిద్ధాంతంగా ప్రాచుర్యం పొందింది. దివ్యఖుర్ఆన్‌లోని దైవవాక్కులు ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా యథాతథంగా ఉండడం కూడా ఒక అనుకూలాంశమయ్యింది. పైగా ఇస్లామ్‌లో పూజారులు లేరు. మతపెద్దల నుంచి, వారి ఆదేశాల నుంచి విముక్తిని ప్రసాదించడం కూడా ప్రజలను ఆకట్టుకుంది. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వల్లనే ఇస్లామీయ స్పెయిన్‌లో విజ్ఞానశాస్త్రం ప్రగతిపురోగతులు సాధించింది. స్పెయిన్‌లో ఇస్లామ్ వికాసం చూసిన క్రయిస్తవ యూరప్ మనుగడకు ప్రమాదంగా భయపడింది. ఇస్లామ్ పురోగమనాన్ని అడ్డుకునే మార్గాల కోసం అన్వేషించడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇస్లామ్‌పై ఆధ్యాత్మికంగాను, సిద్ధాంతపరంగాను దాడులు చేయడం ప్రారంభమయ్యింది. ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిత్వాన్ని దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ వివాహాలు, ఆయన చేసిన యుద్ధాలను వక్రీకరించి ప్రచారం చేయడం ప్రారంభించారు. క్రూసేడు యుద్ధాలు, వాటి వల్ల తలెత్తిన విద్వేషాలు,

వివాదాలు, ఆ తర్వాత ధార్మిక ప్రదేశాలను సలాహుద్దీన్ అయ్యూబీ మరలా ఆక్రమించుకోవడం, ఆ తర్వాత కాన్‌స్టాంటినోపుల్ పతనం (టర్కీ రాజధాని ఇస్తాంబుల్ తూర్పు రోమన్ సామ్రాజ్యానికి అంటే బైజాంటైన్ సామ్రాజ్యానికి రాజధానిగా ఉండేది), ఉస్మానియా ఖిలాఫత్ కాలంలో యూరప్ తూర్పు ప్రాంతాల్లోకి ఇస్లామ్ ప్రవేశించడం తదితర కారణాల వల్ల ఇస్లామ్ పట్ల పాశ్చాత్య వ్యతిరేకత మరింత పెరిగింది.

నాటి ప్రాభవం ఇస్లామ్‌కు నేడు లేదు. ముస్లిముల్లో అనేక విభేదాలు చోటుచేసుకున్నాయి. పాశ్చాత్యదేశాలు శక్తి వనరుల కోసం చేపట్టిన చర్యలు, చమురు సంపద పుష్కలంగా ఉన్న మధ్యప్రాచ్యంలో చేపట్టిన యుద్ధాల వాతావరణంలో పాతవైరాలను రాజేసి సరికొత్త విద్వేషాలు రెచ్చగొట్టవలసిన అవసరం ఇటీవలి దశాబ్దాల్లో మరింత ఎక్కువయ్యింది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే పాశ్చాత్య మీడియా, పాశ్చాత్య రాజకీయసంస్థలు ఎందుకు ఇస్లామ్ వ్యతిరేక ప్రచారానికి ఉత్సాహపడతాయో అర్థం చేసుకోవచ్చు. వారికి కావలసింది ఈ విద్వేషాన్ని ఆగ్రహంగా మార్చడం. యూరప్‌లో వేర్పాటు ఉద్యమాలకు కొదువ లేదు. ఐరిష్, బాస్క్‌లు అందుకు మంచి ఉదాహరణలు. ఈ ఉద్యమాలు వేర్పాటు కోరుతూ సంఘర్షిస్తున్నాయి. కాని పాశ్చాత్యవ్యవస్థకు ప్రత్యేకంగా గుర్తుపట్టగలిగిన మిలిటెంట్లు కావాలి. ఒక కొత్త శత్రువుగా గుర్తించగలిగిన మిలిటెంట్లు అవసరం. ఈ నేపధ్యంలో కార్పెట్ బాంబింగ్‌తో విధ్వంసమైన పాలస్తీనా, ఇరాక్, అఫ్గనిస్తాన్‌ల నుంచి వచ్చిన శరణార్థులు పాశ్చాత్యదేశాలకు గుణపాఠం నేర్పాలనుకుంటున్న శక్తులకు రిక్రూట్ కేంద్రాలుగా ఉపయోగపడ్డం మొదలైంది.

ఇస్లామ్‌కు పాశ్చాత్యవ్యవస్థకు మధ్య చారిత్రక వైరానికి సంబంధించిన కొన్ని అంశాలను ఇక్కడ పరిశీలించడం అవసరం. ప్రముఖ మేధావి జియావుద్దీన్ సర్దార్ రాసిన వ్యాసం ఇందుకు ఎంతో ఉపయోగపడుతుంది.

“ఇస్లామ్ పుట్టినప్పటి నుంచి పాశ్చాత్యవ్యవస్థకు ఒక సమస్యగానే ఉంది. మొదటిగా ఇది ఒక ధార్మిక సమస్య. దేవుని స్వంత కుమారుడిని శిలువ వేసిన తర్వాత, ఆయన పునరుజ్జీవనం తర్వాత 600 సంవత్సరాలకు ఒక అరబ్బు ప్రవక్త రావలసిన అవసరం ఏముంది? రెండవ సమస్య, ఇస్లామ్ ఆవిర్భవించిన కొన్ని దశాబ్దాల్లోనే యూరప్ గుమ్మం వరకు వచ్చేసింది. ఇది రాజకీయ సమస్య. మూడవది, ముస్లిమ్ నాగరికత సాధించిన వైజ్ఞానిక ప్రగతి ఇస్లామ్‌ను ఒక మేధోపరమైన సమస్యగా కూడా చూడసాగారు. ఇస్లామ్‌కు సంబంధించి ఎదురైన ఈ ప్రతి ఒక్క సమస్యను ప్రత్యేక పద్ధతిలో ఎదుర్కోవడం ప్రారంభించారు.

మతపరంగా క్రయిస్తవ పాశ్చాత్య వ్యవస్థ ఇస్లామ్ ప్రవక్తను, ఆయన అనుచరుల వ్యక్తిత్వాలను వక్రీకరించడం ప్రారంభించింది. రాజకీయంగా పాశ్చాత్య వ్యవస్థ క్రూసేడు యుద్ధాల పరంపరను ప్రారంభించింది. కాని ఈ క్రూసేడులు అనుకున్న ఫలితాలు సాధించలేకపోయాయి. అందువల్ల ముస్లిమ్ దేశాల్లో వలసవాద ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఇక మేధోపరంగా ఇస్లామీయ సిద్ధాంతం, ఆలోచనలను ఎదుర్కోవడానికి అనేక శాఖలు ప్రారంభించారు.

## 1. దుష్ప్రచారం

ఇస్లామ్‌పై ఇస్లామ్ ప్రవక్తపై దుష్ప్రచారం ప్రారంభకాలంలోనే మొదలైంది. పాల్ అల్వరస్ (క్రీ.శ.859) దీనికి ఆద్యుడనవచ్చు. బుక్ ఆఫ్ డేనియల్‌లో ఉన్న యాంటీ క్రీస్ట్, సాతాను వర్ణన ప్రవక్త ముహమ్మద్‌కు సరిపోతుందని ఆయన ప్రచారం చేశాడు. ఈ సంఖ్య ప్రవక్త వర్ధంతిని సూచిస్తుందని చెప్పాడు. చాన్సన్ దు గెస్టేగా పిలువబడే అప్పటి కళా ప్రదర్శనల్లో ప్రవక్తను సాతానుకు పర్యయపదం మాహౌద్‌గా అభివర్ణించడం ప్రారంభమయ్యింది. ఆ తర్వాత ప్రవక్తను అప్రతిష్ఠపాలు చేసే ఇలాంటి కవిత్వాలు, కళాప్రదర్శనలు ఊపందుకున్నాయి. యావత్తు మధ్యయుగాల కాలంలో ఇటలీ, జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ సాహిత్యాల్లో ఈ కవిత్వం ప్రబలంగా కనబడుతుంది. ఈ కవిత్వం వివిధ రూపాల్లో 17వ శతాబ్ధం వరకు కొనసాగింది. ఆ తర్వాత 19వ, 20వ శతాబ్దాల్లో కొత్తరూపంలో మరోసారి ఉధృతంగా ప్రారంభమయ్యింది. దీనికి ఇటీవలి ఉదాహరణ సల్మాన్ రుష్దీ రాసిన శాటానిక్ వర్సెస్ పుస్తకం. చాన్సన్స్ సాహిత్యం పంథాలో రుష్దీ ప్రవక్త (స)ను కించపరుస్తూ జీవితకధను రాశాడు.

## 2. క్రూసేడులు

ఇస్లామ్‌ను దుష్టశత్రువుగా ఇలా సాహిత్యం ద్వారా దుష్ప్రచారం చేయడం ప్రారంభమైన తర్వాత. ప్రజల మనస్సుల్లో విద్వేషాన్ని రగిలించిన తర్వాత ఇస్లామ్‌పై ఎడతెగని యుద్ధాలు ప్రారంభించడం తేలికయ్యింది. నవంబర్ 1095లో క్లెర్‌మాండ్‌లోని పీస్ ఆఫ్ గాడ్ కౌన్సిల్ వద్ద పోప్ ద్వితీయ అర్బన్ క్రూసేడు యుద్ధాలకు శంఖం ఊదాడు. ఇస్లామ్‌కు వ్యతిరేకంగా, జెరుసలేమ్ విముక్తికి దైవయుద్ధం ప్రారంభించాలని కౌన్సిల్ పిలుపునిచ్చింది.

క్రయిస్తవ క్రూసేడులు యూరప్‌లో యూదుల ఊచకోతతో ప్రారంభమయ్యాయి. క్రూసేడు సైన్యాలు జెరుసలేమ్‌ను 40 రోజులపాటు ముట్టడించి, జులై 15, 1099న

జెరుసలేమ్‌లోకి ప్రవేశించాయి. ముస్లిమ్ చరిత్రకారుడు ఇబ్నుల్ అతీర్ ప్రకారం క్రూసేడు సైన్యాలు నగరంలో దాదాపు 70,000 మంది స్త్రీపురుషులను పిల్లలను నిర్దాక్షిణ్యంగా హతమార్చాయి.

ఈ హత్యాకాండకు ప్రత్యక్షసాక్షి రైముండ్ అగీల్స్ మాటల్లో చెప్పాలంటే,

> "అద్భుతమైన దృశ్యాలు కనిపించాయి. మా వాళ్ళు కొందరు శత్రువుల తలల నరికేశారు (ఇది చాలా దయతో చంపారనాలి). మరికొందరు శత్రువులపై బాణాల వర్షం కురిపించారు. ఆ బాణాల దెబ్బలకు శత్రువులు టవర్ల నుంచి క్రిందికి పడ్డారు. మావాళ్ళు ఇంకొందరు శత్రువులను చిత్రహింసలు పెట్టారు. వారిని మంటల్లో పడేశారు. నగరం వీధుల్లో తెగిన తలలు, కాళ్ళూ చేతులు గుట్టలు గుట్టలుగా పడ్డాయి. వీధుల్లో నడవాలంటే శవాలపై నుంచి, గుర్రాల కళేబరాల పైనుంచి వెళ్ళాల్సిందే. సోలమన్ మందిరం వద్ద జరిగిన దాంతో పోల్చితే ఇది చాలా తక్కువ. సోలోమన్ మందిరం వద్ద ధార్మికసేవల కీర్తనలు వినిపించే ప్రదేశం. కాని అక్కడ ఏం జరిగిందో తెలుసా? నేను అక్కడ ఏం జరిగింది చెబితే మన ధార్మిక విశ్వాసశక్తి ఎన్నో రెట్లు పెరిగిపోతుంది. సోలోమన్ మందిరంలో, ప్రవేశ వేదిక వద్ద మనవాళ్ళు మోకాళ్ళ లోతు రక్తంలో గుర్రాల కళ్ళాలను బిగించి పట్టుకుని లోనికి వెళ్ళారన్న ఒక్క దృశ్యం చాలు అక్కడ ఏం జరిగిందో చెప్పడానికి. నిజానికి ఇది దేవుడు గొప్ప అద్భుతమైన తీర్పు. ఈ ప్రదేశం అవిశ్వాసుల నెత్తుటితో తడిసిపోవలసిన ప్రదేశం. ఎందుకంటే వారి దైవదూషణలకు ఇదే తగిన ప్రతిఫలం.

ఈ పవిత్ర ప్రదేశంలో కొన్ని చోట్ల క్రూసేడు యోధులు ముస్లిములను పెద్ద పెద్ద వంటపాత్రల్లో ఉడికించి చంపారు. పిల్లలను పళ్ళాలపై వేయించారు. అవిశ్వాసులను వేటాడుతూ నగరమంతా తిరిగారు."

ఇది క్రయిస్తవ క్రూసేడులు వ్యవహరించిన పద్ధతి. ఇప్పుడు రెండవ ఖలీఫా ఉమర్ జెరుసలేమ్‌ను ఆక్రమించుకున్నప్పుడు ఎలా వ్యవహరించారో చూడండి. క్రీ.శ. 638లో ముస్లిమ్ సైన్యాలు జెరుసలేమ్‌ను ఆక్రమించుకున్నాయి. ఖలీఫా ఉమర్ అక్కడి క్రయిస్తవులు, యూదులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారు. ఎవరికీ ఎలాంటి హాని కలిగించలేదు. ఉమర్ అక్కడి క్రయిస్తవ ఫాదర్‌ను కలుసుకున్నప్పుడు నగరపౌరుల ధనప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి హానీ ఉండదని హామీ ఇచ్చారు. ఆ తర్వాత క్రయిస్తవ పవిత్ర ప్రదేశాలను చూపించమని అడిగారు. నగరంలోని క్రయిస్తవ పవిత్ర ప్రదేశాలను సందర్శిస్తూ ఆయన హోలీ సెప్లూచర్ చర్చిలోకి వెళ్ళినప్పుడు నమాజు వేళయ్యింది. ఉమర్ క్రయిస్తవ ఫాదర్‌తో

తాను ప్రార్థన చేసుకుంటానని చెప్పారు. క్రయిస్తవ ఫాదర్ ఆయన్ను చర్చిలోనే ప్రార్థన చేసుకోవాలని ఆహ్వానించారు. అప్పుడు ఉమర్ చెప్పిన మాటలు గమనార్హమైనవి. తాను విజేతగా అక్కడ ప్రార్థిస్తే, ఉమర్ ప్రార్థించిన ప్రదేశం తమకు కావాలని, తాము అక్కడే ప్రార్థనలు చేస్తామని ముస్లిములు కోరే అవకాశం ఉందని జవాబిచ్చారు. ఆయన చర్చి బయటకు వచ్చి ఉత్తనేలపై ప్రార్థన చేసుకునే తివాచీ పరిచి ప్రార్థన చేసుకున్నారు.

అక్టోబర్ 2, 1187వ తేదీన ముస్లిములు మరోసారి జెరుసలేమ్‌ను తమ వశం చేసుకున్నారు. అయ్యూబి ఖలీఫా సలాహుద్దీన్ విజేతగా నగరంలో ప్రవేశించారు. క్రయిస్తవులకు ఎలాంటి హాని జరగరాదని ఆయన తన సైన్యానికి స్పష్టమైన ఆదేశాలిచ్చాడు. క్రయిస్తవ ఆరాధనాస్థలాలను కాపాడతామని ప్రకటించారు. నగరంలో ఉండాలనుకుంటున్న వారు ఉండవచ్చని, నగరాన్ని వదిలి వెళ్ళాలనుకుంటున్న వారు వెళ్ళవచ్చని ప్రకటించారు. చాలా మంది తమ సంపదను తీసుకుని నగరం వదిలి వెళ్ళిపోయారు. నగరంలోని క్రయిస్తవ ఫాదర్ స్వయంగా హెూలీ సెప్లూచియర్ చర్చిలోని సంపదను, బంగారాన్ని, విలువైన వస్తువులను, తివాచీలను మూటలు కట్టుకుని నగరం వదిలి వెళ్ళిపోయాడు.

సలాహుద్దీన్ అనుచరులపై బురదజల్లే ప్రయత్నాలు జరిగాయి. సలాహుద్దీన్ కోశాధికారి ఇమాముద్దీన్ అస్ఫహానీ ఇదంతా చూసి ఆగ్రహం పట్టలేకపోయారు. ఆయన సలాహుద్దీన్‌తో "ఈ చర్చి ఫాదర్ కనీసం రెండు లక్షల దీనార్ల సంపదను చర్చి నుంచి తీసుకుపోతున్నాడు. మనం వారికి వ్యక్తిగత ఆస్తి తీసుకుపోయే అనుమతి మాత్రమే ఇచ్చాం. చర్చిలు, ఆరాధనాస్థలాల్లోని ఆస్తులను తరలించే అనుమతి ఇవ్వలేదు. మీరు దీన్ని అడ్డుకోవాలి" అన్నారు. కాని సలాహుద్దీన్ చిరునవ్వుతో జవాబిస్తూ "మనం సంతకాలు చేసిన ఒప్పందంలోని మాటలకు మనం కట్టుబడాలి. విశ్వాసులు ఒప్పందభంగం చేశారన్న చిన్న మాట కూడా రాకూడదు. అంతేకాదు, క్రయిస్తవులు మనం చూపిన ఉదారస్వభావాన్ని గుర్తుంచుకుంటారు." అని చెప్పారు.

కాని సలాహుద్దీన్ చెప్పిన మాటలకు విరుద్ధంగా జరిగింది. క్రయిస్తవులు ఆయన్ను హింసాత్మక అవిశ్వాసిగా చిత్రీకరించారు. శిశుభక్షకుడని, క్రయిస్తవ యోధుల హంతకుడని, క్రయిస్తవ ఆరాధనాస్థలాల విధ్వంసకుడని ప్రచారం చేశారు.

యూరప్‌లో ఇస్లామ్ గురించిన ఆలోచనలను, భావాలను క్రూసేడులు చాలా ప్రభావితం చేశాయి. యూరప్‌కు సంబంధించి ఇస్లామ్ ఒక దుష్ట ధర్మంగా, చీకటి ధర్మంగా ప్రచారం చేశాయి. ముస్లిములను అనాగరికులుగా, విశృంఖలంగా వ్యవహరించేవారిగా, మతోన్మాదులుగా, అజ్ఞానులుగా, మూర్ఖులుగా, పరిశుభ్రత పాటించనివారిగా, తక్కువస్థాయి

వారిగా చిత్రీకరించే ఈ భావనలు యూరోపు ఆలోచనల్లో, సాహిత్యంలో, దృక్పథాల్లో వేళ్ళూనుకుపోయాయి. వలసవాద కాలంలో ఈ అపవాదులకు మరింత బలం లభించింది. నేడు వీటినే మరింత ఉధృతంగా ఉపయోగిస్తున్నారు.

## 3. ఓరియంటలిజమ్ లేదా ప్రాచ్యవాదం

ఇస్లామ్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి, ఇస్లామ్‌ను వక్రీకరించడానికి కొత్త కొత్త వాదాలు కనిపెట్టి మేధోపరమైన సమర్థన సాధించే ప్రయత్నాలు జరిగాయి. పాశ్చాత్యేతర సమాజాలన్నీ పాశ్చాత్య సమాజాల కన్నా తక్కువస్థాయికి చెందినవిగా, పాశ్చాత్య సమాజం స్థాయి పరిపక్వత లేనివిగా చిత్రీకరించడానికి ఆంత్రోపాలజీ అనే శాస్త్రం ప్రవేశపెట్టారు. వలసవాద ఆంత్రోపాలజిస్టులు ఇస్లామ్ విషయంలో ఊహించినవిధంగానే జాతిపరమైన పక్షపాతాన్ని ప్రదర్శిస్తూ రాశారు. ఇస్లామ్ పట్ల భయద్వేషాలకు మేధోపరమైన రంగు అద్దడానికి, ఆ విధంగా ఆమోదయోగ్యం చేయడానికే ఓరియంటలిజాన్ని ప్రవేశపెట్టారు.

ఓరియంటలిస్ట్ రచయితలు చాలా మంది పూజారులే. పదిహేనవ శతాబ్దం నుంచి ఇస్లామీయ చరిత్రను వీళ్ళు తిరగరాస్తున్నారు. ఇస్లామీయ చరిత్రను వక్రీకరించి చూపిస్తున్నారు. ముస్లిమ్ సమాజాలకు దుర్మార్గపు దుష్ట లక్షణాలను ఆపాదించి ప్రచారం చేస్తున్నారు. దివ్యఖుర్‌ఆన్ విషయంలో అసంబద్ధమైన, పునరుక్తులతో కూడిన, హింసాత్మకమైన, ప్రాముఖ్యం లేని పుస్తకంగా చిత్రీకరించడం జరుగుతోంది. ప్రవక్త ముహమ్మద్ (స) విషయంలోను అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. నైతికత లేని, విశృంఖలమైన వ్యక్తిగా ప్రచారం చేస్తున్నారు. ముస్లిమ్ ఆలోచనావిధానాన్ని, శాస్త్రసాంకేతిక రంగాల్లో వారి విజయాలను ఉద్దేశ్యపూర్వకంగా అణిచివేసి విజ్ఞానశాస్త్ర చరిత్రలో కనబడకుండా తుడిచేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓరియంటలిజమ్ అనేది మేధోపరమైన అధ్యయనశాఖ కానే కాదు. ఇది నిజానికి ఇస్లామ్ పట్ల పాశ్చాత్య దృక్పథం. ఇస్లామ్‌ను సెక్సు, హింస, మంత్రతంత్రాలు, మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాలు, వక్రమార్గాల అనాగరిక సమ్మేళనంగా చిత్రీకరిస్తూ యూరోపు యాత్రికులు, నవలాకారులు, కళాకారులు పుంఖానుపుంఖాలుగా సాహిత్యాన్ని, వర్ణచిత్రాలు, కళారూపాలను రూపొందించారు. ఇలాంటి రచయితలు చాలా మంది ఉన్నారు. ఉదాహరణకు ఫ్లిచర్డ్ బర్టన్ ((1890), ఇసాబెల్లా ఇబర్‌హర్డ్ (1904), టి.యి.లారెన్స్ (1935) వంటి వారు గూఢచారులుగా లేదా యూరపులో సాధ్యం కాని లైంగిక సంతృప్తిని పొందే ఉద్దేశ్యంతో ముస్లిమ్ దేశాల్లో పర్యటించారు.

## 4. యూరపులో ముస్లిమ్ అధ్యయనాల వ్యాప్తి

పదిహేనవ శతాబ్దం వరకు విజ్ఞానశాస్త్రం ఇస్లామీయ భూభాగాల నుంచి యూరపుకు బదిలీ అవుతూ వచ్చింది. ముస్లిమ్ మేధావుల రచనలను లాటిన్ తదితర యూరోపు భాషల్లోకి అనువదించడం జరిగేది. వీటిని పాఠ్యగ్రంథాలుగా, ప్రాక్టికల్ మాన్యువల్స్‌గా ఉపయోగించేవారు. ముస్లిమ్ అధ్యయనా కేంద్రాలను పాశ్చాత్య మేధావులు తరచూ సందర్శించేవారు. యూరోపు విద్యార్థులు కార్డోబా, ఫెజ్, కైరో, బగ్దాద్, సమర్‌ఖండ్ వంటి ప్రాంతాలకు గొప్ప గొప్ప అధ్యాపకుల వద్ద విద్యాభ్యాసానికి వెళ్ళేవారు. నేడు ముస్లిమ్ దేశాల నుంచి విద్యార్థులు ఉన్నత చదువుల కోసం యూరపు, ఉత్తర అమెరికాలకు ఎలా వెళుతున్నారో అప్పట్లో యూరపు విద్యార్థులు ముస్లిమ్ ప్రాంతాలకు వెళ్ళేవారు. అప్పట్లో విజ్ఞానశాస్త్రం, సంస్కృతి అధ్యయనాల్లో అరబీ భాష మాధ్యమంగా ఉండేది. విద్యాజ్ఞానాలు, అధ్యయనాల పట్ల ఆసక్తి కలిగిన వారు, మేధావులుగా గుర్తించబడాలని భావించేవారు ముస్లిముల మాదిరిగా దుస్తులు ధరించేవారు. యూరపు పునరుజ్జీవనం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, వైద్యం తదితర శాస్త్రాల్లో సాధించిన విజయాలు నిజానిక ముస్లిమ్ మేధావులు, ఆలోచనాపరులు, శాస్త్రవేత్తల విజయాల పునాదులపై నిలబడినవే.

నిజానికి ముస్లిమ్ నాగరికత ప్రమేయమే లేకపోతే యూరపు పునరుజ్జీవనం కూడా సాధ్యమయ్యేది కాదు. కాని ఈ వాస్తవాన్ని పాశ్చాత్యులు ఎన్నడూ ఒప్పుకోరు. మరోవైపు ముస్లిమ్ మేధావులు శాస్త్రవేత్తల విజయాలను తమవిగా చెప్పుకోవడం, ఉద్దేశ్యపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా ముస్లిమ్ శాస్త్రవేత్తల విజయాలను తక్కువ చేసి చూపడం జరుగుతోంది.

## యూరప్ – ఇస్లామోఫోబియా

"ముహమ్మద్ ఇన్ యూరప్" పుస్తకంలో మినో రీవ్స్ చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి.

"ఇస్లామ్ వల్ల యూరపుకు సైనిక ప్రమాదం మాత్రమే లేదు, సైద్ధాంతికంగా, నైతికంగా కూడా ఇస్లామ్ సవాలుగా మారింది. ఎందుకంటే, ఇస్లామ్ ఒక ప్రత్యామ్నయ దృక్పథాన్ని ప్రతిపాదిస్తోంది. సాంస్కృతిక, శాస్త్ర రంగాల్లో యూరపును చూసి అరబ్బు ప్రపంచం నవ్వుకునేది. వైద్యం, గణితం, భౌతికశాస్త్రలో ఆప్టిక్స్, ఖగోళశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం తదితర శాస్త్రాల్లో పాశ్చాత్య క్రయిస్తవుల కన్నా అరబ్బులు చాలా ముందంజలో ఉండేవారు. భారతీయ సున్నాను స్వీకరించి అరబ్బు గణితశాస్త్రవేత్తలు అంకగణితాన్ని చాలా సరళీకరించారు. గణితశాస్త్రంలో కొత్త విభాగాలకు ద్వారాలు తెరిచారు. ఆల్జీబ్రా, అనలిటికల్

జామెట్రీ, స్ఫిరికల్ ట్రిగొనామెట్రీ వంటి కొత్త విభాగాలను ప్రారంభించింది ముస్లిములే. యురపులో క్రీ.శ.1600 వరకు విశ్వవిద్యాలయాల్లో ప్రధానమైన పాఠ్యపుస్తకంగా అవిసేన రాసిన కేనన్ ఆఫ్ మెడిసిన్ గ్రంథమే కొనసాగింది. అవిసేన పదకొండవ శతాబ్ధానికి చెందిన పర్షియన్ శాస్త్రవేత్త, తత్వవేత్త. శరవేగంగా విస్తరించిన ఇస్లామీయ సామ్రాజ్యంలో ఆయన మాతృభూమి కూడా భాగమైంది. అరబ్బులు స్పెయిన్‌లో, సిసిలీలో అరబ్బులు అనువాద కేంద్రాలను స్థాపించారు. ఈ కేంద్రాల వల్ల గ్రీకు, సిరియా, పర్షియా, సంస్కృత భాషల్లోని జ్ఞానాన్ని అరబ్బీలోకి అనువదించారు. ఆ తర్వాత ఈ గ్రంథాలను లాటిన్‌లోకి అనువదించడం జరిగింది. ఈ అనువాద కేంద్రాలకు అనుసంధానంగా పెద్ద పెద్ద లైబ్రరీలు, ఖగోళవేధశాలలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో పరిశోధనలను ప్రోత్సహించేవారు. ఆ విధంగా ప్రాచ్య, పాశ్చాత్య దేశాలకు మధ్య మేధోపరమైన, శాస్త్రపరమైన సమాచార బదిలీకి స్పెయిన్, సిసిలీలు వేదికలయ్యాయి. ఈ పరిణామం యూరోపియన్ హ్యూమనిజానికి, పునరుజ్జీవనానికి దారితీసింది."

"కాని ఎడారి ప్రాంతానికి చెందిన సంచార బదూయిన్ ప్రజలు, గిరిజన సముదాయాలుగా నాగరికత ప్రారంభించిన ప్రజలు అత్యంత స్వల్ప కాలంలో విజ్ఞానసాంకేతిక రంగాల్లో ఈ అద్భుతమైన ప్రగతి ఎలా సాధించారు? ఈ ప్రశ్నకు జవాబు చాలా సరళమైనది. కొత్త మతధర్మంలో ఉన్న స్వచ్ఛత కారణంగా అరబ్బులు తమ విశ్వాసాన్ని అరబ్బు ద్వీపకల్పం దాటి విస్తరించగలిగారు. అప్పట్లో నాగరికతా కేంద్రాలుగా ఉన్న పర్షియా, గ్రీక్, బైజాంటైన్ ప్రాంతాలకు విస్తరించారు. సుసంపన్నమైన పర్షియన్, గ్రీకు తత్వశాస్త్రాలను వారసత్వంగా పొందారు. పర్షియన్ కులీనులు పాటించే దర్బారు మర్యాదలు, అలవాట్లు, సంప్రదాయాలను నేర్చుకున్నారు. వాటినే దక్షిణ యూరపులో ప్రవేశపెట్టారు. ఈ విధంగా యూరోపులో ముస్లిమ్ సంస్కృతి ఆధిక్యత ప్రదర్శితమైంది. ఈ పరిణామం యూరోపియన్లకు మింగుడుపడలేదు, ఈర్ష్యాసూయలు, నిరాశనిస్పృహలు వారిని కమ్ముకున్నాయి. అరబ్బుల ఈ విజయాలకు ప్రవక్త ముహమ్మద్ (స) ఆద్యుడన్న భావన యూరపులో జీవనరంగాలన్నింటా వ్యాపించింది. మధ్యయుగాల యూరపులో (యూరపు చరిత్రలో మధ్యయుగం 5వ శతాబ్దం నుంచి 15వ శతాబ్ధం వరకు కొనసాగింది. పాశ్చాత్య రోమన్ సామ్రాజ్య పతనంతో ఇది ప్రారంభమయ్యింది.) యూరపులో ఇస్లామ్ పట్ల నెలకొన్న ఈ భయం ప్రవక్త ముహమ్మద్ పట్ల ద్వేషంగాను, ప్రవక్త ముహమ్మద్ (స)ను వక్రీకరించడంగాను బహిర్గతమయ్యింది.

ముస్లిముల నుంచి ఎంతో నేర్చుకున్న యూరపు నేడు ఎందుకు పురోగమిస్తోంది, ముస్లిము ప్రపంచం ఎందుకు వెనుకబడిపోయిందన్న విషయంపై ముస్లిములు

ఆలోచించవలసిన అవసరం ఉంది. నిజం చెప్పాలంటే, పాశ్చాత్య వలసవాదానికన్నా ముందే ముస్లిమ్ ప్రపంచంలో ఈ స్తబ్ధత ప్రారంభమయ్యింది. ఈ స్తబ్ధత వల్లనే పాశ్చాత్య వలసలను ప్రతిఘటించడం ముస్లిమ్ ప్రపంచానికి కష్టమయ్యింది. పాశ్చాత్య ప్రపంచంలో ముస్లిములకు, ప్రవక్త ముహమ్మకు వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రచారం ఇస్లామ్ ప్రగతిపథాన పురోగమిస్తున్నప్పుడే ప్రారంభమయ్యింది. ముస్లిమ్ ప్రపంచంలో స్తబ్ధత నెలకొని, యూరోపు పురోగమించడం ప్రారంభమైనప్పుడు కూడా ఈ విద్వేష ప్రచారం ఆగలేదు. పైగా మరింత ఉధృతమయ్యింది. ఈ పరిణామాలు ముస్లిమ్ ప్రపంచంలో ఆగ్రహావేశాలను రాజేశాయి.

(మినో రీవ్స్, ముహమ్మద్ ఇన్ యూరప్: ఏ థౌజండ్ ఇయర్స్ ఆఫ్ వెస్టర్న్ మైథ్ మేకింగ్, ఎన్‌వైయు ప్రెస్, 2001)

## 5. వలసవాదం

యూరోపియన్ రాజ్యాలు బ్రిటన్, ఫ్రాన్స్, హాలెండ్‌లు ముస్లిమ్ దేశాల్లో వలసలను విస్తరించాయి. ఈ రాజ్యాలన్నీ వలస ప్రాంతాల్లో దాదాపు ఒకేవిధంగా వ్యవహరించాయి. దురాక్రమణలకు అందరూ విభజించి ఆక్రమించుకునే నీతినే పాటించారు. ఉదాహరణకు భారతదేశంలో కూడా ఒక రాజ్య పాలకుడిని మరో పాలకుడిపై రెచ్చగొట్టి వారు పోరాటాల్లో మునిగి బలహీనమయ్యేలా చేశారు. ఆ విధంగా బ్రిటీష్‌వాళ్ళు ముగల్ సామ్రాజ్యాన్ని ఆక్రమించుకున్నారు. భారతదేశంలో 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అప్పటి భారత సాధారణ జనసముదాయం బ్రిటీషు వారిని పారద్రోలడానికి చేసిన చివరి ప్రయత్నం. ఈ ప్రయత్నం దారుణంగా విఫలమయ్యింది. భారతదేశంలో చిట్టచివరి ముగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ బ్రిటీషు వారి స్వేచ్ఛావిపణి పట్ల పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఆయన బ్రిటీష్ ఉద్దేశ్యాలను అనుమానించాడు. వారికి వాణిజ్యపరమైన రాయితీలు ఇవ్వడానికి నిరాకరించాడు. ఆయన అనుమానాలు నిజమేనని నిరూపితమయ్యాయి.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి నాయకత్వం వహించింది ఆయనే. ఈ తిరుగుబాటు విఫలమయ్యింది. స్థానికులకు బ్రిటీషు వారు నేర్పిన నాగరికత ఏమంటే, ముగల్ చక్రవర్తి కుటుంబ సభ్యులందరి తలలు నరికి వెండిపళ్ళెంలో ఆయన ముందు పెట్టారు. జఫర్‌ను దేశం నుంచి రంగూన్‌కు బహిష్కరించారు. అక్కడ ఆయన దయనీయస్థితిలో మరణించారు. అక్కడే ఆయన ఉర్దూలో అత్యుత్తమ సాహిత్యంగా పరిగణించబడే కవిత్వం రాశారు.

దురాక్రమణతో అదుపు సాధించిన తర్వాత వలస శక్తులు ముస్లిమ్ సమాజంలో శాస్త్రసాంకేతిక అధ్యయనాలను, వారి నైపుణ్యాలను క్రమేణా నిర్మూలించే ప్రయత్నం చేశారు.

ఉదాహరణకు మేథోపరమైన, అధ్యయనాత్మకమైన, విద్యాపరమైన కార్యకలాపాలన్నింటిని వలసపాలకులు నిషేధించారు. డచ్ వలస పాలకులు ఇండోనేషియాను 1595లో ఆక్రమించుకున్నప్పుడు అక్కడ మదరసాలను, కళాశాలలను, లైబ్రరీలను మూయించి, విద్యాభ్యాసాన్ని నిషేధించారు. డచ్‌వాళ్ళు తమ కోసం ఏర్పాటు చేసుకున్న కొన్ని లైబ్రరీల్లోకి స్థానికులను అనుమతించేవారు కాదు. 1850లో కేవలం ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మాత్రం స్థానికులకు అనుమతించారు. అప్పుడు కూడా సెకండరీ స్థాయి విద్యాభ్యాసానికి అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత ఇస్లామీయ వైద్యశాస్త్రాన్ని పూర్తిగా ధ్వంసం చేయడం ప్రారంభమయ్యింది. పందొమ్మిదవ శతాబ్దం ప్రారంభంలో టూనీషియాలో వైద్యం చేయడానికి ఒక ఫ్రెంచ్ డాక్టరు అక్కడి ప్రధాన ముస్లిమ్ వైద్యునితో అనుమతి తీసుకోవలసి ఉండేది. పందొమ్మిదవ శతాబ్దం చివరినాటికి ఫ్రెంచ్ వలసపాలకులు ఇస్లామీయ వైద్యవిధానాన్ని తక్కువస్థాయి వైద్యంగా అణిచివేశారు. క్రమేణా ముస్లిమ్ ప్రపంచంలో ఇస్లామీయ వైద్యాన్ని నాశనం చేశారు.

## వలసవాద ఉత్పత్తి

వలసశక్తులు తాము ఆక్రమించుకున్న ముస్లిమ్ దేశాల నుంచి సమస్తాన్ని దోచుకువెళ్ళాయి. వలసల నుంచి ముడిసరుకులను దోచుకెళ్ళడానికి ఒక వ్యవస్థనే రూపొందించుకున్నాయి. ఉదాహరణకు ఉత్తర ఇంగ్లాండ్‌లోని బట్టల మిల్లులు భారతదేశంలోని బట్టల పరిశ్రమను నాశనం చేసి ఆ అవశేషాలపై నిర్మించుకున్నారు. పారిశ్రామిక విప్లవం, వలసవాదం ఈ రెండూ అవినాభావ సంబంధం ఉన్న అంశాలు.

యూరోపు పాలకులు ఒక ప్రత్యేక తరగతిని రూపొందించారు. సివిల్ సర్వెంట్స్, ప్రభుత్వ ఉద్యోగుల తరగతిని సృష్టించాయి. ఈ సివిల్ సర్వెంట్స్ వలసపాలకులకు సహాయపడే స్థానిక తరగతిగా రూపొందింది. మెకాలే 1835లో మినిట్స్ ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్ రాసినప్పుడు వలసపాలకులందరి ఆలోచనలనే అందులో పొందుపరిచాడు. ఆయన ఏం రాశాడంటే :

> "మనకు, మనం పాలించే లక్షలాది ప్రజానీకానికి మధ్య దుబాసీ పనిచేయగలిగిన వారిని ముందుగా తయారు చేసుకోవాలి. ఈ దుబాసీలు నిజానికి భారతసంతతికి చెందిన వారైనా అభిరుచులు, ఆలోచనలు, నైతికత విషయంలో బ్రిటీషువారిగా ఉండాలి."

ముస్లిమ్ ప్రపంచంలో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ, డచ్‌వారి ఈస్ట్ ఇండీస్ కంపెనీలు స్వేచ్ఛావిపణి ప్రయత్నాలు. వారు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోడానికి వివిధ ముస్లిమ్ పాలకులు కావలసిన రాయితీలు ఇచ్చారు. కాని ఈ వలసశక్తులు కేవలం వాణిజ్యంతో సరిపెట్టుకోలేదు. దురాక్రమణలకు కూడా పాల్పడ్డాయి.

ఈ నేపథ్యంలో ముస్లిమ్ సమాజాలు ప్రయోగాలకు వేదికలయ్యాయి. నాగరికత తామే నేర్పగలమనుకునే ఆధునిక మెషినరీలు, ప్రగతి, శాస్త్రవిజ్ఞానాలను తప్ప మరి దేనినీ నమ్మనివారు, శ్వేతజాతి భారాన్ని (వైట్‌మ్యాన్స్ బర్డెన్) మోస్తున్నామని భావించేవారు కొత్త కొత్త ఊహాత్మక సామాజిక, విద్యాయిక, సాంస్కృతిక విధానాల ప్రయోగాలను ముస్లిమ్ సమాజాల్లో కొనసాగించారు.

వలసవాదం ముస్లిమ్ నాగరికతను ధ్వంసం చేసింది. కేవలం ముస్లిమ్ ప్రాంతాలను ఆక్రమించుకోవడమే కాదు, ముస్లిములను శారీరకంగా బలహీనులు చేయడమే కాదు మానసికంగా కూడా దాస్యభావానికి గురిచేసింది. ఇస్లామ్‌కు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని నిమ్నతరమైనదిగా, అల్పమైనదిగా చిత్రీకరించింది. ముస్లిమ్ సమాజాల సాంస్కృతిక ప్రాధాన్యతలను మార్చేసింది. ముస్లిమ్ దేశాల్లోని సంపద వనరులన్నింటినీ దోచుకుంది. ముస్లిమ్ జనసముదాయాలు దారిద్ర్యానికి గురయ్యేలా చేసింది.

ఇస్లామ్ సమస్యలను పరిష్కరించడానికి జరిగిన ఈ పాశ్చాత్య ప్రయత్నాల్లో అనేక నేరాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు ముస్లిములకు వ్యతిరేకంగా జరిగాయి. మాటల్లో చెప్పరాని అణిచివేతలు చోటుచేసుకున్నాయి. యూరోపియన్ ఆలోచనలు, భావాలు, చరిత్రలో ఇస్లామ్ ముస్లిములంటే దుష్టశక్తులన్న అభిప్రాయాన్ని వ్యవస్థీకృతం చేశాయి. (జియావుద్దీన్ సర్దార్; ఇంట్రోడ్యూసింగ్ ఇస్లామ్, 2009, నేషనల్ బుక్ నెట్‌వర్క్, ఐకాన్ బుక్స్ లిమిటెడ్, లండన్)

## ఆధునిక విద్వేషం

పాశ్యాత్య ఆలోచనల్లో గూడుకట్టుకున్న విద్వేషం కాలం గడిచిన కొద్ది మరింత పేరుకుపోయింది. ఆధునిక కాలంలో ఆధునిక రూపాలను సంతరించుకుంది. నేడు పాశ్చాత్యదేశాలు ముస్లిమ్ ప్రపంచాన్ని రక్తసిక్తం చేయాలని నడుంకట్టాయి. ప్రాచ్యదేశాలను లొంగదీయడానికి పూనుకున్నాయి. సెప్టెంబర్ 11, 2001లో జరిగిన దుర్ఘటన వారికి కావలసిన అవకాశాన్ని బంగారు పళ్ళెంలో పెట్టి ఇచ్చింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై సైనికదాడులు చేయడానికి మంచి సాకు దొరికింది. ఆ రెండు దేశాల్లో మొత్తం ఇన్‌ఫ్రాస్టక్చర్ సర్వనాశనం చేశారు. అమాయకపౌరులను వధించారు. లక్షలాదిమంది నిహతులయ్యారు, ఇళ్ళు

కోల్పోయారు, వికలాంగులయ్యారు. ఇస్లామ్‌ను, ముస్లిములను దుర్మార్గులుగా చిత్రీకరించే సరికొత్త పరంపర ప్రారంభమైంది. కాని దీనివల్ల కొందరు ముస్లిమ్ యువకులు తీవ్రవాద మార్గం పట్టేలా చేయడం తప్ప పాశ్చాత్యదేశాలు సాధించింది ఏదీ లేదు. పాశ్చాత్యుల హింసాకాండను భరించిన ముస్లిమ్ యువత తీవ్రవాదాన్ని ఆశ్రయించడమన్నది అటు పాశ్చాత్యదేశాలకు కాని, ఇటు ముస్లిమ్ దేశాలకు కాని రెండింటికి మంచిది కాదు. ఎందుకంటే విద్వేషానికి మతోన్మాదం జవాబు కానేకాదు. పదమూడు శతాబ్ధాలుగా పాశ్చాత్యదేశాల్లో గూడుకట్టుకున్న అపార్థాల విద్వేషం నేడు కొత్త ఇండియా, మయన్మార్ వంటి దేశాల్లోని మతతత్వశక్తులకు సాధనంగా ఉపయోగపడుతోంది. ముస్లిములు ఈ దేశాలను పాలించిన కాలంలో ఎన్నడూ కనబడని ముస్లిమ్ విద్వేషం నేడు ఈ ప్రాంతాల్లో వీరంగం వేస్తోంది.

గతంలో పాశ్చాత్యవ్యవస్థ ఇస్లామ్‌ను మేధోపరంగా, సైద్ధాంతికంగా ఎదుర్కోవడానికి ఆసక్తి చూపలేదు. ఇస్లామ్ చాలా సరళమైనది. పాశ్చాత్య ప్రజలకు సులభంగా అవగాహనయ్యే ధర్మం. అలాంటి ఇస్లామ్‌పై దాడులు చేయడం వల్ల అనవసరంగా క్రయిస్తవ ఛాందసభావాలపై విమర్శలు వస్తాయి కాబట్టి ప్రవక్త ముహమ్మద్ (స)పై, సలాహుద్దీన్ అయ్యూబీ వంటి వారిపై వ్యక్తిగత దాడులకు పూనుకుంటున్నారు. వీరిని దుర్మార్గులుగా, దుష్టులుగా చిత్రించడం ద్వారా ఇస్లామీయ సిద్దాంతాల్లోనే లోపం ఉందన్న భావం కలిగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి విద్వేషాలను ప్రచారం చేయడం వల్ల శాంతిని సాధించలేము. అవగాహన, సౌహార్దభావాల ద్వారానే శాంతిని నెలకొల్పగలం.

# మన రాజకీయాల్లో మతతత్వవిషాన్ని తొలగించాలి

## మార్కండేయ కట్జూ

**(భారత సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్)**

మతవిద్వేషాన్ని ప్రచారం చేస్తున్న, మతవిద్వేషంపై బతుకుతున్న శక్తులన్నింటిని భారతదేశం ఓడించవలసి ఉంది. నేడు భారతదేశంలో అనేకమంది హిందువులు, ముస్లిములు ఈ మతవిద్వేష వైరస్ బారిన పడినప్పటికీ, నిజానికి 1857కు ముందు భారత ప్రజల్లో ఎలాంటి మతవిద్వేష భావాలు ఉండేవి కావు. హిందూ ముస్లిముల మధ్య కొన్ని అభిప్రాయభేదాలు ఉండేవన్నది నిజమే, కాని వైరం లేదు. ఈద్ పండుగలో ముస్లిములతో పాటు హిందువులు కూడా పాలు పంచుకునేవారు. హెూలీ, దిపావళి పండుగల్లో ముస్లిములు పాలు పంచుకునేవారు. అందరు సోదరుల్లా కలిసిమెలిసి జీవించేవారు.

కాని 150 సంవత్సరాల తర్వాత వైరం కాకపోయినా అనుమానాలు ఎలా పుట్టాయి. భారత ఉపఖండంలోని రెండు అతిపెద్ద సముదాయాల మధ్య అపార్థాలు ఎలా జనించాయి? నేడు దేశంలో హిందువులు తమ ఇళ్లను ముస్లిములకు అద్దెకివ్వడానికి ఇష్టపడని వాతావరణం ఉంది. దేశంలో ఎక్కడైనా బాంబు ప్రేలుడు జరిగితే, అసలు దోషులను పట్టుకోవడం చేతకాని పోలీసులు (ఎందుకంటే శాస్త్రీయ పరిశోధనలో వారికి ఎలాంటి శిక్షణ లేదు.) ఒక అరడజను ముస్లిమ్ యువకులను అరెస్టు చేసి సమస్య పరిష్కరించేస్తున్నారు. చివరకు ఆ అరెస్టయిన ముస్లిముల్లో చాలా మంది నిర్దోషులుగా న్యాయస్థానాలు తేల్చి చెబుతున్నాయి. కాని అప్పటికీ అనేక సంవత్సరాలు వారు జైళ్ళలో మ్రగ్గవలసి వస్తుంది. దీని వల్ల భారతదేశంలో ముస్లిములు ప్రధాన స్రవంతికి దూరమైపోతున్నారు. పాకిస్తాన్‌లో మైనారిటీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ వాళ్ళు అనుక్షణం భయభీతులకు గురై బతకవలసి వస్తుంది. ఉగ్రవాదుల భయం, మతోన్మాదుల భయం వారిని వెంటాడుతోంది.

## మైలురాయి

భారతదేశంలో మతవర్గాల మధ్య సంబంధాల విషయానికి వస్తే 1857వ సంవత్సరం ఒక మైలురాయి వంటిది. 1857కు ముందు మతకలహాలనేవి లేవు. మతపరమైన సమస్యలు ఏవీ లేవు. హిందూ ముస్లిముల మధ్య కొన్ని విభేదాలుండేవన్నది నిజమే, కాని ఒకే తండ్రికి పుట్టిన బిడ్డల మధ్య కూడా విభేదాలుంటాయి. హిందువులు ముస్లిములు శాంతియుతంగా జీవించేవారు. ఒకరికొకరు సహాయపడేవారు. కష్టసమయంలో ఒకరినొకరు ఆదుకునేవారు.

భారతదేశంపై దాడి చేసినప్పుడు ముస్లిము రాజులు మందిరాలను పడగొట్టారన్నది నిజమే. కాన వారి వారసులు స్థానిక ముస్లిమ్ రాజులుగా మారారు. దాదాపు వీళ్ళందరూ మతసామరస్యాన్ని ప్రోత్సహించారు. మతసామరస్యం వారికి అవసరం. ఎందుకంటే దేశంలో అత్యధిక జనాభా హిందువులే. హిందువుల ఆలయాలు కూల్చేస్తే అలజడి చెలరేగుతుందని, అల్లర్లు జరుగుతాయని వారికి తెలుసు. ఇలాంటి పరిస్థితిని ఏ పాలకుడు కోరుకోడు. అందువల్ల భారతదేశాన్ని పాలించిన ముస్లిమ్ రాజులందరూ మతసామరస్యాన్ని ప్రోత్సహించారు. ముగల్ చక్రవర్తులు, అవథ్, ముర్షిదాబాద్, ఆర్కాట్ నవాబులు, టిప్పుసుల్తాన్, హైదరాబాద్ నిజామ్ అందరూ మతసామరస్యాన్నే కోరుకున్నారు.

1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. ఈ పోరాటంలో హిందువులు, ముస్లిములు కలిసి బ్రిటీషువారిపై తిరగబడ్డారు. ఈ తిరుగుబాటును అణిచివేసిన తర్వాత బ్రిటీషువారు భారతదేశాన్ని అదుపు చేయడానికి "విభజించు-పాలించు" విధానాన్ని అవలంబించారు. అప్పుడు భారతదేశానికి సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా ఉన్న సర్ చార్లెస్ వుడ్ 1862లో వైస్రాయ్ లార్డ్ ఇగ్లిన్‌కు ఒక లేఖ రాశాడు. "మనం భారతదేశంలో ఒక సముదాయాన్ని మరో సముదాయంపై రెచ్చగొట్టడం ద్వారా దేశంలో మన అధికారాన్ని కాపాడుకుంటూ వచ్చాం. ఈ విధానాన్ని మనం కొనసాగించవలసి ఉంది. ఈ దిశగానే ప్రయత్నించండి. కాబట్టి, ప్రజలందరూ ఉమ్మడి అభిప్రాయాలు కలిగి ఉండకుండా చూడండి." అని రాశాడు.

## విభజించు-పాలించు

సెక్రటరీ ఆఫ్ స్టేట్ విస్కంట్ క్రాస్ 1887 జనవరి 14న గవర్నర్ జనరల్ డఫ్లిన్‌కు ఒక లేఖ రాశాడు. "మతపరమైన ఈ విభజన మనకు ఎంతో అనుకూలమైనది. భారత విద్యావ్యవస్థ, బోధనా సామాగ్రికి సంబంధించి మీ ఎంక్వయిరీ కమిటీ మరింత మంచి ఫలితాలు

సాధిస్తుందని ఎదురు చుస్తున్నాను.” అని రాశాడు.

ఇండియాకు సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా ఉన్న జార్జి హామిల్టన్ అప్పట్లో గవర్నర్ జనరల్‌గా ఉన్న కర్జన్‌కు ఒక లేఖ రాశాడు. “భారతదేశంలో మన పాలనకు ఎదురయ్యే అసలైన ప్రమాదం ... పాశ్చాత్య భావాలను క్రమేణా వారు అందిపుచ్చుకోవడంగా భావిస్తున్నాను. మనం కనుక విద్యావంతులైన భారతీయులను రెండు వర్గాలుగా (హిందూ, ముస్లిములు) విభజిస్తే, ఈ విభజన ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు. విద్యావ్యాప్తి వల్ల మన పాలనావ్యవస్థపై జరిగే నిరంతరమైన దాడులను ఆవిధంగా ఎదుర్కొని మన అధికారాన్ని బలపరచవచ్చు. అందువల్ల మనం రెండు వర్గాల మధ్య విభేదాలను పెంచేలా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.”

## రెచ్చగొట్టే మతపెద్దలకు లంచాలు

ఇంగ్లీషు కలెక్టరు రహస్యంగా పండిత్‌జీని పిలిచేవాడు. ముస్లిములకు వ్యతిరేకంగా మాట్లాడాలని చెప్పి కొంత డబ్బిచ్చి పంపేవాడు. అదేవిధంగా మౌల్వీని పిలిచి డబ్బిచ్చి హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడమనేవాడు.

## మతవిద్వేషం పెంచడానికి చరిత్ర వక్రీకరణ

ఇంతకు ముందు పేర్కొన్నట్లు, ఇక్కడ ప్రారంభంలో దండయాత్రలు చేసిన ముస్లిమ్ రాజులు మందిరాలను నష్టపరిచారు. కాని వారి వారసులు (అక్బర్ వంటి వారు. ఈయన బాబర్‌కు వారసుడు) స్థానిక ముస్లిములయ్యారు. ఈ స్థానిక ముస్లిమ్ రాజులు మందిరాలను పడగొట్టలేదు. పైగా అనేక మందిరాలకు కానుకలు, జాగీర్లు ఇచ్చారు. రామ్‌లీలాలు నిర్వహించేవారు. హెూలీ, దీపావళి పండుగల్లో పాల్గొనేవారు. (అవధ్, ముర్షిదాబాద్, ఆర్కాట్ నవాబులు మొదలైనవారు). ప్రారంభ ముస్లిమ్ దండయాత్రల తర్వాత స్థానిక ముస్లిమ్ రాజులుగా మారిన వీరందరూ మతసామరస్యాన్ని ప్రోత్సహించారు. కాని ఈ చరిత్రను మన చరిత్ర పుస్తకాల్లో పూర్తిగా అణిచేశారు. మన పిల్లలకు మనం ఇప్పుడు ముహమ్మద్ గజనీ సోమనాథ ఆలయాన్ని పడగొట్టాడన్నదే చెబుతున్నాం కాని టిప్పు సుల్తాన్, ముగల్ చక్రవర్తులు మొదలైనవారు హిందూ మందిరాలకు జాగీర్లు ఇచ్చారని, హిందూ పండుగల్లో పాలు పంచుకునేవారని చెప్పడం లేదు. (చూడండి. హిస్టరీ ఇన్‌ది సర్వీస్ ఆఫ్ ఇంపీరియలిజమ్, బి.ఎన్.పాండే)

## మతకలహాలను రెచ్చగొట్టడం

మతకలహాలన్నీ 1857 తర్వాతనే జరిగాయి. అంతకు ముందు ఒక్కటి కూడా లేదు. మతకలహాలను అనేక రకాలుగా రెచ్చగొట్టేవారు. ఉదాహరణకు మస్జిదు ముందు ప్రార్థన సమయంలో బిగ్గరగా మ్యూజిక్ వాయించడం లేదా హిందూ విగ్రహాలు ధ్వంసం చేయడం వంటి పద్ధతుల ద్వారా మతకలహాలు రెచ్చగొట్టేవారు.

ఈ విషాన్ని బ్రిటీషు పాలకులు మన రాజకీయవ్యవస్థలో ఒక పద్ధతి ప్రకారం కలిపేశారు. సంవత్సరాలుగా, దశాబ్దాలుగా గూడుకట్టుకున్న ఈ విషం చివరకు 1947లో దేశవిభజనగా భగ్గుమంది. నేడు కూడా మతవిద్వేషం ఊపిరిగా బతుకుతున్న దుష్టశక్తులు ఉన్నాయి. ఎప్పుడు బాంబు ప్రేలుడు జరిగినా వెంటనే టి.వీ.చానల్స్ తమకు ఎస్.ఎమ్.ఎస్. వచ్చిందని, లేదా ఈ మెయిల్ వచ్చిందని, ముస్లిమ్ ముజాహిదీన్, జైషె ముహమ్మద్; హర్కతుల్ జిహాదుల్ ఇస్లామీయ వంటి ఏదో ఒక సంస్థ ఈ ప్రేలుడు తమ పనే అని చెప్పిందని వార్తలు ప్రసారం చేస్తాయి. ఇలా ఏ తుంటరి అయినా ఎస్.ఎం.ఎస్ లేదా ఈ మెయిల్ పంపవచ్చు. కాని ఆ వార్తను టి.వీలో ప్రసారం చేయడం వల్ల తర్వాతి రోజు దినపత్రికల్లో ఆ వార్త రావడం వల్ల ముస్లిములు టెర్రరిస్టులని, బాంబులు వేస్తుంటారన్న భావాన్ని హిందువుల మనస్సుల్లో సృష్టిస్తున్నారు. కాని నిజానికి 99 శాతం ప్రజలు వారు ఏ సముదాయానికి చెందిన వారైనా శాంతినే కోరుకుంటారు. బాబరీ మస్జిద్ రామజన్మభూమి వివదం సందర్భంగా మీడియాలో కొందరు ముఖ్యంగా హిందీమీడియా స్వయంగా కరసేవకుల్లా మారిపోయింది.

**బెంగుళూరులో భయాందోళనలు :** బెంగుళూరు తదితర నగరాల్లో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు 2012 సంవత్సరం మధ్యలో ఎస్.ఎం.ఎస్‌ల ద్వారా భయాందోళనలకు గురి చేయడం జరిగింది. అస్సామ్‌లో ముస్లిములను హతమార్చడం జరిగింది కాబట్టి మీరు బెంగుళూరు నుంచి బయటకు వెళ్ళిపోవడం మంచిదని లేకపోతే ఊచకోతలు జరగొచ్చని ఈ సందేశాల్లో భయపెట్టడం జరిగింది. దాంతో ఒక్కసారిగా భయందోళనలు వ్యాపించాయి. ఈ కుట్ర గురించి తర్వాత ముస్లిములకు తెలిసింది. వారు వెంటనే ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఒక విందు భోజనం ఏర్పాటు చేసి తాము వారికి వ్యతిరేకం కాదని, ఈ సందేశం ఎవరో అల్లరిశక్తులు చేసిందని వివరించారు. దుష్టశక్తుల ఈ స్వార్థ పన్నాగాలను ప్రజలు గ్రహించవలసిన అవసరం ఉంది. భారతదేశం వైవిధ్యభరితమైన దేశం. సమాజంలోని అన్ని వర్గాలు, అన్ని సముదాయాలకు సమాన గౌరవమర్యాదలు ఇవ్వడం ద్వారా మాత్రమే సమైక్యతను, సౌభాగ్యాన్ని సాధించగలం.

# జిహాద్

## జిహాద్ వివిధ రూపాలు

జిహాద్‌ను తప్పుగా అనువాదం చేస్తుంటారు. ఇస్లామ్ శత్రువులపై పవిత్రయుద్ధంగా చెబుతుంటారు. దీన్ని హింస, అణిచివేతలకు ప్రతిరూపంగా కూడా చాలా మంది వర్ణిస్తుంటారు. అరబిక్ భాషలో జిహాద్ అన్న పదం పట్ల వ్యక్తమయ్యే తీవ్రమైన ప్రతిస్పందనలు బహుశా మరే పదం విషయంలోను వ్యక్తం కావు. నేడు పాశ్చాత్య వ్యవస్థ ఇస్లామ్‌కు సంబంధించి అత్యంత వివాదాస్పదంగా తయారు చేసిన పదం కూడా ఇదే. మనోభావాలను రెచ్చగొట్టడానికి ఉపయోగిస్తున్న పదం కూడా ఇదే. మీడియాలోని పక్షపాత శక్తులు, ఇస్లామ్ వ్యతిరేకులు జిహాద్ అన్న పదాన్ని విమర్శించకుండా ఒక్క రోజు కూడా గడవదు.

జిహాద్ అన్న పదాన్ని దివ్యఖుర్‌ఆన్ బోధనల పరంగాను, ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాల పరంగాను పరిశీలించవలసి ఉంటుంది. అరబీ భాషలో జిహాద్ అన్న పదానికి "ప్రయత్నించడం", "సంఘర్షించడం" అన్న అర్థాలున్నాయి. "నేను నా శక్తిమేరకు ప్రయత్నిస్తాను" అన్న భావం ఉంది. ఈ ప్రయత్నం అనేది మేధోపరమైనది కావచ్చు, ఆధ్యాత్మికమైనది కావచ్చు, సామాజికమైనది, ఆర్థికమైనది, రాజకీయమైనది లేదా భౌతికమైనది కూడా కావచ్చు. కాబట్టి జిహాద్‌కు అనేక రూపాలున్నాయి. ఉదాహరణకు :

## అత్యుత్తమ జిహాద్

ప్రవక్త ముహమ్మద్ చెప్పిన ఒక ప్రవచనం ప్రకారం మనిషి తన మానసిక అభిలాషలకు వ్యతిరేకంగా చేసే ఆత్మసంఘర్షణ అత్యుత్తమ జిహాద్. అంటే మనిషి తన అహంకారంతో, తన దురాశతో, సంతృప్తిచెందని కోరికలతో, దుష్టభావాలతో సంఘర్షించడం, ఆత్మసంఘర్షణ మాత్రమే కాదు, సమాజంలోని చెడులకు దూరంగా ఉండడానికి ప్రయత్నించడం కూడా ఇందులో చేరి ఉంది. అన్ని విధాల అన్యాయాలు, అణిచివేతలతో సంఘర్షించి మంచిని,

న్యాయాన్ని, సమాజంలో శాంతిని స్థాపించడానికి ఉద్దేశించింది. ఇస్లామ్ అంటే శాంతి. జిహాద్ అనేది శాంతిని సాధించే పద్ధతి.

ఈ భావంలో జిహాద్ అనేది ఎంతో అవసరం. జిహాద్ ముఖ్యంగా రెండు కోణాల్లో కొనసాగాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా మనిషి సన్మార్గాన నడువడానికి చేసే జిహాద్ ఒకటైతే, సమన్యాయం కోసం సమాజంలో జరిగే జిహాద్ మరొకటి. జిహాద్ భావనను అద్భుతంగా అవిష్కరిస్తూ బీరుట్‌కు చెందిన యూసుఫ్ బిష్ ఇలా రాశారు. "మనిషి తనలో ఉన్న పశు స్వభావాన్ని అణచడానికి చేసే సంఘర్షణ అత్యుత్తమ జిహాద్. ఇది బాహ్యంగా జరిగే జిహాద్ కాదు, అంతర్గతంగా జరిగే జిహాద్. మనిషి తనలో ఉన్న మృగాన్ని అధిగమించడానికి చేసే పోరాటం ఇది. మనిషి స్వతహాగా కొన్ని మృగప్రాయమైన లక్షణాలు కూడా అంతర్గతంగా కలిగి ఉంటాడు. ఈ లక్షణాలను అణిచివేయకపోతే అతను అత్యంత ప్రమాదకరమైన మృగంలా మారిపోతాడు. ఈ లక్షణాలను అదుపు చేయడమే మనిషి తనపై తాను చేసే జిహాద్. మనిషికి తన్ను తాను అతిగా ఊహించుకునే లక్షణం కూడా ఉంటుంది. అదేసమయంలో మనిషి తనలో ఉన్న ఆధ్యాత్మికతను కూడా తక్కువగా అంచనా వేస్తాడు. మనిషి తన పరిసరాలను, తోటివారిని ప్రభావితం చేసి దుర్మార్గంగా వ్యవహరించే అవకాశమూ ఉంది. ఈ ధోరణులన్నింటినీ అదుపు చేయడానికి జిహాద్ ఎంతో అవసరం."

ప్రవక్త ముహమ్మద్ హునైన్ యుద్ధరంగం నుంచి వెనక్కి వస్తున్నప్పుడు ఇలా ప్రకటించారు:

> "మనం తక్కువస్థాయి జిహాద్ (ప్రయత్నం, సంఘర్షణ, ప్రతిఘటన, సంస్కరణ కోసం కృషి) నుంచి వస్తున్నాం. ఎక్కువ స్థాయి జిహాద్ వైపు వెళుతున్నాం."

ఈ మాటలు విని ఒక అనుచరుడు "ఎక్కువ స్థాయి జిహాద్ అంటే ఏమిటి దైవప్రవక్తా?" అనడిగారు.

ప్రవక్త ముహమ్మద్ జవాబిస్తూ "అది ఆత్మసంఘర్షణ (మనిషి తన అహంతో పోరాడ్డం). చెడు పట్ల మొగ్గు చూపకుండా ఉండడం." అన్నారు.

ప్రవక్త ముహమ్మద్ ఈ అత్యుత్తమ జిహాద్ రూపానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. అంటే చెడుకు వ్యతిరేకంగా మనిషి చేసే ఆధ్యాత్మిక ఆత్మ సంఘర్షణ"

ముస్లిములకు కాని, ముస్లిమేతరులకు కాని మనుష్యులందరికీ ఈ ఆత్మసంఘర్షణ చాలా కష్టమైనది. ఇది చాలా ఉత్తమమైనది. ఈ జిహాద్ చేయడానికి గొప్ప అవగాహన, క్షమాగుణం, నిజాయితి ఎంతో అవసరం.

## గొప్ప జిహాద్

జిహాద్‌లలో గొప్ప జిహాద్ ఏదంటే, ఒక నిరంకుశుడైన నియంత ముందు నిలబడి ధైర్యంగా సత్యాన్ని పలుకడం. అణిచివేతలకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల కోసం గొంతు విప్పాలని ప్రవక్త ముహమ్మద్ ఉద్బోధించారు. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయమై ఇలా అంటుంది "అణగారిన వారికి మిత్రునిగా ఉండండి. నిరంకుశపాలకులను, దుర్మార్గపు అణిచివేతను ప్రతిఘటించండి (తగిన పద్ధతులతో)."

ఇంకా ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది :

> "అసలు మీరు, నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లల కొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి? బలహీనులవటం చేత అణచబడి, వారు "మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు' అని ఫిర్యాదు చేస్తున్నారే." దివ్యఖుర్‌ఆన్ (4:75)

## తక్కువస్థాయి జిహాద్

ప్రవక్త ముహమ్మద్ చెప్పినట్లు తక్కువస్థాయి జిహాద్ అంటే సైనిక ప్రయత్నాలు. ఇస్లామ్‌ను, న్యాయాన్ని కాపాడ్డానికి ఆత్మరక్షణ ప్రధానంగా జరిగే సైనిక పోరాటాలు.

దురాక్రమణ ప్రమాదం ఉన్నప్పుడు ఏ రాజ్యానికైనా ఆత్మరక్షణ చర్యలు చేపట్టే హక్కు ఉంది. ఈ హక్కును ఎవరూ కాదనలేరు. రాజ్యాన్ని కాపాడే ప్రయత్నం రచనల ద్వారా కూడా జరగవచ్చు. మీడియా ద్వారా, చర్చల ద్వారా, దౌత్యప్రయత్నాల ద్వారా, ఒప్పందాలు, శాంతిప్రక్రియలు వంటి పద్ధతుల్లో కూడా జరగవచ్చు. ఈ పద్ధతులేవీ ఫలించకపోతే, ప్రమాదం తగ్గుముఖం పట్టకపోతే రాజ్యాధికారం సాయుధ ప్రతిఘటన ద్వారా రాజ్యాన్ని కాపాడే ప్రయత్నాలు చేయవచ్చు. ఈ హక్కు ఏ దేశానికైనా ఉంటుంది.

దురాక్రమణకు వచ్చిన, దాడికి దిగిన విదేశీ సైన్యాన్ని ప్రతిఘటించడానికి ప్రజలు సాయుధులై పోరాడ్డాన్ని అంతర్జాతీయ చట్టాలు అంగీకరిస్తాయన్నది గమనించాలి.

జిహాద్ దురాక్రమణకు పాల్పడే యుద్ధం ఎన్నటికీ కాదు, అలాగే జిహాద్ అంటే భూభాగాలను అక్రమించుకునే ఉద్దేశ్యంతో చేసే యుద్ధం కానే కాదు. ఇది ఆత్మరక్షణకు ఉద్దేశించిన యుద్ధం. ఈ పోరాటానికి దిగేవారు కొన్ని ఖచ్చితమైన నియమాలు పాటించాల్సి

ఉంది. ఈ రూపంలో జిహాద్ విషయానికి వస్తే, ఇది ఒక నైతికమైన చర్య. పోరాటానికి సంబంధించిన ఇస్లామీయ నియమ నిబంధనలన్నింటికీ కట్టుబడాలి. అంటే అమాయకులైన పౌరులు, మహిళలు, పిల్లలు, నిరాయుధులైన ప్రజలకు హాని కలిగించరాదు. ఆస్తులకు, పర్యావరణానికి నష్టం కలిగించరాదు. ఇతర మతవిశ్వాసాల వారి ఆరాధనాస్థలాలకు నష్టం కలిగించరాదు. కిడ్నాపులకు పాల్పడడం, బంధీలను తీసుకెళ్ళడం, పౌరులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం, ప్రజలు పనిచేసుకునే ప్రాంతాల్లో, భవనాల్లో బాంబులు పెట్టడం వంటి చర్యలు దుష్టచర్యలుగా ఇస్లామ్ భావిస్తుంది. ఇస్లామ్ ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తుంది. ఈ చర్యలు టెర్రరిజం, విచక్షణారహితమైన హత్యాకాండల కోవకు వస్తాయి.

అంతేకాదు, ఎవరిష్టం వచ్చినట్లు వారు ఎవరిపై పడితే వారిపై జిహాద్ ప్రకటించడానికి వీలు లేదు. ఉదాహరణకు ఒక ముస్లిమ్ దేశం మరో ముస్లిమ్ దేశంపై జిహాద్ ప్రకటించడం సాధ్యం కాదు. ఒక దుర్మార్గుడైన నిరంకుశ పాలకుడు తనకు వ్యతిరేకంగా నిలబడిన దేశాలపై జిహాద్ ప్రకటించలేడు. జిహాద్ ప్రకటించాలంటే నిస్సహాయులైన బాధితులపై అణిచివేతలు, అన్యాయాలకు పాల్పడుతున్న శత్రువును ఖచ్చితంగా గుర్తించడం, జిహాద్ విషయంలో ముస్లిమ్ సముదాయం ఏకాభిప్రాయం వ్యక్తం చేయడం ఈ రెండు అవసరం.

అదేవిధంగా నేడు ఇస్లామీయ జిహాద్ గ్రూపులుగా చెప్పబడుతున్న వారికి ఇలా చేసే అధికారం కూడా లేదు. పైగా అమాయకులపై హింసాకాండకు కారణమయ్యే వారి తీవ్రవాద పద్ధతులకు ఇస్లామ్‌లో ఎలాంటి స్థానమూ లేదు.

కొందరు అవగాహన లేని, జ్ఞానం లేని, దోవతప్పిన ముస్లిముల తప్పుల ఆధారంగా ఇస్లామ్‌పై ఒక నిర్ణయానికి రావడం సముచితం కాదు. ముస్లిముల పతనావస్థ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అవినీతి వాతావరణం దృష్ట్యా కూడా ఇస్లామ్‌పై ఒక నిర్ణయం తీసుకోవడం సరయిన పద్ధతి కాదు.

మాజీ పాప్ సింగర్ క్యాట్ స్టీవెన్స్, ఇప్పుడు యూసుఫ్ ఇస్లామ్‌గా మారిన వ్యక్తి ఇలా చెప్పారు. "మీడియాలో తరచు చూపించే కొందరు దారితప్పిన ముస్లిముల ప్రవర్తన ప్రాతిపదికగా ఇస్లామ్‌పై ఒక నిర్ణయానికి రావడం తగదు. మద్యం మత్తులో కారు నడిపిన డ్రయివరు యాక్సిడెంట్ చేస్తే కారును తప్పు పట్టడం ఎలాంటిదో ఇది కూడా అలాంటిదే."

## సామాజిక జిహాద్

సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం మరోవిధమైన ప్రయత్నం (జిహాద్). ఆధునిక కాలానికి ఇది ఎంతో తగినది. సమాజంలో మార్పు తీసుకురావాలని ఎవరైన భావిస్తుంటే, మెరుగైన సమాజం కోసం ప్రయత్నించాలని అభిలషిస్తుంటే అలాంటి వ్యక్తులు సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలి. నేడు పౌరసమాజంలోని వివిధ గ్రూపులు ఈ విధానాన్నే పాటిస్తున్నాయి. నిశ్శబ్దంగా, నిరంతరంగా కొనసాగే సంఘర్షణ ఇది. ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకురావడానికి జరిగే ప్రయత్నం ఇది. విద్యావ్యాప్తి, చైతన్యం, ఆలోచనాశైలిలో మార్పులు తీసుకురావడం, నచ్చచెప్పడం, ప్రోత్సహించడం వంటివి ఈ సంఘర్షణకు ఉపయోగపడే సాధనాలు. సామాజిక జిహాద్ పరిధిలో అసంఖ్యాక లక్ష్యాలు, ఉద్యమాలు ఉండవచ్చు. పిల్లల హక్కుల కోసం పోరాటం కావచ్చు, మహిళల సాధికారతా ప్రయత్నాలు కావచ్చు. బాలశ్రామికుల సమస్య పరిష్కారం కావచ్చు, శిశుమరణాలను నిరోధించడం, పర్యావరణ పరిరక్షణ, అడవి మృగాల పరిరక్షణ, స్కూళ్ళలో చదువు మానేసే పిల్లల సమస్య, మద్రసాలను ఆధునికీకరించడం, బాధిత మహిళల పునరావాసం, వ్యసనబాధితుల పునరావాసం, గ్రామీణ ప్రాంతాల్లో రుణబాధితులకు సహాయసహకారాలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన, గ్రంథపఠనాన్ని ప్రోత్సహించడం, వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ, నిర్మాణ కూలీల పిల్లల కోసం శిశుసంరక్షణాలయాలను ఏర్పాటు చేయడం, గని కార్మికులకు భద్రతావసతులు కల్పించడం, ఖైదీలకు కౌన్సిలింగ్ లేదా వారి కుటుంబాలకు సహాయసహకారాలు అందించడం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, వృద్ధాశ్రమాల నిర్వహణ, పాత నేరస్తుల సంస్కరణ, బాలనేరస్తుల కోసం శరణాలయాల నిర్మాణం, చవుకగా గృహాల నిర్మాణానికి ఏర్పాట్లు చేయడం, వృద్ధాశ్రమాల నిర్వహణ, పాత నేరస్తుల సంస్కరణ, బాలనేరస్తుల కోసం శరణాలయాలు ఏర్పాలు చేయడం, ఇళ్ళులేని వారికి చవుకగా గృహనిర్మాణం, నిరుపేదలకు తాగునీటి వసతి కల్పించడం... వగైరా. ఈ జాబితా చాలా పెద్దది. ప్రపంచంలో వేలాది సంస్థలు రాత్రింబవలు ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా తీర్చిదిద్దడానికి, సురక్షితమైన ప్రాంతంగా, సంతోషకరమైనదిగా రూపొందించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సంస్థలన్నీ నిజానికి చేస్తున్నది సామాజిక జిహాద్. సామాజిక చెడులకు వ్యతిరేకంగా జిహాద్ చేస్తున్నాయి. సమానత్వం, సౌభాగ్యాలతో కళకళలాడే, పేదరికం కష్టాలు లేని ప్రపంచనిర్మాణానికి పాటుపడుతున్నాయి. దివ్యఖుర్‌ఆన్ ఇదే బోధిస్తోంది. ఇతరులకు మంచి చేయాలని చెబుతుంది. అల్లాహ్ మీకు మంచి చేసినట్లే మీరు ఇతరులకు మంచి చేయండని ఆదేశిస్తుంది. (అహ్‌సిన్, కమా అహ్‌సినల్లాహు అలైక్). దురదృష్టం ఏమంటే

నేడు దివ్యఖుర్ఆన్ తమ పవిత్రగ్రంథంగా చెప్పుకునే వారి కన్నా ఎక్కువగా నేడు పాశ్చాత్యులు ఈ లక్షణాన్ని ప్రదర్శిస్తున్నారు. నేడు ముస్లిమ్ సముదాయాల్లో పౌరసమాజంగా చెప్పుకునే గ్రూపులు ఏవీ కనబడడం లేదు. ముస్లిమ్ మతపెద్దలు చాలా మంది నేడు ఫత్వాలు ఇవ్వడం, ఇఫ్తాలు (ధార్మిక సూచనలు) జారీ చేయడంలో తలమునకలై ఉన్నారే కాని సంస్కరణ (ఇస్లాహ్) గురించి పట్టించుకోవడం లేదు. ముస్లిములు సామాజిక కార్యకలాపాల ప్రాముఖ్యాన్ని గుర్తించవలసిన అవసరం ఆసన్నమయ్యింది. పేదరికం, నిరక్షరాస్యత, వ్యాధులు, వ్యసనాలు, రుణభారాలు, అణిచివేత తదితర సమస్యల నుంచి ప్రపంచాన్ని కాపాడే ప్రయత్నాలు ప్రారంభించవలసి ఉంది.

ముస్లిమ్ మతం గురించి ఈ వివరణ సామాజిక కార్యకలాపాల గురించి కొత్త ఆలోచనలకు తలుపులు తెరుస్తుందని ఆశించవచ్చు. ఇస్లామ్‌ను ఆచరించడం అంటే కేవలం నమాజులు చేయడం, జకాత్ ఇవ్వడం, ఉపవాసాలు పాటించడం, హజ్ యాత్ర చేయడం మాత్రమే కాదు. దైవాన్ని గుర్తు చేసుకునే, దైవ ప్రసన్నత కోసం చేసే ప్రతి పని ఆరాధన క్రిందికే వస్తుంది. విశ్వసించిన వారు, మంచిపనులు చేసేవారు అన్న దివ్యఖుర్ఆన్ వాక్యం ముస్లిములకు బాగా తెలిసిన వాక్యమే. మంచిపనులకు, దైవ విశ్వాసానికి మధ్య దగ్గరి సంబంధం ఉందన్నది మనకు బాగా తెలుసు. ధార్మిక విశ్వాసం కలిగి ఉండడమంటే, విశ్వాసం కలిగి ఉండడం మాత్రమే కాదు, ఆచరణలో కూడా ఉండాలి. ఆచరణలనేవి అనేక రూపాల్లో ఉన్నాయి. మనిషి తన పట్ల తాను నిజాయితీగా ఉండడం, బంధువుల పట్ల మంచిగా, దయగా ఉండడం. సామాజిక సంస్కరణ కోసం అంకితభావంతో కృషి చేయడం, అన్యాయానికి వ్యతిరేకంగా గొంతువిప్పడం ఇవన్నీ ఇందులోకే వస్తాయి. ఈ ప్రయత్నాలన్నీ ఆచరణాత్మకంగా కొనసాగించడమే జిహాద్‌లో భాగాలే. ఎందుకంటే ఈ ప్రయత్నాలన్నీ దివ్యఖుర్ఆన్ ప్రస్తావించిన సూత్రాల ప్రకారం న్యాయమైనవి, గౌరవప్రదమైనవి. దివ్యఖుర్ఆన్ స్వయంగా చెబుతున్న వివరణ ఏమంటే :

> "పోరాడండి అల్లాహ్ మార్గంలో మీ సంపదలను, మీ ప్రాణాలను ధారపోసి మీరు గనుక గ్రహిస్తే ఇదే మీకు మేలైనది." దివ్యఖుర్ఆన్ (61:11)

పవిత్రమైన లక్ష్యాల కోసం ఒక ముస్లిమ్ తన ధనప్రాణాలతో కృషి చేయవలసి ఉంది. విస్తృతార్థంలో ఈ వాక్యానికి అర్థమేమంటే, ఈ విస్తృతార్థాన్ని దివ్యఖుర్ఆన్ వాక్యాలు, ప్రవక్త ముహమ్మద్ ప్రవచనాలు కూడా ధృవీకరిస్తున్నాయి, దైవమార్గంలో పోరాడడమంటే అర్థం అన్యాయాలను, దౌర్జన్యాలను, ఆకలి, పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత,

నేరస్వభావం, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వ్యసనం, జూదం వంటి సమస్యలను అధిగమించడానికి మన మానవవనరులన్నింటినీ సమీకరించడం, సమైక్య ప్రయత్నాలు చేయడం, ధనప్రాణాలొడ్డి కృషిచేయడం. ఈ లక్ష్యసాధానకు తీవ్రమైన కృషి అవసరం. నిరంతర సంఘర్షణ అవసరం. అంటే సంపూర్ణ జిహాద్ చేయాలి. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనవలసి ఉంటుంది.

ఎంతమంది ముస్లిములు తమ ఇంటి గడపదాటి ఇలాంటి ప్రయత్నాలకు పూనుకుంటున్నారు? ఎంతమంది పూర్తి నిజాయితీగా ఇలాంటి ఉద్దేశ్యాలతో ఇస్లామ్ కోసం అంకితమవుతున్నారు? తమ తమ మహల్లాల్లో, తమ ఊళ్ళలో, తమ ప్రాంతాల్లో, తమ నగరాల్లో ప్రతి దేశంలోను ఇలా సామాజిక కార్యకలాపాల ద్వారా మెరుగైన సమాజం కోసం జిహాద్ చేస్తున్నవాళ్ళు ఎంతమంది? ఈజిప్టు మేధావి హసనల్ బన్నా చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి "దేవుని మార్గంలో మరణించడం చాలా కష్టమైన పని. అయితే దేవుని మార్గంలో జీవించడం ఇంకా కష్టమైన పని." అన్నాడాయన. ఈ జిహాద్ మెరుగైన జీవితం కోసం చేసే జిహాద్. ప్రతిమనిషికి లభించవలసిన హక్కులన్నీ లభించేలా చేసే జిహాద్ అది. ఇస్లామ్ సందేశం యావత్తు ఈ అవసరాన్నే చాటి చెబుతుంది. దీన్ని సాధించడం అత్యంత అవసరమని పేర్కొంటుంది.

# యుద్ధం గురించి ప్రవక్త ఏమన్నారు ?

ఇస్లామ్ వాస్తవాలను గుర్తించే ధర్మం. యుద్ధం వాస్తవికతను దివ్యఖుర్ఆన్ గుర్తిస్తుంది. కాని కేవలం అన్యాయాన్ని అరికట్టడానికి మాత్రమే యుద్ధం చేసే అనుమతి ఉంది. యుద్ధం అనేది ఆత్మరక్షణకు, న్యాయబద్ధమైన భద్రత పొందడానికి మాత్రమే ఉద్దేశించినదై ఉండాలి. ఎలాంటి కారణం లేకుండా కయ్యానికి కాలుదువ్వడం, దురాక్రమణలకు పూనుకోవడం నిషిద్ధం.

> "మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు." దివ్యఖుర్ఆన్ (2:190)

సముదాయాన్ని కాపాడడంతో పాటు అన్యాయాన్ని ఎదుర్కోవడం, దౌర్జన్యాలను అరికట్టడం కూడా యుద్ధానికి సముచితమైన కారణాలే.

> "ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చెయ్యడానికి) అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే వారు అన్యాయానికి గురిఅయిన వారు. నిశ్చయముగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ళనుండి తరిమివేయబడినవారు. వారి తప్పు కేవలం "అల్లాహ్ మా ప్రభువు" అని అనటమే." దివ్యఖుర్ఆన్ (22:39-40)

కాని మనిషిలో హింసాత్మక స్వభావం ఉంటుంది. ఆధిపత్యం సాధించాలన్న కోరిక ఉంటుంది. పగ ప్రతీకారాలు తీర్చుకోవాలన్న ఆవేశం ఉంటుంది. స్వార్థం ఉంటుంది. దోపిళ్ళకు పాల్పడే నైజం ఉంటుంది. వీటన్నింటిని దుష్టచేష్టలుగా, పాపాలుగా, అనైతికమైనవిగా ఖండించడం జరిగింది. క్లుప్తంగా చెప్పాలంటే దురాక్రమణ అనేది నిషిద్ధం.

## యుద్ధనీతి

ఇస్లామ్ ఒక కొత్త పారిభాషికపదాన్ని ప్రవేశపెట్టింది. జిహాద్ ఫీ సబీలిల్లాహ్. అంటే దేవుని మార్గంలో కృషి చేయడం. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, భౌతిక ప్రయోజనాల కోసం జరిగే యుద్ధాలను ప్రవక్త ముహమ్మద్ సంస్కరించారు. దైవమార్గంలో కృషిచేయడంగా

పేర్కొని యుద్ధం స్వార్థం కోసం చేసేది కాదని, ప్రతిష్ఠ కోసం, యుద్ధసొత్తు కోసం, ఇతర ప్రజలను అణిచివేయడానికి లేదా వారి మెడలు వంచడానికి చేసేది కాదని బోధించారు. ఈ విశ్వాసం యుద్ధనియమాలను పటిష్టంగా అమలు చేసేలా ప్రోత్సహించింది.

యుద్ధానికి సంబంధించిన ఈ కొత్తభావన ప్రవేశపెట్టడం ద్వారా యుద్ధనియమాలు అమలయ్యే వాతావరణం ఏర్పడింది. ప్రవక్త ముహమ్మద్ యుద్ధనియమాలను నిబంధనలను స్పష్టంగా నిర్దేశించారు. యుద్ధంలో పాటించవలసిన నైతికసూత్రాలు, హక్కులు, బాధ్యతలు, పోరాడే సైనికులకు, పోరాటం చేయని పౌరులకు మధ్య పాటించవలసిన వ్యత్యాసం, రాయబారుల హక్కులు, యుద్ధఖైదీల హక్కులు, పరాజిత ప్రజల హక్కులను కూడా స్పష్టంగా నిర్వచించారు.

## పదిసూత్రాలు

అరబ్ ముస్లిమ్ దండయాత్రల్లో ఇస్లామ్ యోధులు గొప్ప సంయమనాన్ని, సహనాన్ని ప్రదర్శించడం మనకు ప్రతీసారి కనబడుతుంది. ముఖ్యంగా పరాజిత ప్రజల పట్ల, ముస్లిమేతరుల పట్ల వారు ప్రదర్శించిన సహనశీలం చరిత్రలో నమోదయ్యింది. హింసాకాండలకు ఎలాంటి నియమాలు, నిబంధనలు, హద్దులు లేని కాలంలో ప్రవక్త ముహమ్మద్ విధించిన యుద్ధనియమాలన్నింటినీ ఆయన అనుచరుడు, మొదటి ఖలీఫా అబూబక్ర్ క్రోడీకరించి తన సైనికులకు ఇచ్చారు. లెవెంట్ ప్రాంతానికి (తూర్పు అరేబియా) సైన్యాన్ని పంపుతున్నప్పుడు ఈ యుద్ధనియమాలను సైనికులకు అందజేశారు. ముఖ్యంగా సైన్యాధ్యక్షుడికి ఈ నియమాలను పాటించాలని ఆదేశించారు. ప్రపంచంలో జరిగిన యుద్ధాల చరిత్రలో యుద్ధనియమాల పత్రాన్ని రూపొందించిన మొట్టమొదటి సంఘటన బహుశా ఇదే. ఈ నియమాల్లో ఇస్లామ్ అభిలషించే నైతికత మనకు కనబడుతుంది.

> ఆడవారిని హతమార్చరాదు, పిల్లలను, బలహీనులైన వృద్ధులను హతమార్చరాదు. పండ్లవృక్షాలను నరికేయరాదు. నివాసగృహాలను ధ్వంసం చేయరాదు. అనవసరంగా గొర్రెలను కాని ఒంటెలను కాని చంపరాదు. (ఆహారం కోసం అవసరమైతే తప్ప). కీటకాలకు నిప్పు పెట్టరాదు. వాటిని నీటిలో ముంచరాదు. యుద్ధసొత్తును దురుపయోగించరాదు. పిరికితనం చూపరాదు.

దీనిలో ఇస్లామీయ యుద్ధనియమాల పది సూత్రాలున్నాయి. యుద్ధంలో ఒక ముస్లిమ్ అమాయకుల పట్ల, పోరాడని పౌరుల పట్ల మాత్రమే కాదు, పర్యావరణం పట్ల, జంతువుల పట్ల కూడా దయతో వ్యవహరించవలసి ఉంటుంది. ప్రపంచంలో సైన్యాలు ఈ నియమాలను

పాటిస్తే ప్రపంచం నిస్సందేహంగా మరింత మానవీయంగా మారి ఉండేది. నేడు యుద్ధాల వల్ల వాటిల్లుతున్న అపార విధ్వంసం ఉండేది కాదు. యుద్ధాలు చేస్తున్నది ఎవరైనా గాని ఈ నియమాలను పాటిస్తే అమాయక, పోరాటంలో పాల్గొనని పౌరులకు రక్షణ లభించేది.

మానవులంతా ఒక్కటే అన్నది ఒక వాస్తవం. దీని గురించి ప్రవక్త ముహమ్మద ఇలా అన్నారు : "దైవమా! మానవులంతా సోదరులని నేను సాక్ష్యమిస్తున్నాను."

ప్రవక్త ముహమ్మద్ జీవితంలో ఆచరణాత్మకంగా ఈ సమానత్వం, సమైక్యతలు కనబడతాయి. ఒకసారి ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులతో కూర్చుని మాట్లాడుతున్నప్పుడు ఎవరిదో శవం అంతిమ యాత్ర వెళుతోంది. వెంటనే ప్రవక్త మరణించిన ఆ వ్యక్తి పట్ల గౌరవం ప్రదర్శిస్తూ లేచి నిలబడ్డారు. అక్కడ ఉన్న ముస్లిములు ఆశ్చర్యంగా ఆయనతో ఆ శవయాత్ర ఒక యూదుడిదని అన్నారు. ప్రవక్త వారితో స్పష్టంగా, హుందాగా "ఆయన మనిషే కదా" అన్నారు.

ఇస్లామ్ మానవ ప్రాణాలకు అంత విలువ ఇస్తుంది. దివ్యఖుర్ఆన్ ఇలా ప్రకటించింది: "ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలు కాపాడినట్లే." దివ్యఖుర్ఆన్ (5:32)

ఈ దైవికమైన ఆదేశం ద్వారా ప్రవక్త ముహమ్మద్ మానవప్రాణాల పవిత్రతను, ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ముస్లిముల ప్రాణాలైనా, ముస్లిమేతరుల ప్రాణాలైనా మనిషి ప్రాణం అత్యంత విలువైనదని బోధించారు.

ఒక యుద్ధంలో ప్రమాదవశాత్తు రెండు సైన్యాల మధ్య చిక్కుకున్న కొందరు పిల్లలు మరణించారు. ఈ విషయం గురించి తెలిసి ప్రవక్త ముహమ్మద్ చాలా బాధపడ్డారు. ఆయన బాధపడ్డం చూసి ఒక వ్యక్తి "ఓ దైవప్రవక్తా! వారు ముస్లిమేతరుల పిల్లలు" అన్నాడు. అది విన్న ప్రవక్త "ముస్లిమేతరుల పిల్లలైనా వారు మీకన్నా మెరుగు. జాగ్రత్త పిల్లలను హతమార్చవద్దు, జాగ్రత్త పిల్లలను చంపవద్దు. ప్రతి శిశువు దేవుని సహజధర్మంతో జన్మిస్తాడు" అన్నారు.

దీనికి విరుద్ధమైన వ్యాఖ్య మనకు అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మెడిలిన్ అల్‌బ్రైట్ నోట వినవచ్చింది. ఇరాక్‌పై అమెరికా విధించిన ఆంక్షల వల్ల అక్కడ ఐదు లక్షల మంది పిల్లలు మరణించారు. అలాంటి ఆంక్షలు విధించడం అవసరమా అని ప్రశ్నించినప్పుడు ఆమె "అవసరమేనని అనుకుంటున్నాం" అని జవాబిచ్చింది.

# జిహాద్ పదం - వాడుకలో దురుపయోగాలు

జిహాద్ అనేది అరబీ భాషా పదం. అరబీలోని జహద అన్న మూల పదం నుంచి ఇది పుట్టింది. ఈ మాటకు అర్థం ప్రయత్నం, సంఘర్షణ. ఒక లక్ష్యం కోసం తీవ్రంగా కృషి చేయడాన్ని జిహాద్ అని చెప్పవచ్చు. ఈ పదాన్ని అనేక సందర్భాల్లో ఉపయోగిస్తారు. సాధారణంగా ఉర్దూ భాషలో వాడే "జదో జహద్" అన్న పదబంధం జిహాద్ నుంచి వచ్చిందే. ఈ పదబంధానికి ప్రయత్నించడం, సంఘర్షించడం అని భావం. ఒక అరబీ పలుకుబడి ఇక్కడ గమనించదగ్గది. యామిల్ బి జకా, వ లా యామిల్ బి జహదా కసీరా, ఈ వాక్యానికి "తెలివిగా పనిచేయి, అనవసరంగా అతిగా కష్టపడకు అని అర్థం.

ఆధునిక భాషలో కూడా జిహాద్‌ను అనేక సందర్భాల్లో ఉపయోగిస్తున్నారు. ఇందులో చాలా సందర్భాలు ధార్మికమైనవి కానే కాదు, పూర్తిగా లౌకికమైన సందర్భాల్లోను ఈ పదం ఉపయోగిస్తారు. అవినీతిపై జిహాద్, కాలుష్యంపై జిహాద్, భ్రూణహత్యలపై జిహాద్; మహిళా హక్కుల కోసం జిహాద్ అన్న నినాదాలు కూడా వినిపిస్తుంటాయి.

భారత జాతిపిత గాంధీజీ నాయకత్వం వహించిన స్వాతంత్ర్యసంగ్రామం అహింసా పద్ధతుల్లో సాగింది. ఈ స్వాతంత్ర్య సంగ్రామాన్ని కూడా అరబీలో తరచు జిహాద్ అనే అంటారు. ట్యూనిషియా అధ్యక్షుడు హబీబ్ బూర్గిబా దేశంలో జాతీయ ఆర్థిక అభివృద్ధికి ప్రారంభించిన ఉద్యమాన్ని కూడా జిహాద్ అనే పిలిచారు. నిజానికి హబీబ్ బూర్గిబా కరడుగట్టిన సెక్యులర్ వాది. జహాద్ అన్న పదాన్ని కొందరు స్త్రీవాదులు స్త్రీ స్వేచ్ఛా పోరాటాలకు కూడా వాడారు. నైతిక, సామాజిక సరళిని సంస్కరించడానికి చేసిన ప్రయత్నాలను కూడా జిహాద్ అనే పిలిచారు.

కాని కాలక్రమేణా జిహాద్ అన్న పదాన్ని ముస్లిమ్ సైనికచర్యలను సూచిస్తూ వాడడమే అధికమయ్యింది. ఈ యుద్ధాలనే జిహాద్ అని పిలువడం ప్రారంభమయ్యింది. ఒక ముస్లిమ్ రాజ్యం మరో ముస్లిమ్ రాజ్యంతో యుద్ధానికి తలపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఇందులో ఇస్లామ్ ప్రమేయమే లేదు. నిజానికి పందొమ్మిదవ శతాబ్ధంలో సూడాన్‌కు చెందిన తిరుగుబాటు నాయకుడు మహదీ ఉస్మానియా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తాను ప్రారంభించిన తిరుగుబాటును జిహాద్‌గా పేర్కొన్నాడు. టర్కులందరిని హతమార్చాలని పిలుపునిచ్చాడు. అలాగే సౌదీ అరేబియాకు చెందిన ఒక తీవ్రవాదసంస్థ కూడా ఇతర ముస్లిములందరికీ వ్యతిరేకంగా జిహాద్ పిలుపునిచ్చింది. ఆసక్తికరమైన విషయమేమంటే, ఇస్లామ్‌లోని కొన్ని వర్గాలు ఇతర ఇస్లామీయ వర్గాలపై తమ పోరాటాలను కూడా జిహాద్‌గానే పేర్కొన్నాయి. ఇతర వర్గాల ఇస్లామీయ పంథాకు వ్యతిరేకంగా తమ సంఘర్షణకు కూడా జిహాద్ అనే పిలిచాయి.

ముస్లిమ్ ప్రపంచంలో కొన్ని దేశాల్లోని తిరుగుబాటు సంస్థలు, సాయుధపోరాటానికి పూనుకుంటున్న సంస్థలు కూడా దివ్యఖుర్‌ఆన్‌లోని జిహాద్ భావనను వాడుకుంటూ రాజకీయ శత్రువులకు వ్యతిరేకంగా అంతర్గతంగా సాగిస్తున్న యుద్ధానికి కూడా జిహాద్ అనే అంటున్నాయి.

ఇటీవల విపరీతమైన తీవ్రవాద పోకడలకు పోతున్న సంస్థలు కూడా తమ కార్యకలాపాలను జిహాద్ అనే అంటున్నాయి. నైజీరియా, నీగర్, సోమాలియా, మాలి, అఫ్గనిస్తాన్, లెబనాన్ దేశాల్లో ఇలాంటివి చూడవచ్చు. ఈ గ్రూపులు తమ ఉగ్రవాద కార్యకలాపాలు అంటే కిడ్నాపులకు పాల్పడడం, బంధీలుగా చేయడం, హైజాకింగ్ వగైరాలను కూడా జిహాద్‌లో భాగంగానే చెబుతుంటాయి. నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న జిహాద్‌లో ఈ చర్యలన్నీ భాగాలేనంటాయి.

కాబట్టి జిహాద్ అన్న పదం శతాబ్దాలుగా ఎంతగా ఉపయోగంలో ఉందో అంతగానే దురుపయోగమయ్యింది. ఇప్పుడు మళ్ళీ ముస్లిమ్ ప్రపంచంలో పాశ్చాత్య సైన్యాలను ప్రతిఘటించే కార్యకలాపాలకు కూడా ఇదే పేరు పెట్టడం జరుగుతోంది.

పేరు ఏది పెట్టుకున్నా దురాక్రమణకు దిగిన విదేశీ సైన్యాలకు వ్యతిరేకంగా సాయుధప్రతిఘటన చేసే హక్కు అంతర్జాతీయ చట్టాలు ప్రసాదిస్తున్నాయి.

పాశ్చాత్య శక్తులు కూడా తమకు అనుకూలమైనప్పుడు జిహాద్ అన్న పదాన్ని ఇష్టం వచ్చినట్లు ఉపయోగిస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో మాజి సోవియట్ యూనియన్ దురాక్రమణకు పాల్పడినప్పుడు ఈ పదం విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. అమెరికాకు చెందిన సి.ఐ.ఏ. వేలాది మంది ఆఫ్గన్ మిలిటెంట్లను రిక్రూట్ చేసుకుంది. వారికి శిక్షణ ఇచ్చి ఆయుధాలు సమకూర్చింది. వారికి ఆర్థికంగానే కాదు, దౌత్యపరంగా కూడా

సహాయసహకారాలందించింది. వివిధ ముస్లిమ్ దేశాల నుంచి వారికి సహాయం అందేలా ఏర్పాట్లు చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో పోరాడ్డానికి దూరప్రాంతాలైన అల్జీరియా, ఎమన్; చెచెన్యా, మధ్యాసియా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో రాడికల్స్‌ను తరలించింది సి.ఐ.ఏ. ఇస్లామీయ పారిభాషిక పదాలు ముజాహిదీన్; జిహాద్, షహీద్ వగైరా పదాలు అప్పుడే మీడియాలో విస్తృతంగా వాడుకలోకి వచ్చాయి.

గమనించవలసిన విషయమేమంటే, కిసింజర్ వ్యూహం ప్రకారం ఆసియన్లు ఆసియన్లతో పోరాడేలా చేయాలి. అందుకు అవసరమైతే ఇస్లామీయ సంప్రదాయాలను ఉపయోగించి వారిని ప్రోత్సహించాలి. అందుగ్గాను ఆఫ్ఘనిస్తాన్‌కు ఆనుకుని ఉన్న పాకిస్తాన్ సరిహద్దులో కొన్ని ప్రత్యేక మదరసాలను స్థాపించారు. ఈ మదరసాలకు చాలా వరకు అమెరికాయే నిధులు సమకూర్చింది. కమ్యూనిస్టులు కాఫిర్లు, వారిని చంపడం జిహాద్, ఈ పోరాటంలో మరణించినవారు షహీదులుగా స్వర్గానికి పోతారు. అక్కడ వారి కోసం 72 మంది కన్యలు ఎదురుచూస్తుంటారు వంటి మాటలతో వారిని రెచ్చగొట్టడం జరిగింది. ఈ సైద్ధాంతిక ప్రేరణ ముస్లిం యువకుల్లో బాగా పనిచేసింది. వారు పెద్ద సంఖ్యలో ఈ సంస్థల్లో చేరి శిక్షణ పొందారు. అవసరమైతే తమ ప్రాణాలను అర్పించి షహీదులుగా మారడానికి సిద్ధపడ్డారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో రెండు తరాల యువకులు అమెరికా నుంచి ఇలాంటి శిక్షణ పొందారు. కమ్యూనిస్టు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా కొనసాగించే ప్రచ్ఛన్న యుద్ధానికి ఈ యువకులు ఉపయోగపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అత్యంత తీవ్రవాదభావాలున్న ఏడు ముఖ్యమైన రాజకీయ గ్రూపులకు అమెరికా సహాయమందించింది. ఈ గ్రూపులన్నీ సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా పోరాడాయి. ఈ విషయాలన్ని మాజీ నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ జిగ్న్యూ బెజిన్‌స్కీ బట్టబయలు చేశాడు. "సి.ఐ.ఏ. ముజాహిదీన్లకు ఆయుధాలు, మందుగుండు సరఫరా చేసింది. ఈ ఆయుధాలతోను, ఉగ్రవాద కార్యకలాపాల్లో గట్టి శిక్షణతోను ఈ యువకులు సోవియట్ యూనియన్‌ను తరిమికొట్టడంలో విజయం సాధించారు. కాని స్వయంగా ఆఫ్ఘన్ పౌరులపై కూడా దాడులు చేసి ఒక్క కాబూల్‌లోనే దాదాపు 45,000 మందిని హతమార్చారు." (నినాన్ కోషి డబ్ల్యు.ఓ.టి, పేజి 62-63)

ఈ గ్రూపులు సోవియట్‌ను తరిమికొట్టడంతో ఆగలేదు. ఇదే సిద్ధాంతం, ఇవే ఆయుధాలతో ఒకరిపై ఒకరు పోరాటానికి దిగారు. స్వంతవారినే చంపుకునే అంతర్యుద్ధం జరిగింది. చివరి సోవియట్ సైనికపటాలం ఆఫ్ఘనిస్తాన్ వదిలి వెళ్ళిన తర్వాత ఈ యుద్ధం దాదాపు ఆరేళ్లు కొనసాగింది. 1995 తర్వాత మాత్రమే ఈ గ్రూపుల్లో అత్యంత బలమైన

గ్రూపు, అంటే తాలిబాన్ మిగిలిన వారిని అణిచేసి అధికారంలోకి రాగలిగింది. ఈ గ్రూపు అధికారంలోకి వచ్చిన వెంటనే ఛాందసవాద వ్యవస్థను అమలు చేయడం ప్రారంభించింది. బాలికల స్కూళ్ళను కూలగొట్టారు. బమియాన్‌లోని బుద్ధుడి ప్రాచీన విగ్రహాలను ధ్వంసం చేశారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్ తీసుకువెళ్ళారు. ఆ విమానాన్ని, అందులో బంధీలైన ప్రయాణీకులను విడుదల చేయడానికి భయంకరమైన ఉగ్రవాది మసూద్ అజహర్‌ను విడుదల చేయాలని షరతు పెట్టి విజయం సాధించారు. అల్‌ఖాయిదా, ఉసామా బిన్ లాదెన్ ఇవన్నీ ఈ యుద్ధ ఫలితాలే. చివరకు ఈ తుపాకులు అమెరికన్లకు వ్యతిరేకంగా పేలడం ప్రారంభించిన తర్వాత, అమెరికన్ల ప్రయోజనాలకు విఘాతం వాటిల్లుతున్నప్పుడు తాలిబాన్ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం మొదలైంది. ఆ తర్వాతే జిహాదీ టెర్రరిజం అన్న పదబంధం వాడుకలోకి తెచ్చారు. చివరకు వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌కు చెందిన జంట టవర్లపై సెప్టెంబర్ 11న జరిగిన భయంకరమైన దాడి జరిగింది. అమెరికా అధ్యక్షుడు ఉగ్రవాదంపై యుద్ధానికి పిలుపునిచ్చాడు.

హింస ప్రతిహింసకు కారణమవుతుంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో అమెరికా చేసిన యుద్ధం పగ ప్రతీకారాలను మరింత రెచ్చగొట్టాయి. యావత్తు మధ్యప్రాచ్యంలో ఆత్మాహుతి దాడులు ఎక్కువయ్యాయి. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం వల్ల సాంఘీకంగాను, రాజకీయంగాను చిందరవందరయ్యాయి. అమెరికా ప్రారంభించిన ఉగ్రవాదంపై యుద్ధంలో పదిలక్షలకు పైగా ఇరాకీ ప్రజలు మరణించారు. ఆఫ్ఘనిస్తాన్ భవిష్యత్తు గందరగోళంగా ఉంది. ఈ పరిణామాల దుష్పరిణామం పాకిస్తాన్ అనుభవిస్తోంది. అక్కడ ప్రతిరోజు ఆత్మాహుతి దళాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.

ఇవేవీ జిహాద్ పరిధిలోకి వచ్చే చర్యలు కావు. హింస, ఉగ్రవాదాలు జిహాద్ కానే కావు. జిహాద్ అనేది వ్యక్తిని ప్రక్షాళనం చేసి మంచివాడిగా రూపొందించే ఆత్మసంఘర్షణ, సమాజాన్ని సంస్కరించి సత్సమాజం స్థాపించే ప్రయత్నం. భౌగోళికంగా దురాక్రమణ, వనరులను హస్తగతం చేసుకోవడం, జాతినిర్మూలనకు పాల్పడడం, ప్రజలపై విచక్షణారహితంగా హింసకు పాల్పడడం, ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే కార్యకలాపాలు జిహాద్ కానే కాదు. జిహాద్ అంటే శాంతి, న్యాయం, భద్రతలను స్థాపించే ప్రయత్నమని అర్థం. జిహాద్ పరిధిలో పోరాటం అనే భావం చిట్టచివరి భావం. మనిషి తనలో ఉన్న మాలిన్యాలను ప్రక్షాళనం చేసుకోవడంతో ప్రారంభమవుతుంది జిహాద్. కాని జిహాద్ అన్న పదాని వివిధ శక్తులు వివిధ రకాలుగా దురుపయోగిస్తున్నాయి. చివరకు ఇస్లామ్ అభిలషించే జిహాద్ కనుమరుగయ్యింది.

# మతవిశ్వాసాల దురుపయోగం

ముస్లిమ్ తీవ్రవాద గ్రూపులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నప్పుడు మతం పేరు చెప్పుకోవడం కూడా కనబడుతుంది. ఈ విధంగా మతంపేరు చెప్పుకోవడం వల్ల ఈ హింసాత్మక చర్యలకు మతం రంగు పులిమేస్తున్నారు. మతం హింస ఉగ్రవాదం ఒకదానికొకటి సంబంధించినవిగా భావించే వాతావరణం సృష్టిస్తున్నారు.

కాని, ఇలా మతాన్ని వాడుకుంటున్నది కేవలం ముస్లిమ్ గ్రూపులు మాత్రమే కాదు. చాలా మంది ఈ పనే చేశారు. జాతీయపోరాటాల్లోను స్వాతంత్ర్యసంగ్రామాల్లోను మతపరమైన నినాదాలు వినిపించాయి. మతపరమైన చిహ్నాలను వాడుకోవడం కనబడుతుంది. ఎందుకంటే మతవిశ్వాసాలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఎందుకంటే మతం ప్రజల మనోభావాలతో వేల సంవత్సరాలుగా పెనవేసుకుని ఉంది. కాగా జాతీయ ప్రభుత్వాలనేవి కేవలం గత రెండువందల సంవత్సరాలుగా మాత్రమే ఉనికిలోకి వచ్చాయి. కాబట్టి స్థానిక సంస్కృతితో వేల సంవత్సరాలుగా పెనవేసుకుని ఉన్న ఇస్లామ్‌ను ప్రస్తావిస్తే తక్షణం ప్రజలు ప్రతిస్పందిస్తారు. ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి కూడా మతం పేరు చెప్పడం వల్ల కావలసిన ప్రజామద్దతు లభిస్తుంది.

ఇలా చేస్తున్నది కేవలం ముస్లిమ్ గ్రూపులు మాత్రమే అనుకుంటే పొరబాటు.

- అగస్ట్ సి. క్రే రాసిన "ది ఫస్ట్ క్రూసేడ్ : ది ఎక్కౌంట్ ఆఫ్ ఐ విట్నెసెస్ అండ్ పార్టిసిపెంట్స్ " పుస్తకంలోని ఈ పంక్తులు చూడండి.

నవంబర్ 1095లో పోప్ అర్బన్ 2 ముస్లిమ్ ప్రపంచంలో యూరోపు వలసలకు నాంది పలికాడు. ఇవే క్రూసేడులుగా పాశ్చాత్యదేశాల్లో పేరుపడ్డాయి. పోప్ అర్బన్ 2 ముస్లిములను అవిశ్వాసులుగా, అనాగరికులుగా పేర్కొంటూ యూరపు క్రయిస్తవులు వారి భూభాగాల్లోకి వెళ్ళి అందరినీ హతమార్చాలని ఆదేశించాడు.

అందరూ మూకుమ్మడిగా దాడులకు వెళ్ళాలని, క్రీస్తు పేరిట ఈ దాడులు చేయాలని, ఈ దాడులు క్రీస్తు ఆదేశించిన దాడులని అన్నాడు. ఈ పుస్తకంలో హత్యాకాండల వర్ణన కూడా ఉంది. జులై 15, 1099 తేదీన జెరుసలేమ్‌ను ఆక్రమించుకున్నారు. క్రీస్తు ఆశ్వికయోధులుగా పిలువబడే క్రూసేడులు అక్కడ 60,000కు పైబడి ముస్లిములను యూదులను అత్యంత కిరాతకంగా హతమార్చారు.

ఈ హత్యాకాండలో అక్కడి ముస్లిములు, యూదులు ఎవరూ బతికి బయటపడలేదు. శిశువులు, పిల్లలు, మహిళలు, వృద్ధులు అందరినీ క్రీస్తు అశ్వికయోధులు తమ కరవాలాలకు బలిపెట్టారు. ఆ పిదప ఈ మహాయోధులు క్రీస్తు సమాధి వద్దకు వెళ్ళి ధన్యవాదాలు చెప్పుకున్నారు. ఈ అత్యంత కిరాతకమైన, పైశాచికమైన హత్యాకాండ ఆధారంగా క్రయిస్తవంపై ఒక నిర్ణయానికి రావచ్చా? క్రయిస్తవులు ఎవరు దీనికి ఒప్పుకోరు. క్రయిస్తవులే కాదు క్రయిస్తవేతరులు, నాగరికులు కాని అంతగా నాగరికులు కాని వారు కాని ఎవరైనా సరే ఈ పైశాచిక హత్యాకాండల ఆధారంగా క్రయిస్తవంపై ఒక నిర్ణయానికి రావడం తగదనే అంటారు. అలాంటప్పుడు చాలా స్వల్పమైన సంఖ్యలో ఉన్న కొందరు ఉగ్రవాదుల చేష్టల కారణంగా ఇస్లామ్‌పై ఒక నిర్ణయానికి రావడం కూడా సముచితం కాదు.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమంటే, క్రయిస్తవం పేరుతో ఈ హత్యాకాండలు, దోపిళ్ళకు చాలా సందర్భాల్లో ప్రభుత్వాలు, చర్చిలు స్వయంగా ప్రారంభించడం, ప్రణాళికాబద్ధంగా జరిపించడం, మద్దతివ్వడం కనబడుతుంది. ఇవి వ్యవస్థీకృత ఉగ్రవాద చర్యలుగా పేర్కొనాలి. కాగా ఇస్లామ్ పేరుమీద జరిగిన సంఘటనలేవయినా గాని అవి పూర్తిగా ఎవరో కొందరు వ్యక్తులు వ్యక్తిగతస్థాయిలో పాల్పడిన చర్యలు. ఈ చర్యలకు గుర్తింపు పొందిన ప్రభుత్వాలు కాని, ముస్లిమ్ నాయకత్వం కాని ఎన్నడూ మద్దతివ్వలేదు.

- బాప్టిస్ట్ క్రయిస్తవ వర్గానికి చెందిన కొందరు తమ ధార్మిక గ్రంథాలను మార్చి అబార్షన్ క్లినిక్కులపై బాంబులు వేయడానికి సమర్ధింపు పొందారు. ఆ విధంగా జరిగిన బాంబింగ్‌లో అనేకమంది అమాయకులు మరణించారు.

- స్టాలిన్ రెండవ ప్రపంచయుద్ధంలో థర్డ్ రీచ్ సైన్యం దాడుల్లో ఇరుక్కున్నప్పుడు మార్క్సిస్ట్ లెనినిస్ట్ భావాల వల్ల ప్రజామద్దతు లభించదని గ్రహించాడు. ఆయన రష్యన్ జాతీయవాదాన్ని ప్రస్తావించాడు. అలా కూడా ప్రయోజనం కలుగకపోయేసరికి చివరకు ఆర్థోడాక్స్ చర్చినే ఆశ్రయించాడు, హోలీ మదర్

రష్యా చిహ్నంతో ప్రజలను ప్రతిఘటనకు సమాయత్తం చేశాడు.

- రెండవ ప్రపంచయుద్ధానికి ముందు జపాన్ సామ్రాజ్య విస్తరణకు ప్రజామద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. ఆసియాలో వలసలకు పూనుకుంది. ప్రజామద్దతు కోసం షింటో మతాన్ని, బౌద్ధమతాన్ని ప్రస్తావించడం ద్వారా ప్రజామద్దతు పొందింది.

- శ్రీలంకలో ప్రాబల్యంలో ఉన్న బౌద్ధ సింహళీయులు హిందూ తమిళ వేర్పాటువాదులకు వ్యతిరేకంగా ప్రజామద్దతు పొందడానికి బౌద్ధ సన్యాసుల సహాయం పొందారు.

- నాజీ జర్మనీ నియంత హిట్లర్ క్రయిస్తవ భక్తుడు. అతను దేవుని పథకం ప్రకారం పనిచేస్తున్నాననే చెప్పేవాడు. హిట్లర్ జరిపించిన హత్యాకాండల్లో 60 లక్షల మంది యూదులు మరణించారు. జర్మనీ యుద్ధానికి చర్చి మద్దతు పొందే ప్రయత్నాలు చేశాడు.

- అమెరికాలోను యుద్ధకాలంలో ప్రధాన చర్చీలు, మతనాయకులు, ప్రొటెస్టెంటులు, కేథలిక్కులు, యూదుల మతపెద్దలను రంగంలో దించి యుద్ధానికి ధార్మిక మద్దతు పొందే ప్రయత్నాలు జరిగాయి.

- ఇదేవిధంగా భారతదేశంలో మతతత్వ శక్తులు ఎల్లప్పుడు ధార్మిక చిహ్నాలనే ఉపయోగిస్తూ వచ్చాయి. జాతీయ ప్రయోజనాలకు మతానికి ముడిపెట్టి ఎన్నికల్లో ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు చేస్తున్నాయి. మెజారిటీ ఓట్లను పొందడానికి మైనారిటీలను బుజ్జగిస్తున్నారన్న అపవాదును కూడా ప్రచారం చేస్తూ వస్తున్నాయి.

ప్రజామద్దతు పొందడానికి, తమను తాము సమర్థించుకోవడానికి మతాన్ని వాడుకోవడం చాలా చోట్ల మనం చూస్తాం. కాని ఈ యుద్ధాలు, పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలు ఇవి ఏవీ కూడా మతం కోసం జరిగినవి కాదు. మతాన్ని అక్కడి నుంచి తొలగించినా సరే ఈ యుద్ధాలు, పోరాటాలు, ఆందోళనలు ఉండనే ఉంటాయి. మతాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకోవడం మాత్రమే జరుగుతోంది. ఇందులో మతప్రమేయం లేదు.

# అణిచివేత - ఉగ్రవాదం
## రెంటి మధ్య తేడా ఏమిటి ?

ఉగ్రవాదానికి మతానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఉగ్రవాదం రాజకీయ, ఆర్థిక సామాజిక కారణాల వల్ల తలెత్తుతుంది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలమ్, ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ, ఉల్ఫా వగైరా ఉగ్రవాద సంస్థలు ముస్లిము సంస్థలు కానే కావు. అలాగే హిందూత్వ సిద్ధాంతంతో నడుస్తున్న ఉగ్రవాద సంస్థలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు అభినవ్ భారత్. ఇలాంటి సంస్థలు మిలిటెన్సీని మతంతో ముడేస్తున్నాయి. కాని ఇటీవల ఉగ్రవాదాన్ని ఇస్లామ్‌తో ముడిపెట్టే ప్రయత్నాలకు మీడియాలో కొన్ని శక్తులు పాల్పడుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలకు, స్థానిక పరిణామాలకు మధ్య యాధృచ్ఛికంగా ఏర్పడిన పోలికలను మీడియా అతిగా చేసి చూపించడం ప్రారంభించింది. ఇస్లామిక్ టెర్రరిజమ్ అన్న పదాలు వాడడం మొదలెట్టింది. నిజానికి ఉగ్రవాదానికి ఇస్లామ్‌కు మధ్య రవ్వంత సంబంధం కూడా లేదు.

అన్యాయాలు, పౌరస్వేచ్ఛలను, హక్కులను అణిచివేయడం వల్ల హింస పెచ్చరిల్లుతుంది. ఈ హింస తర్వాత ఉగ్రవాదంగా రూపాంతరం చెందవచ్చు. ఈ చేష్టలకు పాల్పడేవారు ఒక ప్రత్యేక మతవర్గానికి చెందినవారైతే ఆ ఉగ్రవాద చేష్టలకు ఆ మతానికి ముడిపెట్టడం జరుగుతోంది. ఆ మతవిశ్వాసాలవల్లనే ఇలాంటి చేష్టలకు పాల్పడుతున్నారన్న ప్రచారం మొదలవుతోంది. లిబరేషన్ ఆఫ్ తమిళ ఈలమ్ కార్యకర్తలు, పోరాటయోధులు ముఖ్యంగా హిందూ మతానికి చెందినవారన్నది అందరికీ తెలిసిన వాస్తవం. కాని మీడియా వారి మతానికి వారి చర్యలకు ముడిపెట్టడం చేయలేదు. అలాగే ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ ఉత్తర ఐర్లాండ్ ప్రజల హక్కుల కోసం పోరాడుతుంది. ఐరిష్ రిపబ్లిక్ ఆర్మీ కార్యకర్తలందరూ కేథలిక్ క్రయిస్తవులు. కాని పాశ్చాత్య మీడియా వారిని కేథలిక్ క్రయిస్తవ ఉగ్రవాదంగా చిత్రించలేదు.

ఇక్కడ గమనించవలసిన మరో అంశమేమంటే టెర్రరిస్టుగా కొందరి దృష్టిలో ఉన్న వ్యక్తి మరికొందరి దృష్టిలో స్వాతంత్ర్య సమరయోధుడు కావచ్చు. ఉదాహరణకు సర్దార్ భగత్‌సింగ్ విషయం అలాంటిదే. ఆయన కోట్లాది భారతీయుల దృష్టిలో హీరో. యువకులకు, విప్లవకారులకు ఆయన ఆదర్శం. బ్రిటీషు పోలీసు అధికారి జాన్ శాండర్స్‌ను హతమార్చిన

గ్రూపులో ఆయన ఉన్నాడు. భగత్‌సింగ్ స్వయంగా అసెంబ్లీలో బాంబు విసిరాడు. ఆ ప్రేలుడులో ఎవరు మరణించలేదు. భగత్‌సింగ్‌ను గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర్యసమర యోధుడిగా మనం భావిస్తాం. కాని బ్రిటీషువారు ఆయన్ను టెర్రరిస్టుగా ముద్రవేశారు.

కొన్ని గ్రూపులు ఉగ్రవాద చర్యలకు పాల్పడడమే కాదు పాశ్చాత్యదేశాల్లో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలు కూడా ఇలాంటి పనులకు పాల్పడ్డాయి. పశ్చిమబెంగాల్లోని పురులియాలో ఆయుధాలు జారవిడిచిన బ్రిటీషు టెర్రరిస్టు పీటర్ బ్లీచ్‌ను అరెస్టు చేసి ఏడేళ్ళ జైలు శిక్ష విధించారు. కలకత్తా జైలులో అతడు సగం శిక్షకూడా పూర్తి చేయకముందే బ్రిటీష్ ప్రధాని టోనీబ్లెయిర్ చేసిన ప్రత్యేక విజ్ఞప్తిని మన్నించి అతడికి క్షమాభిక్ష పెట్టడం జరిగింది. టోనీ బ్లెయిర్ ఉగ్రవాదంపై యుద్ధం చేస్తున్న ఛాంపియన్లలో ఒకడు. ఇదే కేసులో అరెస్టయి కలకత్తాలో జైలు శిక్ష అనుభవిస్తున్న మరో ఐదుగురు రష్యన్లకు కూడా వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్.డీ.ఏ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టి వదిలేసింది (ఇండియా పార్డన్డ్ పైలట్స్ ఇన్ పురులియా ఆర్మ్స్ డ్రాప్ కేస్, ది టైమ్స్ ఆఫ్ ఇండియా, జులై 22, 2000). అమెరికన్ టెర్రరిస్టు రేమండ్ డేవిస్ కేసు కూడా ఇలాంటిదే. లాహోర్‌లో తాలిబాన్ల కోసం టెర్రరిస్టులను రిక్రూట్ చేస్తూ పట్టుబడ్డాడు. అతడిని విడుదల చేయించుకోడానికి అమెరికన్లు చివరకు దియాత్ అంటే రక్తపరిహారం కూడా చెల్లించారు. లాహోర్ స్క్వేర్ వద్ద అతడు హతమార్చిన వ్యక్తుల కుటుంబసభ్యులకు రక్తపరిహారం చెల్లించి విడుదలయ్యాడు.

క్యూబా విమానాన్ని 1976లో బాంబుతో అమెరికా పేల్చింది. 2005లో ఈ విషయం మీడియాలో వచ్చింది. అమెరికా ద్వంద్వప్రమాణాలు, రెండునాల్కల ధోరణి బట్టబయలైంది. విమానాన్ని బాంబుతో పేల్చిన పోసాడా ఒక అమెరికన్ అని తేలింది. అమెరికన్ మాత్రమే కాదు సిఐఏ ఏజంటు కూడా. ఈ సంఘటనలో 73 మంది క్యూబన్లు మరణించారు. అతడు ఫ్లోరిడాలో ఆశ్రయం పొందాడు. అతడిని తమకు అప్పగించాలని క్యూబా కోరినా అమెరికా తిరస్కరించింది. ఈ విషయమై గార్డియన్ పత్రిక ఇలా రాసింది "ఈ కేసు చాలా ముఖ్యమైనది. ఎందుకంటే అమెరికా తన విషయంలోను తన మిత్రదేశాల విషయంలోను ఒక న్యాయాన్ని, తన శత్రువుల విషయంలో మరో న్యాయాన్ని పాటిస్తుందని ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో ఉన్న భావాన్ని ఇది బలపర్చింది." (డంకన్ క్యాంప్‌బెల్ "హౌ ది యు.ఎస్. డీల్స్ విత్ ఫ్రండ్స్ అండ్ ఫోస్", గార్డియన్ న్యూస్‌పేపర్ లిమిటెడ్, 2005, ది హిందూ, జూన్ 30, 2005లో పునర్ముద్రణ)

అంతేకాదు ఈరాన్‌లో టెర్రరిస్టు గ్రూపులకు అమెరికా నిధులు సమకూరుస్తుందన్న వార్తలు వచ్చాయి. న్యూయార్కర్‌లో సీమర్ హెర్ష్ రాసిన వ్యాసం ప్రకారం జార్జిబుష్ కాలంలో

అమెరికా ముజాహిదీన్ ఖలఖ్ సంస్థకు చెందిన నెవడా సభ్యులకు నిధులు, ఆయుధాలు, శిక్షణ సమకూర్చింది. ఈ సంస్థ ఈరాన్‌కు చెందిన టెర్రరిస్టు సంస్థ. ఈరాన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తున్న సంస్థ. అనేకమంది ఈరానీ అణుశాస్త్రవేత్తల హత్యల వెనుక ఇస్రాయీల్‌తో పాటు ఈ సంస్థ హస్తం కూడా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ సంస్థను అమెరికా టెర్రరిస్టు సంస్థగా 1997 నుంచి ప్రకటించింది కూడా. మరోవిధంగా చెప్పాలంటే అమెరికా స్వయంగా టెర్రరిస్టు సంస్థగా ప్రకటించిన సంస్థకు సహాయసహకారాలందించింది. ఇది అమెరికా చట్టాల ప్రకారం నేరమని గ్లెన్ గ్రీన్‌వాల్డ్ పేర్కొన్నాడు. (http://www.policymic.com/articles/6587/u-s-funded-iran-terroristgroup-says-shocking-report ) ఈ నాటకాలను, ద్వంద్వప్రమాణాలను పరిశీలిస్తే టెర్రరిజమ్‌పై పాశ్చాత్య ప్రాపగాండలో ఉన్న రాజకీయాలు అర్థమవుతాయి. చిన్న దేశాలను, బలహీన దేశాలను బెదిరించడానికి టెర్రరిజమ్ ఒక గొప్ప సాధనంగా ఉపయోగపడుతోంది.

నిజానికి పాశ్చాత్యదేశాలు అణిచివేతలను ఏమాత్రం పట్టించుకోవు. కాని ఆ అణిచివేతలపై ప్రతిస్పందనలు, తిరుగుబాట్లు, ప్రతిఘటనలు మొదలైతే మాత్రం వెంటనే రంగంలోకి దిగుతాయి. ఈ విషయాన్ని ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ గుర్తించింది. 2003లో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని గుర్తించి, ఐక్యరాజ్యసమితికి ఈ విషయమై విజ్ఞప్తి కూడా చేసింది. అన్ని విధాల ఉగ్రవాదంపై సంయుక్త ప్రతిస్పందన కోసం అంతర్జాతీయ కన్వెన్షన్ నిర్వహించాలని కోరింది. "మేము అంతర్జాతీయ టెర్రరిజమ్ మూలకారణాలను తొలగించాలని గట్టిగా భావిస్తున్నాము. టెర్రరిజానికి కారణమయ్యే వాతావరణం, విదేశీ దురాక్రమణలు, అన్యాయాలు, దౌర్జన్యాలు ఇలాగే కొనసాగుతూంటే ఉగ్రవాదంపై యుద్ధం వల్ల సాధించేది ఏదీ ఉండదని భావిస్తున్నాము" అని స్పష్టంగా ఐఓసి సమావేశం పేర్కొంది. (ది హిందూ, పాలస్తీనియన్స్ నాట్ టెర్రరిస్ట్స్, ఓ.ఐ.సి, మార్చి 4, 2002)

కాని గుప్పెడు మంది దారితప్పిన వ్యక్తులు కొన్ని హింసాత్మక చర్యలకు పాల్పడగానే వాటిని జిహాద్‌గా పేర్కొనడం జరుగుతోంది. ఈ హింసకు పాల్పడుతున్న వారిలో కొందరు కూడా మతపరమైన మద్దతు పొందడానికి తమ చేష్టలను జిహాద్‌గానే చెప్పుకుంటున్నారు. జిహాద్‌గా చెప్పబడే ఇలాంటి చర్యలే ముస్లిమ్ సముదాయానికి పెద్ద శత్రువులు. ఈ మతిలేని హింస వల్ల ముస్లిముల పట్ల విద్వేషం జనిస్తోంది. ముస్లిములకు ఇస్లామ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న దుష్ప్రచారానికి మరింత బలం లభిస్తోంది. ఇలాంటి ప్రతి సంఘటన ఈ విషప్రచారాన్ని బలోపేతం చేస్తోంది

ఇస్లామ్ ప్రకారం జిహాద్ అంటే తగిన వనరులన్నింటిని ఉపయోగించుకుని

ప్రయత్నించడం. కలం ద్వారా, మాటలు, చేతల ద్వారా అన్ని విధాలుగా ప్రయత్నాలు చేయడమే జిహాద్. కాని పక్షపాతపు పొరలు కమ్మిన మీడియాలోని కొన్ని శక్తులు ఈ వాస్తవాన్ని చూడడం లేదు. ముస్లిములకు సంబంధించిన విషయమైతే, కొందరు దారితప్పినవారి చర్యలన్నింటిపై జిహాద్ అన్న ముద్ర వేయడం జరుగుతోంది.

కొన్ని ముస్లిమ్ దేశాల్లో రాజ్యేతర శక్తులు ఏవిధంగా అణిచివేతలను ప్రతిఘటించడానికి లేచాయో గమనించవలసి ఉంది. మధ్యప్రాచ్య సమాజాల్లో అభివృద్ధి చాలా తక్కువన్నది నిర్వివాదాంశం. విద్యాప్రమాణాలు, జీవనప్రమాణాలు, ఉపాధి అవకాశాలు చాలా తక్కువ. కొందరు చమురు సంపద చేజిక్కించుకున్న కులీనవర్గాల వారిని, చమురు సంపద పుష్కలంగా ఉన్న చిన్న చిన్న గల్ఫ్ రాజ్యాలను మినహాయిస్తే మధ్యప్రాచ్యం అంతటా ఇదే పరిస్థితి ఉంది. వారికి భవిష్యత్తు మెరుగుపడే అవకాశాలు కూడా కనబడడం లేదు.

చాలా ముస్లిమ్ దేశాలు రాజులు, నియంతల పాలనలో ఉన్నాయి. ప్రజాస్వామిక ఉద్యమాలను అక్కడ ఉక్కుపాదంతో అణిచివేయడం జరుగుతోంది. మౌలిక హక్కులు, పౌరస్వేచ్ఛల ప్రశ్నే లేదు. పారదర్శకత లేని ప్రభుత్వాలు, పెచ్చుమీరిన అవినీతి కలిసి పౌరజీవనాన్ని దుర్భరం చేశాయి. ఈ దేశాల్లోని నియంతలు పాశ్చాత్యుల సహకారంతో తమ పాలనకు సమర్థింపు పొందుతున్నాయి. అందుకు బదులుగా పాశ్చాత్యదేశాలకు తమ చమురు, సహజవాయువు వంటి సహజవనరులను కట్టబెడుతున్నాయి. ఈ వాతావరణంలో ప్రతిఘటన ఉద్యమాలు తలెత్తడం ఆశ్చర్యమేమీ కాదు. ఆయా దేశాల్లో ఉన్న వ్యవస్థలపై తిరుగుబాటు ఇది. ఈ ప్రతిఘటన ఉద్యమాలు సాయుధ ఉద్యమాలుగా కూడా మారవచ్చు. కాని ఈ సందర్భంగా పాశ్చాత్యుల రెండునాల్కల ధోరణి కూడా బయటపడుతోంది.

ప్రముఖ అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త, మేధావి ఈ పరిస్థితిని చక్కగా వివరించారు.

> "టెర్రరిజానికి అణిచివేతను సాకుగా చూపించడం మొదట జరిగేది. ఆ తర్వాత అణిచివేతకు సాకుగా టెర్రరిజాన్ని చూపించడం జరుగుతోంది. ఇందులో మొదటిది వామపక్షవాదుల సాకు. రెండవది నియోకన్సర్వేటివ్‌ల సాకు."

ఏ సమాజంలోనైనా రాజకీయ హింస అన్నది అభిలషణీయం కాదు. ఈ వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారు. టెర్రరిజమ్ కూడా రాజకీయ హింసే. కాని ప్రపంచంలో చాలా చోట్ల రాజ్యవ్యవస్థలు రాజకీయ హింసకు పాల్పడుతున్నాయి. తమ స్వంత ప్రజలపైనే, తమ దేశంలోని ప్రత్యర్థులపైనే రాజకీయ హింసను కొనసాగిస్తున్నాయి. అక్రమ వ్యవస్థలు తప్పనిసరిగా రాజకీయహింసను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది.

చాలా కాలం వరకు పలస్తీనా ప్రజలు ఇస్రాయీల్ రాకెట్లను రాళ్ళతోను అలాంటి ఇతర ఆయుధాలతోను ఎదిరించారు. కాని ఇది ఎంతోకాలం వరకు కొనసాగలేదు. ఇస్రాయీల్ హింసాకాండ పెచ్చుమీరుతుండడంతో హమస్, హిజ్బుల్లా వంటి సంస్థలు మరింత బలమైన, మరింత వ్యవస్థీకృతమైన ప్రతిస్పందనకు దిగాయి. ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లలో దశాబ్దం కొనసాగిన యుద్ధాలు సందేహాలను మరింత పెంచాయి. పాశ్చాత్య దేశాలు పలస్తీనా సమస్యను పరిష్కరించడానికి బదులు పోరాట ప్రాంతాన్ని మరింత పెంచడానికి చూస్తున్నాయని, కొత్త ఆయుధాలను పరీక్షించుకునే యుద్ధక్షేత్రాలను వెదుకుతున్నాయన్న అనుమానాలు బలపడ్డాయి. సద్దామ్ ఇరాక్‌లో జనసంహారక ఆయుధాలున్నాయన్న పాశ్చాత్యుల అబద్ధం బట్టబయలైంది. దాంతో ఈ అనుమానాలు మరింత ఎక్కువయ్యాయి. యుద్ధం, హింస, రక్తపాతాలనే పాశ్చాత్యదేశాలు కోరుకుంటున్నాయన్న భావాలు ఘనీభవించాయి. ఈ నిరాశా నిస్పృహల వాతావరణంలో కొందరు యువకులు పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా వ్యవస్థీకృతమయ్యారు. చివరకు ఏం జరిగింది. పాశ్చాత్యవ్యవస్థ ఏ తాలిబాన్లనైతే టెర్రరిస్టులుగా ముద్రవేసిందో వారి ముందే నేడు కూలబడుతోంది.

ఈ వాస్తవాలను, నిజాలను గమనిస్తే ఇస్లామ్‌ను, ముస్లిములను టెర్రరిజమ్‌తో ముడిపెట్టడమన్నది కొన్ని శక్తుల వ్యూహంగా స్పష్టమవుతుంది.

నేటి ప్రపంచంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా ఇస్లామ్, ముస్లిములపై ఒక నిర్ణయానికి రావడం సముచితం కాదు. ఈ సంఘటనల్లోను బాధితులు ముస్లిములే. వారి ఆగ్రహం, ఆవేదన, ప్రతిఘటనలు సహజమైనవే. శ్రీలంక, ఉత్తర ఐర్లాండ్,కాంగో తదితర ప్రాంతాల్లో బాధితులు ఎలా ప్రతిస్పందించారో ఇది అంతే. ఇస్లామ్ ప్రపంచంలో శాంతిని, సహజీవనాన్ని కోరుతుంది. మానవ ప్రాణాలు, స్వేచ్ఛలు, ఆస్తులు, మానమర్యాదలు భద్రంగా ఉండాలని అభిలషిస్తుంది.

ఈ ఖుర్ఆన్ ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది.

> "ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాలు కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." దివ్యఖుర్ఆన్ (5:32)

ఈ నేపథ్యం దృష్ట్యా టెర్రరిజాన్ని ఇస్లామ్‌తో ముడిపెట్టడమన్నది ఒక కుట్ర తప్ప మరేమీ కాదని స్పష్టంగా అర్థమవుతోంది. మతవిశ్వాసాలను అప్రతిష్ఠపాలు చేయడం వల్ల మనకు పరిష్కారాలు లభించవు. అణిచివేతలు, అన్యాయాలను తొలగించడమే సమస్యలకు పరిష్కారం.

# ఇస్లామోఫోబియాను ఉత్పత్తి చేయడం

సోవియట్ యూనియన్ పతనమై, ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత పాశ్చాత్యదేశాలు ముఖ్యంగా అమెరికా కొత్త శత్రువులను వెదికే పనిలో పడ్డాయి.

అమెరికా రచయిత, న్యూయార్కర్ పత్రికలో కాలమిస్ట్, ఇంటర్నేషనల్ హెరాల్డ్ ట్రిబ్యునల్‌లో వ్యాసకర్త, విలియం ఫాఫ్ మాటలు ఇక్కడ గమనించదగ్గవి

> "కమ్యూనిస్టులకు పాశ్చాత్యులకు మధ్య యుద్ధం ఇప్పుడు పాశ్చాత్యులకు ముస్లిములకు మధ్య యుద్ధంగా మారిందని భావిస్తున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు.

"కొందరు అమెరికన్లకు కొత్త శత్రువులను వెదకడం అవసరం. మన శక్తిసామర్థ్యాలు పరీక్షించుకోడానికి ఒక శత్రువు కావాలి. కమ్యూనిజమ్ తుదిశ్వాస వదిలిన తర్వాత, తగిన శత్రువుగా ఇస్లామ్ కనబడింది. కాని ఇస్లామ్‌ను శత్రువుగా ప్రకటించడమంటే, రెండవ ప్రచ్ఛన్నయుద్ధానికి దిగడమే అవుతుంది. ఈ రెండవ ప్రచ్ఛన్నయుద్ధం మొదటి దాని మాదిరిగా పాశ్చాత్యులకు జయప్రదంగా ముగిసే అవకాశాలు లేవు. ఆకుపచ్చ భయం (ఇస్లామ్‌ను సూచిస్తూ ఆకుపచ్చ వర్ణాన్ని వాడారు). ఇప్పుడు కమ్యూనిస్టుల ఎరుపు భయం స్థానంలోకి వచ్చింది."

అఫ్గనిస్తాన్‌నుంచి సోవియట్‌ను తరిమి కొట్టడానికి ఆఫ్గన్ ముజాహిదీన్లకు, అల్‌ఖాయిదాకు సి.ఐ.ఏ. సహాయసహకారాలందించింది. ఆఫ్గన్ యుద్ధప్రభువులు పాశ్యాత్యులు ఇచ్చిన తుపాకులను పాశ్చాత్యులపై, పాశ్చాత్య ప్రయోజనాలపై ఎక్కుపెట్టడానికి ఎక్కువ సమయం పట్టలేదు. సి.ఐ.ఏ. ప్రాపగాండ యంత్రాంగం సుదీర్ఘకాలంగా పనిగట్టుకుని ప్రచారం చేసిన జిహాద్ భావనే ఈ పరిణామం వెనుక కూడా ఉంది. "అవిశ్వాసులు, నాస్తికులపై జిహాద్"గా సి.ఐ.ఏ. ప్రాపగాండ బ్రెయిన్ వాష్ చేసింది. అమెరికా పెంచి పోషించిన ఆఫ్గన్ ముజాహిదీన్లు ఆ తర్వాత మధ్యప్రాచ్యంలోను ఇతర ప్రాంతాల్లోను అమెరికా

ప్రయోజనాలనే లక్ష్యంగా చేసుకున్నారు.

ఈ లోగా అమెరికాలోని ఆయుధ ఉత్పత్తిదారులు కొత్త మార్కెట్ల కోసం ఒత్తిడి పెంచారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగియడంతో ఆయుధాల అమ్మకాలు పడిపోయాయి. ఆయుధ పరిశ్రమ సంక్షోభంలో పడింది. అమెరికా కాంగ్రేసు పెద్దలకు ఇది మంచి పరిణామం కాదు. ఆయుధాలు ఉత్పత్తి చేసే బహుళజాతి సంస్థల విరాళాల వల్లనే ఎన్నికల్లో అమెరికాన్ కాంగ్రేసు సభ్యులు గెలుస్తున్నారు. సెప్టెంబర్ 11న జంట టవర్లపై జరిగిన దాడి ఒక గొప్ప అవకాశంగా దొరికింది. ఆయుధాల అమ్మకాలు పెరిగాయి. చీూూణూు గణాంకాల ప్రకారం రేథీయన్, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ఆయుధకంపెనీల షేర్లు ఒక్కసారి ఆకాశాన్నంటాయి. న్యూయార్క్ టవర్లు కూలడంతో పాటు ఆయుధ కంపెనీల లాభాలు ఎగసిపడ్డాయి. హఠాత్తుగా యుద్ధనేరాల సంఖ్య పెరిగింది. ఆయుధ కంపెనీలకు పంటపండింది.

ప్రస్తుతం పాశ్చాత్యదేశాల్లో ఉన్న ప్రాపగాండ యంత్రాంగం చాలా పెద్దది. చాలా శక్తివంతమైనది. ఒక భ్రమను వాస్తవంగా మార్చే శక్తి దానికి ఉంది. వాస్తవాన్ని ఉత్త భ్రమగా నిరూపించే సామర్థ్యం కూడా దానికి ఉంది. ప్రాపగాండ యంత్రాంగం ఒక మౌలికమైన నమ్మకంపై ఆధారపడి పనిచేస్తుంది. ప్రజలు సాధారణంగా పరిపాలనలో చురుకైన పాత్ర పోషించడానికి ముందుకు రాలేని మూర్ఖులుగా నమ్ముతుంది. ప్రజలను సెంటిమెంటల్ సమస్యలతో రెచ్చగొట్టవచ్చని, భావావేశాలను కవ్వించే నినాదాలతో వారిని తమవైపు తిప్పుకోవచ్చని విశ్వసిస్తుంది. ప్రజాసంబంధాల పరిశ్రమ అనేది ఇలా పుట్టుకు వచ్చిందే. ప్రజల ఆలోచనలను అదుపు చేయవచ్చని ఈ పరిశ్రమ నమ్ముతుంది. ప్రాపగాండలో ముఖ్యమైన విషయమేమిటంటే ప్రజాసమస్యలపై హేతుబద్ధంగా ఆలోచించే అవకాశం ప్రజలకు ఇవ్వకూడదు. అందుకు బదులుగా ప్రజలు ఆలోచించకుండా వారిని దారిమళ్ళించే నినాదం ఏదో ఒకటి ఇవ్వాలి. ఉదాహరణకు ప్రెసిడెంట్ జార్జి డబ్ల్యు బుష్ ఇచ్చిన నినాదం “మీరు మాతో ఉన్నారా లేక ఉగ్రవాదులతో ఉన్నారా” అన్నది అలాంటిదే. ఈ నినాదం తర్వాత ఇతరులకు మరో అవకాశం లేకుండా పోయింది. ఉగ్రవాదులతో ఉంటామని ఎవరంటారు. అందువల్ల ఇక మిగిలిన దారి ఒక్కటే బుష్‌తో పాటు ఉండడం. (ఈ విషయమై నామ్ చామ్‌స్కీ రాసిన “మీడియా కంట్రోల్” చదవగలరు)

చాలా యూరోపు దేశాల్లో ముస్లిములు తీవ్రమైన బెదిరింపులు, దుర్భర పరిస్థితులు ఎదుర్కున్నారు. ఇది ఇంకా కొనసాగుతోంది. పరిస్థితి ఎంతగా దిగజారిందంటే చివరకు ప్రభుత్వాలు కల్పించుకుని భిన్న వర్గాల మధ్య సంబంధాలు చక్కదిద్దకపోతే పరిస్థితి చేయి

దాటిపోయేలా కనబడింది. అంతగా హానికరం కానటువంటి అపహాస్యాలు, ఎగతాళులు మొదలుకుని ఇస్లామ్‌ను హింసోన్మాదం రెచ్చగొట్టే మతంగాను, ముస్లిములను అసహనంతో వీరంగం వేసే మతోన్మాదులుగాను చిత్రించే స్థాయికి విషప్రచారం చేరుకుంది. యురప్‌లో ప్రతి ఒక్కడు ఇస్లామ్ హత్యాకాండను బోధిస్తుందన్నట్లు మాట్లాడే పరిస్థితిని సృష్టించారు. ఇస్లామీయ బోధనల్లో జిహాద్ అంతర్భాగమని, జిహాదీలు ఇస్లామ్ సైనికులని చిత్రించడం తీవ్రంగా కొనసాగింది. ఇక్కడ భారతదేశంలో ముస్లిములకు వ్యతిరేకంగా ఆరోపణల పెద్ద జాబితాయే ఉంది. ముస్లిమ్ రాజులు హిందూ మతాన్ని అవమానించడానికి హిందూ మందిరాలను కూలగొట్టారన్న అపార్థాలు అపోహలు మొదలు, ప్రతి ముస్లిమ్ నలుగురు భార్యలను పెళ్ళాడతాడని, ఇరవై మంది పిల్లల్ని కలిగి ఉంటారని, ప్రతి టెర్రరిస్ట్ ఒక ముస్లిమేనని ఇలా అనేక రకాల విషప్రచారం కొనసాగుతూనే ఉంది. ఈ అపార్థాలు, అపోహలకు కారణమేదైనా గాని, ప్రస్తుతం అనేక హింసాత్మక సంఘటనల్లో నిందితులుగా ముస్లిముల పేర్లే వస్తున్నాయి. ఇది రాజకీయ స్వార్థశక్తులకు గొప్ప అవకాశంగా లభించింది. మొత్తం ముస్లిమ్ సముదాయానికి చెడ్డపేరు వస్తోంది.

ఇక్కడ భారతదేశంలో ఈ ఇస్లామోఫోబియా, ఈ ప్రాపగాండ చాలా వరకు జయప్రదంగా కొనసాగుతోంది. ప్రతి సందర్భంలోను సగటు పౌరుడు నిజానిజాలు తెలుసుకునే పరిశోధన చేపట్టలేడు. టెలివిజన్‌లో కనబడిన విషయాలనే నిజమని నమ్ముతాడు. ప్రింట్ మీడియాలో తరచు వస్తున్న వార్తలే నిజాలని విశ్వసిస్తాడు.

పరిస్థితి మరింత దిగజారింది. ముస్లిములకు వ్యతిరేకంగా విద్వేష ప్రచారం, ఇస్లామ్ పట్ల భయసందేహాలను సృష్టించే ప్రయత్నాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. ఈ పరిస్థితి అమెరికాకు చమురుసంపద కోసం అనేక దేశాలపై దాడి చేసే అవకాశాన్ని ఇచ్చింది. మరోవైపు స్వార్థశక్తులకు సమాజంలో చెలామణి లభించింది. కాని దీని దుష్పరిణామాలను కూడా ఈ దేశాలు, సమాజాలు అనుభవించక తప్ప లేదు. వివిధ వర్గాల మధ్య అపోహలు, విద్వేషాల వాతావరణం సమాజాల్లో ప్రజాస్వామిక వాతావరణాన్ని దెబ్బతీస్తోంది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోంది. మరోవైపు సామాజికాభివృద్ధి ప్రక్రియ స్తంభించింది. ఫలితంగా సమాజంలో బలహీనవర్గాలు దెబ్బతింటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవ్యవస్థలు నాశనమవుతున్నాయి. మానవవిలువలు అంతరిస్తున్నాయి. ఈ వైషమ్యాలు, విద్వేషాల దశను సాధ్యమైనంత త్వరగా అధిగమించవలసి ఉంది. రైట్‌వింగ్ శక్తులు బలం పుంజుకోవడం, వివిధ ప్రాంతాల్లో మతతత్వశక్తులు చెలరేగడం ప్రజాస్వామ్యాలకు, ప్రగతిశీల ఉదారవాద గ్రూపులకు ఒక హెచ్చరిక వంటిది. ఇస్లామోఫోబియాను సృష్టిస్తున్న శక్తులను

ఇప్పటికైనా అరికట్టడానికి ప్రయత్నాలు ప్రారంభం కావలి. ఈ వాస్తవం ప్రపంచం ముందుకు చాలా సార్లు వచ్చింది. టెర్రరిజానికి కారణం ఇస్లామ్‌లో అంతర్లీనంగా హింసాత్మక స్వభావం అన్న ఆరోపణ చేస్తూ ప్రస్తుతం ముస్లిములను లక్ష్యంగా చేసుకుంటున్నారు కాని నిజానికి స్వార్థశక్తుల రాజకీయ ప్రయోజనాల కోసం జరుగుతున్న నాటకమే ఇదంతా.

కాబట్టి వివిధ సముదాయాల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి మనం ప్రయత్నించవలసి ఉంది. శాంతి, సౌహార్ద సందేశాన్ని ప్రచారం చేయాలి. మతాన్ని నైతిక ప్రమాణాల వ్యవస్థగా చూడాలే తప్ప ఏవో ఆచారవ్యవహారాల సమాహారంగా చూడరాదు. రాజకీయ ప్రయోజనాలతో, వనరులను కబళించడానికి ప్రయత్నిస్తున్న స్వార్థశక్తులు విజయం సాధించకుండా చూడాలి. మానవతా విలువలు విస్తరించేలా కృషి చేయాలి.

# ఉగ్రవాదం మూలకారణాలు

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా పెను హింసాకాండ కొనసాగుతోంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. ప్రజాజీవనం అల్లకల్లోలమవుతోంది. న్యూయార్క్‌లోని వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌కు చెందిన జంట టవర్లపై జరిగిన దాడి టెర్రరిస్టు దాడిగా చెప్పబడింది. ఈ దుర్ఘటన వివరాలు చాలా మందికి తెలిసినవే కాబట్టి ఇక్కడ ప్రస్తావించనవసరం లేదు. జిహాద్ ప్రేరణ పొందిన టెర్రరిస్టులు ఈ దాడులకు పాల్పడ్డారన్న వాదనలు వినిపించాయి. మధ్యప్రాచ్యం నుంచి పాకిస్తాన్ వరకు ఉన్న ప్రాంతానికి చెందినవారే ఈ టెర్రరిస్టులని కూడా చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఇస్లామ్ గురించి జిహాద్ గురించి అనేక ప్రశ్నలు తలెత్తాయి, అవిశ్వాసులకు వ్యతిరేకంగా కొనసాగే "పవిత్రయుద్ధమే జిహాద్" అన్న వివరణలు వినిపించాయి.

ప్రపంచ జనాభాలో ముస్లిములు దాదాపు 23 శాతం ఉన్నారు. అంటే దాదాపు నూట డెబ్బయి కోట్ల మంది. ఇస్లామ్ అన్న పదానికి అరబ్బీ భాషలో అర్థం పరిశీలిస్తే, ఇస్లామ్ అన్న పదం అరబీలో సిల్మ్ అన్న పదం నుంచి పుట్టింది. సిల్మ్ అంటే శాంతి అని అర్థం. ఇస్లామ్ అంటే శాంతిధర్మంగా భావించబడుతుంది. ఇస్లామ్‌ను వ్యతిరేకించేవారు కూడా ఇస్లామ్ అంటే శాంతి అన్న అర్థాన్ని ఒప్పుకుంటారు. అంతేకాదు, ఇస్లామ్‌లో అన్యాయమైన హింసాకాండను ప్రోత్సహించే విషయాలేవీ లేవని కూడా ఒప్పుకుంటారు. నిజానికి సెప్టెంబర్ 11న జంటటవర్లపై దాడి తర్వాత గడిచిన దశాబ్ద కాలంలో నాటో చేపట్టిన వ్యవస్థీకృత హింసాకాండకు బలయ్యిందిన ముస్లిములు ఇస్లామీయ ప్రపంచమే. ప్రపంచశాంతి, భద్రతలను కాపాడుతున్నామని చెప్పుకుంటూ, రెండు ముస్లిమ్ దేశాలు అఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై అమెరికా దురాక్రమణకు పాల్పడింది. ఈ రెండు దేశాలను సర్వనాశనం చేసింది. అక్కడ హింసాకాండ కొనసాగుతూనే ఉంది. అక్కడి ప్రజలకు శాంతిభద్రతలు సుదూర స్వప్నాలుగానే మిగిలిపోయాయి. దాదాపు పదిలక్షల మంది మరణించారు. యాభైలక్షల మంది శరణార్థులయ్యారు. ఇలాంటి వారి గురించే దేవుడు దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు.

"అవనిలో కల్లోలాన్ని రేకిత్తించకండి అని వారితో అన్నప్పుడల్లా వారు "మేము సంస్కర్తలము మాత్రమే" అని అంటారు - జాగ్రత్త! అస్తవంగా వారే అసలు కల్లోలాన్ని సృష్టించేవారు. వారు గ్రహించడం లేదు." దివ్యఖుర్ఆన్ (2:11-12)

ప్రస్తుతం ప్రపంచంలో శాంతి భద్రతల గురించి జరుగుతున్న చర్చ యావత్తు అగ్రరాజ్యాలుగా చెలామణి అవుతున్న పాశ్చాత్యదేశాల కనుసన్నల్లో జరుగుతోంది. ప్రబలమైన పాశ్చాత్యమీడియా నాయకత్వంలో కొనసాగుతోంది. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి వంటి ప్రపంచ సంస్థలను కూడా ఈ దేశాలే నియంత్రిస్తున్నాయి. శాంతిప్రక్రియల ద్వారా వీళ్ళు సాధిస్తామని చెబుతుందేమిటో నమ్మడం కష్టమే. చిన్న దేశాలు, బలహీనదేశాల వాదన ఎంత న్యాయబద్ధమైనదైనా సరే వారి మాటకు అంతర్జాతీయ మీడియాలో చోటు దక్కదు. ఈ నేపథ్యంలో ఇస్లామ్‌ను, ముస్లిములను ఈ మీడియా లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేయడం, హింసాకాండ, అల్లకల్లోలాలకు ఇస్లామ్, ముస్లిములే కారణమంటూ నిందించడంలో ఆశ్చర్యమేముంది? ఇస్లామీయ దేశాలు ఆత్మరక్షణ చేసుకునే పరిస్థితుల్లో లేవన్నది వీరికి బాగా తెలుసు. కాబట్టి పాశ్చాత్యదేశాలు తమకు వ్యతిరేక శక్తులను ఈ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపణలు గుప్పించి, ఆ సాకుతో ఈ దేశాలపై, పౌరులపై, ఈ దేశాల ప్రయోజనాలపై దాడులకు పాల్పడడం కొనసాగుతూ వస్తోంది. పాశ్చాత్యదేశాలు "ఉగ్రవాదం" అన్న పదాన్ని కనిపెట్టాయి. ఈ హింసాకాండను టెర్రరిజమ్‌గా వర్ణిస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రపంచానికి వివరించడానికి కావలసిన పదబంధాలెన్నో సృష్టించాయి. మరోవైపు దాదాపుగా వర్ధమానదేశాలన్నీ ఏదో ఒక విధంగా తమ ప్రయోజనాల కోసం పాశ్చాత్యదేశాలపై ఆధారపడి ఉన్నాయి. అందువల్ల పాశ్చాత్యదేశాలను వ్యతిరేకించే స్థితిలో లేవు. పాశ్చాత్యదేశాల వాదనలోని లోపాలు, తప్పులు తెలిసినా ఎదురు ప్రశ్నించడానికి సాహసించడం లేదు. పాశ్చాత్యదేశాల కనుసైగల్లో మసలుకోడానికి ఇష్టపడని దేశాలపై దాడులకు పాల్పడుతున్నారు. ఆంక్షలు విధించి శిక్షిస్తున్నారు. ఇవన్నీ అంతర్జాతీయ రాజకీయాల వివిధ రూపాలు. ఈ నేపథ్యంలో మనం టెర్రరిజమ్ వాస్తవాలేమిటి? టెర్రరిజానికి ఎలా ఎక్కడి ఉంచి పుడుతుందన్న ప్రశ్నలపై ఆలోచించవలసిన అవసరం ఉంది.

ప్రస్తుతం మనకు ఉగ్రవాద మూలాలు మధ్యప్రాచ్యంలో కనబడవచ్చు. యూరపు యాంటి సెమిటిజమ్ వల్ల, నాజీ జర్మనీ జాతినిర్మూలన హత్యాకాండల వల్ల బాధితులైన యూదులకు పునరావాసం కల్పించాలని పాశ్చాత్యదేశాలు ఇస్రాయీల్ ఏర్పరచడానికి ప్రదర్శించిన అత్యుత్సాహం, ఫలితంగా జియోనిస్ట్ ఇస్రాయీల్ ఉనికిలోకి వచ్చింది. ఈ అక్రమ దేశానికి జన్మనిచ్చింది బ్రిటన్. ప్రపంచంలో మానవహక్కుల భారాన్ని మోస్తున్నట్లు

చెప్పుకునే అమెరికా పెంచి పెద్దచేసి గారాబం చేస్తోంది అమెరికా.

ఇస్రాయీల్ ఏర్పడినప్పుడు అక్కడ 60,000 మంది యూదులు కూడా లేరు. అరబ్బులు 7,50,000 మంది ఉండేవారు. కాని బ్రిటీష్ ఫారిన్ సెక్రటరీ ఏ.జే.బాల్ఫోర్ 1918లో "నాలుగు అగ్రరాజ్యాలు జియోనిజానికి కట్టుబడ్డాయి. జియోనిజం మంచైనా చెడ్డయినా సరే అదే కావాలంటున్నాయి. ఇది సుదీర్ఘకాలంగా సంప్రదాయికంగా కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్ ఆశలు అక్కడ ఉన్న ఏడులక్షల మంది అరబ్బుల కన్నా చాలా ముఖ్యమైనవి." అని రాశాడు.

హైఫా యూనివర్శిటీ స్కాలర్ ఇలాన్ పాపే ఇస్రాయీల్ చరిత్రకారుల్లో ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి. అసోసియేటెడ్ ప్రెస్‌కు చెందిన డాన్ పెర్రీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో "ఇస్రాయీల్ ఒక పాపం నుంచి పుట్టిందా?" అన్న ప్రశ్నకు ఆయన "అవును" అని స్పష్టంగా సమాధానం ఇచ్చాడు. అంతేకాదు తన జవాబును వివరిస్తూ "యూదులు ఇక్కడికి వచ్చి లాక్కున్నారు. అరబ్బు నేలను లాక్కున్నారు. ఇక్కడి వారిని తరిమి, బహిష్కరించి లాక్కున్నారు. మేము వలస ఆక్రమణదారులుగా మారాలనుకున్నాం. అయితే చాలా నైతికంగా కనబడాలని కూడా అనుకుంటున్నాం. ఇది క్షమించదగిన పాతకమా? పలస్తీనా ఏడు శతాబ్దాల పాటు ముస్లిమ్ పాలనలో ఉంది." అన్నాడు.

ఇస్రాయీల్ జర్నలిస్ట్ టామ్ సెగేవ్ ఒక చరిత్రకారుడు కూడాను. ఆయన తన పుస్తకం "జ్యూస్ అండ్ అరబ్స్ అండర్ ది బ్రిటీష్ మాండేట్" లో కుట్రలు కుతంత్రాలు బలప్రయోగాలను బ్రిటీషువారు ఎలా అమలుపరిచారో తెలియజేశాడు. 19191 నుంచి 1948 వరకు ఈ కుట్రల ద్వారా ఇక్కడ యూదపాలనకు అంకురార్పణ చేశారు. జియోనిస్ట్ నాయకులతో కుమ్మక్కయి ఇదంతా చేశారు. ఈ పుస్తకరచనలో ఆయన చేసిన పరిశోధనలో ఒక ఆసక్తికరమైన సంఘటన కూడా ఉంది.

ఆ సంఘటన గురించి సెగేవ్ ఇలా రాశాడు: "జియోనిస్ట్ సంస్థలు, బ్రిటీషు ప్రభుత్వం పలుకుబడి ఉన్న అరబ్బులకు లంచాలు ఇచ్చేవి. అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ (32వ అధ్యక్షుడు) జియోనిస్ట్ నాయకుడు ఛైమ్ వెజ్‌మ్యాన్‌తో (ఈయన ఇస్రాయీల్‌కు మొదటి అధ్యక్షుడు) అరబ్బులను కొనవచ్చని అన్నాడు. ఈ సంభాషణ జరిగిన కొన్ని నిముషాల్లోనే అరబ్బు పదం బక్షీష్ ప్రత్యక్షమయ్యింది. యూద సంస్థలకు అతిపెద్ద క్లయింటు ట్రాన్స్ జోర్డన్ యువరాజు అబ్దుల్లాలా కనబడుతున్నాడు." అంటూ ఆయన ముగించాడు. నేడు అరబ్బులకు అమెరికా మీద బ్రిటన్ మీద ఈ రెండు దేశాలు అరబ్బు భూభాగంలో ప్రతిష్ఠించిన ఇస్రాయీల్ దేశం మీద ఎంత కోపం ఉందో అంతే ఆగ్రహం అవినీతిపరులైన అసమర్థులైన

తమ నాయకులపై కూడా ఉంది. అక్కడ కనబడుతున్న బాంబులు విసిరేవాళ్ళు ఈ అవినీతి, అసమర్థ ప్రభుత్వాల వల్ల ఉనికిలోకి వచ్చినవారే.

ఈ నేపథ్యంలో చూస్తే ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఉన్న సంక్షోభానికి ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ ప్రాంతంలో ఇస్రాయీల్‌ను ఏర్పాటు చేయడమే ఈ సంక్షోభానికి మూలకారణం. 1950, 1960ల్లో బయటపడిన చమురు నిక్షేపాలపై పాశ్చాత్య కుట్రలు, ఇస్రాయీల్ దౌర్జన్యాల కారణంగా పుట్టుకువచ్చిన అరబ్ జాతీయవాద శక్తులు ఈ సంక్షోభం వెనుక ఉన్నాయి. ఇస్రాయీల్‌తో జరిగిన మూడు పెద్ద యుద్ధాలు, హిజ్బుల్లా ఇస్రాయీల్‌కు మధ్య యుద్ధంలో లెబనాన్ నాశనం కావడం, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలను బలవంతంగా ఆక్రమించుకోవడం, సిరియాలోని కొన్ని ప్రాంతాల్లో దురాక్రమణలు, పలస్తీనీయులను చిన్న చిన్న ప్రదేశాల్లో ముట్టడించి ఉంచే ప్రయత్నాలు, దక్షిణాఫ్రికాలోని జాతివివక్ష మాదిరి పరిస్థితులు, అరబ్బుల వ్యవసాయభూములను, నీటివనరులను కబళించడం, మూడుసార్లు భారీస్థాయిలో అరబ్బులను వారి ప్రాంతాల నుంచి బహిష్కరించిన సంఘటనలు, అరబ్బులను విభజిస్తూ 375 కి.మీ. గోడ కట్టడం ఇవన్నీ ఆగ్రహావేశాలను రెచ్చగొడుతూనే ఉన్నాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి తర్వాత జార్జిబుష్ మొదటి ప్రతిస్పందనలో వాడిన "క్రూసేడు" పదం మాదిరిగానే యుద్ధనేరాలు కూడా ఇస్లామీయ రంగును పులుముకుంటున్నాయి.

కాని అమెరికాకు, బ్రిటన్‌కు, ఇస్రాయీల్‌కు, ముస్లిమ్ ప్రాంతాల్లో అణిచివేతలకు పాల్పడుతున్న శక్తులకు ఈ వాస్తవాలేవీ పట్టడం లేదు. ఇరాక్ వద్ద జనసంహారక ఆయుధాలున్నాయన్న అబద్ధం సాకుతో ఇరాక్‌పై దాడి చేశారు. న్యూయార్క్‌పై సెప్టెంబర్ 11 దాడులు చేసిన అల్‌ఖాయిదాకు ఆశ్రయం ఇచ్చారన్న సాకుతో ఆఫ్గనిస్తాన్‌పై కార్పెట్ బాంబింగ్ చేశారు. ప్రముఖ రచయిత నోమాన్ చామ్‌స్కీ (హెజిమనీ ఆఫ్ సర్వయివల్, పెంగ్విన్ 2003, పేజి 200) ఈ దాడులకు బుష్ ప్రభుత్వాన్ని నిందించాడు. సెప్టెంబర్ 11 దాడుల్లో ఆఫ్గనిస్తాన్ ప్రమేయం ఉందన్న విషయం నిరూపితం కాకముందే దాడులు ఎలా ప్రారంభించారని ప్రశ్నించాడు.

అమెరికా 1958 నుంచి ముస్లిమ్ దేశాలపై దురాక్రమణలు, అణిచివేతలు, నియంత్రణలకు పథకాలు వేస్తోంది. ఐసెన్‌హోవర్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మూడు ప్రాంతాలను గుర్తించడం జరిగింది. ఉత్తర ఆఫ్రికా, ఇండోనేషియా, మధ్యప్రాచ్యాలు. ఇవన్నీ చమురు నిల్వలు పుష్కలంగా ఉన్న ప్రాంతాలు. ఇక్కడ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డల్లస్ రేడికల్ జాతీయవాదం సమస్యగా గుర్తించాడు. రేడికల్ ఇస్లామ్ కాదు ఆయన చెప్పింది రేడికల్

నేషనలిజమ్. ఉత్తర ఆఫ్రికాలో ఫ్రెంచ్ వలసపాలకులపై నేషనలిస్టులు విజయాలు నమోదు చేశారు. అధ్యక్షుడు నాసర్ తీసుకొచ్చిన అరబ్బు జాతీయవాదం, అలీన ఉద్యమం, ఇండోనేషియా అధ్యక్షుడు సుకర్నో "అవసరం కన్నా ఎక్కువ ప్రజాస్వామిక సరళి" ఇవన్నీ స్టేట్ డిపార్టుమెంటును చికాకు పెట్టాయి. (నామ్ చామ్‌స్కీ, హెజిమోని ఆఫ్ సర్వయివల్). ఆ తర్వాతనే అరబ్బులపై ఇస్రాయిల్‌ను దాడులకు దిగేలా చేశారు. ఇప్పుడు అరబ్, ముస్లిమ్ భూభాగాల్లో సంక్షోభానికి మూలకారణమేమిటో ఊహించడం కష్టం కాదు.

ఉగ్రవాదానికి సంబంధించి ఇస్లామ్‌పై పాశ్చాత్యులు చేస్తున్న ఆరోపణలను ఈ నేపథ్యంలో చూసి అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఇస్లామ్ గురించి తెలియనివారిలో ఇస్లామోఫోబియాను నింపే కొత్త ఎత్తుగడ "టెర్రరిజమ్"

# ఉగ్రవాదంపై మీడియా ద్వంద్వప్రమాణాలు

పాశ్చాత్య ఎలక్ట్రానిక్ మీడియా ఇంటింటా నేడు దర్శనమిస్తోంది. గ్లోబలైజేషన్ ఫలితంగా పాశ్చాత్య మీడియా చేరుకోని ప్రదేశం మిగల్లేదు. ఈ ప్రచార ప్రసార మాధ్యమాలు భావాలపై ప్రభావం వేస్తున్నాయి. శాటిలైట్, కేబుల్ ద్వారా క్షణాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం సాధ్యమవుతోంది. ప్రపంచంలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, ఆన్‌లైన్ సర్వీసులన్నీ పాశ్చాత్య మీడియా చేతుల్లోనే ఉన్నాయి. ముఖ్యంగా ఆంగ్లో అమెరికన్ మీడియా పెత్తనం చెలాయిస్తోంది. పాశ్చాత్య ఎలక్ట్రానిక్ సామ్రాజ్యాలు విస్తరించిన తర్వాత శాటిలైట్, కేబుల్ టెక్నాలజీ పుణ్యమా అని పాశ్చాత్య మీడియా క్షణాల్లో ప్రపంచవ్యాప్తంగా చొచ్చుకుపోతోంది.

అంతర్జాతీయ టెలివిజన్ వార్తలన్నీ పాశ్చాత్య వార్తా సంస్థల ద్వారానే పంపిణీ అవుతున్నాయి. రాయిటర్స్, వరల్డ్ వైడ్ టెలివిజన్ న్యూస్; ఏపిటీవీలతో పాటు సిఎన్ఎన్; స్కై, బిబిసి వరల్డ్ సర్వీస్‌ల వార్తలు వివిధ భాషల్లో ప్రసారమవుతున్నాయి. ఈ వార్తా సంస్థలే ప్రపంచంలో టెలివిజన్ వార్తలను శాసిస్తున్నాయి.

ప్రపంచంలోని నాలుగు పెద్ద అంతర్జాతీయ వార్తాసంస్థలు అసోసియేటెడ్ ప్రెస్, యునైటెడ్ ప్రెస్ ఇంటర్నేషనల్, రాయిటర్స్, ఏజన్సీ ఫ్రాన్స్ ప్రెస్‌లలో మొదటి మూడు ఆంగ్లో అమెరికన్ సంస్థలు. ప్రపంచ వార్తల్లో 80% వార్తలను ఈ నాలుగు ఏజన్సీలే పంపిణీ చేస్తాయి. ఈ సంస్థల్లో అన్ని దేశాలకు చెందిన సిబ్బంది పనిచేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని సార్లు ఉద్దేశ్యపూర్వకంగా, కొన్నిసార్లు అలవాటుగా పాశ్చాత్య మరీ ముఖ్యంగా ఆంగ్లో

అమెరికన్ న్యూస్ ఎజెండాను అమలు చేస్తుంటాయి.

మరో విషయమేమంటే భారతదేశంలో ఇంగ్లీషు భాషా పత్రికలన్నీ, దినపత్రికలు కాని న్యూస్‌మ్యాగజైన్లు కాని పాశ్చాత్య పత్రికల వ్యాఖ్యానాలను, విశ్లేషణలను అచ్చేస్తుంటాయి. సిండికేషన్ అరేంజ్‌మేంట్ ద్వారా ఈ సమాచారాన్ని గ్రహిస్తుంటాయి. ఈ విధంగా ప్రపంచవ్యాప్త న్యూస్ ఎజెండాను రూపొందించడంలోను, నిర్మించడంలోను పాశ్చాత్య వార్తాసంస్థల ప్రాబల్యం అత్యధికంగా ఉంది. ఇదంతా పాశ్చాత్య ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటుంది. చివరకు భారతదేశంలోని ప్రాంతీయ మీడియా కూడా ఇంగ్లీషులో ప్రధాన వార్తాసంస్థలు ఇచ్చే సమాచారాన్నే అనువదించుకుని తమ భాషాపత్రికల్లో వేయవలసిన పరిస్థితి ఉంది. ఆ విధంగా ప్రాంతీయభాషా పాఠకులపై కూడా ఈ మీడియా ప్రభావం బలంగా ఉంది. ఇలా జరుగుతోంది ఒక్క భారతదేశంలోనే కాదు, మొత్తం వర్ధమాన దేశాలన్నింటా ఇదే పరిస్థితి ఉంది. ఈ దేశాల్లో ప్రజలు పాశ్చాత్య మీడియా ఏది చూపించాలనుకుంటుందో అది మాత్రమే చూసే పరిస్థితి ఉంది.

చాలా మంది భారతీయ పాత్రికేయులు కూడా పాశ్చాత్య మీడియా భాషను, పలుకుబడిని, వార్తలను, విలువలను అనుసరిస్తుంటారు.

ఇస్లామీయ టెర్రరిజమ్ అన్న పదాన్ని పాశ్చాత్యమీడియా సృష్టించింది. ఆ వెంటనే ఈ పదం భారతీయ మీడియాలోను ప్రతిధ్వనించింది. పాశ్చాత్య ప్రయోజనాలకు అనుగుణంగా ఈ ప్రతిధ్వనులు వినిపించాయి. ఇస్లామ్ టెర్రరిజాన్ని బోధించే మతం కాదు, ప్రోత్సహించే మతం కాదని, ఇస్లామ్ శాంతిధర్మమని చెప్పినంత మాత్రాన సరిపోదు. ఎందుకంటే, కొందరు ఉగ్రవాదులు ఇస్లామ్ పేరు వాడుకుని అమెరికాకు వత్తాసు పాడే మీడియాకు కావలసిన అవకాశాన్ని కల్పిస్తున్నారు. జిహాద్‌ను టెర్రరిజమ్‌గా చెప్పే వీలు కల్పిస్తున్నారు.

పలస్తీనా ప్రాంతాలపై ఇస్రాయీల్ దురాక్రమణ, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగల్లో తొక్కడం, మధ్య ప్రాచ్యంలో చమురు వనరుల కోసం అమెరికా సృష్టిస్తున్న మారణహోమం తదితర కారణాలతో కొన్ని శక్తులు సాయుధ ప్రతిఘటనకు పూనుకుంటున్నాయి. మధ్యప్రాచ్యం వార్తల విషయంలో పాశ్చాత్య మీడియా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోంది. ఇస్రాయీల్ కొనసాగిస్తున్న భయంకరమైన అణిచివేతను చాలా తక్కువ చేసి, ఏవో చిన్న చిన్న పొరబాట్లుగా చూపిస్తున్నారు. పలస్తీనీయుల ప్రతిఘటనకు ఇస్లామీయ టెర్రరిజమ్‌గా భూతద్దంలో చూపిస్తున్నారు. విభిన్న వర్గాల చర్యలను మీడియా యాజమాన్యాలు వివిధ రూపాల్లో చూపిస్తున్నాయి. మీడియా యాజమాన్యాలు వేర్వేరు

కొలబద్దలు ఉపయోగిస్తున్నాయని చెప్పాలి.

ఇస్లామ్, ముస్లిములను టెర్రరిజమ్‌తో ముడిపెట్టడం వెనుక ప్రత్యేక ప్రయోజనాలున్నాయి. టెర్రరిజమ్, టెర్రరిస్టులకు సంబంధించి ఎక్కడ చూసినా మనకు ద్వంద్వ ప్రమాణాలే కనబడతాయి. దీని వెనుక ఖచ్చితమైన కుట్ర దాగి ఉంది. ఎందుకంటే విధ్వంసకర చర్యలకు ఇస్లామ్‌ను, ముస్లిములనే నిందించడం జరుగుతోంది. ఎవరో కొందరు ముస్లిములు చేపట్టిన వ్యక్తిగత హింసాకాండలను ఇస్లామీయ టెర్రరిజమ్‌గా ఎలా చెబుతారు. ఎవరో కొందరు హిందువులు చేసిన వ్యక్తిగత పనులకు బాధ్యత యావత్తు హిందూయిజం నెత్తిన వేయడం ఎలా సముచితం కాదో ఇది కూడా అంతే. కాని ఈ ద్వంద్వ ప్రమాణాలు కనబడుతున్నాయి. మీడియాలోని పక్షపాత శక్తులు మీడియాలో ప్రాతినిధ్యం లేని వారిపై టెర్రరిస్టు ముద్ర వేయడానికి వెనుకాడడం లేదు.

పాశ్చాత్య ద్వంద్వ ప్రమాణాలకు హద్దుల్లేవు. సల్మాన్ రుష్దీ రాసిన నీచమైన రాతలు ముస్లిములను తీవ్రంగా గాయపరిచాయి. కాని రుష్దీ భావప్రకటనాస్వేచ్ఛకు పాశ్చాత్యమీడియా మద్దతు పలికింది. రుష్దీకి బాసటగా నిలిచింది. కాని డేవిడ్ ఇర్వింగ్స్ యూదుల ఊచకోతపై సందేహాలు వ్యక్తం చేస్తే జైలు శిక్ష విధించింది. ఇదెక్కడి భావప్రకటనా స్వేచ్ఛ. ఇస్రాయీల్ విధానాలను, ఇస్రాయీల్ పద్ధతులను అమెరికాలో విమర్శించడం అసాధ్యం. ఇలాంటి ప్రయత్నాలకు ఎవరైనా పాల్పడితే యాంటి సెమిటిక్ చట్టాల ప్రకారం విచారించి శిక్షిస్తారు. ఈ ద్వంద్వ ప్రమాణాలకు సిగ్గుపడడం కూడా లేదు.

# హింసాకాండ, ఉగ్రవాదం, ఊచకోతలు పాశ్చాత్యులదే ప్రథమస్థానం

ఉగ్రవాదులకు ఒక మతం ఉండదు. క్రయిస్తవ, యూద, బౌద్ధ, హిందూ, ముస్లిమ్ తదితర మతాలకు కట్టుబడినవారు కాదు. కాని సాంఘీకంగా, సాంస్కృతికంగా పెరిగిన వాతావరణంలో విద్వేషబీజాలు ఉండవచ్చు. వారు నివసిస్తున్న సమాజాల్లో అంతర్లీనంగా ఉన్న భావాలు వారిలో ద్వేషభావానికి కారణం కావచ్చు. ఇటీవలి చరిత్రలో చోటు చేసుకున్న ముఖ్యమైన హింసాకాండలు, జాతినిర్మూలన ఊచకోతలు, ఉగ్రవాద చర్యలను ఒకసారి పరిశీలించడం ఇక్కడ అవసరం. ఈ చర్యలకు పాల్పడిన వారి మతాన్ని ఉగ్రవాదంతో ముడిపెట్టడం జరగలేదు. ఇస్లామ్, ముస్లిముల విషయంలో జరుగుతున్నట్లు ఉగ్రవాద సంఘటనలను ముస్లిములతోను, ఇస్లామ్‌తోను ముడిపెట్టే ప్రయత్నాలు ఈ క్రింది సంఘటనల విషయంలో జరగలేదు.

ఏడవ శతాబ్దంలో ఇస్లామ్ క్రయిస్తవ భూభాగాల్లో వ్యాపించడం ప్రారంభమైనప్పటి నుంచి ఇస్లామ్‌ను హింసాత్మక మతంగాను, యుద్ధోన్మాద మతంగాను దుష్ప్రచారం మొదలైంది. మధ్యప్రాచ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న హింసాకాండ, సెప్టెంబర్ 11 జంట టవర్లపై దాడి వగైరా సంఘటనల తర్వాత ఇస్లామ్‌ను అసహనానికి మారుపేరుగాను, టెర్రరిజమ్‌గాను అభివర్ణించడం ఎక్కువయ్యింది. ఈ ప్రచారం నిజమా? లేక ఈ ప్రచారంలో లోతయిన కుట్ర ఉందా?

ఉగ్రవాదం తదితర హింసాకాండల విషయంలో పాశ్చాత్య ద్వంద్వ ప్రమాణాలను బట్టబయలు చేసే ఉదాహరణలు చాలా ఉన్నాయి. క్రింది వివరాలు చదివితే ఈ వాస్తవాలు అర్థమవుతాయి. ఈ వివరాలు సాధారణంగా మీడియాలో కనబడలేదు కాబట్టి చాలా మందికి తెలియకపోవచ్చు.

1. కాథలిక్ చర్చికి అధినేత పోప్. పోప్ నిరంకుశ పెత్తనానికి వ్యతిరేకంగా మార్టిన్ లూథర్ కింగ్ ప్రొటెస్టంట్ పంథాకు పునాదులు వేశాడు. ఆ తర్వాత లూథర్‌కింగ్ అనుచరులపై దౌర్జన్యాల పరంపర మొదలయ్యింది. వారి ఇళ్ళు తగులబెట్టారు. ప్రొటెస్టంట్ మహిళలపై కేథలిక్కులు మానభంగాలకు పాల్పడ్డారు. ఇంత హింసాకాండకు పాల్పడిన కేథలిక్కులను ఎవరూ టెర్రరిస్టులనలేదు. ఇప్పుడు కూడా అనడం లేదు.

2. నాజీ జర్మన్ నియంత హిట్లర్ నిబద్ధత కలిగిన క్రయిస్తవుడే. దేవుని పథకంలో భాగంగానే తాను పనిచేస్తున్నానని విశ్వసించాడు. జాతినిర్మూలనకు ఒడిగట్టాడు. ఈ ఊచకోతల్లో అరవై లక్షల మంది యూదులు మరణించారు. ఇది యూదులకు వ్యతిరేకంగా క్రయిస్తవ విద్వేషం పరాకాష్ఠకు చేరుకున్న సమయమని చాలా మంది అంగీకరిస్తారు. అయినా హిట్లర్‌ను క్రయిస్తవ టెర్రరిస్టుగా ఎవరైనా పిలుస్తున్నారా?

3. స్టాలిన్, ముస్సోలిని, మావో సేటుంగ్‌లు లక్షలాది అమాయకుల హత్యాకాండకు కారకులు. అయినా ఎవ్వరూ వారిని ఉగ్రవాదులని అనడం లేదు. ఎందుకని?

4. బోస్నియా ముస్లిముల జాతినిర్మూలనకు సెర్బులు ఒడిగట్టారు. ఇరవయ్యో శతాబ్దం ఆఖరు పదిసంవత్సరాల కాలంలో కొనసాగిన ఈ హింసాకాండ ప్రపంచానికి బాగా తెలుసు. కాని వారెవ్వరినీ క్రయిస్తవ టెర్రరిస్టులనడం లేదు.

5. బ్రిటన్‌కు చెందిన పీటర్ బ్లీచ్, డెన్మార్క్‌కు చెందిన మిలిటెంట్ కిమ్ దేవీలు పశ్చిమబెంగాల్‌లోని పురులియా వద్ద ఆయుధాలు జారవిడిచారు. అక్కడి ఉగ్రవాదుల కోసం ఉద్దేశించినవి ఈ ఆయుధాలు. ఈ ఇద్దరిని బ్రిటీష్ లేదా పాశ్చాత్య టెర్రరిస్టులుగా పిలవడానికి మన మీడియా సిగ్గుపడింది. పీటర్ బ్లీచ్ తన శిక్షాకాలం ఏడేళ్ళు పూర్తి చేయకముందే భారత ప్రభుత్వం వదిలేసింది.

6. పాకిస్తాన్‌కు చెందిన తహ్రీకె తాలిబాన్ సంస్థ కోసం మిలిటెంట్లను రిక్రూట్ చేస్తూ అమెరికాకు చెందిన టెర్రరిస్టు రేమండ్ డేవిస్ పట్టుబడ్డాడు. ఇద్దరు పాకిస్తానీలను హత్యచేసి పట్టుబడ్డాడు. అతడిని విడుదల చేయించుకోవడం కోసం అమెరికన్లు బేరాలు మొదలు పెట్టారు. దియాత్ అంటే రక్తపరిహారం చెల్లించి అతడిని విడుదల చేయించుకున్నారు. అతడిని అమెరికన్ టెర్రరిస్టుగా అమెరికా మీడియా ఎందుకు పేర్కొనడం లేదు.

7. ఈరాన్‌కు చెందిన జెట్ విమానాన్ని 1990లో అమెరికా నౌకాదళం నేలకూల్చింది. ఆ విమానంలోని 259 మంది అమాయకపౌరులు మరణించారు. ఇది ఉగ్రవాద చర్య కాదా? ఎవరు దీన్ని ఉగ్రవాదంగా పేర్కొనడం లేదు, ఎందుకని?

8. భోపాల్‌లో 1984లో అమెరికాకు చెందిన బహుళజాతి సంస్థ యూనియన్ కార్బయిడ్ నుంచి విడుదలైన విషవాయువు వల్ల 2,500 మంది మరణించారు. యూనియన్ కార్బయిడ్ అధినేత అండర్సన్‌పై విచారణ జరపడానికి అమెరికా

సహకరించలేదు. అతడిని భారతదేశానికి అప్పగించేది లేదని చెప్పేసింది. విచిత్రమేమంటే లాకర్‌బీ ని పేల్చేసిన బాంబర్‌ను తమ దేశంలో విచారించడానికి అప్పగించాలని పట్టుబట్టింది. ఈ ద్వంద్వ ప్రమాణాలకు అర్థమేమిటి?

9. నిరాయుధులైన పాలస్తీనీయులపై ఇస్రాయీల్ చెప్పలేని అకృత్యాలకు పాల్పడుతోంది. పలస్తీనా భూభాగాలను దురాక్రమించుకుంది. ఒక పెద్ద అడ్డుగోడను కట్టి పలస్తీనా ప్రజల నీటివనరులు దోచుకుంటోంది. పలస్తీనా ప్రజలను విడగొట్టింది. అయినా మధ్యప్రాచ్యంలో ఉన్న ఏకైక ప్రజాస్వామ్య దేశంగా ఇస్రాయీల్‌ను పొగుడుతున్నారు. మిగిలిన దేశాలన్నీ నియంతల పాలనలో ఉన్నాయని ఈసడిస్తున్నారు. ఇస్రాయీల్ ప్రధాని మెనాచిమ్ బెగిన్‌ను ఒకప్పుడు బ్రిటీషు ప్రభుత్వం టెర్రరిస్టుగా ప్రకటించింది. కాని అతడికే నోబుల్ శాంతి బహుమతి ఇచ్చారు. యూద టెర్రరిస్టులన్న పదం మనకు ఎక్కడా వినబడదు. ఈ ద్వంద్వ ప్రమాణాలకు హద్దు ఉందా?

10. ఐర్లాండ్‌కు చెందిన ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ బాంబులు వేసి అనేకమంది బ్రిటీషు పౌరులను హతమార్చింది. కాని వారిని కేథలిక్ టెర్రరిస్టులని అనడం లేదు. ఉత్తర ఐర్లాండ్ వేర్పాటు కోరడానికి ప్రధాన కారణం కేథలిక్ మతవిశ్వాసమే.

11. కిడ్నాపులకు, హత్యలకు గురైన అమెరికన్ల సంఖ్య ముస్లిమ్ దేశాల్లో కన్నా మధ్య, దక్షిణ అమెరికాల్లోనే ఎక్కువ. (నేషన్ మాస్టర్ డాట్‌కామ్ స్టాటిస్టిక్ రిపోర్టు)

12. ముస్లిములు అధికంగా ఉన్న దేశాలన్నింటిలోను (మొత్తం ముస్లిముల జనాభా 1.7 బిలియన్లు) చోటు చేసుకుంటున్న హత్యా నేరాలు అమెరికాలో జరిగే హత్యా నేరాల కన్నా చాలా తక్కువ. అమెరికాలో ప్రతిరోజు చిన్న చిన్న కారణాలతో హత్యలకు పాల్పడుతున్నారు. (నేషన్ మాస్టర్ డాట్‌కామ్ స్టాటిస్టిక్ రిపోర్టు)

13. లౌకికదృష్టితో ఆలోచిస్తే, హీరోషిమా నాగసాకిలపై అణుబాంబు దాడికి పాల్పడి రెండు లక్షల మంది అమాయక పౌరులు, మహిళలు, పిల్లల్ని చంపిన పైశాచిక చేష్టకు అమెరికన్లందరి బాధ్యత లేదా? యుద్ధాలు సైన్యాల మధ్యనే జరగాలని, సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకోరాదని అమెరికన్లు నీతులు చాలా చెబుతుంటారు. అయినా జపాన్‌ను లొంగదీయడానికి సాధారణ పౌరులను పెద్ద సంఖ్యలో చంపేయడానికి అమెరికా వెనుకాడలేదు.

ఒక మతానికి చెందిన లేదా ఒక దేశానికి కొందరు వ్యక్తులు లేదా కొన్ని గ్రూపులు పాల్పడిన చేష్టల ఆధారంగా ఆ మతంపై లేదా ఆ దేశంపై ముద్రవేయరాదన్నది హేతుబద్ధమైన వాదనే. ఉదాహరణకు హిట్లర్ చేసిన పనులకు జర్మన్లందరినీ బాధ్యులు చేయలేం. హీరోషిమా నాగసాకిలపై అణుబాంబులు వేసి లక్షలాది అమాయకులను చంపేసిన పాపాన్ని సగటు అమెరికన్ పౌరుడిపై రుద్దలేం.

క్రూసేడులు పాల్పడిన పైశాచికచేష్టలు, స్పానిష్ దాడులకు చెందిన అత్యంత హేయమైన హింసాకాండల గురించి తెలిసిన సగటు క్రయిస్తవులు కూడా ఖండిస్తారు. ఈ క్రూరత్వాన్ని ఖండిస్తారు. ప్రముఖ బాక్సర్ ముహమ్మదలీని ఒక క్రయిస్తవ రిపోర్టరు "ఉసామా బిన్ లాదెన్ అనుసరించే మతమే మీరు అనుసరిస్తున్నందుకు మీరెలా ఫీలవుతున్నారని" అడిగాడు. ముహమ్మదలీ జవాబిస్తూ "హిట్లర్ మతాన్నే అనుసరిస్తున్నందుకు మీరెలా ఫీలవుతున్నారని" అన్నాడు.

గాజు గోడల మధ్య నివసించేవారు ఇతరులపై రాళ్ళు విసరరాదన్న సూక్తి చాలా మతాలు సంస్కృతుల్లో వినిపిస్తుంటుంది. ముస్లిములపై ఆరోపణల రాళ్ళు విసురుతున్నవారు ఎలాంటి గోడల మధ్య ఉంటున్నారో ఒకసారి గమనించాలి.

ఇప్పుడోసారి ప్రపంచంలో టెర్రరిజమ్ పరిస్థితేమిటో చూద్దాం. నిజానికి ఈ గణాంకాలు, వివరాలు కూడా పాశ్చాత్యుల నుంచే లభిస్తున్నాయి. ఈ వివరాల నేపథ్యంలో టెర్రరిజానికి సంబంధించి ముస్లిములు ఎక్కడున్నారో కూడా అంచనా వేద్దాం. అమెరికా ప్రచురించిన వార్షిక స్టేట్ డిపార్టుమెంట్ రిపోర్ట్, పాటర్న్స్ ఆఫ్ గ్లోబల్ టెర్రరిజమ్ 1997 ప్రకారం 1992 నుంచి 1997 వరకు రిపోర్టయిన టెర్రరిస్టు సంఘటనల్లో అత్యధికంగా 831 సంఘటనలు యూరప్‌లో చోటుచేసుకున్నాయి. ఆ తర్వాతి స్థానం లాటిన్ అమెరికాలో 602 సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్యప్రాచ్యం మూడవస్థానంలో ఉంది. అంటే 422 సంఘటనలు జరిగాయి. ఇందులో ప్రాణనష్టాలు పరిశీలిస్తే యూరప్‌లో 7621 మంది మరణించారు. మధ్యప్రాచ్యంలో 2692 మంది మరణించారు. ఈ గణాంకాలను చూసిన తర్వాత వాషింగ్టన్‌లోని వాల్ష్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫయిర్స్‌కు చెందిన రాల్ఫ్ ఎడ్మండ్ ఇలా అన్నారు.

> "బౌద్ధ ఓం షిరింక్యో విషవాయువు ఉపయోగించడం, అమెరికన్ క్రయిస్తవుడు పాల్పడిన ఓక్లాహోమా బాంబింగ్, ఉత్తర ఐరిష్ కేథలిక్కుల ఉగ్రవాదం, భారత హిందువుల హింసాకాండ (బాబరీ మస్జిద్ విధ్వంసం తర్వాత జరిగిన రక్తపాతం), ముస్లిములకు వ్యతిరేకంగా బౌద్ధుల హింసాకాండ, కొసోవో, బోస్నియాలో ఆర్థోడాక్స్

> క్రయిస్తవ సెర్బులు జరిపిన జాతినిర్మూలన, లాటిన్ అమెరికాలో డ్రగ్స్‌కు సంబంధించిన కేథలిక్ గుంపుల హింసాకాండ, శ్రీలంకలో సింహళ బౌద్ధులకు వ్యతిరేకంగా తమిళ హిందువుల ఉగ్రవాదం వగైరాలు ఉగ్రవాదం విశ్వజనీన స్వభావాన్ని చాటి చెబుతున్నాయి. ఉగ్రవాదం పుట్టుకలో ఉన్న సాంస్కృతిక, ధార్మిక వైవిధ్యాన్ని కూడా ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి."

అమెరికాలో ఉగ్రవాదానికి సంబంధించిన వాస్తవాలను మనం పరిశీలిస్తే, ఎఫ్‌బీఐ నివేదికలో ఉన్న గణాంకాల ప్రకారం (ఎఫ్‌బీఐ.జిఓవి)

1. ఎఫ్‌బీఐ ఫైళ్ళ ప్రకారం, ఈ ఫైళ్ళను ఎఫ్‌బీఐ.జిఓవిలో మనం చూడవచ్చు, ఉగ్రవాదుల్లో కేవలం 6 శాతం మాత్రమే ముస్లిములు. అమెరికాపై జరిగిన మిగిలిన టెర్రరిస్టు దాడులన్నీ ఇతరులు చేసినవే. లాటినోలు చేసిన దాడులు 42 శాతం ఉన్నాయి. తీవ్రవాద వామపక్ష గ్రూపులు చేసిన దాడులు 24 శాతం ఉన్నాయి. యూద తీవ్రవాదుల దాడులు 7 శాతం ఉన్నాయి. కమ్యునిస్టులు చేసిన దాడులు 5 శాతం ఉన్నాయి. ఇతర టెర్రరిస్టు సంస్థల దాడులు 16 శాతం ఉన్నాయి.

2. కేవలం 6 శాతం టెర్రరిస్టులు మాత్రమే ముస్లిములైనప్పుడు పక్షపాతంతో కళ్ళుమూసుకుపోయిన మీడియా కేవలం ముస్లిముల ప్రమేయం ఉన్న ఉగ్రవాద సంఘటనతోనే సంచలనాలకు ఎందుకు పూనుకుంటుందో ఆలోచించాలి. ఈ మీడియా ప్రచారం ప్రజల్ని తప్పుదారి పట్టించేదిలా, ప్రజల్ని మోసపుచ్చేదిగా ఉంది.

3. యూరప్‌లో టెర్రరిజమ్ గురించిన వివరాలు మనం చూస్తే టైమ్స్ ఆఫ్ ఇండియా (29-07-2011) ప్రచురించిన యూరోపోల్ రిపోర్టు ప్రకారం "యూరప్‌లో చాలా ఉగ్రవాద దాడుల వెనుక ఉన్నది ముస్లిములు కాదు, వేర్పాటువాదులు"

4. శ్వేతజాతి ఉగ్రవాదం : విద్వేష సంస్కృతి (డక్కన్ హెరాల్డ్ సంపాదకీయం)

*http://www.deccanherald.com/content/269972/culture-hate.html*

విస్కాన్సిన్ గురుద్వారా వద్ద ఆరుగురు సిక్కులను ఒక మాజీ అమెరికా సైనికుడు కాల్చి చంపాడు. అతడికి వైట్ సూపర్‌మాసిస్ట్ గ్రూపులతో సంబంధం ఉందని తెలిసింది. ఈ సంఘటన అమెరికాలో జాతివివక్ష, అసహనాల వల్ల తలెత్తుతున్న తీవ్ర పరిస్థితులకు నిదర్శనం.

అమెరికాలో సిక్కులపై శ్వేతజాతి అమెరికన్లు జరిపిన దాడులు శ్వేతజాతి ఉగ్రవాదాన్ని సూచిస్తున్నాయి. విచిత్రమేమంటే అమెరికాలో వేలాదిమందిని కేవలం ముస్లిములైనందుకు లేదా గెడ్డం పెంచుతున్నందుకు నిర్బంధించి విచారించడం జరిగింది.

అమెరికా ఈ విషయంలో ఎంత గుడ్డిగా వ్యవహరిస్తుందంటే, అమెరికాలో అంతర్గతంగా ఉన్న శత్రువులను కూడా గుర్తించలేకపోతోంది. అమెరికాలో అధికారులు ఇస్లామిక్ టెర్రరిస్టులపై నిఘా పెట్టడంలో బిజీ అయిపోయారు. మరోవైపు క్రయిస్తవ, శ్వేత సూపర్ మాసిజమ్ గ్రూపులు, ఉగ్రవాద సంస్థలు విస్తరిస్తున్నా పట్టించుకోవడం లేదు. అమెరికాలో 2009 తర్వాతి నుంచి రైట్‌వింగ్ తీవ్రవాద గ్రూపుల సంఖ్య 149 నుంచి 824కు పెరిగింది.

విద్వేష నేరాల వెనుక శ్వేత జాతి దురహంకారం ఉందన్న వాస్తవాన్ని అమెరికా మీడియా మొహమాటపడుతూ ఒప్పుకుంటుంది. పలస్తీనా భూభాగాలపై ఇస్రాయీల్ దురాక్రమణ, జెరుసలేమ్ దురాక్రమణ, పలస్తీనాపై ఇస్రాయీల్ దౌర్జన్యాలు, దాడులు, ఇస్రాయీల్‌కు మద్దతివ్వడంలో అమెరికా చూపించే అత్యుత్సాహం, ఇస్రాయీల్‌కు అమెరికా అందిస్తున్న సహాయసహకారాలు ఇవన్నీ మిలిటెన్సీ, ఉగ్రవాదాలు తలెత్తడానికి కారణాలే. ఈ వాస్తవాలను చాలా మంది నేడు గుర్తిస్తున్నారు. ఈ క్రింది వాస్తవాలు పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

1. ఇస్రాయీల్ ఆక్రమిత భూభాగాల నుంచి వైదొలగాలంటూ ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలను ఎన్నడూ అమలు చేయడం జరగలేదు. కాని కువాయిత్ నుంచి ఇరాక్ దురాక్రమణలను తొలగించడానికి అమెరికా సైన్యాలు అక్కడ దాడి చేశాయి.

2. ఇరాక్ వద్ద జనసంహారక ఆయుధాలు ఉన్నాయన్న అబద్దాని బహుళజాతి కంపెనీలు నడుపుతున్న మీడియా విపరీతంగా ప్రచారం చేసింది. ఈ ప్రచారం ఆధారంగా, ప్రపంచదేశాల అభిప్రాయాలకు వ్యతిరేకంగా, ఐక్యరాజ్యసమితి వద్దన్నప్పటికీ ఇరాక్‌పై సంకీర్ణ సైన్యాలు దాడి చేశాయి.

3. ఇస్రాయీల్ అణ్వాయుధాలు సమకూర్చుకుంటున్నప్పటికీ పట్టించుకోలేదు. ఇరాక్ అణుస్థావరాలపై ఇస్రాయీల్ బాంబుదాడులు చేసినా పట్టించుకోలేదు. కాని ఈరాన్‌కు బెదిరింపులు, హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా భద్రతకు ఈరాన్ వల్ల ప్రమాదం ఉందని ప్రచారం చేశారు. కాని అణుబాంబును ఉపయోగించిన ఏకైక దేశం ఒక్క అమెరికా మాత్రమే. జపాన్‌లోని జనావాసాలపై అమెరికా

అణుబాంబు ప్రయోగించింది.

4. అమెరికాలోని పెద్దలు ఇస్లామ్‌ను ప్రపంచానికి ప్రమాదంగా ప్రచారం చేస్తున్నారు. చాలా ఇస్లామీయ దేశాల్లో ప్రజాస్వామ్యం లేదని, మానవహక్కులు లేవని, ప్రభుత్వాలు తీవ్రమైన అణిచివేతలు అమలు చేస్తాయన్న కారణాలు చూపిస్తున్నారు. ఇస్లామ్ వర్సెస్ వెస్ట్ అన్న అంశంపై సెమినార్లు నిర్వహిస్తున్నారు. మరోవైపు అమెరికా చైనాతో వ్యాపారసంబంధాలకు ఏమాత్రం ఇబ్బంది పడడం లేదు. చైనాతో చర్చలు జరపవలసిన అవసరం కూడా వారికి కనబడడం లేదు.

5. అణిచివేతలు, హక్కుల నిరాకరణ కొనసాగుతుంటే సహజంగానే ప్రజలు ప్రతిస్పందిస్తారు. చాలా స్వతంత్ర పోరాటాలు జాతీయతావాదం పునాదిగానే ప్రారంభమయ్యాయి. జాతీయతావాదం అనేది కూడా పాశ్చాత్యదేశాలు సృష్టించిందే.

ఈ వాస్తవాల దృష్ట్యా మనం ఆలోచించవలసింది న్యాయంతో కూడుకున్న ప్రపంచశాంతిని సాధించే నూతన ప్రపంచ సరళి గురించి, అంతేకాని స్మశాన ప్రశాంతతతో కూడుకున్న శాంతి గురించి కాదు.

శ్రీలంక ఈశాన్య ప్రాంతాల్లో తమిళ టైగర్లు దాదాపు మూడు దశాబ్దాల పాటు వేర్పాటు ఉద్యమాన్ని నడిపారు. ఈ మిలిటెంట్లకు తమిళనాడులో శిక్షణ లభించింది. మీనంబాకం ఎయిర్‌పోర్టుపై తమిళ టైగర్లు బాంబుదాడులు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని ఆత్మాహుతి బాంబర్లు హత్యచేశారు. కాని వారినెన్నడూ తమిళ ఉగ్రవాదులుగా పేర్కొనలేదు. మతపరంగా చూస్తే శ్రీలంకలో తమిళులు హిందువులు.

భారత ఈశాన్య ప్రాంతాల్లో ఉల్ఫా ఉగ్రవాదులు 1990 నుంచి 2006 వరకు 749 ఉగ్రవాద దాడులకు పాల్పడ్డారు. కాని ఉల్ఫాను ఉగ్రవాద సంస్థగా ఎన్నడూ పేర్కొనలేదు.

ఇక్కడ మిలియన్ డాలర్ల ప్రశ్న ఏమంటే, ఉగ్రవాదంపై పోరాటం పేరుతో పాశ్చాత్యదేశాలు ఇస్లామ్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నించడం లేదా? ముస్లిమ్‌దేశాలను ఆక్రమించుకోడానికి, సర్వనాశనం చేయడానికి, అక్కడ కీలుబొమ్మ ప్రభుత్వాలు స్థాపించడానికి, అక్కడి సహజవనరులను దోచుకోడానికి, తమ బహుళజాతి కంపెనీలకు నిర్మాణ కాంట్రాక్టులు కట్టబెట్టడానికి, ఉగ్రవాదాన్ని ఒక సాకుగా వాడుకోవడం లేదా?

# ఆత్మాహుతి దాడులకు ఇస్లామ్‌లో అనుమతి లేదు

విదేశీ దురాక్రమణలున్న భూభాగాల్లో ఆత్మాహుతి దాడులపై అధ్యయనం జరిగింది. అంతకన్నా ముందు మనం అసలు ఆత్మాహుతి దాడులంటే ఏమిటన్నది పరిశీలిద్దాం.

ఒక వ్యక్తి ఏదన్నా ప్రాంతంపై బాంబుదాడి చేయడానికి తన శరీరానికే బాంబు కట్టుకుని పేల్చుకుని చనిపోవడం. ఇప్పుడు అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, ఇరాక్, చెచెన్యా, సోమాలియాలో వివిధ గ్రూపులు ఈ దాడులకు పాల్పడుతున్నాయి.

దురదృష్టవశాత్తు ఈ దాడులు కేవలం మిలిటరీ లక్ష్యాలపైనే కాదు సాధారణ జనావాసాలపై కూడా జరుగుతున్నాయి.

విదేశీ దురాక్రమణలను ప్రతిఘటించడానికి ముస్లిమ్ దేశాల్లో మిలిటెంట్లు పాటిస్తున్న ఈ పద్ధతి మంచిదేనని భావించేవారు కూడా చాలా మంది ఉన్నారు. నిజానికి ఈ పద్ధతిని ప్రారంభించింది తమిళ టైగర్లు. (మతపరంగా చూస్తే తమిళ టైగర్లు హిందువులు). ఎనభయ్యవ దశకంలో ఆత్మాహుతి బాంబుల విధానాన్ని కనిపెట్టి వ్యవస్థీకృతంగా ఈ దాడులకు శ్రీకారం చుట్టింది వారే. ఆ తర్వాత మధ్యప్రాచ్యంలో నాటకీయంగా ఆత్మాహుతి దాడుల సంఘటనలు పెరిగాయి. ఇరాక్, ఆఫ్గనిస్తాన్‌లలో అమెరికా దురాక్రమణల తర్వాత ఈ దాడులు ఒక్కసారి ఎక్కువయ్యాయి.

ఆత్మాహుతి దాడుల గురించి అత్యంత ప్రామాణికమైన పుస్తకం "డయింగ్ టు విన్" రాసిన రచయిత, ఆత్మాహుతి ఉగ్రవాదంపై చికాగో ప్రాజెక్టుకు సారథ్యం వహించిన అమెరికాకు చెందిన రాజనీతి నిపుణుడు రాబర్ట్ పేపే ఈ విషయంపై చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనార్హమైనవి. "ఆత్మాహుతి ఉగ్రవాదం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. అయితే ఈ విషయంలో ఒక అయోమయం కూడా ఉంది. ఇలాంటి దాడుల్లో, సెప్టెంబర్ 11, 2001న జరిగిన దాడితో సహా అన్ని దాడుల్లోను ముస్లిములు, మతపరమైన ప్రేరణలో ఈ పనికి పాల్పడడం ఎందుకు జరిగింది? దీనికి ఇస్లామీయ ఛాందసవాదం కారణం కావచ్చు... వంటి భావాలు ప్రచారం పొందాయి. అందువల్ల ముస్లిమ్ సమాజాలను పూర్తిగా మార్చేస్తేనే సెప్టెంబర్ 11 వంటి దాడులను నిరోధించగలమన్న అభిప్రాయాన్ని సృష్టించారు. అందువల్లనే ఇరాక్‌పై దాడులకు అమెరికాలో ప్రజామద్దతు లభించింది.

కాని వాస్తవం అది కాదు. ఆత్మాహుతి ఉగ్రవాదానికి, ఇస్లామీయ ఛాందసవాదానికి మధ్య సంబంధం ఉందన్న అభిప్రాయమే తప్పుడు అభిప్రాయం. అమెరికాలో పరిస్థితి మరింత దిగజారేలా చేయడానికి, ముస్లిములకు మరింత హాని కలిగించడానికి అవసరమైన విధానాల రూపకల్పనకు ఇది ఉపయోగపడవచ్చు."

ప్రొఫెసర్ పేపే 1980 నుంచి 2003 వరకు ప్రపంచలో జరిగిన ప్రతి ఒక్క ఆత్మాహుతి దాడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. తన్ను తాను ఆత్మాహుతి చేసుకుంటూ అనేకమంది చావులకు కారణమైన ఉగ్రవాద దాడులన్నింటిని ఆయన ఇందులో క్రోడీకరించారు. అయితే జాతీయ ప్రభుత్వాలు పాల్పడిన దాడులను ఇందులో చేర్చలేదు. ఉదాహరణకు ఉత్తర కోరియా దక్షిణ కోరియాపై చేసిన దాడుల వంటివి ఇందులో లేవు. ఆత్మాహుతి దాడులకు సంబంధించి ఆయన సేకరించిన సమాచారం ప్రపంచంలో అత్యంత ప్రమాణికమైన సమాచారం. ఒక్క ఇంగ్లీషు భాషలోనే కాదు అరబ్బీ, హిబ్రూ, రష్యన్, తమిళ భాషల్లో ప్రింటులోను, ఆన్‌లైన్‌లోను ఉన్న సమాచారాన్నంతా ఆయన జల్లెడ పట్టారు. ఈ సమాచారాన్ని విశ్లేషిస్తే ఆత్మాహుతి ఉగ్రవాదానికి, ఇస్లామీయ ఛాందసవాదానికి మధ్య ఎలాంటి సంబంధమూ కనబడదు. నిజం చెప్పాలంటే ప్రపంచంలోని ఏ మతానికి సంబంధించిన ఛాందసవాదానికి కూడా ఆత్మాహుతి ఉగ్రవాదంతో ఎలాంటి సంబంధమూ లేదు. నిజానికి శ్రీలంకలో తమిళ టైగర్లు ఆత్మాహుతి ఉగ్రవాదానికి ఎక్కువ పాల్పడ్డారు. తమిళ టైగర్లు హిందూ కుటుంబాలకు చెందినవారయినా, మతాన్ని వ్యతిరేకించే, మార్క్సిస్ట్ లెనినిస్ట్ పంథాకు చెందిన వారు.

ఆత్మాహుతి దాడులు ఎక్కువగా జరిగిన 2007 సంవత్సరంలో మొత్తం 658 దాడులు జరిగాయి. ఇందులో 548 అమెరికా దురాక్రమించుకున్న ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో జరిగాయి. ఇవి అమెరికా ప్రభుత్వం వారి లెక్కలే. గత 25 సంవత్సరాల్లో జరిగిన దాడులన్నింటికన్నా రెట్టింపు దాడులు ఈ ఒక్క సంవత్సరంలోనే జరిగాయి. ఇంకో ముఖ్యమైన విషయమేమంటే, ఆత్మాహుతి దాడులన్నింటిలోను దాదాపు ఐదింటా నాలుగువంతులు దాడులు గత ఏడేళ్ళ కాలంలోనే జరిగాయి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఈ ఆత్మాహుతి దాడుల పద్ధతి విస్తరిస్తోంది. వాషింగ్టన్ పత్రిక ప్రకారం "1983 తర్వాతి నుంచి అర్జంటీనా, ఆల్జీరియా, క్రోషియా, చైనా, ఇండియా, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన బాంబర్లు, ఉగ్రవాదులు ట్రక్కు బాంబులను, కారు బాంబులను, బెల్టులను, కోటులను, ఆటవస్తువులను, మోటారుసైకిళ్ళను, సైకిళ్ళను, బోట్లు, బ్యాగులు, గర్భంలా కనిపించే కడుపులను ఉపయోగించి దాడులకు పాల్పడుతున్నారు. గత పాతికేళ్ళలో 1840 ఇలాంటి దుర్ఘటనలు జరగ్గా, ఇందులో

86 శాతం సంఘటనలు 2001 తర్వాతే జరిగాయి. గత నాలుగేళ్ళలో ఈ సంఘటనలు మరింత ఎక్కువగా జరిగాయి."

విదేశీ దురాక్రమణల్లో ఉన్న భూభాగాల్లో చాలా మంది యువకులు అక్కడి పరిస్థితుల వల్ల తీవ్రవాదానికి మళ్ళుతున్నారు. విదేశీ దురాక్రమణ ఉన్న భూభాగాల్లో పాశ్చాత్య సైన్యాల చేతుల్లో స్థానిక పౌరులు భారీ సంఖ్యలో హత్యలకు గురికావడం, పరాభవం, ఓటమి వల్ల జనించే నిరాశా నిస్పృహలు, పగ ప్రతీకార భావనలు, కొన్ని సందర్భాల్లో స్వంత కుటుంబంలో హత్యలకు ప్రతీకారం తీర్చుకోవాలన్న భావనలు ఈ దాడులకు కారణాలు. ఇవి బలమైన కారణాలు. ఈ కారణాలకు ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంలో ప్రొఫెసర్ పేపే చేసిన అధ్యయనం ఎంతైనా ముఖ్యమైనది. "ప్రతి ఆత్మాహుతి దాడి వెనుక ఒక నిర్దిష్టమైన, వ్యూహాత్మకమైన, మతంతో సంబంధం లేని లక్ష్యం ఉంది. ఈ ఉగ్రవాదులు తమ మాతృభూమిగా భావిస్తున్న ప్రాంతాల్లో విదేశీ, ఆధునిక ప్రజాస్వామ్య దేశాల సైన్యాలు వెనక్కి మరిలేలా చేయాలనుకుంటున్నారు. ఇక్కడ మూలకారణం మతం కాదు. విస్తృతమైన వ్యూహాత్మక లక్ష్యం కోసం మానవవనరులను రిక్రూట్ చేయడానికి ఉగ్రవాద సంస్థలు మతాన్ని ఒక సాధనంగా వాడుకుంటే వాడుకుని ఉండవచ్చు." అన్నాడాయన.

ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్యమైన విషయమేమంటే, విదేశీ దురాక్రమణ ఉన్న ప్రాంతాల్లో భయానకమైన సంఘటనలను కేవలం అక్కడి ప్రత్యక్షసాక్షులు మాత్రమే చూడడం లేదు. టెలీవిజన్ ద్వారా మళ్ళీ మళ్ళీ చాలా మంది ఆ సంఘటనలు చూస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఇస్లామ్ ఆత్మాహుతి దాడులను కాని, అమయక పౌరుల హత్యాకాండలను కాని ఇస్లామ్ ఎంతమాత్రం సమ్మతించదని, ఇస్లామ్‌లో ఇలాంటి చేష్టలకు స్థానం లేదని ఒక మతపండితుడు ఇచ్చే ఉపన్యాసం వల్ల తీవ్రవాద పంథాపట్టిన యువకుడు హింసామార్గాన్ని మానుకుంటాడా? పగ ప్రతీకారాలతో రగిలిపోతున్న యువకుల, తమ కుటుంబంపై, తన వారిపై, తన మతంపై జరిగిన దాడులకు, లేదా దాడులు జరిగే ప్రమాదం ఉన్న వాతావరణంలో ఈ యువకులు శత్రువుపై దాడులు చేయకుండా ఉంటారని అనుకోలేం. ఇలాంటి నేపథ్యంలో పగ ప్రతీకార చర్యలకు మద్దతిచ్చే భావాల కోసం చూస్తాడు. తనలో రగులుతున్న ఆగ్రహం చల్లార్చుకునే చేష్టలకు అనుకూలమైన భావాలను ఆశ్రయిస్తాడు. నిజానికి పగ ప్రతీకార భావన బలంగా పనిచేస్తుంది. దానికి సమర్థింపుగా, ఈ పగ ప్రతీకారాలకు నైతిక మద్దతుగా ఏదో ఒక సిద్ధాంతాన్ని భావాన్ని ఆశ్రయిస్తాడు.

ముస్లిములుగా చెప్పుకుంటూ కొందరు పాల్పడుతున్న ఈ ఉగ్రవాద చేష్టలను చూసి ఇక ముస్లిములకు వేరే శత్రువుల అవసరం లేదని కూడా అనిపిస్తుంది. తప్పుదారి పట్టిన ఈ

కొందరి చేష్టలు మొత్తం సమాజాన్ని అప్రతిష్ఠపాలు చేస్తోంది. ఇస్లామ్‌ను అప్రతిష్ఠపాలు చేయడంలో ఈ ఉగ్రవాదులు అందరికన్నా ముందున్నారు.

ఇలాంటి తప్పుడు మార్గాన్ని ఎవరైనా ఎందుకు ఎన్నుకుంటున్నాడు? మతబోధనలివేనా? ఈ ఉగ్రవాదుల తల్లిదండ్రులు ఇదే బోధించారా? లేకపోతే ఈ ఉగ్రవాదులను తయారు చేసే ఇతర యంత్రాంగాలు ఏమైనా ఉన్నాయా? అన్న ప్రశ్నలు ఆలోచించవలసిన ప్రశ్నలు. ఒక వ్యక్తి ఉగ్రవాదిగా అమాయకులను హతమార్చాడంటే దానికి అనేక కారణాలుంటాయి. ముస్లిమ్ వ్యతిరేక మారణకాండలతో ముంబాయి అట్టుడికినప్పుడు చాలా మంది హేతుబద్ధంగా ఆలోచించే ముస్లిమ్ యువకులు కూడా ప్రతీకారం గురించి మాట్లాడే వాతావరణం చోటు చేసుకుంది. గుజరాత్‌లో వ్యవస్థీకృతంగా కొనసాగిన ముస్లిమ్ హత్యాకాండల తర్వాత అనేకమంది సామాజిక శాస్త్రవేత్తలు ఈ హత్యాకాండలు ఖచ్చితంగా ఉగ్రవాదాన్ని మరింత పెంచుతాయని అన్నారు. ఒక పెద్ద సామాజికవర్గంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పుడు, పగ ప్రతీకారాలు తీర్చుకోవాలనుకుంటున్న యువకులు చాలా మంది ఉండవచ్చు. పగప్రతీకారాల కోసం తప్పుడు మార్గాలు పట్టేవారు కూడా ఉండవచ్చు. ఉగ్రవాదం అలాంటి తప్పుడుమార్గాల్లో ఒకటి. ఆగ్రహం, ఆవేదన, దోషులకు ఎలాంటి శిక్షలు పడవన్న ఆక్రోశం గూడుకట్టుకుంటే అది ఉగ్రవాదం వంటి తప్పుడు మార్గాలకు మళ్ళుతుంది.

అదృష్టవశాత్తు కొన్ని భయాలు నిజం కాలేదు. గుజరాత్‌లో మారణకాండ తర్వాత ఉగ్రవాదాన్ని పెంచకపోవడం అదృష్టమే. భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ పరిణామం చోటుచేసుకోలేదు. ముస్లిమ్ సంస్థలు అనేక సెమినార్లు నిర్వహించి ముస్లిమ్ యువకులు చట్టబద్ధమైన మార్గాల ద్వారా, కోర్టుల ద్వారా న్యాయం పొందాలని ప్రోత్సహించాయి. హింసాత్మక పద్ధతులను ముస్లిమ్ మతపండితులు, ఉలమాలు హింసాత్మక ప్రతీకారాలను, అమాయకపౌరులను లక్ష్యం చేసుకునే దాడులను తీవ్రంగా వ్యతిరేకించారు, ఖండించారు. కొందరు ప్రముఖ ఇస్లామ్ పండితులు ఆత్మాహుతి దాడులను మతపరంగా నిషిద్ధమైనవిగా ప్రకటించారు. సౌదీ అరేబియా, కైరోలకు చెందిన కొందరు ప్రసిద్ధ ముస్లిమ్ పండితులు కూడా ఆత్మాహుతి దాడులను నిషిద్ధమైనవిగా ప్రకటనలు విడుదల చేశారు. ఆత్మాహుతి దాడులనేవి పాపాలని, ఇవి ఇస్లామ్‌కు వ్యతిరేకమైనవని ముస్లిమ్ మత పండితులు స్పష్టమైన అభిప్రాయాన్ని ప్రకటించారు.

ఇస్లామ్ నిర్దేశించిన యుద్ధనియమాల గురించి అవగాహన లేని కొందరు దారితప్పిన ముస్లిములు ఈ అజ్ఞానం నుంచి బయటకు రావలసిన అవసరం ఉంది. ఇస్లామ్‌లో

నిషిద్ధమైనది (హరామ్) ఎన్నటికీ ఆమోదించబడింది (హలాల్) కాదు. ఇలా జరగడం అన్నది ఇస్లామ్ కాదు. ఆత్మహత్యను ప్రవక్త ముహమ్మద్ (స) నిషేధించారు. స్వయంగా అల్లాహ్ ఆత్మహత్యను పాపకృత్యంగా పేర్కొన్నాడు. కాబట్టి ఇస్లామ్ గురించి అవగాహన ఉన్న వారి నుంచి ఇస్లామీయ జ్ఞానాన్ని పొందాలి. అంతేకాని ఎలాంటి జ్ఞానం లేకుండా తమ స్వంత తీర్మానాలను ప్రకటించే వారి నుంచి ఇస్లామీయ జ్ఞానాన్ని పొందాలనుకోవడం అవివేకం. ఈ ఆత్మాహుతి దాడులు చాలా వరకు రాజకీయ కారణాలతో జరిగాయి. మతపరమైన కారణాలతో జరగలేదు. ఒక మహాపాపంగా పేర్కొనబడిన పని చేస్తే అమరత్వం పొందుతామా? అంతకన్నా అవివేకం, అజ్ఞానం మరొకటి లేదు.

దివ్యఖుర్ఆన్‌లో దేవుడు ఇలా ప్రకటించాడు.

> "మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్‌కు మీరంటే ఎంతో దయ అని నమ్మండి" దివ్యఖుర్ఆన్ (4:29)

"చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి." దివ్యఖుర్ఆన్ (2: 195)

ఆత్మహత్యకు సంబంధించి హదీసులు పరిశీలిస్తే ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు :

> "గతించిన జాతులకు చెందిన ఒక వ్యక్తికి తీవ్రమైన గాయమైంది. ఆ గాయం బాధ భరించలేక ఆ వ్యక్తి ఒక కత్తితో తన చేతిని నరుక్కున్నాడు. తీవ్రరక్త స్రావంతో చివరకు మరణించాడు. అల్లాహ్ అత డి గురించి చెబుతూ "నా దాసుడు చావు కోసం తొందరపడ్డాడు. అందువల్ల అతడు స్వర్గంలోకి ప్రవేశించకుండా నిషేధించాను" అన్నాడు. (బుఖారీ : 4.56.669)

> "నిజానికి, ఎవరైనా (ఉద్దేశ్యపూర్వకంగా) ఆత్మహత్య చేసుకుంటే అతను తప్పకుండా నరకాగ్నిలో శిక్షించబడతాడు. అతను అక్కడే శాశ్వతంగా ఉంటాడు." (బుఖారీ : 5.77.87)

దివ్యఖుర్ఆన్ వాక్యాలు, హదీసులు స్పష్టంగా ఆత్మహత్యను పాపంగా పేర్కొన్నాయి. అలాంటి వ్యక్తికి స్వర్గం నిషిద్ధమవుతుందని కూడా హదీసులు పేర్కొన్నాయి.

# ఇస్లామిక్ ఫండమెంటలిజమ్

ఛాందసవాదమనేది ఇరవయ్యవ శతాబ్దంలో ఒక పెద్ద సమస్యగా మారింది. ప్రపంచంలోని ప్రతి పెద్ద మతం ఈ సమస్యకు గురవుతోంది. ఎంత పాత మతమైనా ఈ సమస్యతో సతమతమవుతూనే ఉంది. హిందూ, క్రయిస్తవం, యూదమతం, ఇస్లామ్... ఏ మతానికైనా ఈ సమస్య తప్పలేదు. ఛాందసవాదం మతంలో హేతుబద్ధతను గుర్తించదు. మతవిశ్వాసంలో ప్రేమాభిమానాలను నిరాకరిస్తుంది. పాతభావాల పునరుద్ధరణ, మైనారిటీలపై విద్వేషం, మేధోమథనం పట్ల వ్యతిరేకత, అసహనం, అహంభావం, మేధోపరమైన దివాలాకోరుతనం, నైతికరాహిత్యం ఛాందసవాదం ముఖ్యలక్షణాలు. హేతుబద్ధమైన వాదన, బహుళత్వం, వాక్‌స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక పరిపాలన, లౌకికతత్వం అనేవి ఇందులో కనబడవు. హింసాత్మక పద్ధతులకు పాల్పడడానికే ప్రాముఖ్యం ఉంటుంది. సాంఘీకాభివృద్ధి, సమానత్వం, ఆర్థికప్రగతికి సంబంధించిన ఏ ఒక్క కార్యక్రమం కూడా ఛాందసవాద ఉద్యమాలు ఏన్నడూ చేపట్టలేదు. ఈ ఉద్యమాలు పతనం కావడమన్నది సహజంగా జరిగే పరిణామం.

ఒకప్పటి నన్, బ్రిటీషు రచయిత్రి, మతవిశ్వాసాల తులనాత్మక విశ్లేషణలు చేసిన మేధావి, అనేక పుస్తకాలు రాసి ప్రఖ్యాతి పొందిన కరెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఈ విషయమై వ్యాఖ్యానిస్తూ ఛాందసవాదమనేది ప్రపంచంలోని అన్ని మతాల్లోను చోటు చేసుకుంది. ఇరవయ్యవ శతాబ్దంలో చోటుచేసుకున్న వికృత లక్షణం ఇది. కొన్ని అతివాద హిందూత్వ గ్రూపులు కులవ్యవస్థను కాపాడ్డానికి వీధుల్లోకి వచ్చాయి. ముస్లిములను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఛాందసవాదం ముస్లిముల్లో ఎక్కువగా ఉందని నిరూపించడానికి ఈ గ్రూపులు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ గ్రూపులు విద్యావ్యవస్థలోను, ఇతర రంగాల్లోను తమ స్వంత ఛాందసవాద ఎజెండాను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. యూద ఛాందసవాద శక్తులు పలస్తీనా వెస్ట్‌బ్యాంక్‌లోను గాజాలోను అక్రమ సెటిల్‌మెంట్లు నిర్మించాయి. అరబ్బులందరినీ ఈ భూభాగం నుంచి తరిమివేయడానికి ప్రయత్నిస్తున్నాయి. సోవియట్ యూనియన్‌ను దుష్టశక్తిగా

జెర్రీ ఫార్‌వెల్ పుస్తకం మోరల్ మెజారిటీ అండ్ క్రిస్టియన్ రైట్ పేర్కొంది. ఎనభయ్యవ దశకంలో ఈ భావన ప్రబలంగా ఉండేది. కాని ఇది తప్పు భావన. అదేవిధంగా ముస్లిముల్లో తీవ్రవాదులు వారి మతవిశ్వాసానికి ప్రతినిధులుగా భావించడం కూడా తప్పు.

ఇస్లామ్ కోసం నోరు విప్పిన ప్రతివారిని ఛాందసవాదులుగా ముద్రవేయడం అర్థరహితం మాత్రమే కాదు ఇది ఒక దారుణమైన తప్పిదం. నిజానికి ముస్లిములందరూ ఏకశిలా సదృశంగా ఉన్నారనుకోవడం కూడా పొరబాటు. ముస్లిముల్లో అన్నివిధాల రాజకీయ భావాలున్నాయి. ఇస్లామీయ బోధనల వివరణల్లోను విభేదాలు కనబడతాయి.

అయితే గత కొన్ని దశాబ్దాలుగా కొన్ని సాంప్రదాయిక ముస్లిమ్ గ్రూపులు అసహనానికి, గురయ్యాయన్నది కూడా నిజమే. ఈ ఛాందసవాదం తలెత్తడానికి అనేక కారణాలున్నాయి.

1. ముస్లిమ్ సమాజాల్లో ఆధునికత్వం వంటబట్టించుకున్న నాయకులు అధికం కావడం. ముస్లిమ్ సమాజాలపై వారి ప్రాబల్యం పెరగడం, బలప్రయోగం, దౌర్జన్యాలతో సాంప్రదాయిక ముస్లిమ్ నాయకత్వాన్ని జైళ్ళలో పెట్టి, చిత్రహింసలకు గురిచేయడం, మతపెద్దలను, ముస్లిమ్ మేధావులను వేధింపులకు గురిచేయడం.

2. ఈ మాడర్నిస్ట్ నాయకుల ఆర్థిక విధానాలు, ప్రగతి పథకాలు దారుణంగా విఫలం కావడం, ఈ విధానాలు, పద్ధతుల కారణంగా సంపద కేవలం కొద్దిమంది వద్ద మాత్రమే పోగుపడే పరిస్థితి తలెత్తడం.

3. యాభయ్యవ దశకం తర్వాతి నుంచి సాంప్రదాయిక ముస్లిమ్ ఆలోచనావిధానం, జీవనసరళి మొదలైన వాటన్నింటినీ నిరంతరం అపహాస్యానికి, ఎగతాళికి గురిచేయడం.

4. ముస్లిమ్ దేశాల్లో ఇస్లామీయ అసమ్మతిని అణిచివేయడానికి పాశ్చాత్యదేశాలు అనుసరించిన పద్ధతులు, ముస్లిమ్ నాయకులను దుర్మార్గులుగా చిత్రించడం, నిరంకుశ అణిచివేతల వ్యవస్థలను అక్కడ ప్రోత్సహించడం, ముస్లిమ్ దేశాలను ఆర్థికంగా దివాలా తీసేలా చేయడం, రుణభారం కింద నలిగేలా చేయడం.

# నేడు...

ఉగ్రవాదానికి నేడు ఇస్లామ్ మారుపేరుగా చిత్రిస్తున్నారు. సెప్టెంబర్ 11, 2001 సంఘటన తర్వాత ఇది సహజంగా చోటుచేసుకున్న పరిణామంగా కనబడింది. కాని ఇస్లామ్‌పై ఉగ్రవాదం ముద్ర వేయడమన్నది సత్యానికి చాలా దూరమైన విషయం. న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్, వాషింగ్టన్‌లోని పెంటగాన్‌లపై కొందరు టెర్రరిస్టులు చేసిన దాడులకు ఇస్లామ్‌ను నిందించలేము. గ్యాస్‌ఛాంబర్ల హత్యాకాండలకు క్రయిస్తవాన్ని ఎలా నిందించలేమో, ఐరిష్ ఉగ్రవాదుల దాడులకు కేథలిసిజాన్ని ఎలా నిందించలేమో ఇది కూడా అంతే. ఉగ్రవాదులు స్వంతంగా తాము వక్రీకరించి, తయారు చేసుకున్న వాదనను అనుసరిస్తారు. హేతుబద్ధమైన వాదనలు, సాధారణ ఆలోచనాసరళికి వారికి సంబంధం లేదు. ఎలాంటి మానవీయ ఆలోచనలు లేని ఇలాంటి వ్యక్తుల దుష్టచేష్టలు సాధారణ ప్రజలందరినీ విషాదానికి, భయబీభత్సాలకు గురిచేస్తాయి.

ఇస్లామీయ ఆలోచనాసరళి, అంటే ప్రపంచంలో మెజారిటీ ముస్లిముల ఆలోచనాసరళి న్యాయాన్ని, సత్యాన్ని, మానవవిలువలను అభిలషిస్తుంది. కాని ముస్లిములందరినీ ఒకే గాటన కట్టడం వల్ల మెజారిటీ ముస్లిముల్లో ఉన్న మానవీయ కోణాన్ని కాదని, దాదాపు 170 కోట్ల మంది ముస్లిములను, అంటే ప్రపంచ జనాభాలో ప్రతి ఐదుగురిలో ఒకరుగా ఉన్న ముస్లిములందరినీ తప్పుపడుతున్నాం. ముస్లిమ్ సమాజాలను, వారి సంస్కృతిని, వారి చరిత్రను అప్రతిష్ఠపాలు చేస్తున్నాం.

ముస్లిములు యదార్ధ చరిత్ర కలిగిన ప్రజలు. దాదాపు ఎనిమిది వందల సంవత్సరాలు విద్యా వైజ్ఞానిక రంగాల్లో, సాహిత్యం, మీమాంస, ఆవిష్కరణల్లో, దూర ప్రయాణాలు, రాజకీయాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో వారి నాగరికత ప్రపంచానికి నాయకత్వం వహించింది.

నేడు ముస్లిములు తమ చారిత్రక గుర్తింపును తిరిగి కనుగొనే ప్రయత్నాల్లో ఉన్నారు. నూతన వలసవాదం, అణిచివేతలు, అన్యాయపు ప్రపంచసరళి భారాలను వదిలించుకుని తమ భవిష్యత్తుకు సరికొత్త రూపం ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు.

# రేపు...

అనేక ఆందోళనలు, అలజడులు, వైరుధ్యాలు వివిధ దిశల్లోకి లాగుతున్నప్పటికీ నేడు ముస్లిములు భవిష్యత్తులో ఒక చురుకైన, ప్రగతిశీల సమాజంగా రూపొందే ప్రయత్నాలు నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. తీవ్రవాద గ్రూపుల హంగామా ఎంత బిగ్గరగా వినిపిస్తున్నప్పటకీ ఈ హంగామాకు దూరంగా సమకాలీన పరిస్థితులు, భవిష్యత్ పరిస్థితుల్లో ప్రవక్త ముహమ్మద్ బోధనల ప్రాముఖ్యం గురించి సరికొత్త ఆలోచనలు, చర్చలు, మేధోమథనాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కొత్త ఆలోచనలు, సిద్ధాంతాలు, దృక్పథాలు ముస్లిమ్ సమాజాన్ని సరికొత్తగా రూపొందించడమే కాదు, ఒక బహుళత్వంతో కళకళలాడే సరికొత్త ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి కూడా తోడ్పడతాయి.

గుర్తించవలసిన వాస్తవం ఏమంటే, ముస్లిములు నేడు ఎదుర్కుంటున్న సమస్యలకు సింపుల్ పరిష్కారాలేవీ లేవు. పై పూతల పరిష్కారాలతో ఈ సమస్యలను తొలగించడం సాధ్యం కాదు. కొన్ని సందర్భాల్లో ఈ సమస్యలు అత్యంత తీవ్రమైనవిగా, నిరాశాజనకంగాను కనిపిస్తున్నాయి. కాని, ముస్లిములు తమ విశ్వాసాల బలం వల్ల ఎల్లప్పుడు ఆశావాదులుగానే ఉంటారు. కేవలం సుదీర్ఘమైన, అలుపెరుగని, మేధోపరమైన సామాజిక, రాజకీయ ప్రయత్నాలు మాత్రమే ఫలితాలు సాధిస్తాయని వారికి తెలుసు. ఒక నిరంతరమైన ఆలోచన ప్రక్రియ ద్వారానే భవిష్యత్తుకు ఉపయోగపడే ఆచరణసాధ్యమైన ప్రత్యామ్నాయాలు ముందుకు వస్తాయన్న గ్రహింపు వారికి ఎల్లప్పుడు ఉంది. చైతన్యం ఉంటే చాలు యుద్ధం సగం గెలిచినట్లే.

# మహిళలు

## గతం అయోమయం - వర్తమానం అస్థిరం

ప్రాచ్య, పాశ్చాత్య సమాజాల్లో చోటుచేసుకుని ఉన్న తప్పు భావాలు ఎలాంటివో తెలుసుకోవాలంటే వివిధ సమాజాలు మహిళల పట్ల ఎలాంటి వైఖరి కలిగి ఉండేవో ఒకసారి పరిశీలించడం అవసరం.

## 1. బాబిలోనియా నాగరికత

బాబిలోనియా చట్టాల ప్రకారం మహిళలకు ఎలాంటి హక్కులు లేవు. వారిని అత్యంత హీనంగా చూసేవారు. ఒక పురుషుడు ఒక మహిళను హత్య చేస్తే ఆ పురుషుడిని శిక్షించేబదులు అతడి భార్యను శిక్షించేవారు.

## 2. గ్రీకు నాగరికత

ప్రాచీన నాగరికతల్లో అత్యంత వైభవోపేతమైన నాగరికతగా గ్రీకు నాగరికతను భావిస్తారు. ఈ మహా వైభవోపేతమైన నాగరికతలో మహిళలకు ఎలాంటి హక్కులు లేవు. వారిని హీనంగా చూసేవారు. గ్రీకు పురాణాల్లో ''పండోరా'' అనబడే ఒక పురాణ మహిళే మానవులందరి దురదృష్టాలకు కారణంగా చెప్పారు. గ్రీకులు మహిళలను మనుష్యుల కన్నా తక్కువగా చూసేవారు. పురుషుల కన్నా చాలా తక్కువస్థాయి కలిగిన వారిగా ఎంచేవారు. స్త్రీకి శీలం చాలా విలువైనదిగా భావించినా, స్త్రీలను గొప్పగా కొనియాడినా తర్వాతి కాలాల్లో గ్రీకులు పురుషాహంకారానికి, లైంగిక విపరీతాలకు గురయ్యారు. గ్రీకు సమాజంలోని అన్ని వర్గాల్లోను వ్యభిచారం సర్వసాధారణమయ్యింది.

## 3. రోము నాగరికత

రోమన్ నాగరికత ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడు పురుషుడికి తన భార్యను హత్య చేసే హక్కు ఉండేది. వ్యభిచారం, నగ్నత్వం రోమన్ సమాజంలో అత్యంత సాధారణమైన అంశం.

## 4. ఈజిప్టు నాగరికత

ఈజిప్షియన్లు మహిళలను దుష్టశక్తులుగా, దుష్టశక్తి చిహ్నాలుగా భావించారు.

## 5. క్రయిస్తవం ఆరంభంలో..

క్రయిస్తవం ఆరంభ దినాల్లో మహిళలను పురుషులను ప్రలోభపరిచి పాపం చేయించేవారిగా భావించేవారు. ఆదమ్ స్వర్గం నుంచి నేలపడడానికి కారణంగా ఎంచేవారు.

ఫ్రాన్సులో కామన్ ఎరా 587లో ఒక కాన్ఫరెన్సు జరిగింది. మహిళల స్థాయిని అధ్యయనం చేయడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఒక మహిళను మనిషిగా గుర్తించాలా లేదా అన్నది చర్చించడానికి జరిగిన సమావేశం ఇది. ఇంగ్లాండులో ఎనిమిదవ హెన్రీ మహిళలు బైబిల్ చదవడాన్ని నిషేధించాడు. మధ్యయుగాలన్నింటా కేథలిక్ చర్చి మహిళలను రెండవతరగతి పౌరులుగానే పరిగణించింది. 1850కి ముందు ఇంగ్లాండులో మహిళలను పౌరులుగా పరిగణించేవారు కాదు. 1882 వరకు ఇంగ్లీషు మహిళలకు వ్యక్తిగత హక్కులనేవి లేనే లేవు.

## 6. భారత నాగరికత

ఇండియాలో సతీసహాగమనం ఉండేది. అంటే మరణించిన భర్త చితిపై భార్య కూడా అగ్నికి ఆహుతి అయ్యేలా చేసేవారు. ఈ దురాచారాన్ని అనేకసార్లు నిషేధించారు.

## 7. ఇస్లామ్‌కు ముందు అరేబియా

ప్రపంచవ్యాప్తంగా కామన్ ఎరా 7వ శతాబ్దానికి ముందు నెలకొని ఉన్న పురుషాహంకారం, మహిళలను నీచంగా చూడడం అనేది అరేబియాలోని సంచార తెగల్లోను ప్రవక్త ముహమ్మద్ రాకకు ముందు కనబడేది. అప్పట్లో సామాజిక వాతావరణం అత్యంత ఉద్రిక్తంగా ఉండేది. వివిధ తెగల మధ్య యుద్ధాలు, పోరాటాలు, దోపిళ్ళు, అలజడుల్లో వివిధ తెగల పురుషులే నాయకత్వం వహించేవారు. అలాంటి వాతావరణంలో మహిళల స్థానం నిస్సందేహంగా ద్వితీయస్థానమే ఉంటుంది.

ఇస్లామ్‌కు ముందు అరేబియా ద్వీపకల్పంలో ఎవరికైనా ఆడపిల్ల పుట్టిందంటే చాలా అప్రతిష్ఠగా భావించేవారు. ఆడపిల్ల పుట్టిందన్న అవమానం భరించే బదులు ఆ శిశువును

సజీవంగా సమాధి చేసేవాళ్ళు. ఆ కాలంలోని ప్రతి పదిమంది పురుషుల్లో కనీసం ఒకరు అలాంటి పాపానికి పాల్పడినవారే. కేవలం పురుషులే కాదు మహిళలు కూడా ఇలాంటి పాపకృత్యంలో పాల్గొనేవారు. స్వయంగా తల్లులే తమ ఆడశిశువును సమాధి చేయడానికి అప్పగించేవారు. పేదరికానికి భయపడి పిల్లల్ని చంపేవారు.

ఇస్లామ్‌కు ముందు అరేబియా ద్వీపకల్పంలో విచిత్రమైన వైవాహిక ఆచారాలు ఉండేవి. పురుషులు ఎన్నిసార్లయినా పెళ్ళి చేసుకునేవారు. ఎంతమంది స్త్రీలనైనా భార్యలుగా స్వీకరించేవారు. ఒక్కొక్కరికి పదిమంది, ఇరవైమంది కొన్ని సందర్భాల్లో వందమంది వరకు భార్యలు ఉండేవారు. ఎంత మంది భార్యలుంటే అంత గొప్ప అనుకునేవారు. విడాకులనేవి చాలా సులభంగా ఉండేవి. ఎన్నిసార్లయినా విడాకులిచ్చే అవకాశం ఉండేది. దివ్యఖుర్ఆన్ ఈ దురాచారాలకు అడ్డుకట్ట వేసింది. కఠినమైన నియమనిబంధనలు విధించింది. అప్పట్లో మరో ఆచారం కూడా ఉండేది. పురుషులు తమ భార్యలతో లైంగిక సంబంధం మానుకోవడానికి ప్రమాణాలు చేసేవారు. ఆ విధంగా స్త్రీలను వేధింపులకు గురిచేసేవారు. వారికి విడాకులివ్వరు. అందువల్ల వారు మరొకరిని పెళ్ళి చేసుకునే అవకాశం ఉండదు. భార్యలుగా వారికి హోదా ఉండదు. ఇలాంటి బానిసబంధంలో చాలా మంది మహిళల జీవితాలు గతించిపోయాయి. ఇలాంటి పురుషులను దివ్యఖుర్ఆన్ కఠినంగా హెచ్చరించింది.

> "'వారిని (భార్యలుగా) ఉంచుకోండి. లేదా సముచితమైన పద్ధతిలో వారిని వదిలేయండి." దివ్యఖుర్ఆన్ : (2:224:227)

చాలా సందర్భాల్లో వితంతు మహిళను మరణించిన భర్త వదిలిన ఆస్తిగా పరిగణించేవారు. ఆ కుటుంబంలోని పురుషవారసులకు ఆమె ఆస్తిగా లభించేది. అలాంటి సందర్భాల్లో ఆమెను మరణించిన వ్యక్తికి మరో భార్య ద్వారా పుట్టిన పెద్దకుమారుడికి ఆమెను కట్టబెట్టేవారు.

ఈ అత్యంత నీచమైన ఆచారాన్ని దివ్యఖుర్ఆన్ కఠినంగా నిషేధించింది.

> ''మీ తండ్రులు వివాహం చేసుకున్న స్త్రీలను మీరు ఎంతమాత్రమూ వివాహమాడకండి. పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. వాస్తవానికి ఇది ఒక సిగ్గుమాలిన పని, జుగుప్సాకరమైనది, ఒక దుర్నడత." దివ్యఖుర్ఆన్ (4:22)

ఒకవేళ వితంతు మహిళను ఆమె మరణించిన భర్త పెద్దకుమారుడికి ఇచ్చి పెళ్ళిచేయడం కుదరకపోతే ఆమె మరుదులకు ఆస్తి అయ్యేది. ఇలాంటి సందర్భాల్లో మరుదుల్లో ఎవరో ఒకరు తన పై వస్త్రాన్ని ఆమెపైకి విసిరి ఆమెను తన ఆస్తిగా చేసుకునేవాడు. వితంతు

మహిళ తన భర్త ఇంటిని వదిలి వెళ్ళే అనుమతి లేదు.

ఇస్లామ్‌కు ముందు కాలంలో అరేబియాలో వ్యభిచారం అత్యంత సాధారణంగా ఉండేది. అందువల్ల చాలా మంది పిల్లలు పెళ్ళి కాని తల్లులకే పుట్టేవారు. మహిళలను కొట్టడం శారీరకంగా హింసించడం అత్యంత మామూలు విషయంగా ఉండేది.

చాలా అరబ్బు తెగల్లో మహిళలకు ఎలాంటి గౌరవాదరాలు ఉండేవి కావు. కేవలం లైంగికేచ్ఛకు ఉపయోగపడే వస్తువులుగా పరిగణించేవారు. కురచదుస్తుల్లో అత్యంత తక్కువ దుస్తుల్లో తిరగడాన్ని ప్రోత్సహించేవారు. మతపరమైన ఆచారాల్లోను అర్ధనగ్నంగా తిరిగేవారు. మక్కాలోని కాబాగృహ ప్రదక్షిణల్లో నగ్నంగా ప్రదక్షిణలు చేసేవారు. ఆ విధంగా పురుషులకు లైంగిక సంతృప్తినిచ్చే సాధనాలుగా మార్చేశారు.

ఇస్లామ్‌కు ముందు కాలం నాటి అరేబియాలో మహిళలకు ఎలాంటి ఆస్తి హక్కులు లేవు. పైగా మహిళలను ఆస్తిగా భావించి అమ్మడం కొనడం జరిగేది. అప్పు తీసుకుంటే అందుకు బదులుగా మహిళను ఇచ్చి అప్పులు తీర్చడం కూడా ఉండేది. ఈ దురాచారాలన్నింటిని దివ్యఖుర్ఆన్ నిషేధించింది. కొత్త చట్టాలను అమలులోకి తీసుకువచ్చింది. మహిళలకు వారసత్వ హక్కులు, ఆస్తిహక్కులు ప్రసాదించింది.

## ఆధునిక సమాజంలో మహిళలు

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి నేడు విభిన్నమైన వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు కూడా మానవాళి మహిళల విషయంలో ఇస్లామ్ రాకకు ముందు ఉన్న పరిస్థితిలోనే ఉన్నామని, మహిళలను అలాగే చూస్తున్నామని చాటి చెప్పే సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.

ఆడపిల్లను హతమార్చే ఆచారం ఇప్పుడు కూడా కొనసాగుతుంది. ఇప్పుడు సాంకేతిక ప్రగతి వల్ల పుట్టకముందే ఆడపిల్లను గర్భంలోనే హతమారుస్తున్నాం. యూనిసెఫ్ ప్రచురించిన వరల్డ్ చిల్డ్రన్స్ నివేదిక ప్రకారం భారతదేశంలో ఆడపిల్లల కన్నా  మగపిల్లల సంఖ్య చాలా ఎక్కువ ఉంది. భారతదేశంలో ప్రతి 1000 మంది మగపిల్లలకు 880 మంది ఆడపిల్లలున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1000 మంది మగపిల్లలకు 954 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నారు. ఆడపిల్లలను పుట్టకముందే హతమార్చే భ్రూణహత్యల వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది.

ప్రతి సంవత్సరం దాదాపు ఏడు కోట్ల మంది ఆడపిల్లలను పుట్టకముందే

హతమార్చడం జరుగుతుంది. యావత్తు మానవాళి సిగ్గుపడవలసిన విషయం ఇది. మనస్సాక్షి ఉన్న ప్రతి వ్యక్తిని ఆపాదమస్తకం జలదరించేలా చేసే వాస్తవాలివి. అయినా మనం నాగరిక ప్రపంచంలో జీవిస్తున్నామని అనుకుంటున్నాం. మానవహక్కులతో కళకళలాడే ప్రపంచంలో ఉన్నామని సంతోషిస్తున్నాం.

నేటి ఆధునిక కాలంలో మహిళలను ఆటవస్తువులుగా, వినోదసాధనాలుగా మార్చేయడమే జరుగుతోంది. ఆధునిక కాలంలో మహిళలు సమానత్వం పేరిట, చాలా సందర్భాల్లో ఇది ఊహాజనితమైన సమానత్వంగానే ఉంటుంది అలాంటి సమానత్వం కోసం అనుకోకుండానే పురుషాహంకారానికి తగినట్లు వ్యవహరిస్తూ తమను తాము కించపరుచుకుంటున్నారు.

ఆధునిక ప్రపంచం మహిళలకు హక్కులు ప్రసాదించినట్లు గర్వంగా చెప్పుకోవచ్చు. కాని మహిళల భద్రత, రక్షణల విషయంలో ఆధునిక ప్రపంచం ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోలేదు. ఫలితంగా స్త్రీస్వేచ్ఛ స్త్రీలపై దౌర్జన్యాలకు కారణమయ్యింది. నేటి సమాజంలో కనబడుతున్న అనేక గందరగోళాలకు కారణమయ్యింది. ఈ స్వేచ్ఛ స్త్రీలకు ఏమిచ్చిందో కాని, మార్కెట్టులో మహిళలు అందుబాటులో ఉండేలా చేసింది. నేడు సెక్స్ అనేది అతిపెద్ద గ్లోబల్ మార్కెట్లుగా మారింది. మానవత్వాన్ని చిందరవందర చేసే వ్యాపారంగా మారింది. ప్రజలను ఎయిడ్స్, ఆత్మహత్యలు, హత్యల రూపంలో చంపుతుంది. కుటుంబాలను నాశనం చేస్తుంది. సాంఘీక సరళిని చిందరవందర చేస్తోంది.

మహిళలను పశువుల కన్నా హీనంగా చూస్తున్నారు. వ్యభిచారం, సెక్స్ వర్కర్లు, అశ్లీల నృత్యాలే కాదు, మాడలింగ్, నగ్నత్వం, వరకట్న హత్యలు, నూతన వధువులను కాల్చి చంపడం, ఆత్మహత్యలు, జూదం, మద్యపానం ఇవన్నీ సర్వసాధారణమై పోయాయి. స్త్రీల మధ్య లైంగిక వాంఛలు, సంబంధాలు, యథాలాప లైంగిక సంబంధాలు, అనేకమందితో లైంగిక సంబంధాలు మామూలయ్యాయి.

నేడు స్త్రీని వినోదసాధనంగా, ఆటవస్తువుగా మార్చడం అనేది ఇంకా చాలా ఎక్కువయ్యింది. నేడు ఆధునిక పద్ధతుల్లో స్త్రీలను లైంగిక సాధనాలుగా ఉపయోగిస్తున్నారు. మీడియాలోను, వాణిజ్య ప్రకటనల్లోను స్త్రీలను అర్ధనగ్నంగా చూపించడం అలాంటిదే. (చాలా సందర్భాల్లో వాణిజ్య ప్రకటనల్లో కనబడే అర్ధనగ్న స్త్రీకి ఆ ఉత్పత్తికి ఎలాంటి సంబంధమూ ఉండదు. హ్యాంబర్గర్, సాఫ్ట్‌డ్రింకులు, కార్లు వగైరా ఉత్పత్తుల ప్రకటనలు అలాంటివే). ఇవే కాక అశ్లీలచిత్రాలు, నగ్న నృత్యాలు, కొన్ని రెస్టారెంట్లలో ఆడ వెయిటర్లు కురచ దుస్తుల యూనిఫారం ధరించడం, ఇటీవల కాలంలో కాస్మటిక్ సర్జరీ పట్ల పెరుగుతున్న ఒత్తిడి,

ముఖ్యంగా బ్రెస్ట్ ఎనలార్జ్‌మెంట్ విషయంలో పెరుగుతున్న ఆసక్తి ఇవన్నీ వేటిని సూచిస్తున్నాయి?

## లైంగిక వైపరీత్యం

మహిళలు, బాలికలు, చివరకు అమాయకపు పిల్లలు ఎవరినీ కామపిశాచులు వదిలిపెట్టడం లేదు. మహిళలు, బాలికలపై లైంగిక అఘాయిత్యాలు, మానభంగాల, కిడ్నాపులు, సామూహిక అత్యాచారాలు, హత్యల వార్తాలు అనేకం వస్తున్నాయి. ఇలాంటి చాలా సందర్భాల్లో వీడియో తీసి బాధితులను బెదిరించడం, అప్రతిష్ఠపాలు చేయడం కూడా జరుగుతోంది. ఈ దుర్మార్గుల్లో కొందరు ఎంతకు తెగిస్తున్నారంటే, తమ పైశాచిక చేష్టల నేరాలను ఫోటోలు తీసి సోషల్ మీడియా సైట్లలో కూడా పెట్టి దమ్ముంటే పట్టుకోండన్నట్లు శాంతిభద్రతల యంత్రాంగానికి సవాళ్ళు విసురుతున్నారు. ఈ సంఘటనలు మన సభ్యతా సంస్కారాలను అపహసిస్తున్నాయి. సామాజిక బాధ్యత, నాగరిక జీవనాలను ఎగతాళి చేసే దురాగతాలివి.

మహిళలను తీవ్రమైన దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు గురిచేసిన నాగరికతలు నాశనమయ్యాయని చరిత్ర చాటి చెబుతోంది. మన సినిమాలు, పత్రికలు, దినపత్రికలు అన్నీ సెక్సుపిచ్చిని పెంచడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. జాతీయస్థాయిలో పేరుపొందిన ఇంగ్లీషు పత్రికలు, దినపత్రికలు కూడా అశ్లీలమైన సప్లిమెంట్లు ప్రచురించడం శోచనీయం. ఇంటర్నెట్ వాడకం పెరిగిన తర్వాత స్వచ్ఛమైన యువతరాన్ని పెడదారి పట్టించే అశ్లీలం మరింత విస్తరించింది.

ఆధునిక సెక్సుపిచ్చి సమస్యను పరిష్కరించాలని మనం భావిస్తే, ప్రభుత్వ పరంగానూ, సామాజిక శాస్త్రవేత్తలు, మీడియా, మతపెద్దలు అందరూ కలిసి సమైక్య ప్రయత్నాలు చేయవలసిన అవసరం ఉంది. మన సంస్కృతి, మన కుటుంబ జీవనం, మన నాగరికత పునాదులన్నీ ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. సాహిత్యంలో, ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియాలో భావప్రకటన స్వేచ్ఛ పేరిట అనారోగ్యకరమైన ధోరణులను అనుమతించరాదు. అసహజ కామకేళిని, వివాహానికి ముందు సెక్సును, వివాహేతర లైంగిక సంబంధాలను ప్రోత్సహించే రాతలను కఠినంగా నిషేధించాలి. దైవభీతి, నైతిక ప్రమాణాలు, బాధ్యతాభావాలను ప్రోత్సహించాలి. ఇవి సమాజానికి మార్గదర్శనమిచ్చే అంశాలు కావాలి.

ఇస్లామ్ మహిళలకు ప్రసాదించిన హక్కులేమిటో ఒకసారి చూద్దాం. ఇక్కడ మనం దృష్టిలో ఉంచుకోవలసిన వాస్తవమేమంటే, 21వ శతాబ్దంలో ముస్లిమ్ సమాజాల్లో కనబడుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు, ఇస్లామ్ ప్రసాదించిన హక్కులకు మధ్య భేదం ఉందని గుర్తించాలి.

# ఇస్లామ్ దృష్టిలో మహిళలు

దివ్యఖుర్ఆన్ వాక్యాలు అవతరించడం ప్రారంభమైనప్పటి నుంచి ఇస్లామ్ మహిళలకు హక్కులు ప్రసాదించింది. ఆధ్యాత్మికంగా స్త్రీలు పురుషులతో సమానులుగా గుర్తించింది. ఇస్లామ్ స్త్రీ పురుషులను జీవిత భాగస్వాములుగా వర్ణించింది. స్త్రీలకు, పురుషులకు విభిన్నమైన, స్పష్టమైన బాధ్యతలున్నాయి. వారు నిర్వహించవలసిన పాత్రలు స్పష్టంగా ఉన్నాయి. వారి శక్తిసామర్థ్యాలు, వారి బలాబలాలకు తగిన బాధ్యతలను వారికి నిర్దేశించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ బోధనలు అరేబియాలో వ్యాపించినప్పుడు అక్కడి మహిళలు ఈ బోధనల్లో తమకు స్వేచ్ఛ లభిస్తుందని వెంటనే గ్రహించారు. నిజానికి ఇస్లామ్ స్వీకరించిన మొదటి వ్యక్తి ఒక మహిళ. (హజ్రత్ ఖదీజా, ఆమె ప్రవక్త ముహమ్మద్ భార్య). మరో ముఖ్యమైన ఉదాహరణ హజ్రత్ ఉమర్ సోదరి ఫాతిమా. హజ్రత్ ఉమర్ కన్నా ముందే ఈమె ఇస్లామ్ స్వీకరించారు. అంతేకాదు, హజ్రత్ ఉమర్ ఇస్లామ్ స్వీకరణకు ఈమె కారణమయ్యారు. కేవలం దైవదాసులుగా మారడం ద్వారా వీరందరూ ఇతర దాస్యబంధనాలన్నింటి నుంచి విముక్తులయ్యారు.

ఇస్లామ్ వచ్చిన తర్వాత మహిళలపై ఇంతకు ముందున్న అణిచివేతల సంకెళ్ళన్ని తొలగిపోయాయి. ప్రవక్త ముహమ్మద్ మహిళల హక్కులను సమర్థించడమే కాదు, చివరి వరకు మహిళల హక్కుల విషయంలో నొక్కి చెప్పారు. ఆయన చివరి ప్రసంగంలోను ఆయన ఈ విషయాన్ని నొక్కి చెప్పారు.

> "ప్రజలారా! మీ మహిళల విషయంలో మీకు కొన్ని హక్కులున్నాయన్నది నిజమే. కాని వారికి కూడా మీపై కొన్ని హక్కులున్నాయి. దేవుని అమానుతుగా, దేవుని అనుమతితో మీరు వారిని భార్యలుగా స్వీకరించారని మరిచిపోరాదు. వారు మీ హక్కులను నిర్వర్తిస్తే, వారికి అన్నవస్త్రాలను, ప్రేమాభిమానాలను పొందే హక్కు ఉంది. మీ మహిళలను చక్కగా చూసుకోండి. వారి పట్ల దయతో, ప్రేమగా

మెలగండి. వారు మీకు భాగస్వాములు. అంకితభావం ఉన్న సహాయకులు. మీకు ఇష్టం లేని వారితో స్నేహం చేయకుండా ఉండడం, తమ మానమర్యాదలను కాపాడు కోవడం వారి బాధ్యత."

## పరివర్తనం

అనేక యుగాల పాటు రెండవతరగతి పౌరులుగా జీవనరంగాలన్నింటా చిన్న చూపు చూడబడిన మ హిళలు చివరకు విముక్తి పొందారు. ఇస్లామ్ వారికి వారి హక్కులు లభించేలా చేసింది. పురుషులతో సమానహక్కులు పొందేలా చేసింది. పురుషుల భాగస్వాములుగా, సహాయకులుగా నిర్ధారించింది. ప్రతి మహిళలకు నిర్దిష్టమైన, పవిత్రమైన హక్కులు కల్పించింది. మహిళలను వారికి తగిన ఉత్తమమైన హోదా లభించేలా చేసింది. ఈ అసాధారణమైన మార్పులు ఎలా చోటు చేసుకున్నాయి?

ఇస్లామ్‌లో మహిళా విముక్తి అనేది మహిళల ప్రయత్నాల వల్ల కాని లేదా పురుషుల ప్రయత్నాల వల్ల కాని జరగలేదు. దేవుడు స్వయంగా ఈ విషయాన్ని మానవాళికి తెలియజేశాడు. ప్రవక్త ముహమ్మద్ దివ్యఖుర్ఆన్ అవతరణను స్వీకరించి దానిని ప్రజలకు తెలియజేసేవారు. తక్షణం ప్రజలు ఆ ఆదేశాలను అమలు చేయడానికి పూనుకునేవారు. ఆ విధంగా మహిళల హక్కులకు సంబంధించిన ఆదేశాలు, మహిళలను దయతో చూడాలన్న బోధనలు వచ్చిన వెంటనే వాటిని యథాలాపంగా వినడం జరగలేదు. తక్షణం అమలు చేయడం జరిగింది. దేవుని ఆదేశాలు వచ్చిన వెంటనే ముస్లిమ్ పురుషులు అంతకు ముందు వరకు ఉన్న తమ భావాలను సరిచేసుకున్నారు. అంటే తమ హక్కుల కోసం మహిళలు ఎలాంటి పోరాటాలు చేయవలసిన అవసరమే కలుగలేదు. అక్కడ ఎలాంటి తిరుగుబాట్లు జరగలేదు. ఎలాంటి ర్యాలీలు లేవు. ఎలాంటి ప్రతిఘటన పోరాటాలు లేవు. ఇస్లామ్‌కు ముందు అరేబియాలో మహిళల పట్ల చిన్నచూపు భావనతో పెరిగిన పురుషులు, ఆడశిశు వు పుడితే అప్రతిష్ఠగా భావించి సజీవ సమాధులు చేసిన పురుషులు, వ్యభిచారం సర్వసాధారణమైన సమాజంలో స్త్రీని ఆటవస్తువుగా భావించినవారు తక్షణం తమ ఆలోచనలు చక్కదిద్దుకున్నారు. దైవభీతి కలిగినవారిగా, అంతకు ముందు తాము చేసిన పాపాలకు పాశ్చాత్తాపపడుతూ మహిళల పట్ల గౌరవాదరాలు, దయసానుభూతి కలిగిన వారిగా మారిపోయారు. వారు ప్రవక్త చెప్పిన ప్రతి మాటను చాలా జాగ్రత్తగా వినేవారు. వెంటనే అమలు చేసేవారు.

"తన భార్య పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడే మీ అందరిలోను ఉత్తముడు" అన్నారు ప్రవక్త.

అంతేకాదు

"దేవుడు ఇద్దరు కుమార్తెలను ప్రసాదించిన వ్యక్తి ఆ ఇద్దరు కుమార్తెలను ప్రేమాభిమానాలతో పెంచి పెద్దచేస్తే ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించే అర్హత పొందుతాడు." అని కూడా బోధించారు.

సమాజాన్ని సంస్కరించిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ మానభంగం, హత్య, ఆడశిశువుల హత్య వంటి నేరాలకు కఠినమైన మరణశిక్ష విధించారు. వ్యభిచారం, జూదం, మద్యపానం, నృత్యవినోదం వంటి వాటన్నింటిని నిషేధించారు. దుబారా ఖర్చులు, లైంగిక విశృంఖలత్వం, అనేకమందితో యథాలాప లైంగిక సంబంధాల వంటి రుగ్మతలన్నింటిని నిషేధించారు. మహిళలను ఆర్థిక భారాలుగా భావించడాన్ని, ఆటవస్తువులుగా, వినోదసాధనాలుగా చూడడాన్ని ఆయన అనుమతించలేదు.

# ఇస్లామ్‌లో మహిళల హక్కులు

మనోభావాల సంతృప్తి, కామవాంఛల సంతృప్తి, చట్టబద్ధమైన పునరుత్పత్తి, కుటుంబాల మధ్య సంబంధాలు, సమాజంలో సౌహార్దతకు సాధనంగా ఇస్లామ్ వివాహాన్ని చూస్తుంది. ఇస్లామ్‌లో వివాహం ఏదో యాజమాన్యం వంటిది కాదు, ఇది ఒక ఒప్పందం వంటిది. అందువల్ల ఈ వివాహ వ్యవస్థ మహిళలకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తుంది.

1. ముస్లిమ్ స్త్రీ పెళ్ళయిన తర్వాత తన పుట్టింటి పేరును వదులుకోవలసిన అవసరం లేదు. తన గుర్తింపును ప్రత్యేకంగా కొనసాగించవచ్చు.

2. వధువుకు తన వరుడిని ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. పెళ్ళిలో ఆమె ఒప్పుకోలు, వరుడి ఎంపిక విషయంలో ఆమె అంగీకారం తప్పనిసరి.

3. ముస్లిమ్ వివాహంలో వరుడు స్త్రీ ధనాన్ని వధువుకు మాత్రమే చెల్లిస్తాడు. వధువు తండ్రికి ఇవ్వడం జరగదు. వధువు పెళ్ళి సమయంలోనే ఈ స్త్రీధనాన్ని చెల్లించాలని డిమాండ్ చేయవచ్చు. ఎంత స్త్రీధనం అనే విషయంలోను ఆమె నిర్ణయించవచ్చు. ఈ స్త్రీధనం ఆమె స్వంత ఆస్తి అవుతుంది. ఆమె దానిని తన వద్ద ఉంచుకోవచ్చు, పెట్టుబడి పెట్టవచ్చు, ఖర్చు చేసుకోవచ్చు. ఆమె పురుష బంధువులెవ్వరు ఈ విషయంలో జోక్యం చేసుకోలేరు.

4. వధువు నుంచి కాని లేదా వధువు తల్లిదండ్రుల నుంచి కాని వరకట్నం కోరడాన్ని ఇస్లామ్ నిషేధిస్తుంది.

5. వధువుకు తన తల్లిదండ్రుల నుంచి లభించిన కానుకలపై సర్వహక్కులు ఆమెవే. ఆ కానుకలను తన భర్తకు కాని, తన భర్త తరఫు బంధువులకు కాని ఎవరికీ ఆమె ఇవ్వవలసిన అవసరం లేదు. ఆ విధంగా ఆమె తన భర్త ఆస్తిలో హక్కు కలిగి ఉంటుంది, తన తల్లిదండ్రుల ఆస్తిలోను హక్కు కలిగి ఉంటుంది. (చూడండి దివ్యఖుర్ఆన్ : 4 : 7, 32, 176)

6. కుటుంబంలో స్త్రీలందరికీ రక్షణ కల్పించడం, వారిని పోషించడం పురుషుల బాధ్యత. అంటే అర్థం భార్య వద్ద ధనసంపదలు ఉన్నప్పటికీ పురుషుడు ఆమెకు తన కుటుంబ సభ్యులకు తానే స్వయంగా పోషణ కల్పించాలి. కుటుంబ ఖర్చులకు ఆమె ఎలాంటి ఖర్చు చేయవలసిన అవసరం లేదు. అందుకు బదులుగా స్త్రీ తన భర్త పట్ల విశ్వాసంగా, పవిత్రంగా ఉండాలని చెప్పడం జరిగింది. (చూడండి దివ్య ఖుర్ఆన్ : 4 : 34)

7. భర్తతో జీవించడం అసాధ్యమైనప్పుడు, భర్త విడాకులివ్వడానికి నిరాకరిస్తే, ఆ స్త్రీ విడాకులు (ఖులా) పొందవచ్చు.

8. వితంతువులు, విడాకులు పొందిన స్త్రీలు పునర్వివాహం చేసుకోవచ్చు.

9. మహిళ పనిచేయాలనుకుంటే లేదా ఆమె పరిస్థితుల రీత్యా పనిచేయడం అవసరమైతే పనిచేసి సంపాదించుకోవచ్చు.

నేడు అందరూ భావిస్తున్నట్లు ఇస్లామ్ మహిళలను కేవలం ఇంటి నాలుగ్గోడల మధ్య ఉంచలేదు. ఏదన్నా వృత్తి లేదా పని చేయాలనుకుంటున్న మహిళలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

10. స్త్రీ స్వయంగా సంపాదించుకోవచ్చు, తన ఇష్టానుసారం తన డబ్బు ఖర్చు పెట్టవచ్చు. తాను సంపాదించుకున్న సొమ్మును ఆమె తన తల్లిదండ్రుల కోసం ఖర్చు చేయవచ్చు. ధర్మకార్యాలకు విరాళంగా ఇవ్వవచ్చు. భర్త నుంచి, లేదా భర్త బంధువుల నుంచి అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు.

11. పెళ్ళి తర్వాత భర్త ఇచ్చిన కానుక అది నగదు కాని వస్తువు కాని ఏదైనా దానికి ఆమె యజమాని అవుతుంది. భర్త ఒకవేళ విడాకులిస్తే ఆ కానుకను వెనక్కి ఇవ్వమని అడగలేడు.

12. విద్యాజ్ఞానాల కోసం ప్రయత్నించడంలో స్త్రీపురుషులిద్దరు సమానులే. స్త్రీపురుషులందరూ విద్యాజ్ఞానాలు పొందడం తప్పనిసరి విధిగా పేర్కొంది.

ఇది ప్రవక్త ముహమ్మద్ (స) వల్ల, దివ్యఖుర్ఆన్ వల్ల చోటు చేసుకున్న సంస్కృతి. స్త్రీపురుషులకు దేవుడు నిర్దేశించిన జీవనవిధానం ఇది. అన్ని విషయాలు తెలిసిన వాడు దేవుడు కాక మరెవ్వరున్నారు.

ఇదంతా ఎవరో ఒకరు ఇచ్చినది కాదు. ఎవరికైనా ఇష్టం లేనప్పుడు ఈ హక్కులను కాదనడానికి కూడా వీలు లేదు. ఇవన్నీ ఇస్లామీయ చట్టాల ప్రకారం ఇవ్వబడ్డాయి. ఈ చట్టాలు శాశ్వతస్థాయి కలిగినవి. భూమిపై వీటిని మార్చే అధికారం ఎవరికీ లేదు. ఆ విధంగా ఇస్లామ్ మహిళల హెూదాను, మర్యాదలను కాపాడింది. ఇస్లామ్ ఈ హక్కులన్నింటినీ మహిళలకు కల్పించిన కాలంలో పాశ్చాత్యదేశాల్లో మహిళలను అస్సలు మనుష్యులేనా అని సందేహిస్తున్న కాలం, మహిళలను పశువుల మాదిరిగా చూసిన కాలం. అసలు మహిళలకు ఆత్మ అనేది ఉంటుందా అని అనుమానించిన కాలం అది.

ఇస్లామ్ మహిళలను అత్యంత విలువైనవారిగా చూస్తుంది. ఎలాంటి పరిస్థితిలోను వారి మర్యాదకు భంగం కలుగడాన్ని అనుమతించదు.

కొన్ని మధ్యప్రాచ్యదేశాల్లో, భారత ఉపఖండంలో, కొన్ని ముస్లిమ్ కుటుంబాల్లో మహిళల పట్ల అనుచిత వ్యవహారశైలికి సాంస్కృతిక కారణాలున్నాయి. ఈ సాంస్కృతిక అంశాలను గుడ్డిగా పాటించే పురుషుల వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సంఘటనలకు ఇస్లామ్ కారణం ఎంతమాత్రం కాదు. ఇస్లామ్ అణిచివేతల మతమే అయినట్లయితే ప్రపంచవ్యాప్తంగా ఇస్లామ్‌ను స్వీకరిస్తున్న మహిళల సంఖ్య ఎందుకు పెరుగుతుంది?

# ఇస్లామ్‌లో మహిళల విధులు

ఇస్లామ్ సమతుల్యం ఉన్న నిష్పక్షపాత ధర్మం. ఇస్లామ్ మహిళల హక్కులను మాత్రమే కాదు, విధులను కూడా నిర్దేశించింది. ముస్లిమ్ మహిళ క్రింది విధులు నిర్వర్తించవలసి ఉంది.

1. ఒకే ఒక్క దేవుడిని విశ్వసించడం (తౌహీద్). ఇస్లామ్‌ను అవలంబించడం ఆమె ముఖ్య విధి. ముస్లిమ్ మహిళ తన ప్రార్థనలను (నమాజ్) ఆచరించాలి. రమజాన్ ఉపవాసాలు (రోజా) పాటించాలి. తన స్వంత సంపద నుంచి జకాత్ (జకాత్ ఇవ్వవలసిన సంపద ఉంటే) ఇవ్వాలి. స్తోమత ఉంటే హజ్ యాత్ర చేయాలి.

2. తన శీలాన్ని కాపాడుకోవాలి. వివాహేతర సంబంధాలకు పాల్పడరాదు.

3. నిండుగా వస్త్రాలు ధరించాలి. బయటకు వెళుతున్నప్పుడు లేదా సన్నిహిత బంధువులు కాని పురుషులను కలుస్తున్నప్పుడు హిజాబ్ పాటించాలి. (హిజాబ్ అంటే పొడవైన పై దుస్తులు, తలపై వస్త్రం)

4. పిల్లలను ఇస్లామీయ నియమనిబంధనల ప్రకారం మంచి గుణగణాలు కలవారిగా తీర్చిదిద్దాలి. ఆమె కుటుంబసభ్యుల మంచి చెడ్డలు చూడాలి. ఇంటి వ్యవహారాల్లో ఆమెకు పూర్తి అదుపు ఉంటుంది. కుటుంబ నిర్వహణ అన్నది పరస్పర సంప్రదింపులతో జరిగినప్పటికీ ఆమె ఇంటి వ్యవహారాల్లో మహారాణి.

5. ఆమె తన భర్తకు సహాయకురాలు. విశ్వాసి అయిన భార్య ఒక మంచి వస్త్రం వంటిది. శాంతి, ప్రేమ, సంతోషం, సంతృప్తులకు నిలయం వంటిది. (చూడండి దివ్యఖుర్‌ఆన్‌లో 30:21, 2:187)

6. అల్లాహ్ అదేశాలకు విరుద్ధంగా చేయాలని ఎవరు చెప్పినా చివరకు భర్త ఆదేశించినా, తండ్రి, సోదరులు ఎవరు చెప్పినా ఆమె వినవలసిన అవసరం లేదు. (చూడండి దివ్యఖుర్‌ఆన్ 9:23)

7. భార్యభర్తలు ఒకరికొకరు సంపూరకాలుగా ఇస్లామ్ పేర్కొంటుంది. ఎవరూ ఎవరిపై పెత్తనం చెలాయించే పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరికి వారి వారి ప్రత్యేక విధిబాధ్యతలు, హక్కులు ఉన్నాయి. వారిద్దరు కలిసి ఒక శాంతియుతమైన, ఆనందదాయకమైన కుటుంబాన్ని ఏర్పరుస్తారు. అలాంటి కుటుంబాలు పటిష్టమైన, స్థిరమైన, శాంతియుతమైన సమాజానికి పునాదులు అవుతాయి.

# హిజాబ్ - బురఖా

నేడు ముస్లిమ్ మహిళలకు సంబంధించి వినిపించే అతిపెద్ద విమర్శ వారి వస్త్రధారణకు సంబంధించినది. నేడు చాలా మంది స్త్రీ స్వేచ్ఛ అంటే స్త్రీల దుస్తులను కురచ చేయడంగా భావిస్తున్నారు. స్త్రీ ఎంతగా శరీరాన్ని ప్రదర్శిస్తే, లేదా ఎంతగా శరీరాన్ని ప్రదర్శించే అవకాశం ఆమెకు కల్పిస్తే అంతగా ఆమె స్వేచ్ఛ పొందినట్లు భావిస్తున్నారు. విచిత్రమేమంటే, ప్రాచీన కాలానికి చెందిన అణిచివేతలకు గురైన మహిళలను శరీరాన్ని ప్రదర్శించేలా ప్రోత్సహించేవారు. రెచ్చగొట్టేలా వస్త్రాలు ధరించడాన్ని ప్రోత్సహించేవారు. ఇలా చేయడం వల్ల స్వేచ్ఛ లభించదు, ఎలాంటి ప్రత్యేక హక్కులు ప్రాప్తం కావు. ఇలా చేయడం చుట్టు ఉన్న పురుషుల కామదృష్టికి సంతృప్తి కలిగిస్తుంది. ఇదే నేడు కూడా కాస్త అటూ ఇటుగా కొనసాగుతోంది.

నేడు ఇస్లామ్‌లో మహిళల హిజాబ్ లేదా బురఖా గురించి చాలా చర్చ జరుగుతోంది. ఇది అణిచివేతకు, హక్కుల నిరాకరణకు, వెనుకబాటుతనానికి నిదర్శనంగా చిత్రించడమూ జరుగుతుంది. మరోవైపు హిజాబ్‌ను కోరేవారు దాన్ని గట్టిగా సమర్థిస్తున్నారు. హిజాబ్‌ను వ్యతిరేకించేవారు అత్యంత హేయమైన పద్ధతుల్లో కూడా తమ విమర్శలు కొనసాగిస్తున్నారు. శతాబ్దాలుగా ముస్లిమ్ మహిళల వెనుకబాటును హిజాబ్‌తో సూచించడమూ జరుగుతూ వస్తోంది. నేడు హిజాబ్ ఇస్లామ్‌లో మహిళల స్థానాన్ని విమర్శించడానికి ఒక సాధనంగానే కాదు, రాజకీయంగా కూడా వాడుకోవడం జరుగుతోంది. అయితే అసలు దివ్యఖుర్ఆన్ హిజాబ్ గురించి ఏమంటుందన్నది చూద్దాం.

హిజాబ్ అన్న పదం దివ్యఖుర్ఆన్‌లో ఎనిమిది సార్లు వచ్చింది. 19:17, 38:32, 17:45, 42:51, 7:46, 33:53, 83:15. హిజాబ్ అన్న పదానికి అర్థం ఒక తెర, పార్టిషన్ లేదా విభజన. ముస్లిమ్ సమాజాల్లో సంప్రదాయికంగా హిజాబ్ అంటే తలపై వస్త్రాన్ని ధరించడం, శరీరం నిండుగా వస్త్రాలు ధరించడం.

స్త్రీ మానమర్యాదలను, గౌరవాదరాలను కాపాడ్డానికి, ఒక మంచి సమాజనిర్మాణానికి గాను ఈ వస్త్రధారణ నియమాలు విధించబడ్డాయి. స్త్రీలు వదులైన దుస్తులు నిండుగా ధరించాలని చెప్పడం జరిగింది. భారత ఉపఖండంలో ముస్లిమ్ మహిళలు తల నుంచి కాళ్ళ వరకు ధరించే నిండైన వస్త్రాన్ని బురఖా అని అంటున్నారు. మధ్యప్రాచ్యంలో దీన్ని

నికాబ్ అంటారు. ఈరాన్‌లో ఒక పెద్ద నల్లని చాదర్ ఉపయోగిస్తారు. అరబ్బు దేశాల్లో మహిళలు పొడవైన వదులైన అబయా అనబడే వస్త్రాలు ధరిస్తారు. ప్రపంచంలో చాలా దేశాల్లో ముస్లిమ్ మహిళలు తలపై వస్త్రాన్ని లేదా స్కార్ఫ్‌ను ధరిస్తారు.

## దేవుని ప్రసన్నత పొందడానికి మహిళలు ఎంచుకున్న వస్త్రధారణ – హిజాబ్

వదులైన దుస్తులను నిండుగా ధరించడమే హిజాబ్. ఇలాంటి వస్త్రధారణ వల్ల ఎలాంటి ప్రయోజనాలున్నాయో అర్థం చేసుకోడానికి పెద్దగా ఆలోచించవలసిన అవసరం లేదు. నేడు కూడా బిగుతుగా, శరీరాకృతిని బహిర్గతపరిచే దుస్తులు ధరించడానికి ఇష్టపడని మహిళలను మర్యాదపూర్వకంగా చూడడం జరుగుతుంది. అందుకు విరుద్ధంగా సినిమాల్లో నటించేవారిని, డ్యాన్సులు చేసేవారిని, వాణిజ్యప్రకటనల్లో అర్ధనగ్నంగా కనిపిస్తూ విలాసవస్తువులుగా, వినోద సాధనాలుగా ఉపయోగపడ్డవారిని ఎలా చూస్తారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సౌందర్యసాధనాలు, సబ్బులు, షాంపూలు, లోదుస్తులు, మహిళల బ్యాగులు, దుస్తులు చివరకు శానిటరీ నాప్కిన్లు, గర్భనిరోధక మాత్రలు, సాధనలు తయారు చేసి అమ్ముకునే కోట్లకు పడగలెత్తిన పరిశ్రమలు స్త్రీ శరీరాన్ని అర్ధనగ్నంగా చూపించడం ద్వారా అమ్మకాలు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పాశ్చాత్య సమాజాల్లో స్త్రీలు కురచదుస్తులు ధరించినా పురుషులు మాత్రం సూటుబూటుల్లోనే ఉంటారు. శరీర ప్రదర్శన ద్వారా ప్రయోజనాలు పొందే విషయంలో పాశ్చాత్య సమాజం వైఖరి ఎలా ఉందో దీన్ని బట్టి అర్థమవుతూంది.

ముస్లిమ్ మహిళలు అణిచివేతలకు గురవుతున్నారని, బురఖా, హిజాబ్‌లను నిషేధించాలని మొసలి కన్నీళ్ళు కారుస్తున్న ఆధునికుల అసలు దృష్టి ఎక్కడుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. స్త్రీలు తమ భర్తలకు తప్ప మరెవ్వరికీ తమ సౌందర్యాన్ని శరీరాన్ని ప్రదర్శించేది లేదని, ప్రేక్షకుల కోసమో, సినిమా తెరపైనో తమ శరీరాన్ని ప్రదర్శించడం కుదరదని తీర్మానించుకుంటే కోట్లాది రూపాయల కాస్మటిక్ పరిశ్రమ చాలా నష్టపోతుంది. అందువల్లనే స్త్రీలు ఇస్లామ్ స్వీకరిస్తున్న సంఘటనల పట్ల పాశ్చాత్యులు చాలా ఆందోళన చెందుతున్నారు. ఇస్లామ్‌లో వారి స్త్రీత్వంపై ఇతరుల చూపులు, మీడియా కన్నులు ఏవీ పడే అవకాశం లేదు, భద్రమైన వాతావరణం ఉంటుంది కాబట్టే పాశ్చాత్య సమాజాలకు ఆందోళన కలుగుతుంది.

ఈ భౌతికవాద సమాజాలు మాట్లాడే స్త్రీ స్వేచ్ఛ నిజానికి ఒకవిధంగా స్త్రీల శరీరాలను

వాడుకునే దౌర్జన్యం తప్ప మరేమీ కాదు. ఇది స్త్రీల మానమర్యాదలను మంటగలుపడమే. పాశ్చాత్య సమాజాలు స్త్రీలను ప్రగతిపథాన నడిపిస్తున్నామని అంటున్నాయి. కాని నిజానికి ఇది ప్రగతి కాదు స్త్రీలను శరీరాన్ని ప్రదర్శించే ఆటవస్తువులుగాను, ఉంపుడుగత్తెలుగాను దిగజార్చడమే సాధించింది. విలాసపురుషులు, సెక్సు మార్కెటర్ల చేతుల్లో సాధనాలుగా ఉపయోగపడుతున్నారు. కళ సంస్కృతి ఫ్యాషన్‌పెరేడ్‌ల మాటున ఇదంతా కొనసాగుతోంది.

నేడు మహిళలకు చెప్పుకోదగిన స్వేచ్ఛ లభించిన వాతావరణంలోను వారికి అత్యంత మౌలికమైన స్వేచ్ఛ లభించకపోవడం విచిత్రం. ఎలాంటి వస్త్రాలు ధరించాలన్న స్వేచ్ఛ వారికి లేదు. చాలా ఆధునిక సమాజాల్లో ఈ స్వేచ్ఛ స్త్రీలకు లభించలేదు. బురఖా ధరించేలా ఎవరినైనా బలవంతం చేయడం అణిచివేత అయితే, బురఖా తొలగించేలా బలవంతం చేయడం అణిచివేత కాదా? సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాత్రతల ధ్వజవాహకులుగా గొప్పలు చెప్పుకునేవారు ఇస్లామ్‌ను అనుసరించేవారిపై బలవంతంగా తాము ఇష్టపడే దుస్తులను ఎందుకు రుద్దుతున్నారు?

హిజాబ్ లేదా బురఖా అనేది ముస్లిమ్ మహిళల వ్యక్తిగత ఇష్టం. ఇతరులు దాన్ని గౌరవించడమే మర్యాద, నాగరికత. ఇతర మతాలు, సంస్కృతులు, వస్త్రధారణకు సంబంధించిన చిహ్నాలను, ఉదాహరణకు క్రయిస్తవ నన్‌లు ధరించే వస్త్రాలు, పాస్టర్ల వస్త్రాలు, డాక్టర్ల ఏప్రానులు, జడ్జీలకు, న్యాయవాదులకు నల్లకోటులు, తలపాగాలు, స్కల్ క్యాప్స్, క్రాస్ గుర్తు ఉన్న లాకెట్లు వగైరాలను మనం చూస్తున్నాం. వీటిని అభ్యంతర పెట్టడం జరగడం లేదు. వీటిని గౌరవిస్తున్నాం. క్రయిస్తవ నన్‌లు ధరించే వస్త్రాలకు బురఖాకు పెద్దగా తేడా ఉండదు. అయినా ఇస్లామీయ హిజాబ్ విషయంలో ఈ ద్వంద్వప్రమాణాలెందుకు. సభ్యతగా, నిండుగా వస్త్రాలు ధరించే ఇస్లామీయ వస్త్రధారణ పట్ల ఈ వైఖరి ఎందుకు?

సహనశీలం అంటే తమలా ఉన్నవారిని మాత్రమే సహించడం కాదు. ఇతరుల ఇష్టాలను కూడా గౌరవించడం. ముఖ్యంగా వారి ఇష్టాలను మనం అర్థం చేసుకోలేకపోయినా, లేదా ఒప్పుకోకపోయినా గౌరవించడమే సహనశీలం. ఆ సహనశీలం ఇక్కడ కనబడుతుందా?

గ్లామర్ ప్రపంచానికి చెందిన అనేకమంది మహిళా సెలబ్రటీలు, సాధారణ మహిళలు కూడా ఈ సోకాల్డ్ స్త్రీస్వేచ్ఛ, భౌతికవాద సంస్కృతి చూపించే భ్రమల పట్ల నిరాశకు గురయ్యారు. అనేకమంది హిజాబ్‌లో సాంత్వన పొందుతున్నారు. అందువల్లనే పాశ్చాత్యదేశాల్లో వేలాది మంది మహిళలు హిజబ్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. బ్రిటీషు మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ మరదలు లారెన్ బూత్, మర్యమ్ జమీలా (మార్గరెట్ మార్కస్), బ్రిటీషు జర్నలిస్ట్ యోన్ రిడ్లీ, మలయాళ కవయిత్రి కమలా సురయ్యా వంటి అనేకమంది

ఇస్లామీయ హిజాబ్‌ను అవలంబించారు. మన దేశంలోను సిఎన్ఎన్ ఐబిఎన్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం చాలా మంది మహిళలు ఈవ్ టీజింగ్ నుంచి భద్రత కోసం, రక్షణ కోసం బురఖాను పాటిస్తున్నారని తెలిసింది.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇస్లామ్ నిర్దేశించిన ప్రకారం తలపై వస్త్రాన్ని ధరించడం వల్ల ముస్లిమ్ మహిళల్లో ఎలాంటి ప్రతికూలభావమూ లేదు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇస్లామీయ సందేశాన్ని ప్రపంచానికి అందించిన పద్నాలుగు వందల సంవత్సరాల తర్వాత నేటికి కూడా మహిళలు గర్వంగా ఈ సభ్యతాయుతమైన, మతపరంగా ప్రత్యేక గుర్తింపు నిచ్చే వస్త్రాధారణ నియమాన్ని పాటిస్తున్నారు. అంతేకాదు, కోట్లాది ముస్లిమ్ మహిళలు ఇష్టపూర్వకంగా ధరిస్తున్న వస్త్రాలివి. పాశ్చాత్యసమాజం వక్రీకరిస్తున్నట్లు బలవంతంగా మహిళలపై రుద్దడం జరగడం లేదు. దైవప్రసన్నత కోసం ఇలాంటి దుస్తులను ధరిస్తున్నారు. కాగా ఇతర సమాజాల్లో మహిళలు ఆ సమాజాలు ఇష్టపడే దుస్తులను ధరిస్తున్నారు.

# హిజాబ్

## నాగరికతకు ప్రగతివికాసాలకు నిదర్శనం

ఎమన్‌కు చెందిన మహిళా కార్యకర్త, 2011 నోబుల్ బహుమతి విజేత తవక్కల్ కార్మన్ చెప్పినంత చక్కగా బహుశా మరెవ్వరు హిజాబ్ ప్రాముఖ్యాన్ని వివరించి చెప్పలేదు. నార్వే రాజధాని ఓస్లోలోని కేపిటల్ హాలులో నోబుల్ బహుమతి ప్రదానోత్సవానికి అబయా ధరించి అంటే బురఖా మాదిరి వస్త్రాలను, తలపై స్కార్ఫ్ ధరించి ఆమె హాజరవ్వడం చూసి అంతర్జాతీయ మీడియా ఆశ్చర్యపోయింది. “మీరు ధరించిన వస్త్రాలు మీ విద్యాజ్ఞానాలకు, మీ మేధోస్థాయికి విరుద్ధమైనవిగా భావించడం లేదా? హిజాబ్ అనేది మహిళల అణిచివేతకు, వెనుకబాటుకు చిహ్నంగా భావించడం జరుగుతుంది కదా ” అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తవక్కల్ జవాబిస్తూ “చరిత్ర ప్రారంభంలో మానవులు దాదాపు నగ్నంగా ఉండేవారు. కాలక్రమంగా ఆలోచనాశక్తి పెరిగింది, ప్రగతివికాసాలు సాధించిన మనిషి దుస్తులు ధరించడం ప్రారంభించాడు. నేడు నేను ఎలా ఉన్నానో, ఏమి ధరించానో అది యుగాల తరబడి మనిషి సాధించిన ప్రగతివికాసాల ఫలితమే కాని మనిషి వెనుకబాటుకు నిదర్శనం కాదు. నగ్నత్వం అన్నది వెనుకబాటుకు చిహ్నం. మానవ ఆలోచనలు ప్రారంభకాలానికి వెనక్కు వెళ్ళుతున్నాయి.” అన్నారు.

# ముస్లిమ్ మహిళలకు సంబంధించి కొన్ని వివాదాస్పద అంశాలు

## ప్రశ్నలు - జవాబులు

### ఇస్లామీయ చట్టాల ప్రకారం వారసత్వ ఆస్తిలో స్త్రీ వాటా పురుషుడి వాటకు సగంగా ఎందుకు నిర్ణయించారు ?

ఇస్లామ్‌కు ముందు అరబ్బు సమాజంలో కేవలం కుమారులకే ఆస్తి హక్కు ఉండేది. దివ్యఖుర్ఆన్ కుమార్తెలకు కూడా హక్కు కల్పించింది. తండ్రుల నుంచి కుమారులకు లభించే వాటాలో సగం వాటా కుమార్తెలకు కూడా లభించేలా చేసింది. అప్పటి కాలంలో ఇది విప్లవాత్మకమైన మార్పు. అప్పటి సమాజంలో స్త్రీలే ఆస్తిగా ఉండేవారు. తండ్రుల నుంచి ఆస్తిగా కుమారులకు లభించేవారు. అలాంటి వాతావరణంలో స్త్రీకి ఆస్తి హక్కు కల్పించడమంటే, ఆమెను స్వతంత్ర వ్యక్తిగా గుర్తించడం, ఆర్థికంగా వారికి సాధికారత కల్పించడం.

దివ్యఖుర్ఆన్ ప్రకారం తండ్రులు, భర్తలు, కుమారులు చివరకు సంతానం లేని సోదరుల ఆస్తి నుంచి స్త్రీకి వాటా లభిస్తుంది. సన్నిహిత బంధువులకు లభించే వాటాలకు సంబంధించి దివ్యఖుర్ఆన్‌లోని అన్నిసా సూరాలో (11, 12, 176 వాక్యాలు) ప్రస్తావన ఉంది. ఈ అధ్యాయంలో అల్లాహ్ ఆస్తిలో పిల్లల హక్కు, తల్లిదండ్రులు, జీవనభాగస్వామి అందరి హక్కులను నిర్దేశించాడు. మానవసహజమైన భావావేశాలకు, నిర్ణయాలకు ఇక్కడ అవకాశమే లేదు. ఎవరి వాటా ఎంతన్నది దేవుడే నిర్దేశించాడు. మానవ అవసరాలకు సంబంధించి సృష్టికర్తకు మించిన పరిజ్ఞానం ఎవరికీ ఉండదు. ఆయనే స్వయంగా సమతులమైన వారసత్వ వాటాలు నిర్ణయించాడు.

తండ్రి ఆస్తిలో పురుషులు పొందే వాటాలో సగం మాత్రమే స్త్రీలకు లభిస్తుందనడం నేటి ఆధునిక నేపథ్యంలో చూస్తే అన్యాయంగా కనిపించవచ్చు. కాని దీని వెనుక కారణం

ఉంది. స్త్రీకి వారసత్వ హక్కు తల్లిదండ్రుల ఆస్తిలో ఉంది, భర్త ఆస్తిలో ఉంది, పిల్లల ఆస్తిలో ఉంది, సంతానం లేని సోదరుల ఆస్తిలో ఉంది. అరేబియాలో 7వ శతాబ్ధం నాటి సమాజంలో ప్రవక్త ముహమ్మద్ ద్వారా ఇస్లామ్ చేపట్టిన ఈ చర్య అత్యంత విప్లవాత్మకమైనది. స్త్రీని ఆస్తులకు యజమానిగా చేయడం, ఆస్తులను అదుపు చేయడం, నిర్వహించడం, ఖర్చు చేయడం, పెట్టుబడి పెట్టడం ఆమె ఇష్టప్రకారం జరిగే చట్టాలు తీసుకురావడం అప్పట్లో పెద్ద విప్లవం. ఊహాతీతమైన విషయం. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని పరిశీలించాలి. కుమార్తెలకు సోదరులకు లభించే వాటాలో సగమే లభిస్తుందన్న దృష్టితో కాకుండా, అన్నదమ్ములకు లభిస్తున్న దాంట్లో సగం భాగం అక్కాచెల్లెళ్ళకు కూడా లభిస్తుందన్న దృష్టితో చూడాలి. ఈ దృష్టితో చూస్తే ఈ చర్యను అభినందించకుండా ఉండలేం.

ఇప్పుడు మనం స్త్రీలకు లభిస్తున్న వాటా సగమే ఎందుకు ఉందన్నది పరిశీలిద్దాం. ముందుగా మనం స్త్రీలు పోషించే పాత్రను కూడా చూడాలి. సమాజంలో మహిళలు నిర్వహించే పాత్రను పరిశీలిసే దివ్యఖుర్‌ఆన్ మహిళలకు నిర్దేశించిన పాత్ర కూడా అన్యాయమైనది కాదు. ఆర్థికంగా మహిళల బాధ్యతలు పురుషుల బాధ్యతల కన్నా చాలా తక్కువ. కుటుంబ పోషణా భారాన్ని ఇస్లామ్ పురుషులపైనే పెట్టింది. భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల బాధ్యత పురుషులపైనే ఉంది. ఈ పోషణ ఖర్చులను భరించవలసింది వారే. వారి వసతికి, వస్త్రధారణకు ఇతర ఖర్చులను భరించవలసంది వారే. పిల్లల విద్యాభ్యాసానికి, పెళ్ళిళ్ళకు ఖర్చు చేయవలసింది వారే. ఆ విధంగా ఈ ఖర్చులన్ని చేయవలసిన అవసరం స్త్రీలపై లేదు. ఈ పరిస్థితి దృష్ట్యా తండ్రి ఆస్తిలో కుమారుడికి లభించే వాటాలో సగమే కుమార్తెకు లభించడంలో అన్యాయమేమీ లేదు. ఇది న్యాయమైన పంపిణీ. మనం స్త్రీ పోషించే వివిధ పాత్రలను పరిశీలిస్తే, తండ్రుల వద్ద కుమార్తెలుగా ఉంటారు. భర్త వద్ద భార్యగా ఉంటారు. కుమారులకు తల్లిగా ఉంటారు. ఎక్కడ ఉన్నా వారిపై ఆర్థికమైన భారం ఏదీ లేదు. కాబట్టి వారికి లభించిన వాటా సరయినదే.

కాబట్టి లింగవివక్ష అన్న ఆరోపణకు ఇక్కడ అవకాశమే లేదు. ఇక్కడ ఇస్లామ్ స్త్రీపురుషులకు విధించిన ఆర్థిక బాధ్యతలకు, ఆస్తిలో వాటకు మధ్య చక్కని సమతుల్యాన్ని నిలబెట్టింది. స్త్రీలు తమ సంపదను, ఆస్తులను దాచుకోవచ్చు, పెట్టుబడి పెట్టి సంపాదించుకోవచ్చు ఖర్చు చేయవలసిన అవసరం లేదు. కాని పురుషులు తమ సంపదను, ఆదాయాన్ని భార్యపిల్లల కోసం ఖర్చు చేయడం తప్పనిసరి. ఇవన్నీ కాక వివాహసమయంలో పురుషుడు తన భార్యకు మెహర్ చెల్లించవలసి ఉంటుంది. మెహర్‌పై సర్వహక్కులు ఆమెకే ఉంటాయి.

ఎవరన్నా చనిపోయిన వ్యక్తికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారనుకుందాం. కుమారుడు తనకు లభించిన వాటా నుంచి తన భార్యకు మెహర్ చెల్లించవలసి ఉంటుంది. కుటుంబాన్ని పోషించడానికి ఖర్చు చేయవలసి ఉంటుంది. తన సోదరికి పెళ్ళయ్యే వరకు పోషించవలసి ఉంటుంది. తాను పనిచేసి అదనపు సంపాదన కోసం ప్రయత్నించవలసి ఉంటుంది. కాని అతడి సోదరికి లభించిన వాటా నుంచి మెహర్‌గా ఎలాంటి ఖర్చు లేదు. కుటుంబ పోషణా భారం ఆమెపై లేదు. ఆమె తన వాటాను పెట్టుబడిగా పెడితే మరింత పెరగవచ్చు. ఆమె పెళ్ళి జరిగితే భర్త నుంచి మెహర్‌గా ఆమెకు సొమ్ము లభిస్తుంది. పెళ్ళి తర్వాత ఆమె బాగోగులు చూడవలసిన బాధ్యత భర్తపై ఉంటుంది. ఆమెపై ఎలాంటి ఆర్థిక బాధ్యతలు పడడం లేదు. నిజం చెప్పాలంటే ఇస్లామ్‌లో మహిళల పట్ల పక్షపాతం కనబడుతుంది.

## పాశ్చాత్యదేశాలన్నింటా మహిళలకు ఓటుహక్కు లభించింది. చాలా ముస్లిమ్ దేశాల్లో ఇంకా మహిళలకు ఓటు హక్కు ఎందుకు లభించలేదు?

ప్రజాస్వామిక వ్యవస్థలున్న ముస్లిమ్ దేశాలన్నింటా స్త్రీపురుషులకు సమాన హక్కులు ఉన్నాయి. ఓటు వేయడానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి హక్కులు ఉన్నాయి. మహిళలు ఓటు వేయడమే కాదు దేశాధినేతలుగా కూడా పనిచేశారు. టర్కీలో 1993 నుంచి 1996 వరకు టాన్సు సిల్లర్ ప్రధానిగా ఉన్నారు. బంగ్లాదేశ్‌లో 1991 తర్వాతి నుంచి ఇద్దరు మహిళలు దేశాధినేతలుగా పాలిస్తున్నారు. పాకిస్తాన్‌లో బెనజీర్ బుట్టో రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. అతిపెద్ద ముస్లిమ్ దేశం ఇండోనేషియాలో మేగావతి సుకర్ణోపుత్రి నాలుగేళ్ళు అధ్యక్షురాలిగా పాలించారు. గల్ఫ్‌లో ఉన్న ఆరు దేశాల్లో మాత్రమే రాజరిక వ్యవస్థ ఉంది. అక్కడ స్త్రీలకే కాదు పురుషులకు కూడా ఓటు హక్కు లేదు. అయితే కువాయిత్‌లో ఎన్నికైన పార్లమెంటు ఉంది. ఆ పార్లమెంటు ఎన్నికల్లో మహిళలు కూడా ఓటు వేయవచ్చు, పోటీ చేయవచ్చు. కాని కువాయితీ పార్లమెంటుకు ఉన్న అధికారాలు చాలా తక్కువ. పార్లమెంటు నిర్ణయాలను అమీర్ (రాజు) రద్దు చేయవచ్చు. సౌదీ అరేబియాలో ప్రజాస్వామిక ప్రక్రియ పౌరసంస్థల్లో ప్రారంభమైంది. ఆరంభదశలో ఉంది కాబట్టి ఇప్పుడు కేవలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు లభించింది. మహిళలకు కూడా ఓటు హక్కు ఇస్తామని వాగ్దానం చేశారు. ఈ గల్ఫ్ రాజ్యాల్లోను త్వరలోనే మహిళలకు ఓటువేసే హక్కుతో పాటు ఎన్నికల్లో

పోటీ చేసే హక్కులు కూడా లభించవచ్చు, ఎందుకంటే ప్రజాస్వామిక ప్రక్రియ ప్రారంభించాలన్న ఒత్తిడి నానాటికీ అక్కడ అధికమవుతోంది. మహిళలకు ఓటు హక్కు రావాడానికన్నా ముందు అక్కడ ప్రజాస్వామ్యం బలపడవలసిన అవసరం ఉంది. ఇక్కడ గమనించవలసిన వాస్తవమేమంటే చాలా పాశ్చాత్య దేశాల్లో గత శతాబ్దంలోనే మహిళలకు ఓటు హక్కు లభించింది.

రాజరికం అనేది కేవలం ముస్లిమ్ రాజ్యాల్లో మాత్రమే ఉందనుకుంటే పొరబాటు. చైనా ఒక ప్రపంచశక్తిగా ఎదిగినప్పటికీ నేటికి కూడా కమ్యునిస్టు పార్టీ నియంతృత్వంలోనే ఉంది. అక్కడ ఎవరికీ ఓటు హక్కు లేదు.

ఇక ఇస్లామ్ విషయానికి వస్తే రాజకీయ సలహా సంప్రదింపుల్లో స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి తేడా పాటించదు. ప్రవక్త ముహమ్మద్ స్వర్గస్థులైన తర్వాత ఖలీఫాల పాలనలో సలహామండలితో సంప్రదింపుల తర్వాతనే ఖలీఫా నియామకం జరిగేది. ఈ సలహామండలిలో స్త్రీపురుషులందరూ ఉండేవారు. ఖలీఫా నియామకం జరిగిన తర్వాత స్త్రీపురుషులు అందరూ ఆయనకు విధేయంగా ఉంటామని ప్రతిజ్ఞ చేసేవారు.

ఇస్లామీయ చరిత్ర ప్రారంభదినాలను పరిశీలిస్తే మూడవ ఖలీఫా ఎన్నిక ప్రక్రియలో ప్రవక్త సహచరుల్లో ఒకరైన అబ్దుర్రహ్మాన్ ఔఫ్ మదీనాలోని ప్రతి వ్యక్తి అభిప్రాయాన్ని సేకరించారు. ఇస్లామీయ రాజ్యాధినేతగా ఎవరిని ఇష్టపడుతున్నారో తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన మదీనాలో నివసించే ప్రతి మహిళను అడిగి ఆమె అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అంతేకాదు, యువత అభిప్రాయాన్ని కూడా సేకరించారు. ఆ తర్వాత ఫలితాన్ని ఇలా ప్రకటించారు.

> "నేను మదీనాలో ఉన్న ప్రతివ్యక్తి అభిప్రాయాన్ని సేకరించాను. స్త్రీలు, పురుషులు యువకులు అందరి అభిప్రాయాలు తెలుసుకున్నాను. అందరూ హజ్రత్ ఉస్మాన్ కు హజ్రత్ అలీ కన్నా ప్రాధాన్యత ఇచ్చారు."

దీన్ని బట్టి మనకు తెలిసేదేమంటే, ఇండ్లలో ఉన్న మహిళలను కూడా సంప్రదించడం జరిగింది. కాబట్టి మహిళలకు ఓటు హక్కును నిరాకరించడం అన్నది ఇస్లామ్‌లో లేదు. అంతేకాదు, ప్రవక్త సహచరుల ఆచరణలకు ఇది పూర్తిగా విరుద్ధం.

ఇస్లామ్ తర్వాత రెండు శతాబ్దాలకు మహిళల హోదాను దిగజార్చడం ప్రారంభమయ్యింది. చివరకు ద్వితీయశ్రేణి పాత్రకు పరిమితమయ్యేలా చేశారు.

## స్త్రీ విద్య, డ్రయివింగ్ చేసే హక్కు

ముస్లిమ్ స్త్రీలకు విద్యాభ్యాసం చేసే అవకాశాలు ఇవ్వరని, వారిని స్కూలుకు వెళ్ళనీయరని, ఉన్నత చదువులకు పంపించరనీ, కొన్ని దేశాల్లో వారికి డ్రయివింగ్ చేసే హక్కు లేదని వాదించేవారు ఉన్నారు. నిజం చెప్పాలంటే దీనికి ఇస్లామీయ షరిఅత్‌కు ఏమన్నా సంబంధం ఉందా?

విద్యార్జన చేసే హక్కును నిరాకరించడం అనేది ఇస్లామ్‌లో లేనే లేదు. నిజానికి స్త్రీపురుషులందరూ విద్యను అభ్యసించాలని ప్రోత్సహించడం జరిగింది. విద్యాజ్ఞానాలు పొందడం ముస్లిమ్ పురుషులకు, ముస్లిమ్ స్త్రీలకు తప్పనిసరి విధిగా ప్రవక్త ముహమ్మద్ చెప్పారు. చాలా గల్ఫ్ దేశాల్లో, ఈజిప్టులో యూనివర్శిటీల్లో పురుషుల కన్నా స్త్రీలే అధికంగా ఉంటారు. సాధారణ ప్రజల్లో కూడా పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువ మంది పట్టభద్రులు కనబడతారు. గత కొన్ని దశాబ్దాల్లో కల్పించిన సౌకర్యాలు, సదుపాయాల వల్ల కూడా ఇది సాధ్యమయ్యింది. అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ ఛాందసవాదులు మాత్రమే బాలికల స్కూళ్ళను పేల్చివేశారు. తాలిబాన్‌లు చెప్పే వాదనను ఇస్లామీయ ప్రపంచంలో ఎవరూ అంగీకరించడం లేదు.

ఇక స్త్రీలకు డ్రయివింగ్ చేసే అనుమతి విషయానికి వస్తే, ఒక్క సౌదీ అరేబియాలోనే ఇలాంటి పరిస్థితి ఉంది. సౌదీ అరేబియాలో రాజరిక వ్యవస్థ ఉంది. స్త్రీలకు డ్రయివింగ్ లైసెన్సులు ఇవ్వడం వల్ల స్త్రీపురుషులు స్వేచ్ఛగా కలగలిసిపోయే వాతావరణం ఏర్పడుతుందని అక్కడి పాలకులు సంకోచిస్తున్నారు. కాని నిజానికి దీనికి ఇస్లామీయ షరిఅత్‌కు సంబంధం లేదు. ఇస్లామ్ స్త్రీలు వాహనాలు స్వారీ చేయరాదని నిషేధించలేదు. ప్రవక్త కాలంలో స్త్రీలు గుర్రాలపై, ఒంటెలపై ప్రయాణాలు చేసేవారు. దీన్ని బట్టి స్త్రీలు వాహనాలు నడుపడంపై ఎలాంటి ఆంక్షలు లేవని అర్థమవుతుంది. స్త్రీపురుషుల కలివిడితనం పెరిగిపోతుందన్న భయంతో స్త్రీలు వాహనాలు స్వయంగా ఉపయోగించకుండా అడ్డుకోవడం సముచితం కానేకాదు. ఇలాంటి పనులకు పాల్పడుతున్న దేశం ఏదైనా కాని స్వంత నిర్ణయాలతో ఈ పనికి పాల్పడుతుంది. ఈ నిర్ణయాలు ఇస్లామీయ షరిఅత్‌కు వ్యతిరేకమైనవి. ఇలాంటి ఆంక్షలకు ఇస్లామ్‌ను నిందించడం సముచితం కాదు.

# బహుభార్యత్వం - ఏకపత్నీవిధానం

బహుభార్యత్వం అంటే పురుషుడు ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండడం. ఒకే భార్యను కలిగి ఉండడాన్ని ఏకభార్య విధానంగా చెప్పుకోవచ్చు

## బహుభార్యత్వం - పాశ్చాత్యులకు ఆయుధం

అజ్ఞానంతో కొందరు ప్రవక్త ముహమ్మద్ అనేక వివాహాలు చేసుకున్నారని విమర్శిస్తూ ఉంటారు. ఇలాంటి విమర్శలు చేసేవారు ఆ వివాహాల స్వభావం, లక్ష్యం వగైరాల గురించి ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడుతుంటారు. ఈ విమర్శల వెనుక ఎలాంటి చారిత్రక ఆధారాలు కూడా ఉండవు. హేతుబద్ధమైన వాదనలు కూడా ఉండవు.

కేవలం అజ్ఞానం, మతపరమైన వివక్ష, ఇస్లామ్ ప్రవక్త పట్ల విద్వేషం, ప్రవక్త చూపించిన జీవనవిధానం పట్ల వైరాలతో ఈ విమర్శలు చాలా మంది చేస్తుంటారు. మానవ సంస్కృతీ నాగరికతలకు ప్రవక్త ముహమ్మద్ చేసిన సేవలు మరుగున పడేలా చేయడానికి ఈ వివాదాన్ని ఈ విమర్శలను అప్పుడప్పుడు లేవనెత్తడం జరుగుతుంటుంది.

అన్నింటికన్నా ముందుగా మనం గుర్తించవలసిన వాస్తవమేమంటే ఒకే భార్య కలిగి ఉండాలన్న వాదన పాశ్చాత్యసమాజాలు ఒక నైతిక ఆయుధంగా చేపట్టాయి. ఇది ఇటీవలి పరిణామం. మధ్యయుగాల్లో ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో బహుభార్యత్వం అనేది విస్తృతంగా ఉండేది. సాంఘీక హెూదా చాటుకోడానికి పురుషులు వందలాది భార్యలను కలిగి ఉన్న సంఘటనలు ఉన్నాయి. ఒక్క క్రీస్తు తప్ప, ఆయన బ్రహ్మచారి, చాలా మంది ప్రవక్తలు భార్యలను కలిగి ఉన్నారు. చివరకు సాధుసంతులు కూడా ఉంపుడుగత్తెలను కలిగి ఉండేవారు.

ఇస్లామ్‌కు ముందు అరబ్బు సమాజంలో స్త్రీలను పశువుల్లా చూసేవారు. తండ్రులు ఆడశిశువులను సజీవంగా సమాధి చేసేవారు. సామాజిక వెసులుబాటు కోసం వివాహ

ఒప్పందాలు చేసుకునేవారు. విడాకులనేవి మామూలు వ్యవహారాలుగా ఉండేవి.

నేటి పాశ్చాత్య సమాజంలో లైంగిక విశృంఖలత్వం, అనేకమందితో యథాలాపంగా సెక్సులో పాల్గొనడం చాలా మామూలు విషయం.

నేటికి కూడా ప్రాచ్య, పాశ్చాత్య దేశాలన్నింటా ముస్లిములు, ముస్లిమేతరులు అందరిలోను బహుభార్యత్వం కనబడుతుంది. కొన్ని చోట్ల ఇది చట్టబద్ధంగాను, కొన్ని చోట్ల చట్టవిరుద్ధంగా దొంగచాటుగాను నడుస్తోంది. పెళ్ళయిన పురుషులు ఉంపుడుగత్తెలను ఉంచుకోవడం, మరో ఆడదానితో ఉండడం, లేదా అప్పుడప్పుడు లైంగిక సంతృప్తి కోసం ఇతర స్త్రీలతో వెళ్ళడం ఎక్కడ ఎక్కువగా నడుస్తుందో, ఎలా నడుస్తుందో తెలుసుకోడానికి ఎక్కువ శ్రమ పడనవసరం లేదు. ఈ అభినవ నైతికవాదులు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బహుభార్యత్వం అనేది ఏదో ఒక రూపంలో ప్రతిచోట ఉంది.

## యూదమతంలో బహుభార్వత్వం

బైబిల్, తల్మూద్ కాలాల్లో ప్రాచీన ఇస్రాయిలీలు బహుభార్యత్వం పాటించేవారని తెలుస్తోంది. కొందరికి వందలాది భార్యలు ఉండేవారు. తల్మూద్ చట్టం, మూసాచట్టాలు బహుభార్వత్వాన్ని ప్రోత్సహించాయి. చాలా మంది ప్రవక్తలకు ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలు ఉండేవారు. వికిపీడియా ప్రకారం అబ్రహం ప్రవక్తకు ఇద్దరు భార్యలున్నారు. (సారా, హాజిరా). ప్రవక్త సోలోమన్‌కు ఏడువందల మంది భార్యలుండేవారు. వీరు కాక మరో మూడువందల మంది ఉంపుడుగత్తెలు ఉండేవారు. జాకబ్ ప్రవక్తకు నలుగురు భార్యలు. డేవిడ్ ప్రవక్తకు ఎనిమిదిమంది భార్యలు. మోసెస్ ప్రవక్తకు నలుగురు భార్యలు (సఫైర్, గిబ్షియా, బింతెకిని, బింతె హుబాబ్)

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ప్రకారం "సాధారణ యూదు నలుగురు భార్యలను పెళ్ళాడవచ్చు. మహారాజయితే ఎనిమిదిమంది భార్యలను కలిగి ఉండవచ్చు."

యూదమతంలో బహుభార్వత్వం రబ్బీ గెర్షామ్ బిన్ యహూదా కాలం (కామన్ ఎరా 960 నుంచి 1030) వరకు కొనసాగింది. రబ్బీ గెర్షామ్ బహుభార్యత్వానికి వ్యతిరేకంగా ఒక ఉత్తర్వు జారీ చేశాడు. యూదుల్లో సెఫార్డిక్ వర్గాలు బహుభార్వత్వాన్ని 1950 వరకు కొనసాగించాయి. ఇస్రాయీల్ లోని ప్రధాన రబ్బి కార్యాలయం బహుభార్యత్వాన్ని నిషేధించేవరకు ఇది కొనసాగింది.

యూదమతం, క్రయిస్తవ మతాలు ఏకపత్నీ విధానానికి కట్టుబడిన మతాలని చెప్పడం,

బహుభార్యత్వాన్ని వ్యతిరేకించిన మతాలని చెప్పడం పొరబాటు. నేటికి కూడా కొందరు ప్రముఖ యూద పండితుల రచనలు పరిశీలిస్తే ఈ వాస్తవం తెలుస్తుంది. ఉదాహరణకు యస్.డి.గోటిన్ రాసిన "యూదులు–అరబ్బులు" పుస్తకం, ఎన్.టి. హాబ్‌హౌస్ రాసిన "మరాల్స్ ఇన్ ఇవాల్యూషన్" పుస్తకం, ఇ.ఏ.వెస్టర్‌మార్క్ రాసిన "ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ మ్యారేజ్" తదితర రచనల ద్వారా ఈ వాస్తవాలు తెలుస్తున్నాయి. బహుభార్యలున్న యూద ప్రవాసుల వల్ల ఇస్రాయీల్ అధికారులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ రచనల ద్వారా తెలుస్తుంది. క్రయిస్తవ మార్మన్ల గురించి అందరికీ తెలిసిందే. ఆఫ్రో ఆసియన్ బిషప్స్ దృష్టిలో వ్యభిచారం, భార్యల మార్పిడి, ఫోర్నికేషన్‌ల కన్నా బహుభార్యత్వం మెరుగైనది.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే కఠినంగా ఏకపత్నీ విధానాన్ని అమలు చేయడానికి, వ్యభిచారం, హెూమోసెక్సువాలిటీ, అక్రమ సంబంధాలు, లైంగిక విశృంఖలత్వం వంటివి పెరగడానికి మధ్య సంబంధం ఉంది. గ్రీక్ రోమన్, యూద క్రయిస్తవ నాగరికతల చారిత్రక రికార్డులు పరిశీలిస్తే ఈ వాస్తవం మరింత స్పష్టంగా బోధపడుతుంది. కుటుంబ వ్యవస్థకు సంబంధించిన సోషియోలాజికల్ చరిత్ర చదివినా ఇది తెలుస్తుంది.

## క్రయిస్తవంలో బహుభార్వత్వం

బైబిల్ కాలంలో బహుభార్వత్వం సర్వసాధారణంగా ఉండేది. జీసస్ ప్రవక్త కూడా బహుభార్యత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన దాఖలా లేదు. ధార్మికంగా, సాంఘీకంగా, నైతికంగా బహుభార్యత్వం ఆమోదం పొందింది. ఎక్కడా ఎలాంటి అభ్యంతరాలు అప్పట్లో లేవు. అందువల్లనే బైబిల్‌లో ఈ విషయమై ఎలాంటి ప్రస్తావన మనకు కనబడదు. బైబిల్ బహుభార్యత్వాన్ని నిషేధించడం కాని, క్రమబద్దం చేయడం కాని, నియంత్రిచడం కాని ఏమీ చేయలేదు. బైబిల్‌లోని పదిమంది కన్యల కథను కొందరు ప్రస్తావిస్తూ, ఈ కథ ద్వారా పదిమంది భార్యలను పెళ్ళాడే అనుమతి బైబిల్ ఇచ్చిందని కూడా చెబుతారు. ఈ విషయానికి సంబంధించి బైబిల్‌లోని ప్రవక్తలు, రాజులు తదితరుల కథల్లోని విషయాలు నమ్మశక్యం కావు.

క్రయిస్తవ రాజులు ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలను పెళ్ళాడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రెడరిక్ విల్‌హమ్ 2, ఫిలిప్‌లు ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలను చర్చి అనుమతితో వివాహం చేసుకున్నారు. తక్కువ జనాభా సమస్యను పరిష్కరించడానికి 1650లో జరిగిన న్యూరెంబర్గ్ సమావేశంలో బహుభార్యత్వాన్ని పాటించాలని నిర్ణయించారు.

ఇటీవల అంటే 17వ శతాబ్దం వరకు క్రయిస్తవ చర్చి బహుభార్యత్వాన్ని ఆమోదించడమే కాదు ఆచరణ కూడా ఉండేది. మార్మన్లు (చర్చి ఆఫ్ జీసస్ క్రీస్ట్ ఆఫ్ ది లేటర్ డే సెయింట్స్) బహుభార్యత్వాన్ని ఆమోదించారు, బహుభార్యత్వాన్ని పాటించారు.

దీన్ని బట్టి అన్ని కాలాల్లోను అన్ని జాతుల్లోను బహుభార్యత్వం చట్టబద్ధంగా ఆమోదం పొందిందని తెలుస్తోంది. యూద ప్రవక్తలకు అనేకమంది భార్యలు ఉండేవారు. జీసస్ ప్రవక్త కూడా దీన్ని నిషేధించలేదు.

పాల్ కాలంలో క్రయిస్తవంలో ఏకపత్నీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ కాలంలో క్రయిస్తవంలో అనేక మార్పులు వచ్చాయి. గ్రీకో రోమన్ సంస్కృతిని పాటించడానికి ఈ మార్పు తెచ్చారు. గ్రీకోరోమన్ సంస్కృతిలో పురుషులు ఏకపత్నీ విధానాన్ని పాటించేవారు. ఒకే భార్య ఉండేది కాని అసంఖ్యాకంగా ఆడబానిసలు ఉండేవారు. ఈ బానిసలను ఎలాగైనా వాడుకునే హక్కు వారికి ఉండేది. అంటే ఇది మరోరకమైన బహుభార్యత్వం.

క్రయిస్తవం ప్రారంభదినాల్లో స్త్రీని పాపాలపుట్టగా భావించేవారు. అందువల్ల పురుషుడు పెళ్ళి చేసుకోకపోవడమే ఉత్తమమనుకునేవారు. కాని పెళ్ళి, పునరుత్పత్తి లేకపోతే మానవాళి కొనసాగింపు ఉండదు కాబట్టి, ఒకే ఒక్క భార్యను పెళ్ళాడవచ్చని రాజీ పద్ధతికి వచ్చారు.

## హైందవంలో బహుభార్యత్వం

చరిత్రలో ప్రాచీన కాలం నుంచి బహుభార్యత్వం ఆచరణలో ఉంది. ప్రతి నాగరికతలోను, ప్రతి సమయంలోను ఇది కనబడుతుంది. ప్రాచీన భారతదేశంలో బహుభార్యత్వానికి అనుమతి ఉండడమే కాదు చాలా మామూలు విషయంగా ఉండేది. వికిపీడియా ప్రకారం రుగ్వేదం తదితర ధార్మిక గ్రంథాల్లో అనేకమంది పురాణపురుషులకు బహుభార్యలున్నట్లు తెలుస్తోంది. శ్రీరామచంద్రుని తండ్రి దశరథమహారాజుకు ముగ్గురు భార్యలు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. శ్రీకృష్ణుడికి పదహారువేల మంది భార్యలు. వీరిలో రాధా, రుక్మిణి, సత్యభామ, జాంబవతి, సత్య, లక్ష్మణ, కలింది, భద్ర, మిత్రవింద ముఖ్యులు.

హిందూ ధార్మిక గ్రంథాలు, అవి వేదాలు కాని రామాయణ మహాభారతాలు కాని, భగవద్గీత కాని బహుభార్యత్వాన్ని నిషేధించలేదు. ఈ గ్రంథాల ప్రకారం పురుషుడు ఎంతమందిని కావాలనుకుంటే అంతమందిని పెళ్ళాడవచ్చు.

హిందూ మ్యారేజ్ యాక్ట్ 1955లో అమలులోకి వచ్చింది. ఈ చట్టం వచ్చిన తర్వాత మాత్రమే హిందూ పురుషులు ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండడం చట్టవిరుద్ధమయ్యింది. అంటే హిందూ పురుషుడు ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలు లేకుండా నిషేధిస్తున్నది భారత చట్టం, అంతేకాని హిందూ ధార్మిక గ్రంధాలు ఇలాంటి నిషేధాలేవీ విధించడం లేదు.

## పాశ్చాత్య సమాజాల్లో బహుభార్యత్వం

పాశ్చాత్య సమాజంలో భార్యభర్తల మధ్య పొరపొచ్చలు వస్తే భర్త భార్యను వదిలేసి మరో స్త్రీతో, ఉండడం జరుగుతుంది. ఇది వైవాహికేతర సంబంధం. పాశ్చాత్యసమాజాల్లో మూడు విధాల బహుభార్యత్వం కనబడుతుంది. 1. సీరియల్ పెళ్ళిళ్ళు, అంటే ఒకరిని పెళ్ళాడ్డం విడాకులివ్వడం, మరొకరిని పెళ్ళాడ్డం, వారికి విడాకులిచ్చి ఇంకొకరిని పెళ్ళాడ్డం. ఇలా ఎన్ని సార్లు చేసినా ఎలాంటి అభ్యంతరాలు అక్కడ లేవు. 2. పురుషుడు ఒక స్త్రీని వివాహమాడుతాడు, కాని ఒకరు లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉంపుడుగత్తెలను ఉంచుకుంటాడు. 3. వివాహం కాని పురుషుడు తనకిష్టం వచ్చినంత మంది ఆడవారితో సంబంధాలు కలిగి ఉండడం లేదా ఉంపుడుగత్తెలను కలిగి ఉండడం.

పాశ్చాత్య సమాజం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అక్కడ బహుభార్యత్వం వేరే రూపంలో ఉంది. ప్రముఖ బ్రిటీషు మహిళా హక్కుల కార్యకర్త డా. అనిబిసెంట్ ఈ విషయమై ఏమన్నారంటే :

"పాశ్చాత్య సమాజంలో ఏకపత్నీ విధానమన్న నాటకం ఉంది. కాని అక్కడ బాధ్యతల్లేని బహుభార్యత్వం ఉంది. పురుషుడు తనకు ముఖం మొత్తినప్పుడు ఉంపుడుగత్తెను వదిలేస్తాడు. ఆమెకు మరో దారి లేకపోతే వీధిన పడుతుంది. ఆమె ప్రియుడికి ఆమె భవిష్యత్తు విషయంలో ఎలాంటి బాధ్యత ఉండదు. బహుభార్యత్వం ఉన్న కుటుంబంలో ఉన్న స్త్రీ కన్నా ఇలా ఉంపుడుగత్తెగా బతికే స్త్రీ పరిస్థితి వంద రెట్లు దారుణం. పాశ్చాత్య పట్టణాల్లోని వీధుల్లో రాత్రులు తిరిగే వేలాది దయనీయ స్త్రీలను మనం చూసినప్పుడు ఇస్లామ్‌ను బహుభార్యత్వం విషయంలో పాశ్చాత్యులు విమర్శించడం అర్థం లేని విషయంగా తెలుస్తుంది. వదిలేయబడిన ఉంపుడుగత్తెగా వీధిన పడ్డం, అక్రమసంతానంతో, ఆశ్రయం లేక, ఆదరించేవారు లేక, దారినపోయే ప్రతి పురుషుడికి బలవుతూ ప్రతిరాత్రి గడపడం, మాతృత్వానికి దూరం కావడం, అందరి ఛీత్కారాలు పొందడం కన్నా బహుభార్యత్వంలో ఒక పురుషుడి భార్యగా కుటుంబంలో

ఉండడం, చట్టబద్ధమైన సంతానాన్ని కలిగి ఉండడం, సమాజంలో గౌరవహోదా పొందడం స్త్రీకి ఎంతో ఉత్తమం."

ఇరువురి సమ్మతి ఉంటే, ఇరువురు యుక్తవయస్కులైతే స్వేచ్ఛగా లైంగికచర్యలో పాల్గొనే అవకాశాన్ని పాశ్చాత్య సమాజం కల్పిస్తుంది. దీని వల్ల బాధ్యతలేని లైంగిక సంబంధాలు ఏర్పడుతాయి. తండ్రులు లేని సంతానం ఎక్కువవుతుంది. పెళ్ళికాని తల్లులు ఎక్కువవుతారు. చివరకు ఈ పరిస్థితి దేశ సంక్షేమానికి ఒక భారంగా మారుతుంది.

కొందరు పాశ్చాత్యులు ఏకపత్నీ విధానం వల్ల స్త్రీల హక్కులకు రక్షణ ఉంటుందని వాదిస్తారు. కాని వీరికి నిజంగా స్త్రీల హక్కుల పట్ల ఆందోళన ఉందా? వారి సమాజంలో ఉన్న అనేక ఆచరణలు స్త్రీలను అణిచివేస్తున్నాయి. స్త్రీవిముక్తి ఉద్యమాలకు దారితీస్తున్నాయి. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలోని సఫ్రాగెట్టెస్ మొదలు నేటి ఫెమినిస్టుల వరకు అనేక ఉద్యమాలు వచ్చాయి.

పాశ్చాత్య సమాజాల్లో నిజానికి ఏకపత్నీ విధానం వల్ల పురుషుడికి రక్షణ లభిస్తోంది. బాధ్యతలేకుండా ఇతర స్త్రీలతో ఆడుకునే అవకాశాన్నిస్తోంది.

నేడు గర్భనిరోధం సులభమయ్యింది. అబార్షన్లు చట్టబద్ధమయ్యాయి. సులభమయ్యాయి. ఈ పరిణామాల వల్ల స్త్రీతో అక్రమ లైంగిక సంబంధాలు పెట్టుకోవడం చాలా తేలికయ్యింది. సోకాల్డ్ సెక్సువల్ రివాల్యూషన్ విషవలయంలో స్త్రీలు చిక్కుకుపోతున్నారు. కాని చివరకు అబార్షన్ బాధను భరించేది ఆమెయే. గర్భనిరోధక పద్ధతుల సైడ్ఎఫెక్ట్స్ భరించేది కూడా ఆమెయే. ఇవి కాక లైంగిక వ్యాధులు, హెర్పిస్, ఎయిడ్స్ వంటివి కూడా తప్పడం లేదు. పురుషుడికి ఇలాంటి ఆందోళనలు చాలా తక్కువ.

కాబట్టి ఏకపత్నీ విధానం వల్ల నిజానికి రక్షణ పొందుతున్నది పురుషులే. స్త్రీలు ఈ విధానం వల్ల పురుషుల కామవాంఛలకు మరింత బలవుతున్నారు. పురుషాధిక్యత ఉన్న సమాజాలు బహుభార్యత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. ఎందుకంటే బహుభార్యత్వం ఉంటే ఒకరి కన్నా ఎక్కువ మంది స్త్రీలతో సంబంధాలు ఉన్న పురుషుడు తన బాధ్యతను తప్పించుకోవడం సాధ్యం కాదు. అలాంటి పురుషుడు ఏఏ స్త్రీలతో సంబంధాలు పెట్టుకున్నాడో వారందరి బాధ్యత స్వీకరించవలసి వస్తుంది.

# ఇస్లామ్‌లో బహుభార్యత్వం

ఇక ఇస్లామ్ విషయానికి వస్తే, పాశ్చాత్య సమాజాల్లోను, ప్రాచ్య దేశాల్లోను చాలా మంది ముస్లిము పురుషుడంటే కామవాంఛలతో ఒకరికన్నా ఎక్కువ మంది స్త్రీలను పెళ్ళాడేవాడిగా భావిస్తుంటారు. ఒక ఇల్లు వదిలి ఇంకో ఇంటికి మారినంత సులభంగా లేదా దుస్తులు మార్చినంత సులభంగా భార్యలను మార్చేస్తుంటారన్న భావన కూడ ఉంది. ఈ తప్పుడు భావాలకు మరింత బలమిచ్చేలా సినిమాలు వస్తున్నాయి, టీవీ కార్యక్రమలు వస్తున్నాయి. చవుకబారు కథలు మీడియాలో ప్రచారమవుతున్నాయి. దీనికి కొందరు ముస్లిముల బాధ్యతారహిత వ్యవహారశైలి కొంతవరకు కారణం కావచ్చు.

దురదృష్టవశాత్తు దివ్యఖుర్ఆన్ ఆదేశాలను, ప్రవక్త బోధనలను చాలా మంది ముస్లిమ్ రాజులు పాటించలేదు. రాజులుగా తమకు మినహాయింపు ఇచ్చుకున్నారు. (శిక్షల నుంచి మినహాయింపు). తాము చేసిన పనులకు సమర్ధింపుగా ప్రవక్త ముహమ్మద్ పేర కట్టుకథలు కూడా సృష్టించుకున్నారు. ఫలితంగా ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిత్వానికి తీవ్రమైన నష్టం కలిగించారు. నేడు కూడా ఇస్లామ్‌పై దుమ్మెత్తి పోసేవారికి ఈ కట్టు కథలు ఉపయోగపడుతున్నాయి. దీని ఫలితంగా ఇస్లామ్, ఇస్లామీయ బోధనల్లో ఉన్న సామాజిక వ్యవస్థ, సాంఘీక నిర్మాణాల ఔన్నత్యాన్ని గుర్తించకుండా ఈ కట్టుకథలు అడ్డుపడుతున్నాయి.

ప్రవక్త ముహమ్మద్ ఇస్లామ్ సందేశాన్ని ప్రజలకు అందజేసిన కాలంలో బహుభార్యత్వం అక్కడ సర్వసాధారణంగా ఉండేది. దివ్యఖుర్ఆన్ బహుభార్యత్వ ఆచారాన్ని గమనించకుండా వదిలేయలేదు, అలా అని అకస్మాత్తుగా నిషేధించనూ లేదు, ఈ ఆచారం నియంత్రణ లేకుండా కొనసాగనీయనూ లేదు. బహుభార్యత్వం విషయంలో ఉన్న అయోమయం, బాధ్యతారాహిత్యాలను ఇస్లామ్ పట్టించుకోకుండా వదిలేయలేదు. ఇతర సామాజిక రుగ్మతల విషయంలోను దివ్యఖుర్ఆన్ చాలా సమతుల్యంగా సంస్కరణా ప్రణాళిని అమలు చేసింది. ఈ ఆచారాన్ని సంస్కరించి ఇందులో ఉన్న లోపాలను తొలగించి, మరింత ప్రయోజనాత్మకంగా మార్చింది. సమాజానికి పునాది అయిన కుటుంబ వ్యవస్థలో ఈ లోపాలను దివ్యఖుర్ఆన్ చూడకుండా ఎలా వదిలేస్తుంది.

గమనించవలసిన ముఖ్యమైన విషయమేమంటే ప్రపంచలోని అన్ని ధార్మిక గ్రంథాల్లోను దివ్యఖుర్ఆన్‌కు ఒక ప్రత్యేకత ఉంది.

# " ఒక్కరినే వివాహమాడండి "

అని పురుషులకు చెప్పిన ధార్మిక గ్రంథం ప్రపంచంలో దివ్యఖుర్ఆన్ ఒక్కటే.

దివ్యఖుర్ఆన్ లోని అన్నిసా సూరాలో ఈ ప్రస్తావన వచ్చింది.

> "మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసి గాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి." దివ్యఖుర్ఆన్ (4:3)

దివ్యఖుర్ఆన్ రాకకు ముందు బహుభార్యత్వం అరబ్బు సమాజంలో ఆచరణలో ఉంది. అంతేకాదు, పురుషుడు ఇష్టం వచ్చినంత మంది స్త్రీలను వివాహమాడే అవకాశం ఉండేది. కొందరు వందలాది స్త్రీలను వివాహమాడేవారు. దివ్యఖుర్ఆన్ ఈ సంఖ్యను నాలుగుకు పరిమితం చేసింది. ఒకరికన్నా ఎక్కువ మందిని వివాహమాడాలనుకుంటే అనేక షరతులు కూడా విధించింది. పురుషుడు తన భార్యలందరినీ సమానంగా చూడాలి. ప్రేమాభిమానాల విషయంలోను సమానత్వాన్ని పాటించాలి. ఈ షరతు విధించడంతో పాటు ఇలా చేయడం సాధ్యం కాదన్న హెచ్చరిక కూడా చేసింది.

> "భార్యల మధ్య పూర్తి న్యాయం చెయ్యటం మీ శక్తికి మించిన పని. మీరు ఎంత కోరినా దీనిని సాధించలేరు. కనుక ఒక భార్య వైపునకు ఎక్కువగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి." దివ్యఖుర్ఆన్ (4:129)

వీటితో పాటు భార్య పట్ల మంచిగా వ్యవహరించాలని నొక్కి చెప్పడం జరిగింది. అంటే దివ్యఖుర్ఆన్ ఏకపత్నీ విధానాన్ని ప్రోత్సహించింది. ఇలా ప్రోత్సహించిన మరో ధార్మిక గ్రంథం ఏదీ మనకు కనబడదు. బహుభార్యత్వాన్ని ఒకరకంగా దివ్యఖుర్ఆన్ షరతులు విధించడం ద్వారా, ఆ షరతులు పూర్తి చేయడం సాధ్యం కాదని హెచ్చరించడం ద్వారా చాలా వరకు నిరుత్సాహపరిచింది. నియంత్రించింది. కాని మనిషి ప్రవృత్తి, సామాజిక వ్యవహారాల దృష్ట్యా దివ్యఖుర్ఆన్ బహుభార్యత్వాన్ని ఒక పరిమితి మేరకు అనుమతించింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్లామ్ ఈ అనుమతి ఇచ్చింది. ఈ పరిస్థితులేమంటే :

1. భార్య గొడ్రాలైనప్పుడు. పిల్లలు పుట్టే అవకాశం లేనప్పుడు, భర్త పిల్లలు కావాలనుకుంటే, భార్యకు విడాకులిచ్చి వదిలేసే బదులు, ఆమె ఉండగానే మరో పెళ్ళి చేసుకోవచ్చు. అయితే భర్త రెండవ పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేక, మొదటి భార్య కావాలనుకుంటే భర్త నుంచి విడిపోవచ్చు. బలవంతంగా కలిపి ఉంచడం జరగదు.

2. భార్య దీర్ఘవ్యాధితో బాధపడుతుంటే, ఆమె గృహబాధ్యతలు నిర్వర్తించే పరిస్థితిలో లేకపోతే, ఆమెకు విడాకులిచ్చి వదిలేసే బదులు ఆమె ఉండగానే భర్త రెండవ పెళ్ళి చేసుకోవచ్చు.

3. సమాజంలో స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్య కన్నా ఎక్కువగా ఉంటే బహుభార్యత్వం మంచి పరిష్కారాన్నిస్తుంది. యుద్ధాల తర్వాత ఇలాంటి పరిస్థితి సమాజంలో తలెత్తవచ్చు. పైన పేర్కొన్న దివ్యఖుర్‌ఆన్ వాక్యం ఉహుద్ యుద్ధం తర్వాత అవతరించింది. ఆ యుద్ధంలో అనేకమంది ముస్లిములు హతమయ్యారు. అనేకమంది స్త్రీలు వితంతువులయ్యారు. అనేకమంది పిల్లలు అనాథలయ్యారు. సమాజంలో ఈ స్త్రీలు, పిల్లల బాధ్యత మిగిలిన వారిపై పడింది. ఈ వితంతువులు, అనాథల సమస్యకు బహుభార్యత్వం ఒక పరిష్కారమిచ్చింది.

4. మొదటి, రెండవ ప్రపంచయుద్ధాల్లో పాల్గొన్న దేశాల్లో కూడా ఈ సమస్య వచ్చింది. అక్కడ పురుషుల కన్నా స్త్రీల సంఖ్య ఎక్కువయ్యింది. మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలు జరుగుతున్నప్పుడు, యుద్ధాలు ముగిసిన తర్వాత చాలా దేశాల్లో ఇళ్ళ ముందు “వాంటెడ్ హజ్బెండ్” బోర్డులు దర్శనమిచ్చాయి. ఇలాంటి సమస్యకు చక్కని పరిష్కారం స్తోమత ఉన్న పురుషులు ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలను పెళ్ళాడి వారితో న్యాయంగా, సమానంగా వ్యవహరిస్తూ వారికి రక్షణ కల్పించడం. సమాజంలో పెద్దసంఖ్యలో అవివాహితలు, వితంతువులు ఉండడం కన్నా ఇది ఎంతో ఉత్తమమైన పద్ధతి.

5. వైవాహికేతర సంబంధాలను ఇస్లామ్ కఠినంగా నిషేధించింది. ఇస్లామీయ సమాజంలో ఉంపుడుగత్తెలు, ప్రేయసి వంటి వారు ఉండే అవకాశం లేదు. అనేకమంది ఉంపుడుగత్తెలను ఉంచుకోవడం కన్నా గౌరవప్రదంగా ఒకరికన్నా ఎక్కువమంది స్త్రీలను పెళ్ళాడ్డమే ఉత్తమం. ఆ విధంగా ఇస్లామ్ పురుషుల గౌరవాన్ని కూడా పెంచింది. ఇస్లామ్ ప్రకారం ఎవరు చేసే పనులకు వారే బాధ్యులు. పురుషులు స్త్రీలను విలాసవస్తువులుగా అనుభవించి, తండ్రిగా నిర్వర్తించవలసిన బాధ్యతను నిరాకరించి వెళ్ళిపోవడం కుదరదు. అలా చేయడం అమానుషం, అన్యాయం.

6. ఒకసారి పెళ్ళయి భార్య ఉన్న పురుషుడికి రెండవభార్యగా వివాహానికి సిద్ధం కావలసిన అవసరం ఏ స్త్రీకి లేదు. ఆమెకు ఇష్టం లేకపోతే అలాంటి వివాహాన్ని నిరాకరించవచ్చు. మొదటి భార్య తన భర్త మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి అంగీకరిస్తే, రెండవభార్య కూడా అందుకు అంగీకరిస్తే ఇతరులకు ఈ విషయంలో అభ్యంతరాలేమిటి?

ఒక వ్యక్తి ఇద్దరు స్త్రీలను పెళ్ళాడి అందులో ఒకరిపట్ల ఎక్కువ ప్రేమ మరొకరి పట్ల తక్కువ ప్రేమ చూపితే తీర్పుదినాన ఆ వ్యక్తి శరీరంలో సగభాగం అంగవైకల్యంలా ఒకవైపుకు

వేలాడబడి ఉంటుందని ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. పై వివరాలను పరిశీలిస్తే ఇస్లామ్ ఏకపత్నీ విధానాన్ని ప్రోత్సహిస్తుందని, ప్రత్యేక పరిస్థితుల్లో బహుభార్యత్వానికి అనుమతినిస్తుందని అర్థమవుతోంది. ఇస్లామీయ ధర్మవేత్త అబూహనీఫా (రహ్) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు : "ఒకే భార్య ఉన్న వ్యక్తి ఆనందంగా, సంతృప్తిగా జీవిస్తాడు. ఇద్దరు భార్యలు ఉన్న వ్యక్తి ఇబ్బందులకు, కష్టాలకు గురవుతాడు."

ముస్లిముల్లో అత్యధిక జనాభా ఒకేభార్యను కలిగిన వారే. చాలా కొద్ది మంది మాత్రమే ఒకరికన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉన్నారు. ఈ కొద్దిమందిని చూపించి ప్రాపగాండ శక్తులు చేస్తున్న ప్రచారం ఇస్లామీయ జీవనవిధానాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ఉద్దేశించింది. ఈ ప్రాపగాండలో ఇస్లామ్‌ను అంతగా అనుసరించని ముస్లిములు కూడా రావడంతో సమస్య మరింత పెరుగుతుంది.

సాధారణంగా ముస్లిముల్లో ప్రపంచవ్యాప్తంగా ఏకపత్నీ విధానమే కనబడుతుంది. బహుభార్యత్వం అనేది ఇస్లామ్‌లో తప్పనిసరి నియమం కాదు. ఇది కేవలం ఒక అనుమతి మాత్రమే. కొన్ని షరతులతో కూడుకున్న అనుమతి మాత్రమే. ఇస్లామీయ విశ్వాసానికి బహుభార్యత్వానికి ఎలాంటి సంబంధమూ లేదు. బహుభార్యత్వం పాటించవలసిన తప్పనిసరి అవసరమూ లేదు. కాని ముస్లిములు తప్పనిసరిగా బహుభార్యత్వం పాటించాలన్న దురభిప్రాయం, అపోహ చాలా మంది ముస్లిమేతరుల్లో కనబడుతుంది.

బహుభార్యత్వాన్ని కనిపెట్టింది ఇస్లామ్ కాదు. పైన పేర్కొన్న నియంత్రణలు, షరతులు విధించడం ద్వారా నిజానికి ఇస్లామ్ బహుభార్యత్వాన్ని కట్టడి చేసింది. అయితే బహుభార్యత్వాన్ని పూర్తిగా నిషేధించనూ లేదు, ఎందుకంటే అలా నిషేధించినా అది కేవలం నామమాత్ర నిషేధం అవుతుంది. నేడు మనకు ప్రత్యక్షంగా ఈ వాస్తవం తెలుస్తుంది. బహుభార్యత్వం నిషేధించినా అనేక సమాజాలు ఏదో ఒక రూపంలో దాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయి.

ఇస్లామ్ ఆచరణాత్మకంగా ఆనుసరించదగిన ధర్మంగా ప్రపంచంలోకి వచ్చింది. ఇది కేవలం ఒక సిద్ధాంతం కాదు. ఆచరణసాధ్యం కాని వ్యవహారాలు ఏవీ ఇందులో లేవు. ఇది వాస్తవికమైన ధర్మం. జీవితం గురించి ఇస్లామీయ దృక్పథం యదార్థాలతో కూడుకున్నది. ఆచరణాత్మకమైనది. అందువల్లనే ఇస్లామ్ బహుభార్యత్వానికి షరతులతో కూడుకున్న అనుమతి ఇచ్చింది. ఎందుకంటే, ఈ అనుమతి లేకపోవడం మానవసమాజాలకు ఉత్తమమైనదయితే దేవుడు తప్పక దీన్ని నిషేధించి ఉండేవాడు. దేవుని కన్నా ఎక్కువ జ్ఞానసంపన్నుడు ఇంకెవరు లేరు.

# ప్రవక్త ముహమ్మద్ కుటుంబ జీవనం

ఇస్లామ్ పట్ల విద్వేషం వెళ్ళగక్కేవారు, ఇస్లామ్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్న వారు ప్రవక్త ముహమ్మద్ కుటుంబ జీవనాన్ని లక్ష్యంగా చేసుకోవడం కనబడుతుంది. ప్రవక్త ముహమ్మద్ అనేకమందిని పెళ్ళాడ్డాన్ని ప్రవక్త జీసస్ అవివాహితుడిగా ఉండడంతో పోల్చుతారు. ప్రవక్తలు, పుణ్యపురుషులు బ్రహ్మచర్యం పాటించడమే ఉత్తమమైన పద్ధతనీ, వైవాహిక జీవితం అన్నది సాధారణ ప్రజలు, కోరికలు వాంఛలు ఉన్న సాధారణ జనానికి సంబంధించిన వ్యవహారమన్న భావన ఇందులో కనబడుతుంది.

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులు అనుసరించదగిన జీవనవిధానాన్ని జీవించి చూపారు. ప్రవక్త ముహమ్మద్ అనుచరుల్లో కొందరు చాలా పుణ్యప్రదమైన జీవితం గడుపుతున్నట్లు ఒకసారి చెప్పుకున్నారు. ఒకరు తాను అసలు పెళ్ళే చేసుకోనని అన్నారు. మరొకరు తాను మాంసం తిననని చెప్పారు. మూడవ వారు తాను కటిక నేలపై పడుకుంటానని అనగా నాలుగవ వ్యక్తి తాను ప్రతిరోజు ఉపవాసాలు పాటిస్తానని అన్నారు. ప్రవక్త వారితో *"దేవుడు మాత్రమే అన్ని స్తోత్రాలకు అర్హుడు. నేను పెళ్ళి చేసుకున్నాను. నేను పుణ్యప్రదమైన జీవితాన్నే గడుపుతున్నాను. నేను మాంసం తింటాను, నేను ఉపవాసాలు కూడా ఉంటాను. నేను నిద్ర పోతాను, మేలుకుని ఉంటాను."* అని జవాబిచ్చారు

ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ ఒక ఖచ్చితమైన సమతుల జీవితాన్ని చూపించారు. ఆధ్యాత్మికతను ప్రాపంచిక జీవితంతో కలిపి ఒక సమతుల జీవనాన్ని ఎలా జీవించాలో తెలియజేశారు. భౌతిక సుఖాలకు అయన ఎక్కువ ప్రాముఖ్యమూ ఇవ్వలేదు. ఆధ్యాత్మిక జీవనాన్ని తక్కువ చేయనూ లేదు. ఆయన సంపదను పోగుచేసుకోరాదన్నారు. ప్రపంచ జిలుగువెలుగుల్లో కొట్టుకుపోరాదన్నారు. అలా అని ప్రపంచానికి దూరంగా తాపసుల్లా బతకమనలేదు. ఆయన జీవితాన్ని ప్రపంచం వేరు పరలోకం వేరు అని విభజించలేదు. ప్రవక్త ముహమ్మద్‌కు ప్రవక్త జీసస్‌కు మధ్య ఉన్న ముఖ్యమైన తేడా ఇది. మానవ నడవడిలో అతివాదాన్ని ఇస్లామ్ ఎన్నడూ ప్రోత్సహించలేదు. ఇస్లామ్ ఏకపత్నీ విధానానికి ప్రాధాన్యం

ఇచ్చింది. అయితే కఠినంగా దానికే కట్టుబడాలని చెప్పలేదు. ఇస్లామ్ శాంతికి ప్రాధాన్యం ఇచ్చింది. కాని కొన్ని పరిస్థితుల్లో యుద్ధానికి అనుమతి ఇచ్చింది. ఇస్లామ్ ప్రధాన సందేశం దేవునికి విధేయత చూపడం. ఒకే దేవుని విశ్వసించడం. క్లుప్తంగా చెప్పాలంటే ఇస్లామ్ మనిషి శక్తిసామర్థ్యాలు, అవసరాలు, బలహీనతలు ప్రవృత్తికి అనుగుణంగా మనిషి నడవడిని నియంత్రించే ఏర్పాటు చేసింది. మనిషి స్వభావాన్ని, ప్రవృత్తిని పూర్తిగా మార్చేసే ప్రయత్నాలేవీ చేయలేదు. అలా చేయడం భౌతికంగాను సాధ్యంకాదు, ఆధ్యాత్మికంగా అభిలషణీయం కాదు.

మనిషి ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవనరంగాలను ఇస్లామ్ ఒక్కటి చేసింది. ఈ రెంటి మధ్య ఇస్లామ్ తేడా చూపించదు. మనిషికి ఈ రెండు రంగాల్లోను కావలసిన మార్గదర్శకత్వాన్ని ఇచ్చింది. ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవనాలను వేర్వేరుగా ఇస్లామ్ చూడలేదు. వీటిని వేర్వేరు చేసేలా ప్రోత్సహించనూ లేదు. మనిషికి ప్రాపంచిక అవసరాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక అవసరాలు ఉన్నాయి. మనిషి కోరికలు తీర్చుకునే ప్రమాణాలను ఖచ్చితంగా నిర్దేశించింది. దాటకూడని హద్దులేమిటో చూపించింది. మనిషి సహజ కోరికలు తీరకపోతే, చట్టబద్ధంగా వాటిని తీర్చుకునే మార్గాలు లేకపోతే మానవజీవితంలో కాలుష్యం చోటు చేసుకోవచ్చని ఇస్లామ్ గుర్తించింది. మానవజీవితం నైతికంగా పతనం కావచ్చని గుర్తించింది.

తమ భౌతికావసరాలను నీతిబద్ధంగా తీర్చుకునే అవకాశం ఉన్న వాతావరణంలో ప్రజలు పారదర్శకమైన జీవనాన్ని గడిపే ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఇస్లామ్ నిర్మిస్తుంది. బ్రహ్మచర్యం ముసుగులో వాంఛల విశృంఖలత్వం ఎలా ఉంటుందో, గత సమాజాలను ఎలా పతనం చేసిందో ఇస్లామ్ గుర్తించింది. మోనాస్టరీలలో స్కాండల్స్, ఆశ్రమాలలో అనుచిత కార్యకలాపాల సంఘటనలెన్నో ఉన్నాయి. అలాంటి పరిస్థితులు సమాజంలో తలెత్తకుండా ఉండడానికి ఇస్లామ్ అనుసరించేవారు పెళ్ళి చేసుకోవాలని, కుటుంబ జీవనాన్ని గడపాలని, వైవాహిక బంధం ద్వారా పుట్టే పిల్లలతో మంచి సమాజం ఏర్పాటు కావాలని ఇస్లామ్ కోరుతుంది. వివాహబంధం అనేది చాలా అవసరం కూడాను. దాని ద్వారానే ఆర్థిక బాధ్యతలను నిర్ధారించడం జరుగుతుంది. వ్యక్తులకు వారి విధులు, బాద్యతలు, హక్కులు అధికారాలను నిర్ధారించడం వీలవుతుంది.

ప్రవక్తలు స్వయంగా ఆదర్శ తండ్రులుగా, ఆదర్శ భర్తలుగా జీవించి తమ అనుచరులకు ఉదాహరణలుగా నిలవడం కన్నా సమాజానికి కావలసింది ఏముంది? ఈ నేపథ్యంలో ప్రవక్త ముహమ్మద్ చేసుకున్న వివాహాలను చూడవలసి ఉంటుంది. ఈ వివాహాల్లో పెళ్ళాడిన వారందరూ దాదాపుగా అందరూ వితంతువులే. ఆయన ఒక ఆదర్శ

కుటుంబజీవనాన్ని గడిపి చూపించారు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన వాస్తవమేమంటే ప్రవక్త ముహమ్మద్ తాను మానవమాత్రుడినేనని ప్రకటించారు. మానవసమాజానికి ఆదర్శం కాదగిన అర్హత ఒక మనిషికి మాత్రమే ఉంది. మానవాతీత శక్తులేవీ మానవసమాజాలకు ఆదర్శం కాలేవు. మానవ సహజ కోరికలు, మానవలక్షణాలు, బలహీనతలు లేని వారు దైవదూతలు కావచ్చు, అలాంటి వారిని మనం గౌరవించవచ్చు, పవిత్రంగా చూడవచ్చు కాని అలాంటి వారు మానవగుణగణాలకు ప్రతిరూపం కాలేరు. మానవాతీత శక్తి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. అవాక్కయ్యేలా చేయవచ్చు. గౌరవాదరాలను పొందవచ్చు, కాని ఆచరణసాధ్యమైన నమూనా కాదు. మనిషిలో ఉండే సహజ లక్షణాలు లేనందువల్ల అలాంటి శక్తిని అనుసరించడం సాధ్యం కాదు. అదేవిధంగా, పెళ్ళాడి, కుటుంబ జీవనం గడిపిన ప్రవక్త మాత్రమే మానవాళికి ఆదర్శం కాగలడు. ఎందుకంటే మానవ సహజమైన కుటుంబ జీవనంలో ఉండే సవాళ్ళు, కష్టనష్టాలను ఆయన మాత్రమే అర్థం చేసుకోగలడు, అలాంటి జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎలా అధిగమించాలో ఆచరణాత్మకంగా చూపించగలడు. అలాంటి నాయకుడు మాత్రమే ఇతరులకు ఆదర్శం కాగలడు. సగటు మనిషి ఎదుర్కునే జీవిత సమస్యల్లో ఎలా వ్యవహరించాలో అలాంటి నాయకుడు మాత్రమే గొప్ప ఉదాహరణగా నిలుస్తాడు.

ప్రవక్త ముహమ్మద్ పెళ్ళి చేసుకోనట్లయితే ఆయన ఒక పరిపూర్ణ మానవుడిగా ఆదర్శ నమూనా అయ్యేవారు కాదు. ఒక ఆదర్శ సమాజానికి సంబంధించి ఆయన దృక్పథం అసంపూర్ణంగా మిగిలిపోయేది. ఆయన చూపించిన మార్గదర్శకత్వానికి విశ్వసనీయత లోపించేది. అనుభవంతో కూడుకున్న మార్గదర్శనమే ఆచరించదగ్గదిగా పరిగణనపొందుతుంది. అంతేకాదు, లైంగికజీవనం, కుటుంబజీవనం, సామాజిక జీవనాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి అనుభవం ఉన్న నాయకుడి ఖచ్చితమైన మార్గదర్శనం లేకపోతే సగటు మనిషికి కష్టనష్టాలు ఎక్కువయ్యేవి. ఈ జీవనరంగాల్లో నైతికతను నింపడం అన్నది అసంపూర్ణంగా మిగిలిపోయేది.

# ఇస్లామ్‌లో వితంతు పునర్వివాహం

ఇస్లామ్ బహుభార్యత్వానికి ఎందుకు అనుమతించిందంటే దానికి చాలా కారణాలున్నాయి. వితంతువులు, విడాకులు పొందిన మహిళల పునర్వివాహం కూడా అందులో ఒకటి. ఇది ఏదో ఊహాత్మకమైన కారణం కాదు. వాస్తవాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఇస్లామ్ బహుభార్యత్వానికి ఎందుకు అనుమతించిందో కొన్ని కారణాలను పరిశీలిద్దాం.

ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా ప్రకారం :

"సాధారణంగా ఏ వయసువారిలోనైనా మహిళల కన్నా పురుషుల్లోనే మరణాలు ఎక్కువ"

చాలా రాజకీయ, సాంఘిక కారణాల వల్ల సమాజంలో వితంతువులు, ఆశ్రయం లేని మహిళల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. దీనికి ముఖ్యమైన కారణాలు : యుద్ధాలు, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, నిర్బంధాలు వగైరా

మొదటి ప్రపంచ యుద్ధంలో (1914–1918) దాదాపు 80 లక్షల మంది సైనికులు మరణించారు. చాలా మంది సివిలియన్ సైనికులు కూడా పురుషులే.

రెండవ ప్రపంచయుద్ధంలో (1939–45) దాదాపు 6 కోట్ల మంది మరణించడమో, లేక జీవచ్ఛవాలుగా మారడమో జరిగింది. వీరిలో ఎక్కువ మంది పురుషులే.

ఈరాన్ ఇరాక్ యుద్ధంలో (1979–1988) 82,000 మంది ఈరానీ మహిళలు, దాదాపు 1,00,000 మంది ఇరాకీ మహిళలు వితంతువులయ్యారు. కేవలం పదేళ్ళ కాలంలో జరిగిన దారుణం ఇది.

ప్రమాదాలు జరగని దేశం అంటూ ఏదీ లేదు. ఒక్క భారతదేశంలోనే 2009లో అధికారిక గణాంకాల ప్రకారం ప్రమాదాల్లో 3,60,000 మంది మరణించారు. ఈ మరణాల్లో

77 శాతం మంది పురుషులు కాగా కేవలం 23 శాతం మహిళలు.

సమాజంలో పురుషుల సంఖ్య తక్కువకావడానికి మరో కారణం నిర్బంధాలు. అమెరికాలో బ్యూరో ఆఫ్ జస్టిస్ గణాంకాల ప్రకారం జైళ్ళలో ఉన్నవారి సంఖ్య 1,613,740 మంది. ఇందులో 14,84,641 మంది అంటే 92 శాతం మంది పురుషులే. మహిళలు కేవలం 8 శాతం మాత్రమే 1,29,099. (బ్యూరో ఆఫ్ జస్టిస్ స్టాటిస్టిక్స్, యు ఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్; ప్రిజనర్స్ ఇన్ 2009 బై హీదర్ సి వెస్ట్ అండ్ అదర్స్)

కొందరు ఖైదీలు దీర్ఘకాలిక జైలు శిక్ష లేదా మరణశిక్షలకు గురైనవారు ఉన్నారు. ఒక ఆరోగ్యకరమైన సమాజానికి ఇలాంటి సమస్యల విషయంలో మానవీయమైన పరిష్కారాలు అవసరం. మహిళలకు అవసరమైన హక్కులను కల్పించడం ద్వారా మాత్రమే ఇది సాధించగలం. ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు పెళ్ళి రద్దుచేసుకోవాలని ఇస్లామ్ సిఫారసు చేస్తుంది. కొన్ని తీవ్రమైన శిక్షలకు గురైతే ఉదాహరణకు మూడేళ్ళకు మించిన జైలుశిక్షకు గురైతే ఆ పురుషుడి వివాహం దానికదే రద్దవుతుంది. ఇలాంటి సమస్యలో ఇరుక్కున్న మహిళకు చట్టబద్ధంగా పునర్వివాహం చేసుకునే హక్కు లభిస్తుంది. ఆ విధంగా బహుభార్యత్వం అనేది ఇలాంటి సమస్యల్లో ఉన్న మహిళలను ఆదుకునే సాధనమవుతుంది.

ఇలాంటి సమస్యలు ఎదుర్కునే సమాజం ఒకవేళ బహుభార్యత్వాన్ని నిషేధిస్తే, చట్టబద్ధంగా కేవలం ఒకే ఒక్క వివాహానికి అనుమతిస్తుంటే, ఆ సమాజంలో వితంతువులు, విడాకులు పొందిన మహిళలు ఏం చేయాలి? ప్రకృతిసిద్ధంగా అవసరమైన తోడును ఎక్కడ పొందాలి? వారికి ఎక్కడ సానుభూతి లభిస్తుంది? వారిని అర్థం చేసుకునేవారు, మద్దతిచ్చేవారు, భద్రత కల్పించేవారు ఎవరు? ఈ సమస్య కేవలం శారీరకమైనది మాత్రమే కాదు, ఇది నైతికమైన, సామాజికమైన, భావావేశాల పరమైన సమస్య కూడాను. సాధారణ మహిళ ఎవరైనా ఆమె వ్యాపారం చేస్తున్నా, ఉద్యోగంలో ఉన్నా, ఇంటిలిజెన్స్ డిపార్టుమెంటులో ఉన్నా ఏ స్థాయిలో ఉన్న తనదైన కుటుంబం కావాలని కోరుకుంటుంది. తనదైన ఇల్లు ఉండాలనుకుంటుంది. తన గురించి ఆలోచించి పట్టించుకునే వ్యక్తి కావాలనుకుంటుంది. తాను శ్రద్ధ చూపవలసిన వ్యక్తి కోసం చూస్తుంది. కేవలం శారీరకంగా చూసినా అప్పుడు కూడా అనేక సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మానసిక రుగ్మతలు, డిప్రెషన్లు, సామాజిక ద్వేషం, మానసిక అస్థిరత్వం వంటివి చోటు చేసుకుంటాయి.

సహజమైన కోరికలు, భావావేశాలను గుర్తించాలి. ఒకరికి చెందినవారిగా ఉండడం, ఒకరి పట్ల శ్రద్ధ చూపడం, ఒకరు తన పట్ల శ్రద్ధ చూపాలని కోరుకోవడం వంటి మనోభావాలు పూర్తయ్యే అవకాశం ఉండాలి. ఇలాంటి పరిస్థితిలో ఉన్న మహిళలు ఒక్కసారి దైవదూతల్లా

మారిపోయి ఏకాంతవాస జీవితం గడిపేయాలని చెప్పడం సరికాదు. జీవితాన్ని అనుభవించే హక్కు తమకు కూడా ఉందనే భావిస్తారు. చట్టబద్ధమైన, సక్రమమైన, న్యాయబద్ధమైన పద్ధతిలో ఆ హక్కు లభించకపోతే ఇతర మార్గాలు వెదకడం కష్టమేమీ కాదు. ఈ మార్గాలు ప్రమాదకరమైనవైనా, తాత్కాలికమైనవైనా ఆ మార్గాలపై నడవడం సహజపరిణామం. శాశ్వతమైన, భద్రత ఉన్న పురుష సహవాసం లేకుండా జీవితాన్ని కొనసాగించగలిగిన మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో చిక్కుకున్న మహిళ మానసిక సంతులనం కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. తిరగబడి నైతికనియమాలను ఉల్లంఘించడమూ జరగవచ్చు.

గతంలో కూడా ఎవరైనా మహిళ భర్త చనిపోతే ఆమెను ఒక ఆస్తిగా మరణించిన భర్త సోదరుడికి ఇచ్చేవారు. ఆమె సవతి కుమారులు ఆమె పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించేవారు. భర్త చితిపై భార్యను కూడా దహనం చేసే ఆచారం ఇక్కడ ఉండేది. ఒకవేళ ఆమె జీవించినా ప్రపంచాన్ని త్యజించి జీవితమంతా విషాదంగా గడుపవలసి ఉండేది.

కాని ఇస్లామ్ ఈ విషాదకాలాన్ని కేవలం నాలుగు నెలల పదిరోజులకు పరిమితం చేసింది. వితంతువులు, విడాకులు పొందిన మహిళల విషాదకాలం కేవలం నాలుగు నెలల పదిరోజులు మాత్రమే. దీన్ని నిరీక్షణకాలం లేదా ఇద్దత్ అంటారు. ఆ తర్వాత ఆమె ఎలాంటి అలంకరణలైనా చేసుకోవచ్చు. పునర్వివాహం చేసుకోవచ్చు. దివ్యఖుర్ఆన్ దీనికి అవకాశం కల్పించింది.

> "మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో ... వారి వివాహాలు చేసివేయండి." దివ్యఖుర్ఆన్ ( 24 : 32)

# అపోహలకు గురైన దివ్యఖుర్ఆన్ వాక్యాలు

ఇస్లామ్‌ను విమర్శించేవారు ఎందరు ఉన్నారో ఇస్లామ్ శత్రువులు కూడా అంతేమంది ఉన్నారు. ముఖ్యంగా ఇస్లామ్ ముస్లిమేతరులపై హింసాకాండను ప్రోత్సహిస్తుందని అసత్య ఆరోపణలు చేసేవారు చాలా మంది కనబడతారు. ఇలాంటి ఆరోపణలు ఎక్కువగా వినిపించే దేశాలే నిజానికి మానవత్వం సిగ్గుపడే స్థాయిలో హింసాకాండ కొనసాగించాయి. రెండు ప్రపంచయుద్ధాలకు కారణమైన తర్వాత కూడా వారి తుపాకులు ఇంకా పొగలు కక్కుతూనే ఉన్నాయి. బోస్నియాలో ఊచకోతలు, స్టాలిన్ జరిపిన బీభత్సాలు, జపాన్‌పై అణ్వాయుధ దాడి, ఇరాక్, ఆఫ్గనిస్తాన్; లిబియా, లెబనాన్‌లను సర్వనాశనం చేసిన దాడులు ఇందులో కొన్ని మాత్రమే. ఈ దేశాలు ఇస్లామ్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి ఇక్కడి మీడియా దివ్యఖుర్ఆన్ వాక్యాలను వక్రీకరించడానికి కూడా పూనుకుంది. దివ్యఖుర్ఆన్ వాక్యాలను వక్రీకరించి ఈ వాక్యాలు హింసాకాండను ప్రోత్సహిస్తున్నాయన్న ఆరోపణలకు దిగుతున్నారు. సహజవనరులు పుష్కలంగా ఉన్న వర్ధమాన ముస్లిమ్ దేశాలపై దాడులకు ఈ ఆరోపణలను సాకుగా వాడుకుంటున్నారు.

ముస్లిముల మార్గదర్శనానికి అత్యంత ముఖ్యమైన ధార్మిక గ్రంథం దివ్యఖుర్ఆన్. ఈ ధార్మిక గ్రంథం యావత్తు ఒకేరోజులో లేదా ఒకేసారి అవతరించ లేదన్నది అందరికీ తెలిసిన విషయం. 23 సంవత్సరాల కాలంలో క్రమానుగతంగా ఈ వాక్యాలు అవతరించాయి. మక్కా మదీనా నగరాల్లో ప్రవక్త ముహమ్మద్ వెంట నడుస్తున్న అతికొద్ది మంది అనుచరులకు మార్గదర్శకత్వం ఇవ్వడానికి, ఒక చిన్న సమాజాన్ని అత్యుత్తమ సమాజంగా మలచడానికి ఒక క్రమపద్ధతిలో అవతరించాయి. మక్కా, మదీనా ఈ రెండు నగరాల్లో ప్రజల వైఖరులు వేర్వేరు. అక్కడి పరిస్థితులు కూడా వేర్వేరు. ప్రవక్త ముహమ్మద్ బోధించిన 23 సంవత్సరాల కాలంలో 13 సంవత్సరాలు మక్కాలో గడిపారు. అక్కడ ఆయన అత్యంత తీవ్రమైన వైరాన్ని, విద్వేషాన్ని చవిచూశారు. మక్కాలో ఖురైషులు మొదట ఆయన బోధనలను వ్యతిరేకించారు. తర్వాత ఆ వ్యతిరేకత విద్వేషంగా, వేధింపులు, చిత్రహింసల స్థాయికి చేరుకుంది. చివరకు

ప్రవక్తపై హత్యాప్రయత్నాలు జరిగాయి. ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు మదీనాకు వలసవెళ్ళే పరిస్థితులు వచ్చాయి. అక్కడ శాంతియుతంగా నివసించడానికి ప్రయత్నించారు. వీరిలో కొందరిని మక్కా నుంచి బహిష్కరించడం జరిగింది. తమ కుటుంబాలను, ఇళ్ళువాకిళ్ళను వదిలి వెళ్ళవలసి వచ్చింది. కొందరు ప్రాణభయంతో రాత్రి చీకటిమాటున తరలిపోయారు. కొందరు ధైర్యంగా మదీనాకు వలసపోతున్నామని చెప్పి మరీ వెళ్ళారు. మదీనాలో వారికి చాలా మంది అనుచరులు లభించారు. వారు అంకితభావం, విధేయత కలిగిన అనుచరులు. దేవుడు, దైవప్రవక్త ఆదేశిస్తే తమ ప్రాణాలు కూడా పణంగా పెట్టడానికి వెనుకాడనివారు.

కాని ప్రవక్త ఆయన అనుచరులు మక్కా వదిలి మదీనాకు వలస వచ్చిన మరుసటి సంవత్సరమే మక్కాలోని ఇస్లామ్ శత్రువుల, ఖురైషులు మదీనాపై దాడికి వచ్చారు. బద్ర్ యుద్దం జరిగింది. ఈ యుద్ధంలో ఇస్లామ్ శత్రువులు ఓడిపోయారు. మూడవసంవత్సరం కూడా మరో యుద్ధం జరిగింది. మక్కా ఖురైషులు మదీనాపై దండెత్తి వచ్చారు. ఈ యుద్ధంలో ముస్లిములకు భారీ నష్టాలు భరించవలసి వచ్చింది. ఏది ఏమైనా పరాజయాన్ని ముస్లిములు తప్పించుకోగలిగారు. మదీనా వలస వచ్చిన ఐదవ సంవత్సరంలో మక్కాలోని ఇస్లామ్ శత్రువులు 10,000 సైన్యంతో భారీఎత్తున మదీనాపై దండెత్తారు. మదీనాలో ముస్లిముల సంఖ్య చాలా తక్కువ. మదీనా చుట్టు కందకం తవ్వి ప్రత్యక్ష పోరాటం జరక్కుండా ముస్లిములు జాగ్రత్త వహించారు. ఆ తర్వాత యుద్ధాలతో అలిసిపోయి మక్కాలోని ఇస్లామ్ శత్రువులు మళ్ళీ రాలేదు. మదీనాకు వలస వచ్చిన సంవత్సరాన్ని హిజ్రీ అంటారు. హిజ్రీ ఏడవ సంవత్సరంలో ఇరుపక్షాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. కాని ఆ ఒప్పందాన్ని మక్కా ఖురైషులే ఉల్లంఘించారు. కేవలం ఆరునెల్ల కాలంలోనే ఒప్పంద ఉల్లంఘన జరిగింది. ఈ ఉల్లంఘనకు బదులుగా ప్రవక్త స్వయంగా హిజ్రీ 8వ సంవత్సరంలో మక్కాపై 10,000 బలగాలతో దాడికి పూనుకున్నారు. మక్కా ఎలాంటి యుద్ధం లేకుండానే వశమైంది. ఎలాంటి రక్తపాతం జరగలేదు. ప్రవక్త ఇస్లామ్ శత్రువులందరికీ క్షమాభిక్ష ప్రసాదించారు. క్లుప్తంగా ఇస్లామ్ చరిత్రలో జరిగిన సైనికపోరాటాలివి. ఈ కాలంలో ప్రవక్తకు కావలసిన మార్గదర్శకత్వాన్ని దివ్యఖుర్ఆన్ అందిస్తూ వచ్చింది.

పై చరిత్రను పరిశీలిస్తే ఈ యుద్ధాలన్నీ ప్రవక్త పై బలవంతంగా రుద్దబడిన యుద్ధాలే. ఈ యుద్ధాల్లో వేటినీ ఆయన ప్రారంభించలేదు. కాని ఆయనపై దాడి జరిగినప్పుడు పూర్తి శక్తిసామర్థ్యాలతో ఎదిరించారు. ఒప్పందాలను ఉల్లంఘించినప్పుడు అలా ఉల్లంఘించినవారిపై పోరాటానికి ఆయన సిద్ధమయ్యారు. కాని పోరాటంలో లేనివారందరికీ క్షమాభిక్ష ప్రసాదించారు.

ఈ చరిత్ర గమనంలో ప్రవక్తకు దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు క్రమబద్ధంగా మార్గదర్శకత్వాన్నిచ్చాయి. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను అర్థం చేసుకునే క్రమంలో ఆయా సందర్భాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం అవసరం. దివ్యఖుర్‌ఆన్‌ను విమర్శించేవారు కావాలనే ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోరు. సందర్భాన్ని పక్కన పెట్టి ఇస్లామ్ పట్ల తమ వివక్షను ప్రదర్శిస్తూ ఈ వాక్యాలను విమర్శించడానికి పూనుకుంటారు.

దివ్యఖుర్‌ఆన్‌లోని కొన్ని వాక్యాల గురించి అయోమయాన్ని సృష్టించే ప్రయత్నం ఇక్కడ భారతదేశంలోను, ఇతర దేశాల్లోను ఇటీవల తీవ్రంగా జరుగుతోంది. దురుద్దేశాలతో ఈ విమర్శలకు పూనుకునే రచయితలు దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను వాటి నేపథ్యం, సందర్భాలనుంచి తప్పించి ఉటంకిస్తారు. ఆ తర్వాత తమకు ఇష్టమొచ్చిన అర్థాలు వివరిస్తారు. దివ్యఖుర్‌ఆన్‌ను పఠించేటప్పుడు ప్రతి వాక్యానికి సంబంధించిన నేపథ్యాన్ని సందర్భాన్ని దృష్టిలో ఉంచుకోవడం ఎంతైనా అవసరం. ఎవరైనా ఒక వాక్యాన్ని దాని సందర్భం నుంచి తప్పించి చదివితే విపరీతార్థాలు తీసే అవకాశం ఉంది. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను చదివడానికి నిజాయితీ, విశ్వాసం అవసరం. దురుద్దేశాలతో చదివే వారికి ఇందులో ఎలాంటి మార్గదర్శకత్వం లభించదు.

ప్రమాణికమైన వివరణలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్ గురించిన జ్ఞానం ఉన్న వారు రాసిన వివరణలకు మాత్రమే ప్రాముఖ్యం ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్ అవతరించిన చారిత్రక కాలం గురించి అవగాహన, ప్రవక్త ముహమ్మద్ జీవితచరిత్ర గురించిన జ్ఞానం ఉన్నవారు మాత్రమే దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను సరిగా అర్థం చేసుకోగలరు. ప్రజలను అయోమయానికి గురిచేసి, దారి తప్పించడానికి దురుద్దేశాలతో కొందరు రచయితలు చేసిన ప్రయత్నాల్లో ఉపయోగించుకున్న కొన్ని వాక్యాలను ఇక్కడ చూద్దాం.

> "మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు మీరకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు." దివ్యఖుర్‌ఆన్ (2 : 190)

> "మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడనుండి పారద్రోలారో, అక్కడినుండి మీరూ వారిని పారద్రోలండి. చంపటం చెడ్డదే. కాని ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. మస్జిదె హరామ్ వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంత వరకు, మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే

అక్కడ కయ్యానికి కాలుదువ్వితే, మీరు వారిని చంపటానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష." దివ్యఖుర్ఆన్ (2 : 191)

"వారు యుద్ధం చెయ్యటం మానుకుంటే (మీరూ మానండి) అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి." దివ్యఖుర్ఆన్ (2: 192)

"పీడన (ఫిత్నా) అంతమయ్యేవరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." దివ్యఖుర్ఆన్ (2 : 193)

"నిషిద్ధమాసానికి బదులు నిషిద్ధమాసమే. నిషేధాలన్నింటినీ అందరూ సమానంగా గౌరవించవలసినదే. కనుక మీపై ఎవరన్నా దాడిచేస్తే మీరూ వారిపై అదేవిధంగా దాడి చెయ్యండి. అయితే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ ఏర్పరచిన హద్దులను అతిక్రమించకుండా ఉండేవారితోనే అల్లాహ్ ఉంటాడు అనే విషయం తెలుసుకోండి." దివ్యఖుర్ఆన్ (2 : 194)

పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ వాక్యాలు నిజానికి ఆధునిక కాలంలో మనం ఎదుర్కుంటున్న డైలమాను కష్టాలను కూడా సూచిస్తున్నాయి. ఈ వాక్యాలను వక్రీకరించడం ద్వారా ఇస్లామ్ శత్రువులు, విద్వేష వ్యాపారులు ఇస్లామ్ హింసాత్మక మతమని విమర్శిస్తున్నారు. ఆరోపిస్తున్నారు.

ఈ వాక్యాలు ముస్లిములకు ఇతర సముదాయాలకు మధ్య సంబంధాలను నిర్వచించే మార్గదర్శక సూత్రాలు. అందువల్ల ఈ వాక్యాలను నిశితంగా గమనించవలసి ఉంది. లోతుగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. ముస్లిములు ఏమాశించగలరు? ఇతర సముదాయాలు ఏ విషయాల్లో ముస్లిములను బాధ్యులుగా చేయవచ్చన్న విషయాలు అర్థం చేసుకోడానికి ఈ వాక్యాలు ఉపయోగపడతాయి.

ఇక్కడ చాలా సరళమైన ప్రశ్న ఏమంటే, ఈ వాక్యాల్లో మొదటి వాక్యం స్పష్టంగా *"హద్దులు మీరకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు." అని ప్రకటించింది.* ఈ వాక్యం స్పష్టంగా ప్రకటిస్తున్న మాటలు హింసాత్మక వైఖరికి నిదర్శనమని ఎవరైనా ఎలా చెప్పగలరు?

ఈ ప్రశ్నకు జవాబేమంటే, వాస్తవాలను వక్రీకరించి, దివ్యఖుర్ఆన్ ప్రతిపాదించే నైతికనియమావళిని పూర్తిగా పక్కన పెట్టి స్వంత భాష్యాలు చెప్పి చిచ్చుపెట్టే వాళ్ళు మాత్రమే

ఇలాంటి పని చేయగలరు.

దివ్యఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేస్తున్నప్పుడు అనేక విషయాలను దృష్టిలో ఉంచుకుని చదవాల్సి ఉంటుంది. ఇందులో అత్యంత ముఖ్యమైన విషయం ఏ ఒక్క వాక్యాన్ని దాని సందర్భం నుంచి వేరు చేసి చూడరాదు. ఈ వాక్యాలను వాటి నేపథ్యం, అప్పటి సందర్భాలను దృష్టిలో ఉంచుకుని అంతకు ముందు వచ్చిన వాక్యాల కొనసాగింపును అర్థం చేసుకుంటూ చదవాలి. మొత్తం దివ్యఖుర్‌ఆన్‌తో ప్రతి వాక్యం ఎలాంటి సంబంధం కలిగి ఉందో కూడా తెలుసుకోవాలి. గుర్తుంచుకోవలసిన రెండవ ముఖ్యమైన విషయం దివ్యఖుర్‌ఆన్ 23 సంవత్సరాల కాలంలో అవతరించింది. అప్పటి సమాజంలో ఉన్న పరిస్థితులకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు, యావత్తు మానవాళికి అన్ని కాలాల్లో వర్తించే మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది. అంటే దాదాపు 15 వందల సంవత్సరాల క్రితం దివ్యఖుర్‌ఆన్ అవతరించిన కాలంలో అప్పటి సమాజంలో ముస్లిములు ఎదుర్కున్న పరిస్థితుల గురించిన అవగాహనతో పాటు దివ్యఖుర్‌ఆన్ కోరుతున్న ఆలోచనా విధానం, దృక్పథాలను కూడా సమగ్రంగా గుర్తుంచుకోవాలి.

పైన పేర్కొన్న వాక్యాలు అవతరించిన సందర్భం నిశితంగా గమనించదగ్గది. కేవలం కొన్ని వందల మంది మాత్రమే ఉన్న ఒక ప్రారంభకాలపు ముస్లిమ్ సముదాయం ముట్టడికి గురై ఉన్న కాలమది. చావుబతుకుల సమస్యను ఎదుర్కుంటున్న పరిస్థితులవి. వివిధ అరబ్బు తెగలు ముస్లిములతో బహిరంగంగావే కయ్యానికి కాలుదువ్వుతున్న కాలమది. ముఖ్యంగా మక్కాకు చెందిన ఖురైష్‌ల వైరం పరాకాష్ఠకు చేరుకున్న నేపథ్యం. మక్కాలో ఇస్లామ్‌ను అణిచేయాలని వారు భావించారు, కాని సఫలం కాలేకపోయారు. మదీనాలో ముస్లిములకు ఆశ్రయం లభించిందని, వారు నెమ్మదిగా బలపడుతున్నారని తెలిసిన వెంటనే మక్కా ఖురైషులు కత్తులు కరవాలాలు పట్టుకుని ముస్లిమ్ సముదాయాన్ని పూర్తిగా తుదముట్టించడానికి సన్నద్ధమయ్యారు.

ఖురైషులు ఒక భారీ యుద్ధానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయం అది. ముస్లిములకు అది చావుబతుకుల సమస్య. ముస్లిమ్ సమాజం ఉనికిలో ఉంటుందా? లేక పూర్తిగా తుడిచేయబడుతుందా అన్న పరిస్థితి. (చివరకు బద్ర్ యుద్ధం జరిగింది. దివ్యఖుర్‌ఆన్ 2:624). అంటే అప్పట్లో ఖురైషులు మొత్తం ముస్లిమ్ సమాజాన్ని నామరూపాలు లేకుండా చేయాలని వీరంగం వేస్తున్నారు. ఆ తర్వాత అవతరించిన దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు ఈ విషయాన్ని ప్రస్తావించాయి.

''మిమ్మల్ని మీ ధర్మాన్నుండి మళ్ళించగలగటం వారికి సాధ్యపడితే, వారు

అంతవరకు మీతో యుద్ధం చేస్తూనే పోతారు.” దివ్యఖుర్‌ఆన్ (2:217)

ఈ పరిస్థితుల్లో దేవుడు స్వయంగా విశ్వాసులకు మార్గదర్శకత్వం ఇచ్చాడు. ఈ వాక్యాల్లో అణిచివేతలు, దౌర్జన్యాలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశాడు. దాడికి వచ్చిన వారిపట్ల ఎలా వ్యవహరించాలో చెప్పాడు.

ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న ఏమంటే, శత్రువులు దాడికి దిగుతుంటే దేవుడు విశ్వాసులకు ఏమని చెప్పాలి? “వారిని కౌగిలించుకోండి. వారు ఎక్కడ కనబడితే అక్కడ వాటేసుకోండి. మిమ్మల్ని మీ ఇండ్ల నుంచి వెళ్ళగొట్టినందుకు, హత్యాకాండకు పాల్పడినందుకు బదులుగా వారిని ముద్దుపెట్టుకోండి” అని చెప్పాలా? ప్రపంచంలో ఏ చట్టం, ఎలాంటి హేతుబద్ధవాదన ఇలా చేయాలని చెప్పదు. నేటి ప్రపంచంలో ఇది మరింత స్పష్టంగా అర్థమవుతున్న వాస్తవం. ఒక దేశం దాడి చేస్తుందన్న అనుమానం ఉంటే చాలు నేడు యుద్ధానికి ఒడిగడుతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. శత్రుదేశం దాడికి సన్నాహాలు చేస్తుందన్న అనుమానాలు వస్తే చాలు, ఆ సన్నాహాలు జరక్కముందే దాడి చేస్తున్న కాలం ఇది (ప్రీ ఎంప్టివ్ వార్)

ముట్టడికి, శత్రుత్వాలకు, దాడులకు గురవుతున్న ముస్లిములు ఏం చేయాలి? ఈ పరిస్థితుల్లో ముస్లిములు తమ ధార్మిక విశ్వాసాన్ని కాపాడుకోవడానికి ఆత్మరక్షణకు పోరాడాలని దేవుడు అనుమతి ఇచ్చాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా పోరాడకుండా ఉంటారా? ఈ దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు మక్కా ఖురైషులకు, మదీనాలో ఉన్న ముస్లిములకు మధ్య వైరం తారాస్థాయికి చేరుకుని, మదీనాలో ముస్లిముల మనుగడకే ప్రమాదం వాటిల్లిన కాలంలో అవతరించిన వాక్యాలు.

ఈ వాక్యాల్లో ఖచ్చితమైన నిర్దేశాలున్నాయి. వాటిని పరిశీలిస్తే చారిత్రక నేపథ్యం కూడా తెలుస్తుంది. ఉదాహరణకు “వారిని చంపండి” అనడం. ముస్లిములపై యుద్ధం చేస్తున్న వారిని ఉద్దేశించి ఈ పదాలున్నాయన్నది స్పష్టం. మక్కా ఖురైషులు, మదీనా ముస్లిముల మధ్య యుద్ధమేఘాలు దట్టంగా అలుముకున్న పరిస్థితిలో మదీనాలో ముస్లిముల ఉనికి తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిలో ఈ మాటలు అవతరించాయి. ఈ నేపథ్యంలో ప్రవక్త అనుచరులకు స్పష్టమైన అనుమతి ఇస్తూ, వారిని ఎక్కడి నుంచి శత్రువులు బహిష్కరించారో శత్రువులను కూడా అలాగే బహిష్కరించాలని చెప్పడం జరిగింది. వారు మక్కాలోని పవిత్ర మస్జిదును ఆక్రమించుకున్నారు. కాని ముస్లిములు సాధ్యమైనంత వరకు పవిత్ర మస్జిదు పరిసరాల్లో పోరాడరాదని కూడా చెప్పడం జరిగింది.

ఈ తీవ్రమైన, క్లిష్టమైన చావుబతుకుల సమస్య ఎదురైన పరిస్థితిలో కూడా ముస్లిములను హద్దులు దాటరాదని హెచ్చరించడం జరిగింది. అంటే వారు దౌర్జన్యాలకు

పాల్పడరాదు, మహిళలు, పిల్లలు, పోరాటంలో లేని పౌరులు, వృద్ధులను చంపరాదు. ఆస్తులను తగులబెట్టరాదు. పంటలు, పాడిపశువులకు నష్టం కలిగించరాదు. అతిగా వ్యవహరించాదు. ఎందుకంటే ఈ హద్దులను దాటడమంటే ఆత్మవినాశాన్ని కొనితెచ్చుకోవడమే.

"చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి." దివ్యఖుర్ఆన్ (2:195)

ఒకవేళ శత్రువు పోరాటం మానుకంటే, ముస్లిములు కూడా ఆయుధాలు పారవేయాలి. శత్రుత్వానికి బదులుగా మాత్రమే శత్రుత్వం ఉంటుంది. ఆ విధంగా ముస్లిముల పోరాటం నిజానికి శత్రుత్వానికి ప్రతిఘటనగా ఆత్మరక్షణాత్మకమైనది.

ఇక్కడ మరో సాధారణ సూత్రం కూడా విస్తృతమైన పరిధిని కలిగి ఉంది. దివ్యఖుర్ఆన్ ప్రకారం యుద్ధం ఆత్మరక్షణకు జరుగుతుంది. ఇస్లామ్‌కు, ఇస్లామ్‌ను అనుసరించే సముదాయానికి వ్యతిరేకంగా యుద్ధానికి దిగిన వారే శత్రువులు. ఈ సూత్రాన్ని దివ్యఖుర్ఆన్ కూడా ప్రకటించింది.

"ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతుందో, వారికి (యుద్ధం చెయ్యటానికి) అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయిన వారు." దివ్యఖుర్ఆన్ (22:39)

(ఇంకా చూడండి, దివ్యఖుర్ఆన్ 60 : 80, 4 : 91) అందువల్లనే ప్రవక్త (స) పోరాడిన మూడు యుద్ధాలు – బద్ర్ యుద్ధం, ఉహుద్ యుద్ధం, కందక యుద్ధం – ఆత్మరక్షణకు పోరాడిన యుద్ధాలే. చివరిది యుద్ధమని కూడా చెప్పలేం. మదీనా చుట్టు తవ్విన కందకం ఎంత బాగా ఉపయోగపడిందంటే శత్రువులు దాన్ని దాటి లోపలికి రాలేకపోయారు. నెలరోజుల పాటు ముట్టడించి చివరకు నిరాశగా వెనుదిరిగారు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమంటే ఇస్లామ్ దురాక్రమణను నిషేధిస్తుంది. ముస్లిములు వైరాన్ని ప్రారంభించరాదు.

"దౌర్జన్యాలకు పాల్పడకండి. దౌర్జన్యపరులను అల్లాహ్ ఇష్టపడడు."

దివ్యఖుర్ఆన్ పేర్కొనే ఆత్మరక్షణాత్మక యుద్ధం నిజానికి అణిచివేతల కారణంగా జరుగుతుంది. అణిచివేతలు, వేధింపులు దివ్యఖుర్ఆన్ ప్రకారం హత్యాకాండల కన్నా నీచమైనవి. చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. అణిచివేతలు చెప్పరాని అఘాయిత్యాలకు, అమానుషాలకు కారణమవుతాయి. మానవ మర్యాదలను మంటగలపడం,

పరాభవాలపాలు చేయడం, ప్రజలకు ప్రగతి వికాసాలు సాధించే అవకాశాలు నిరాకరించడం, హక్కులు, స్వేచ్ఛలు లేకుండా చేయడం ఇవన్నీ ఎక్కువవుతాయి. అణిచివేతలు, దౌర్జన్యాల వల్ల బాధితుల మానమర్యాదలే కాదు, దౌర్జన్యపరుల మానమర్యాదలు కూడా మంటగలుస్తాయి. విద్వేష వైరాల విషవలయం కొనసాగుతూ ఉంటుంది. కొత్త కొత్త వైరాలు ప్రారంభమవుతాయి. ఘర్షణలు చెలరేగుతాయి. ప్రజల ప్రగతి వికాసాలకు లభించవలసిన అవకాశాలు స్వేచ్ఛలు నిరాకరిస్తే హింసాకాండలకు దారితీస్తూనే ఉంటుంది. ఇలాంటి వాతావరణాన్ని నిరోధించడానికి, మదీనా ముస్లిములపై నిరంతరంగా అణిచివేతలు, దౌర్జన్యాలు, హింసాకాండ కొనసాగిస్తున్న మక్కా ఖురైషులను ఎదిరించాలని దివ్యఖుర్ఆన్ పేర్కొంది.

ఆ తర్వాతి వాక్యంలో దివ్యఖుర్ఆన్ అణిచివేత స్వభావం గురించి కూడా వివరించింది. వారు గనుక మిమ్మల్ని వదలకపోతే, మీతో శాంతికి సిద్ధం కాకపోతే, అంటూ వివరించింది. మరోవిధంగా చెప్పాలంటే, అణిచివేత అన్నది నిరంతరంగా సాగే దౌర్జన్యం. మనిషి తన మనస్సాక్షిని అనుసరించి తనకు నచ్చిన విధంగా జీవించే హక్కును స్వేచ్ఛను హరిస్తుంది.శాంతికి అవకాశం లేకుండా చేస్తుంది. అణిచివేత, పీడనగా అనువాదం చేసిన అసలు పదం "ఫిత్నా". ఈ పదానికి దౌర్జన్యం, బాధించడం, ఊచకోతలు, విద్రోహం, నిరంతర నిరాశానిస్పృహలు అన్న అర్థాలున్నాయి. ప్రజలను వారి మతధర్మం పాటించకుండా అడ్డుకోవడమన్న భావం కూడా ఇందులో ఉంది. ఈ పరిస్థితుల్లోనే యుద్ధాన్ని దివ్యఖుర్ఆన్ ఆమోదించింది. ఇలాంటి పరిస్థితులను సృష్టించడం నీచమైన నేరంగా అభివర్ణించింది. (చూడండి దివ్యఖుర్ఆన్ 2 : 217)

అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాటం, మనుగడ కోసం చేసే సంఘర్షణలను దివ్యఖుర్ఆన్ న్యాయమైన యుద్ధంగా దేవుని మార్గంలో చేసేదిగా పేర్కొంది. ఇక్కడ "దేవుని మార్గంలో" అన్న పదాలు ధర్మప్రచారం కోసం అన్న భావాన్ని ఇచ్చేవి కాదు, ఇలాంటి వాక్యం ఎక్కడా దివ్యఖుర్ఆన్‌లో మనకు కనబడదు. ఇక్కడ దేవుని మార్గంలో అంటే అణిచివేతలు, దౌర్జన్యాల నుంచి విముక్తి సాధించడం. అలాగే

"పీడన (ఫిత్నా) అంతమయ్యేవరకు, దైవధర్మం స్థాపించబడేవరకు" దివ్యఖుర్ఆన్ (2:193)

అన్న వాక్యంలోను ఇస్లామ్ ప్రాబల్యం అన్న భావం కాని, ఇతర మతవిశ్వాసాలను లొంగదీయడం, అణిచివేయడం అన్న అర్థం కాని లేవు.

నిజానికి ఈ వాక్యాలు మనిషిని మనిషి బానిసగా చేసుకునే బానిసత్వం నుంచి

విముక్తి సాధించి ఒక ఉత్తమ సామాజిక సరళిని ఉద్బోధిస్తున్నాయి. ఈ వాక్యాలు అణిచివేతల నుంచి లభించే స్వేచ్ఛ ఎలాంటిదో చెబుతున్నాయి. ఎలాంటి అణిచివేతల భయం లేకుండా దైవారాధన చేసుకునే స్వేచ్ఛ ఉండాలి. నిజానికి ధర్మం కేవలం దేవునిదే అన్న పదాలు అన్ని సముదాయాల ఆరాధనలను సూచిస్తున్నాయి. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ 22వ అధ్యాయంలోని 41వ వాక్యం మరింత స్పష్టంగా తెలియజేసింది. దేవుని కొరకు అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడేవారు దేవుని నామం అధికంగా స్మరించబడే ఆరాధనాలయాలకు, చర్చిలకు, మస్జిదులకు విముక్తి సాధిస్తారని పేర్కొనడం జరిగింది. లేకపోతే ఈ ఆరాధనాలయాలు ధ్వంసమయ్యేవని కూడా చెప్పడం జరిగింది. ఇక్కడ కూడా "దైవధర్మం స్థాపించబడేవరకు" అన్న పదాలే వాడబడ్డాయి.

> "అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు చర్చీలు, యూదుల ప్రార్ధనాలయాలు, మస్జిదులు – వేటిలోనైతే అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడుతుందో అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. దివ్యఖుర్ఆన్ (22 : 41)

ఇక్కడ కూడా ధర్మం దేవుడిది మాత్రమే అన్న పదాలు స్పష్టంగా ఉన్నాయి.

ఈ వాక్యాల సందేశం ప్రస్ఫుటమైనది. అణిచివేతలపై పోరాటం వల్ల మతం ప్రాతిపదికన ఎలాంటి అణిచివేతలు లేని వాతావరణం ఏర్పడాలి. ప్రతి వ్యక్తి తాను నమ్మిన మతవిశ్వాసానికి కట్టుబడే వాతావరణం ఉండాలి. ఈ వాక్యాల్లో ఎలాంటి ఇతర భావాలు లేవు. దివ్యఖుర్ఆన్‌లోని అనేక ఇతర వాక్యాల మాదిరిగానే ఇందులో కూడా బహుళ సమాజాన్ని బలపరిచే దృక్పథమే ఉంది.

నిజానికి ఈ వాక్యాలకు ఇస్లామ్ విమర్శకులు చెప్పే వివరణ ఎంతమాత్రం పొసగనిది. ప్రజలందరూ తప్పనిసరిగా ఇస్లామ్ స్వీకరించేవరకు పోరాడాలన్న వివరణ దివ్యఖుర్ఆన్ స్ఫూర్తికే విరుద్ధమైనది. ఎందుకంటే దివ్యఖుర్ఆన్ ఇతర వాక్యాలు ఇలాంటి వివరణ వ్యతిరేకిస్తాయి. ''ధర్మం విషయంలో ఎలాంటి బలవంతం లేదు'' (2:256) అన్న దివ్యఖుర్ఆన్ వాక్యం ఈ వివరణకు పూర్తిగా వ్యతిరేకమైనది. అంతేకాదు ముస్లిమేతరులతో ఎక్కడెక్కడ వీలయితే అక్కడ ఒప్పందాలు, అంగీకరాలు, శాంతిచర్చలు జరిపేలా దివ్యఖుర్ఆన్ అనేక సార్లు ప్రోత్సహించిన వాక్యాలు చదివితే ఇస్లామ్ విమర్శకులు ఇచ్చే వివరణలు అర్ధరహితమైనవిగా కనబడతాయి.

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యాలు (2:190–195) సాధారణంగా ఇతర వాక్యాలతో కలిపి

చదవవలసి ఉంటుంది. ఉదాహరణకు 4:76, 4:34, 4:89, 4:91, 9:5, 9:12, 9:14, 9:25, 9:36, 9:123 వాక్యాలు కూడా పోరాడాలని పేర్కొన్న వాక్యాలే. ఈ వాక్యాలు ఇస్లామ్ విమర్శకులు ఎక్కువగా పేర్కొనే వాక్యాలు 9:5, 3:151 వాక్యాలు. ఈ వాక్యాలపై వినిపించే విమర్శల దృష్ట్యా వాటి గురించి ఇక్కడ చర్చించడం అవసరం.

దివ్యఖుర్ఆన్‌లోని 9 : 5 వాక్యం – కపటులను హతమార్చండి, మీరు వారిని ఎక్కడ చూసినా వారిని పట్టుకోండి, నిర్బంధించండి, ప్రతి మాటులోను వారి కోసం కాచుకుని ఉండండి – అన్న వాక్యం కూడా అన్ని కాలాలకు ఉద్దేశించిన వాక్యం కాదు. ఈ వాక్యం కూడా ఒప్పందాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలకు సంబంధించిన సందర్భంలో అవతరించింది. ఈ వాక్యం పవిత్రమాసాల గురించి ప్రస్తావించింది. ఈ పవిత్రమాసాల్లో నిర్యుద్ధ ఒప్పందం అమల్లో ఉండవలసింది. కాని ముస్లిములతో ఒప్పందం చేసుకున్న తెగల్లో బనీ దమారా, బనీ కనానా తెగలు తప్ప మిగిలిన తెగలన్నీ, మదీనాలోను మదీనా చుట్టుపక్కల ఉన్న తెగలన్నీ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ప్రారంభించాయి. ముస్లిములపై దాడులు చేయడం హతమార్చడం, దౌర్జన్యాలకు పాల్పడడం జరిగేది. ముస్లిముల విషయంలో ఇలా వ్యవహరించడం ఈ తెగలన్నింటికి ఒక అలవాటుగా మారింది. ఈ సందర్భంలో కూడా ముస్లిమ్ సమాజ మనుగడకే ప్రమాదం వాటిల్లిన పరిస్థితి. అందువల్ల ముస్లిములు పోరాటానికి సమాయత్తం కావాలని చెప్పడం జరిగింది. వైరం అంతరించేవరకు ఆత్మరక్షణకు పూనుకోవాలని చెప్పడం జరిగింది. యుద్ధరంగంలో కూడా ఇస్లామ్ శత్రువులు నైతికతకు కట్టుబడలేదు. విస్తృత అంగీకారం ఉన్న తెగల నియమాలను పాటించేవారు కాదు. కాని ముస్లిములు ఇస్లామీయ నియమనిబంధనలను ఖచ్చితంగా పాటించేవారు. శత్రువు పోరాటాన్ని మానుకున్న వెంటనే తమ కరవాలాలు ఒరల్లో పెట్టేవారు. కాని మక్కా ఖురైషులు దీన్ని ఒక అవకాశంగా తీసుకున్నారు. మోసం, ద్రోహాలతో అనేకమంది ముస్లిములను హతమార్చారు. ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం ఈ వ్యవహారం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

> "నీవు ఒప్పందం కుదుర్చుకున్నవారు, అవకాశం దొరికినప్పుడల్లా వారు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారు..." దివ్యఖుర్ఆన్ (8:56)

ఈ ప్రజలకు సంబంధించి మాత్రమే ఈ వాక్యాలు అవతరించాయి.

ఇస్లామ్ శత్రువులు విమర్శించే మరో వాక్యం దివ్యఖుర్ఆన్‌లోని 3:151 వాక్యం.

> "సత్యతిరస్కారుల హృదయాలను మేము భయంతో నింపే సమయం త్వరలోనే రాబోతోంది. ఎందుకంటే ఎవరిని గురించి అల్లాహ్ ఏ ప్రమాణాన్ని

అవతరింపజెయ్యలేదో, వారిని, వారు అల్లాహ్‌తో పాటు దైవత్వంలో భాగస్వాములుగా నిలబెట్టారు." దివ్యఖుర్‌ఆన్ (3:151)

ఇస్లామ్‌పై దాడి చేయడానికి ఇస్లామ్ వ్యతిరేకులు ఈ వాక్యాన్ని కూడా ఆధారంగా చేసుకుంటారు.

కాని నిజానికి ఈ వాక్యం ఒక వాస్తవాన్ని చాటి చెప్పింది. ఈ వాక్యం అవతరించిన నేపథ్యం, సందర్భం చూస్తే ఈ విషయాలు అర్థమవుతాయి. మదీనాలో ప్రవక్త ముహమ్మద్ పై మక్కాలోని ఖురైషులు రెండవసారి దాడికి సిద్ధమవుతున్న కాలమది. బద్ర్ యుద్ధంలో ముస్లిములు విజయం సాధించి ఒక్క సంవత్సరం గడువకముందే మక్కా ఖురైషులు మళ్ళీ దండయాత్రకు వచ్చారు. రెండవ యుద్ధం ఉహుద్ యుద్ధానికి ప్రవక్త ఏర్పాట్లు చేస్తున్నప్పుడు ఈ వాక్యం అవతరించింది. దివ్యఖుర్‌ఆన్ ఈ వాక్యం ద్వారా ప్రవక్తకు ధైర్యాన్నిచ్చింది. ముస్లిముల సైనికశక్తి బలహీనంగా ఉన్నా, యుద్ధసామగ్రి లేకున్నా, శిక్షణ లేకపోయినా శత్రువులను భయకంపితులు చేస్తామని చెప్పింది. నిజానికి ఈ వాక్యం శత్రుశిబిరంలో ఉన్న భావాల గురించి చెప్పింది. ఇది ముస్లిములకు ఒక ఆదేశంగా కాదు, ధైర్యాన్నిచ్చే వాక్యంగా అవతరించింది.

సర్వసాధారణమైన ఆత్మరక్షణ చర్యల్లో కూడా టెర్రరిజాన్ని వెదికేవారు ఇలాంటి వాక్యాలను సాధ్యమైనంత వరకు వక్రీకరించడానికి ప్రయత్నిస్తారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను వక్రీకరించి పెడార్థాలు తీయడానికి వాళ్ళు చేస్తున్న ప్రయత్నాలు పరిశీలిస్తే భగవద్గీత తదితర గ్రంథాల విషయంలో కూడా ఇలాంటి పెడార్థాలు తీసే ప్రయత్నం చేయవచ్చు. ఆత్మరక్షణకు పోరాడాలని భగవద్గీత చెబుతుంది. అణిచివేతకు, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలని పేర్కొంటుంది. అర్జునుడు తన సోదరులైన కౌరవులను చంపేబదులు నిరాయుధుడిగా తాను చచ్చిపోవడమే మేలని భావిస్తాడు. అప్పుడు కృష్ణుడు ఇలా బోధిస్తాడు. "ఈ కలుషిత భావాలు నీలో ఎలా వచ్చాయి. ఇవి నిన్ను స్వర్గంలో ప్రవేశించకుండా చేస్తాయి. ఓయి శత్రుసంహారకుడా ఈ అమర్యాదకరమైన బలహీనతను వదిలి లేచి నిలబడు." అంటాడు. (భగవద్గీత అధ్యాయం 1, వాక్యం 43-46, అధ్యాయం 2, వాక్యం 2-3)

భగవద్గీతలోని ఈ వాక్యాలకు ఎవరైనా వివరణ ఇస్తూ ఇవి హింసను, అన్యాయంగా హత్యాకాండను ప్రోత్సహిస్తున్నాయని అనడం ఎలా ఉంటుంది. ఇలాంటి వివరణలు అత్యంత దుర్మార్గమైనవి, సందర్భరహితమైనవి కాదా? సరయిన నేపథ్యంతో వాటిని అర్థం చేసుకోవాలి. చెడుకు వ్యతిరేకంగా పోరాడాలని భగవద్గీత బోధిస్తుంది. ఆ నేపథ్యంలో చూస్తే ఈ వాక్యాలు చాలా అర్థవంతమైనవిగా కనబడతాయి.

# కృతజ్ఞతలు

సుదీర్ఘకాలంగా అనేకమందితో నాకున్న పరిచయాలు, సంబంధాలు, వారితో నా సంభాషణల ఫలితంగా నాకు తెలిసిన సమాచారం, నా అవగాహనకు వచ్చిన విషయాల సంకలనమే ఈ పుస్తకం. ఈ పుస్తకంలోని వివిధ విషయాలను అక్షరబద్ధం చేయడంలో ఎవరి ప్రభావం ఎంత ఉందన్నది, ఎవరు ఎంతగా సహకరించారన్నది ఖచ్చితంగా చెప్పడం చాలా కష్టం.

అయితే ఈ పుస్తక రచనలో నాకు ప్రత్యక్షంగా సహాయసహకారాలందించిన వారికి ఈ సందర్భంగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పుస్తక సంకలనంలో నేను వివిధ పుస్తకాల నుంచి సమాచారాన్ని ఉపయోగించుకున్నాను. ఆయా పుస్తక రచయితలందరికి ఈ సందర్భంగా నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఆ రచయితల్లో ముఖ్యంగా ప్రముఖ పొలిటికల్ సైంటిస్ట్, అమెరికాకు చెందిన సి.ఐ.ఏ. లోని నేషనల్ ఇంటిలిజెన్స్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ గ్రాహం ఫుల్లర్, భారత సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మార్కండేయ కట్జూ, జార్జిటౌన్ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ ఎఫైయిర్స్ అండ్ ఇస్లామిక్ స్టడీస్ ప్రొఫెసర్ జాన్ లూయిస్ ఎస్పొసిటో, భారతీయ ఇస్లామీయ తత్వవేత్త డా. రఫీక్ జకరియా,బి.బి.సి వరల్డ్ సర్వీస్‌తో సహా అనేక మీడియా సంస్థలకు పనిచేసిన బెంగుళూరుకు చెందిన పాత్రికేయుడు మక్బూల్ అహ్మద్ సిరాజ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ పుస్తక రచన/సంకలనంలో ఎలాంటి వ్యాపార ప్రయోజనాలు ఆశించలేదు.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత, మ్యాన్ బూకర్ అవార్డుకు నామినేట్ అయిన పద్మభూషణ్ డా. యు.ఆర్. అనంతమూర్తి, మంగళూరు, గోవా విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బి.షేక్ అలీ, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత, హంపిలోని కన్నడ యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ డా. చంద్రశేఖర్ కామ్‌దార్, కర్నాటక పోలీస్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ (లా అండ్ అర్డర్) బిపిన్ గోపాల కృష్ణ, యునెస్కో, యునిడో, ఐడిబిలకు సలహాదారుగా

పనిచేసిన అబ్దుర్రహ్మాన్ కమారుద్దీన్, కర్నాటక ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముహమ్మద్ సనావుల్లా ఐఏఎస్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కర్నాటక, యు.నిసార్ అహ్మద్ ఐపియస్‌లు ఈ పుస్తకం ప్రాథమిక రాతప్రతులను కూలంకషంగా పరిశీలించారు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. వారి సలహాలు ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దడానికి ఎంతో ఉపయోగపడ్డాయి. వారందరికీ దైవం తగిన ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము ... ఆమీన్

బిబిసి వరల్డ్ సర్వీస్ జర్నలిస్ట్ మక్బూల్ అహ్మద్ సిరాజ్, కర్నాటక ముస్లిమ్స్ డాట్‌కామ్ చీఫ్ ఎడిటర్ తన్వీర్ అహ్మద్‌లు అందజేసిన అమూల్య సహాయసహకారాలకు ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ పుస్తక రచనలో నాకు ఎంతో ఉత్సాహంగా, ఎంతో విశ్వసనీయంగా సహాయసహకారాలందించిన ముహమ్మద్ నూమాన్ ఖాన్‌కు కృతజ్ఞతలు.

నా కుటుంబ సభ్యులకు, నా సోదర సోదరీమణులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ముఖ్యంగా నా భార్య షబానా ఫిర్దోస్, నా కుమార్తె సయ్యదా సూఫియాలకు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నేను నా కుటుంబ సభ్యుల వద్ద ఉండవలసిన అనేక సందర్భాల్లో ఈ పుస్తక రచనలో నిమగ్నమైన నేను వారి వద్ద ఉండలేకపోయాను. ఈ రచనా కార్యక్రమానికి ప్రధానమైన ప్రేరణగా నిలిచిన నా తల్లిగారు అస్మత్ సారాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆమె ప్రార్థనలు, ఆమె మాటలే నాకు ముందుకు సాగే నిరంతర ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. అన్నింటికి మించి ఇదంతా అల్లాహ్ దయవల్లనే సాధ్యమయ్యింది. దేవుని ఆశీస్సులే లేకుంటే ఈ కార్యభారాన్ని మోయడం సాధ్యమయ్యేది కాదు. ప్రేమ, శాంతి సందేశాన్ని నలుదిశలా చాటడానికి దేవుడు మార్గదర్శనం ఇవ్వాలని, నాకు సహాయపడాలని ప్రార్థిస్తున్నాను ... ఆమీన్.

**సయ్యద్ హామిద్ ముహ్‌సీన్**

చైర్మన్, సలామ్ సెంటర్

# Bibliographic References


| | |
|---|---|
| 1. Muhammad Encyclopedia of Seerah | Afzalur Rehman. |
| 2. The Emergence of Islam | Dr. Mohammed Hameedullah. |
| 3. The Life of Muhammad | Haykal. |
| 4. Muhammad | Martine Lings. |
| 5. Prophet Muhammad | Fethullah Gulen. |
| 6. Muhammad, all that Matters | Ziauddin Sardar. |
| 7. Islam, the West and the Challenges of Modernity | Tariq Ramadan. |
| 8. A World Without Islam | Graham E. Fuller. |
| 9. Islam and *Jihad* | A.G. Noorani |
| 10. The Islamic Threat, Myth or Reality | John L. Esposito. |
| 11. Demystifying Islam | Dr. Ali Shehata. |
| 12. Muhammad and the Quran | Rafiq Zakaria. |
| 13. Islam in Focus | Hammudah Abdalati. |
| 14. The Holy Quran | Abdullah Yusuf Ali. |
| 15. The Quran | Dr. Nazeer Ahmed. |

This document was created with the Win2PDF “Print to PDF” printer available at

https://www.win2pdf.com

This version of Win2PDF 10 is for evaluation and non-commercial use only.
Visit https://www.win2pdf.com/trial/ for a 30 day trial license.

This page will not be added after purchasing Win2PDF.

https://www.win2pdf.com/purchase/